

గాంధ్ శారీస్ (ప్రై) లిమిటెడ్, బొంబాయి వారి తయారి

H.K. INTERNATIONAL / GS / TL

గాంధి టెక్స్ కాటన్ శారీస్ అన్ని షాపులలో లభించును

ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్లు : విజయవాడ, వస్త్రలత : అమరా నాగేంద్రుడు అండ్ సన్సు, శ్రీ లక్ష్మి క్లాత్ కార్పొరేషన్, గిరిజా శారి బ్రదర్సు,
చీరాల : అమరా వెంకట సుబ్బారావు అండ్ సన్సు, ప్రొద్దుటూరు : నల్లి బ్రదర్సు, హిందూపూరు : ఆదర్శ ఎంటర్‌ప్రైజెస్,
సికింద్రాబాద్ : బాలాజి టెక్స్‌టైల్స్, సికింద్రాబాద్ : భరణి టెక్స్‌టైల్స్, హైదరాబాద్ : న్యూ శారి షోరూమ్, ఏలూరు : శ్రీ షణ్ముఖ క్లాత్‌స్టోర్సు, కావలి : శ్రీ బాలాజి శారీస్ సెంటర్.

బాధ్యత స్వీకరించని ప్రభుత్వం

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి


తమ గ్రహబలాన్ని తప్పించి మిగతా వారందరినీ తప్పు పట్టటం రాజీవ్‌బృందం ప్రత్యేకత అని చెప్పవచ్చు. అమెరికా వారిపై (పాకిస్తాన్‌కి ఆయుధాలని ఇస్తున్నందుకు), పాకిస్తాన్ వారిపై (పంజాబ్‌లో తీవ్ర వాదులకి సహాయ పడుతున్నందుకు), బ్రిటిష్ వాళ్ళపై (మాదక ద్రవ్యాల వ్యవహారంలో సహకరించనందుకు), ప్రతిపక్షాల మీద (చిల్లర మల్లర పొరపాట్లకి) భారీగా నిందారోపణలు చేస్తున్నారు ఆఖరుకి ఇంకెవరూ దొరక్కపోతే శుక్రుడిని, నెప్ట్యూన్‌ని, శనిగ్రహాన్ని కూడా నిందించే స్థితికి త్వరలోనే చేరుకుంటారని నాకు అనిపిస్తున్నది.

బడ్జెట్‌లలో మన ఆర్థిక మంత్రులు ప్రతిపాదించిన అందమైన హామీలన్నీ ఆచరణలో విఫలం అయినప్పుడు వాళ్ళు దానికి కారణం ఋతుపవనాలు సరిగా లేకపోవటమేనని అంటారు. మత కలహాలు వచ్చినప్పుడు హోంశాఖ మంత్రులు ఆ నిందని అధిక సంఖ్యాక వర్గాలపై నెట్టివేస్తారేకాని అల్ప సంఖ్యాక వర్గాల మీదకాదు. ఈ మధ్య కర్నాటకలో అల్లర్లు చెలరేగినప్పుడు బూటాసింగ్ కూడా తిరిగి అదే పని చేసారు. ఈశాన్య సరిహద్దులలో చైనావారు మనపై దాడి జరిపినప్పుడు తమ రక్షణ మంత్రి అయిన కృష్ణమీనన్ దారుణ వైఫల్యమేనని నెహ్రూ అనలేదు. చైనావారు మనని మోసం చేసారన్నారాయన– అంతకు ముందెప్పుడూ కమ్యూనిస్టులు ఏమి చెయ్యనట్టు. ప్రతి ఏడూ మొక్కుబడిగా రైలుచార్జీలు పెంచే రైల్వేవారు దానికి బాధ్యత బొగ్గుశాఖదని అంటే వాళ్ళు గనుల శాఖదని, గనుల శాఖవారు కాలరీల మేనేజర్లదని, మేనేజర్లు స్థానిక ప్రముఖులదని బాధ్యతని మరొకరిపైకి నెట్టి చేతులు దులుపుకుంటారు. తన కర్తవ్యాన్ని నిర్వహించటంలో భారతదేశంలోని ప్రతి వ్యక్తి నిస్సహాయుడిగా ఉన్నట్టనిపిస్తుందది. ఇలాంటి విషయాలలో శ్రీమతి గాంధీఅందె వేసిన చెయ్యి ఆమె తనయుడు అంతకన్నా మరో ఆకు ఎక్కువే చదివారు. ఆదమరచి ఉన్న దేశం మీద అత్యవసర పరిస్థితి విధించి ఆ నిందని ఆమె ప్రతిపక్షాలపై వేసారు. అవే తమని ఆ చర్య తీసుకునేలా చేసాయని అన్నారామె కానీ ఆమె ఎందుకలా చేసారన్నది మనందరికీ తెలిసిన విషయమే. అతి త్వరలో రాజీవ్ కూడా అదే చేస్తారు. ద్రవ్యోల్బణం, పంజాబ్‌లో హత్యలతో సహా అన్నిటికీ బాధ్యత ప్రతిపక్షాలదే అంటారు.

శ్రీమతి గాంధీ 1980లో తిరిగి అధికారంలోకి రాగానే జనతా ప్రభుత్వం దేశాన్ని అస్తవ్యస్తం చేసిందని గగ్గోలు పెట్టారు. ఆర్థిక వ్యవస్థని అది చిన్నాభిన్నం చేసిందని దానిని చక్కదిద్ది, దేశాన్ని తిరిగి సరైన దారిలో పెట్టటం ఎంత కష్టమో వివరిస్తూ పెద్ద ప్రచారం చేసారు. అప్పుకోసం అంతర్జాతీయ ద్రవ్య నిధితో చర్చలు జరిపినప్పుడు అప్పటి ఆర్థిక మంత్రి వెంకట్రామన్ జనతా దుష్పరిపాలన కారణంగా ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతిన్నదని. అందుకే అప్పు చేయాల్సి వస్తున్నదని పార్లమెంటులో చెప్పారు. ప్రణబ్ ముఖర్జీ కూడా ఆ పనే చేసారు. కానీ ఇప్పుడు ఆయన మాట మారుస్తున్నారు ఆయన తర్వాత వచ్చిన రాజాసాబ్ ఆర్థిక వ్యవస్థని వెంకట్రామన్‌కన్నా చెడగొట్టారు. అయినా ఆయన కూడా జనతా ప్రభుత్వం మీదే నింద వేస్తున్నారు!

అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ 'ఇది ఇక్కడితో ఆగిపోతుంది' అని వైట్ హౌస్‌లోని తమ బల్లమీద గుర్తు పెట్టుకునే వాడట భారతదేశంలో మాత్రం అది ఎక్కడా ఆగదు, చివరికి ప్రధానమంత్రి బల్లపై కూడా. ప్రతివారూ మరొకరివైపు వేలెత్తి చూపిస్తూనే ఉంటారు కాబట్టి అసలు అది ఎక్కడ ఆగుతుందో ఎవరికీ తెలియదు. పాశ్చాత్య సమాజాలలో అలాకాదు. విదేశాలలో ఒక చెక్కుని మార్చుకోడానికి మీరు బాంకుకి వెళ్తే కొద్ది నిమిషాలపాటు మీరు వరుసలో నిలబడవలసి ఉంటుంది ఒకవేళ ఎక్కువసేపు నిలబడవలసి వచ్చినా తనకింద పనిచేసే బంట్రోతులేదు కాబట్టి, ఆలస్యం జరుగుతున్నదని అనడు, అసలు విదేశాలలో బంట్రోతులనే వాళ్ళే ఉండరు. ఆ వర్షాలు చూసే అమ్మాయి పెళ్ళి చేసుకోబోతున్నది కాబట్టి ఆలస్యం అవుతున్నదని ఆ కౌంటర్ మీద ఉన్న వ్యక్తి అనడు. మనదేశంలో బాంకులలో ఇది నిత్యం జరుగుతూనే ఉంటుంది. విదేశాలలో అది అత్యంత కింది స్థాయి నుంచి ప్రారంభం అయినా ఎక్కడ ఆగిపోవాలో అది అక్కడే ఆగుతుంది.

నాకు ఒక బ్రిటిష్ పార్లమెంటు సభ్యుడి కథ గుర్తొస్తున్నది. ఆయన అనామకుడేమీకాదు రాజాశ్రయంలోని వ్యక్తి. వెస్ట్ మినిస్టర్ పాలెస్ దగ్గర వాహనాలు నిలుపకూడని చోట ఆయన తన కారుని ఆపాడు. వెంటనే అక్కడ ఉన్న బీట్ కానిస్టేబుల్ కేసు నమోదు చేసాడు. ఆ పార్లమెంటు సభ్యుడు తన వివరాలు, హోదా చెప్పుకున్నాడు కానీ ఆ కానిస్టేబుల్ దిగిరాలేదు. ఆయన ఇంకా వాదిస్తూ ఉండే పోలీసు స్టేషన్‌కి తీసుకు వెళ్ళాడు. అక్కడ ఆయన తాగిఉన్నట్టు గుర్తించి లాకప్‌లో పెట్టారు.



పోలీస్ కమీషనర్‌కి ఫోను చేయటంతో సహా ఎం చేసినా ప్రయోజనం లేకపోయింది ఈ విషయం అంతా ఆ కానిస్టేబిల్ పరిధిలోదనీ, తాను అశక్తుడననీ కమీషనర్ అన్నారు చట్టం అంటే చట్టమే, నిబంధనలంటే నిబంధనలే అదే భారతదేశంలో అయితే మీరు అధికార పీఠానికి దగ్గరి వారైతే ఏ శిక్షా పడకుండా నియమాలని ఉల్లంఘించవచ్చు మీరు ఏ పని చేసినా, చెయ్యకపోయినా మరొకరిని తప్పు పట్టవచ్చు

పంజాబ్‌లో శాంతి భద్రతలు సంక్షోభంలో పడటానికి బాధ్యత సుర్జిత్‌సింగ్ బర్నాలాదే అని రాజీవ్‌గాంధీ అంటారు ఆ విధంగా తమ బాధ్యత నించి ఆయన తప్పించుకుంటారు బర్నాలాని సృష్టించింది తామే ఆయన కాళ్ళకింద తివాసీని తాము లాగేస్తే బర్నాలా ఒక్క నిమిషమైనా ఆ స్థానంలో ఉండలేరన్న విషయాన్ని రాజీవ్‌గాంధి పట్టించుకోరు. పంజాబ్‌లో జరుగుతున్న దానికి వాస్తవంగా బాధ్యులు ఎవరు? తాము కాదని బర్నాలా ఢిల్లీని వేలెత్తి చూపిస్తారు రాజీవ్‌గాంధి బర్నాలావైపో, లేదా బాదల్‌వైపో చూపిస్తారు. పంజాబ్‌లో పరిస్థితికి బాధ్యత స్వీకరించటానికి ఎవరూ సిద్ధంగాలేరు కాబట్టే అక్కడి పరిస్థితి అదుపుతప్పి పోతున్నది తీవ్రవాదులకి మాత్రమే తామేం చేస్తున్నదీ తెలుసు. అందుకు బాధ్యత స్వీకరించటానికి వాళ్ళు సిద్ధంగానే ఉన్నారు ప్రతి హత్యాకాండ జరిగిన వెంటనే తామేదాన్ని చేసామని



వాళ్ళు పోలీసులకి ఫోన్‌చేసి చెబుతున్నారు దాన్ని సాహసం అని వాళ్ళు అనుకుంటే అనుకోవచ్చు కానీ వాళ్ళేమిటన్నది మనకి స్పష్టంగా తెలుస్తున్నది.

రాజీవ్, ఆయన బృందం విషయంలో మాత్రం వాళ్ళేమిటన్నది మీకు అర్థం కాదు

బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రభుత్వం ... అందుకనే కొద్ది రోజుల కిందటే ... ఏకీ‌తో కూడా, ప్రభుత్వ మనేది ... ఈ శీర్షికలో రాసాను పంజాబ్‌లో అధికార యంత్రాంగం అనేది ఉండవచ్చు కానీ ప్రభుత్వం మాత్రంలేదు న్యూఢిల్లీలో జరుగుతున్న దానినిబట్టి అక్కడకూడా అంతేననిపిస్తున్నది రైళ్ళు కాలంలో నడుస్తున్నాయని వాళ్ళనవచ్చు కానీ ఫలితాలనిబట్టే అంచనాలు ఉంటాయి కాసిన కాయలనిబట్టే అది ఏ చెట్టో తెలుస్తుంది ఆర్థిక వ్యవస్థ అద్భుతాలు సాధిస్తున్నదని, సాధించబోతున్నదని విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ గత రెండేళ్ళుగా చెపుతూనే ఉన్నారు ఇప్పుడు మనం తెలుసుకుంటున్న దేమిటి? ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతూ ఉన్నది ద్రవ్యోల్బణం కూడా ఒకరకం పన్నే- ఉత్పత్తి తగ్గుతున్నది. అప్పు పెరిగి పోతున్నది ఋతు పవనాలు సరిగా లేకపోతే, పంటలు బాగా పండకపోతే, స్విస్ బ్యాంకులలో దోచుకున్న సొమ్ము జమచేసుకునే స్వార్థపరులు ఉంటే తాము ఏమి చేయజాలమని రాజాసాబ్ అంటున్నారు అంత నిస్సహాయులైతే ఆయన అసలు అక్కడ ఎందుకు ఉన్నట్టు? ఇంకో ప్రశ్న కూడా మీరు అడగవచ్చు. రాజీవ్‌గాంధి అక్కడ ఎందుకు ఉన్నట్టు? □

ఆంధ్రపత్రిక ప్రచురణ

బాలరంజని

చిన్నపిల్లల మాసపత్రిక

(పెద్దవారు కూడా చదవవచ్చు!)



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు (1938-1972)

16-22 జనవరి '87

శ్రీ అక్షయ నామ సం పుష్య బ పాడ్యమి

సంపుటము 79 : సంచిక 20

ముఖ్య సంపాదకుడు

శివలెంక రాధాకృష్ణ

కార్యవాహక (యాక్టింగ్) సంపాదకుడు

మతుకుమల్లి మాధవరావు

విడి ప్రతి వెల రు. 2.75

పోస్టులో 6నెలల చందా రు. 80.60

పోస్టులో 12నెలల చందా రు. 161.20

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటి మాధవి

(ఫొటో ఎం కె రామమూర్తి)



ఉత్తరాలు

ముఖచిత్రం

చిలిపితనం
చిందు లేసే కనులు
జాణతనం
జాలు వారే పెదవులు
చూసినంతనే
కవ్వింతలో నే
కలలో న మెరిసి
కలవర పెట్టే
ముఖచిత్ర తార
ముద్దు లొలుకు సితార'
జిలిబిలి పలకుల అభినయ
నవవిరి జిలుగుల నృత్యమయ
నగవులు కురిసే భానుప్రియ''

-కె రాజేశ్వరి, విజయవాడ

సీరియల్స్

రచయిత(త్రు)ల భావోద్వేగానికి, హృదయ స్పందనకు, సున్నితత్వానికి అద్దం పట్టేలా వుంది శైలకుమార్ గారి 'ఆరోహణ' వారికి నా హార్దికాభినందనలు

శోభ జి చంద్రగిరి

★ ★ ★

అభినేత్రి 'బానుప్రియ' ముఖచిత్రంతో వెలువడిన 19–25, డిసెంబర్–86 నాటి సంచిక మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంది ఒడిలో చెలి మోహనరాగం , ఒకటి ఒకటీ మూడు సీరియల్స్ బాగున్నాయి

యస్ వెంకటేశ్, జువారినగర్ (గోవా)

★ ★ ★

'ఒకటి ఒకటీ మూడు' సీరియల్ అద్భుతంగా, సస్పెన్స్‌తో మమ్మల్ని ఆకట్టుకుంది రచయిత్రి తేజోవతి గార్కి ధన్యవాదాలు

ఉపద్రష్ట జగన్నాధరావు, అయినాపురం

వ్యాసాలు

భానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన 19–25 సంచిక చాల బాగుంది మీరు ప్రచురించిన ఆరు కథలు ఆణిముత్యాల్లా వున్నాయి పత్రిక మధ్య పేజిలో సింగపూర్‌లో భారతీయ మహిళల అన్నలక్ష్మి చదివి ఎన్నో విషయాలు తెలుసుకున్నాము

ఎస్ సావిత్రిహరి, హైదరాబాద్

కథలు

శ్రీ పైడిపాల గారి పోటీ కథ వాస్తవానికి చాలా దగ్గరగా ఉంది ఒకరు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తుంటే, అది ఓర్వలేక వారిని అధఃపాతాళానికి నొక్కే మన ఆంధ్రుల లక్షణాన్ని చాలా చక్కగా వివరించారు

బి రవికుమార్, కాశిబుగ్గ

★ ★ ★

అబినేత్రి బానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్రసచిత్ర వారపత్రిక చాలా ఆకర్షణీయంగా, అందంగా వుంది దేవుడంటూ వేరే లేడు కథలో - అన్నీ తెలిసి ఏమీ తెలియనట్లుండే దేవుని కన్నా ఏమి తెలియక తనకున్న సంస్కారంతో ఎదుటి వారి బాధలు పంచుకుందామనే గుణం కలిగిన చంద్రి పాత్ర నాకు నచ్చింది

దాదాజీ, ఉపోదయం, ఆ ఇంటి దీపం కథలు నాకు నచ్చినాయి


ఎస్ రామచంద్రమూర్తి, రామగిరి, నల్గొండ

శీర్షికలు

మా అభిమాన నటి, భానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన వారపత్రిక చాలా ఆకర్షణీయంగా వుంది అందులో బానుప్రియ సమాదానాలు కూడా ఆసక్తిదాయకంగా, వున్నాయి పోస్టల్ రేట్లు పెరిగాయి – కార్టూన్లు కూడా గమ్మత్తుగా వున్నాయి

పక్కి రాధాగోపాలకృష్ణ

బల్లిగూడ (ఒరిస్సా) □





శ్రీ పులికంటి కృష్ణారెడ్డి



శ్రీ పాలగిరి వేణు



శ్రీ జె. ఎస్. మూర్తి (విహారి)

మనలో మాట

మా పాఠకులు, రచయితలు, రచయిత్రులు, ఏజంట్లు, ప్రకటన కర్తలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

1986 దీపావళి కథల పోటీలో రు 700/- బహుమతి పొందిన ఆరు కథలపై మేము నిర్వహించిన బాలట్ వ్యాస రచన పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని వాటిని జయప్రదం చేసిన వారందరికీ మా కృతజ్ఞతలు

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి రాసిన 'బుద్ధుడు పుట్టిన భూమిలో' బాలట్‌లో మొట్టమొదటి కథగా పాఠకులు ఎన్నిక చేసారు రెండవదిగా శ్రీ పాలగిరి వేణు రాసిన "ఆ తృప్తి చాలుసామీ,' మూడవదిగా శ్రీ విహారి రచన "శిఖరంమీద' కథలు ఎన్నిక అయినాయి

ఇక మిగిలిన నాలుగు, అయిదు, ఆరుస్థానాలకి వరుసగా శ్రీ పేరి రవికుమార్ రాసిన మాయ , డాక్టర్ లేళ్ళపల్లి వెంకటలక్ష్మీ నారాయణశర్మ రచన బరువు - బాధ్యత', శ్రీ ఆదూరి వెంకట సీతారామమూర్తి రాసిన నామకరణం కథలు వచ్చాయి

ఈ ఆరుగురు కథా రచయితలకీ మా ప్రత్యేక అభినందనలు.

పాఠకుల బాలట్‌లో మొదటిదిగాఎన్నికై మరో రు 750/- అదనపు బహుమతిగా అందుకున్న బుద్ధుడు పుట్టిన భూమిలో కథా రచయిత శ్రీ పులికంటి కృష్ణారెడ్డి తమ వివరాలని తెలియచేస్తూ

దాదాపు రెండు దశాబ్దాల కిందట మదరాసులో శ్రీ శివలెంక శంభుప్రసాద్‌గారిని చూడడానికని వెళ్ళినపుడు ఆయన నన్ను చూస్తూ ఓరి పిడుగా! నువ్వా పులికంటి కృష్ణారెడ్డి? దాదాపు యాభై యేండ్లు పైబడి ఉంటాయనుకున్నానే నీ రచనల్ని చూసి! అని ఆశ్చర్యాన్ని ప్రకటించి అడపా దడపా రాస్తే కుదరదు రెగ్యులర్‌గా రాయాలి! అని హెచ్చరించినారు అలా రాయటానికి ఉద్యోగం ఒక ప్రతిబంధకమన్న అపోహతో రైల్వేలో అసిస్టెంటు స్టేషన్‌మాస్టర్ ఉద్యోగాన్ని వదలుకొన్నపుడు ఏటికి ఎదురీదుతున్నావే? అని మందలించినారు

అయినా ఏటికి ఎదురీదినాను జీవితంలో ఢక్కా మొక్కీలు తిన్నాను ఇప్పటికి తట్టుకొని నిలబడ గలిగినాను


ఆదరించిన హృదయం ఎప్పుడూ ఆశీర్వదిస్తూనే ఉంటుంది ఏ లోకంలో ఉందో వారి ఆత్మ ఆశీర్వదిస్తూనే ఉంది ఆ ఆశీర్వాద బలంతో నే ఆంధ్ర సచిత్రవార పత్రికలో వరుసగా యిది నేను సాధించిన మూడవ బహుమతి అయితే ఈ అయిదారేళ్ల కృషిలో యిది పన్నెండవ బహుమతి వివిధ పత్రికల్లో

ఈ మధ్య పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు ఇది నాకు నచ్చిన నవల చదవండి' అని శ్రీ కిషన్‌చందర్ రచన 'అయిదుగురు లోఫర్లు' నవల్ని నాచేతిలో పెట్టారు.

ఆ అనుభూతి రెండు రోజులు నన్ను వదలకుండా ఏడిపించింది రాస్తే అంత మంచినవల అంతకన్నా మంచి కథ రాయాలన్నదే ధ్యేయం!

శ్రీ పి రాధాకృష్ణమూర్తి శ్రీ జి దామోదర్ నాయుడు నా సాహితీ జీవనంలో చెరొక కన్ను ఒక కన్ను అగ్ని కురిపిస్తుంది ఇంకొక కన్ను కన్నీటిని స్రవిస్తుంది సమన్వయించుకోవటమే నేను వేస్తున్న ముందడుగు గురూ! ఒక్కసారి పల్లె ప్రాంతాలకు వెళ్ళి మూగ జీవాల్తో ముచ్చటలాడండి' అని ఈ కథకు ప్రేరణ యిచ్చిన శ్రీ రాధాకృష్ణమూర్తిగారికి కృతజ్ఞుణ్ణి! అని పేర్కొన్నారు

బాలట్‌లో రెండవ కథగా ఎన్నికై మరో రు 650/-లు అదనపు బహుమతిగా అందుకున్న ఆ తృప్తి చాలు సామీ! కథా రచయిత శ్రీ పాలగిరి వేణు తాము రచయితగ ఆంధ్ర సచిత్ర వార పత్రికలోనే పుట్టామనీ అందుకే జన్మనిచ్చిన తల్లిగా ఆంధ్ర పత్రికని ఆరాధిస్తామనీ అంటున్నారు ఇంకా ఆయన తమ ఉత్తరంలో నూట ఇరవై పైగా కథల్ని రాసాను ప్రస్తుతం సీరియల్స్ రాయటంలో చేతులు కాల్చుకుంటున్నాను నాలుగేళ్ళనుంచి ప్రముఖ పత్రికలలో ఏదో ఒక బహుమతి రావటం రివాజు అయ్యింది ఇంతకు ముందు (ఇంటే మూడేళ్ళక్రితం) ఆంధ్ర సచిత్రవారపత్రిక దీపావళి పోటీలో మమతల వంతెన కథకు మొదటి బహుమతి రావటం జరిగింది నా మొదటి పాఠకురాలు శ్రీమతి ఊర్మిళ చిరంజీవులు శ్రీకాంత్ వంశీ శరత్‌లు ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫెర్టిలైజర్ సిటీలో ఆఫీసరుగా ఉద్యోగం 'ఏదైనా మంచికథ రాయిబావా! అంటూ వెంటబడి నాకెంతో స్ఫూర్తిని కల్గించే మా



శ్రీ పేరి రవికుమార్

బావ శ్రీ శంబంగి నర్సింహారావుకు ఎంతో ఋణపడి ఉంటాను ఇంతకన్నా నాగురించి గొప్పలేమీ లేవు నన్ను ప్రోత్సహిస్తూ గుర్తింపుగల రచయితగా ఓస్థానాన్ని కల్పించిన ఆంధ్రపత్రికకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అని రాసారు

బాలట్‌లో మూడవ కథగా ఎన్నికై అదనపు బహుమతిగా మరో రు550/-లు అందుకున్న 'శిఖరంమీద' కథా రచయిత అసలుపేరు శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి 1962 నుంచీ పాఠక లోకానికి విహారి గా సుపరిచితుణ్ని గతంలోనూ చాలాసార్లు పత్రికలో బహుమతులు వచ్చాయి 1978 లో వళ్ళచక్రం కథా సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి అవార్డు లభించింది కథ నవల నాటకం కవిత్వం విమర్శవంటి అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ గత పాతికేళ్ళుగా అసంఖ్యాకంగా రచనలు చేసినా - కథ కవిత అభిమాన ప్రక్రియలు నాకవితా సంపుటి చలనమ్ గత దశాబ్దంలో వచ్చిన ఉత్తమమైన కవితా సంపుటాల్లో ఒకటిగా - ప్రముఖుల ప్రశంసల్ని పొందింది జన్మస్థలం - తెనాలి స్వస్థలం - మచిలీపట్నణం గత ఎనిమిదేళ్ళుగా - (జీవిత భీమా సంస్థలో ఉద్యోగిగా) - కడపలో ఉంటున్నాను

అదినుంచీ నా రచనా వ్యాసంగాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తూ మరోసారి నాకథకి బహుమతిని ఇచ్చిన ఆంధ్రసచిత్ర వారపత్రికకి కృతజ్ఞతలు! అని రాసారు

ఇక ప్రత్యేక బహుమతిగా రు 350/లు చొప్పున అందుకున్న మూడు కథలలో మాయ కథ రాసిన శ్రీ పేరి రవికుమార్ తమ స్వపరిచయంలో మాయ నా ప్రచురితమైన రెండవ కథ ఈ కథకు బహుమతి నిచ్చి ప్రోత్సహించి ధైర్యం కలగజేసిన సంపాదకులకు నా కృతజ్ఞతలు నా గురించి ప్రత్యేకంగా చెప్పుకునేందుకు ఏమీలేదు కృష్ణశాస్త్రి, విశ్వనాథ చలం,



డా. లేళ్ళపల్లి వెంకట లక్ష్మి నారాయణ శర్మ

శ్రీ శ్రీ, లత యండమూరిల రచనలు చదివి ప్రేరణ పొందుతాను అందమైన అనుభూతి కలగచేసే కవిత్వం ఆలోచన కలగచేసే కథ వ్రాయాలని నా ఆశయం అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు అని తెలియచేసారు

బాలట్‌లో అయిదవ కథగా ఎన్నికై అదనంగా మరో రు 350/- లు ప్రత్యేక బహుమతిని అందుకున్న బరువు - బాధ్యత కథా రచయిత డాక్టర్ లేళ్ళపల్లి వెంకట లక్ష్మి నారాయణశర్మ తమ వివరాలని తెలియచేస్తూ - పుట్టింది 1940 మే నెలలో తల్లిదండ్రులు శ్రీమతి లక్ష్మీ భారతమ్మ శ్రీ సీతారామస్వామి హైస్కూలు చదువు భట్టి పెనుమర్రులో తర్వాత విజయవాడ ఎస్ ఆర్ ఆర్ అండ్ సి వి ఆర్ కళాశాలలో ఆపైన ఆంధ్రా యూనివర్శిటీ వాల్తేరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు నుంచి ఇండస్ట్రియల్ మేనేజిమెంట్ (ఫైనాన్షియల్ మేనేజిమెంట్)లో డాక్టరేటు వచ్చింది పి హెచ్ డి రావటానికి ముందు కేరళ రాష్ట్రంలో కొన్నాళ్ళు గుంటూరు హిందూ కాలేజిలో కొన్నాళ్ళు లెక్చరర్‌గా ఉద్యోగం 1970 లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మదరాసులో ఇండస్ట్రియల్ మేనేజిమెంటు లెక్చరర్‌గా ప్రవేశం ప్రస్తుతం అదే సంస్థలో ప్రొఫెసర్‌గా ఉంటున్నాను భార్య శ్రీమతి రాజ్యలక్ష్మి ఇద్దరబ్బాయిలు - చి వెంకటరమణ రామకృష్ణకుమార్ వాళ్ళ మధ్య ఒక అమ్మాయి - చి శారద

రచనా వ్యాసంగం మొదలు పెట్టింది దాదాపు 20 ఏళ్ళ క్రితం ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురింపబడిన ఉద్యోగ పర్వాలు - నిరుద్యోగ పర్వాలు చిరుద్యోగపర్వం, గురుద్యోగపర్వం (ఉద్యోగ విరమణతో సహా) - నా మొదటి రచనలు ఇంత వరకూ మూడు నాలుగు వార పత్రికలలోనూ ఒకటి



శ్రీ ఆదూరి వెంకట సీతా రామమూర్తి

రెండు మాస పత్రికలలోనూ నా కథలు ప్రచురణ అయ్యాయి (ఇంగ్లీషు కన్నడంలోకి అనువాదం అయినవీ ఉన్నాయి) కానీ కథ లెన్ని వ్రాసానా అని చూస్తే చాలా తక్కువేమోనన్న అనుమానం వేస్తుంది కారణం కథ వ్రాయటం అంటే కథ చెప్పటంకాదు కాబట్టి అసలా విషయం తెల్సుకునేందుకే కొంతకాలం పట్టింది కథల్చెప్పుతున్నాను అనే అనుమానమే నాలుగయిదేళ్ళనుంచీ రచనల నుంచి దూరంగా ఉండటానికి కారణం (చదవటం తప్పిస్తే) ఇన్నాళ్ళకి కథ వ్రాయాలనే ప్రయత్నం మళ్ళీ చేసాను అదే నా బరువు-బాధ్యత కథ వ్రాయాలన్న తపన ఇంకా మిగిలే వుంది ఇంతకుముందు కూడా ఆంధ్ర సచిత్ర వార పత్రికలోనూ మరొక వార పత్రికలోనూ కథల పోటీల్లో బహుమానాలొచ్చినయ్ కథలు వ్రాసిన వ్రాస్తున్న రచయిత(త్రు)లంటే యెంతో అభిమానం

నాలుగైదు నాటికలు నాటకాలు వ్రాసాను (?) ఆలిండియా రేడియోవారు ప్రసారం చేసారు నేను వ్రాసిన (లేదా చెప్పిన!) నాటకాలలో నటించటం వాటికి దర్శకత్వం వహించటం కూడా రచనలమాదిరే సరదాగా చేసే పనులు డయలాగ్ డెలివరీమీద శ్రద్ధ తీసుకునే నటులంటే యెంతో గౌరవం హాస్యరసం అంటే ప్రత్యేకాభిమానం విషవలయం (నాటిక) ఉద్యోగపర్వాలు (కథలు) పుస్తకరూపంలో వచ్చిన నా రచనలు అని రాసారు

బాలట్‌లో చివరి కథగా వచ్చి అదనంగా మరో రు 350/-లు ప్రత్యేక బహుమతి నందుకున్న నామకరణం కథా రచయిత శ్రీ ఆదూరి వెంకట సీతారామమూర్తి తమ వివరాలు తెలుపుతూ 1974 లో బ్రతక నేర్చిన వాళ్ళు కథ ద్వారా కథా రచయితగానూ 1975 లో రాగ వీచికలు ద్వారా సీరియల్ నవలా రచయితగానూ 1985 లో

జీవితాన్ని సార్ధకం చేసుకున్న మహానటుడు కారీగ్రాంట్

రెండు దశాబ్దాల క్రితమే రంగం నుంచి విరమించుకున్న సుప్రసిద్ధ హాలీవుడ్ నటుడు కారీ గ్రాంట్ ప్రస్తుత తరానికి తెలియకపోవచ్చు మరణవార్త ద్వారానే ఆయన చాలామందికి తెలిసి ఉండవచ్చు ఆయన చిత్రాలు రాంబో చిత్రాల లాగ ప్రపంచపు మారుమూలల దాకా విస్తరించి ఉండకపోవచ్చు కాని హాలీవుడ్ చిత్ర నిర్మాణరంగం ఇవాళ సాధించిన ప్రగతికి, పేరు ప్రతిష్టలకు కారణ భూతమయిన వ్యక్తులలో ఆయన ఒకరు

కారీ గ్రాంట్ తప్ప మిగిలిన వాళ్లందరూ ముసలి వాళ్లవుతారు అని ముప్పై సంవత్సరాల క్రితం ప్రముఖ నాయిక గ్రేస్‌కెల్లీ అభివర్ణించిన నిత్య యవ్వనుడాయన నలభై సంవత్సరాలపాటు



హాలీవుడ్ చిత్రాలలో ఏకచ్ఛత్రాధిపత్యంగా నాయక పాత్రలు ధరించి, ఈ శతాబ్దపు మూడో దశకం నుంచి ఏడో దశకందాకా ప్రముఖ నాయికలందరి సరసనా ఆయన నటించాడు

ఆయన ఉచ్చారణ అపూర్వమైనది ఆయనకు గొప్ప ఆత్మవిశ్వాసం ఉండేది, అది గర్వంగా కనబడేది కాదు ఆయన ఎందరికో నమ్మకస్తుడుగా, మంచి మిత్రుడుగా ఉండేవాడు అలాగని ఎవరి జీవితంలోకీ ఆయన చొచ్చుకుని వచ్చేవాడు కాదు ఆయన రూపాన్ని, ప్రవర్తనను చూసిన వారెవరయినా దిగ్భ్రాంతికి, ఎల్లలు లేని ఆరాధనకు లోనుకాకుండా ఉండడం సాధ్యమయ్యేది కాదు

ఇంగ్లండ్‌లో పుట్టి, అమెరికాలో జీవించి, నటించి లక్షలాది హృదయాలకు ప్రేరణా, ప్రోత్సాహ శక్తి అయిన కారీగ్రాంట్ 82 సంవత్సరాలు వయసులో యోవాలోని డాక్సెన్ పోర్ట్‌లో గుండెపోటువల్ల గత వారం మరణించాడు

ఇంగ్లండులోని బ్రిస్టల్ నగరంలో సగం యూదుడైన ఒక ఇస్త్రీ చేసే వ్యక్తి కొడుకు కారీగ్రాంట్ ఆయన అసలు పేరు అలెగ్జాండర్ ఆర్చిబాల్డ్‌లీచ్ ఆయన 12 ఏళ్ల వయసులో ఒక సర్కస్ కంపెనీ మోజులో పడి దానితో కలిసి తిరగడం మొదలుపెట్టాడు ఆ సర్కస్‌లో ఆయన ఆశ్చర్యకరమయిన భయోద్వేగ పూరితమయిన అంగ విన్యాసాలు చేస్తుండేవాడు దానితో పాటు జావెలిన్ త్రోయర్‌గా, నాటకరంగం మీద నౌకరుగా, రొట్టెలమ్ముకునే వ్యక్తిగా కూడ పనిచేశాడు ఆ రోజుల్లోని ప్రముఖనటి మేవెస్ట్ ఆయనను సినిమారంగానికి ఆహ్వానించడంతో కారీగ్రాంట్ దశ తిరిగింది

నాదంటూ నాకొక శైలి ఉన్నదని నేననుకోను అనీ, 'నేను జాక్ బుచనన్, నోల్‌కవర్డ్, రెక్స్‌హారిసన్‌లను కలగలిపి అనుకరించడానికి ప్రయత్నించాను నేను ఆ ముగ్గురు కలసిన మనిషిని కాదలచుకున్నాను చివరికి నేనా వ్యక్తిగా మారాను లేదా ఆ వ్యక్తే నాలా మారాడేమో, లేదా ఇద్దరమూ ఒకటిగా కలిసిపోయామో అని ఆయన వినయంగా చెప్పుకున్నాడు కాని ఆయన నటించిన, తీసిన 72 చిత్రాలు ఆయన విశిష్టతను చాటి చెపుతాయి

ది ఆఫల్ ట్రుత్, బ్రింగింగ్ అప్ బేబీ, హిజ్ గర్ల్ ఫ్రైడే, గువాంగా దిన్, ది ఫిలడెల్ఫియా స్టోరీ, వోన్లీ ఏంజల్స్ హావ్ వింగ్స్, సస్పిషన్, నోటోరియస్, నార్త్ బై నార్త్ వెస్ట్, ఇన్‌డిస్క్రీట్, ఫాదర్ గూస్, వాక్ డోన్ట్ రన్ వంటి ఎన్నో కలకాలం గుర్తుండే చిత్రాలలో ఆయన అద్భుతంగా నటించారు

1970లో ఆయనకు ఆస్కార్ ప్రత్యేక బహుమతి అందజేస్తూ నటనా ప్రపంచంలో అత్యద్భుతమయిన ప్రతిభను ప్రదర్శించినందుకు" ఆ బహుమతికి ఆయన అర్హుడని ప్రకటించారు

ఆయన అయిదుగురిని వివాహమాడినప్పటికీ నాలుగో భార్య డయాన్‌కానన్‌తో మాత్రమే ఆయనకు సంతానం కలిగింది ఐదో భార్య బార్బరా హారిస్‌కు మిగిల్చిన ఆస్తి కాక, ఏకైక కూతురు జెన్నీ పర్‌కు ఆయన అరవై మిలియన్ డాలర్ల ఆస్తిని (దాదాపు 80 కోట్ల రూపాయలు) వ్రాసిపెట్టి పోయాడు

కారీగ్రాంట్ తన జీవిత కాలంలోనే ఒక ఆరాధనీయ వ్యక్తి, ఆదర్శనీయ వ్యక్తిగా, నమూనాగా మారాడు ప్రతి ఒక్కరూ కారీగ్రాంట్ కాదలచుకుంటారు నేను కూడా కారీగ్రాంట్ కాదలుచుకున్నాను అని ఆయనే ప్రకటించవలసి వచ్చిందంటే అంతకంటే జీవిత సార్ధకత మరేముంటుంది?' (ఒ. ఏ.)

మనలోమాట

'ఓనమాలు' ద్వారా బహుమతి కథా రచయితగానూ ఆంధ్ర సచిత్ర వార పత్రికకు పరిచయస్తుడినే


బహుమతులు పొందిన పది కథల్లోనూ రెండు కథలు ఆంధ్ర సచిత్ర వార పత్రికలోనే అచ్చయ్యాయి

ఈ కథ పుట్టడానికి కారణం నా శ్రీమతి ఉమకు కృతజ్ఞతలు సుమారు 150కి పైగా అచ్చయిన నా కథల నుండి సుప్రసిద్ధ రచయితలు ఏర్చి కూర్చిన 16 కథల సంకలనం 'వెన్నెల్లో పావురాళ్ళు' ఇటీవలే వెలువడింది. స్వార్థం, ఈర్ష్య లేని నిష్కల్మష స్నేహమన్నా, సూటిగా మనసు విప్పి మాట్లాడే వారన్నా, పంక్చువాలిటీని పాటించేవారన్నా, ఆలోచనల్నిరేపే సత్ సాహిత్యమన్నా యిష్టం

సాహిత్యం జన జీవితాన్ని ప్రతిబింబిస్తూ, సాంఘిక పరమైన సమస్యలకు పరిష్కారమార్గాల్ని చూపటంలో వ్యక్తికి తోడ్పడేదిలా ఉండాలనీ, కాస్తయినా ఆలోచింపజేయాలనీ అనుకుంటాను. సమాజంలో ఉన్న మూడు తరగతుల జన జీవన విధానాలలో మధ్య తరగతివారి జీవితాల్ని రచనల్లో చిత్రించటమంటేనే ఎక్కువ యిష్టం" అని రాసారు

దీపావళి కథలపై మేము నిర్వహించిన వ్యాస రచన పోటీలో మొదటి బహుమతి రు. 250/- శ్రీమతి టి. వి సునంద (గూడూరు), రెండవ బహుమతి రు. 150/- శ్రీ వక్కలంక విజయ భాస్కర రామారావు (మానేపల్లి), మూడవ బహుమతి రు. 100/- శ్రీ ఇ. టి. రామారావు (శ్రీహరికోట) గార్లు రాసిన వ్యాసాలకి లభించాయి. ఈ ముగ్గురికీ మా అభినందనలు. బహుమతి పొందిన వ్యాసాలని ఈ సంచికలోనే ప్రచురించాము.

ఎప్పటివలెనే ఈ ఏడాది కూడా సినిమా బాలట్ నిర్వహిస్తున్నాము. పాఠకులు ఈ సంచికలో ప్రచురించిన బాలట్ పత్రాన్ని పూర్తి చేసి 1987 ఫిబ్రవరి 7 వ తేదీలోగా 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ-520003' అనే చిరునామాకి రాయవలసినదిగా కోరుతున్నాము. పాఠకుల సౌకర్యం కోసం 1986 లో విడుదలైన తెలుగు చిత్రాల పేర్లు, వాటి దర్శకులు, సంగీత దర్శకుల జాబితాని ఈ సంచికలోనే వేసాము. పాఠకులందరూ ఉత్సాహంతో సినిమా బాలట్‌లో పాల్గొని దానిని విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాము. □


ప్రతి దేహానికీ సరిపోయేది
టాన్‌టెక్స్®
బ్రీఫ్‌లు
వెస్ట్‌లు
క్యాజువల్స్
పిల్లల దుస్తులు
TTK తయారీ
Imageads-2321

ఆశయం

యం.యస్.ఆర్.చౌదరి

సమయం రాత్రి 10 గంటలు కావస్తుంది. జోరున, కుండపోతగా వర్షం కురుస్తోంది. దాదాపు వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.





కొత్త సీరియల్ ప్రారంభం

నవంబర్ నెల, పైగా అమావాస్య రోజులు కావటంతో అందరూ తలుపులన్నీ బిగించుకొని, దుప్పట్లు ముసుగేసి వెచ్చగా పడుకొని ఉన్నారు.

వాన కురవటంతో కరంటు పోయినందు వలన స్ట్రీట్ లైట్లు కూడా ఆరిపోయి ఊరంతా కటిక చీకట్లో మునిగి పోయింది.

అప్పుడప్పుడు ఆకాశంలో మెరుస్తున్న మెరుపులు విద్యుల్లతవోలె తళుక్కున మెరుస్తున్నాయి.

అంతలో హఠాత్తుగా ఎక్కడో పిడుగు పడినట్లు భయంకరమైన ఉరుముతో కూడిన శబ్దం వినపడింది.

అంతలో ....

నిర్మానుష్యంగా ఉన్న ఆ వీధిలో, వీధి చివర ఉన్న ఒక బిల్డింగ్ ముందు మోటార్ సైకిల్ ఒకటి వచ్చి ఆగింది.

దానిపై నుంచి ఇద్దరు వ్యక్తులు దిగారు. ఇద్దరూ దాదాపు 6 అడుగులు పొడవు ఉండి హేట్టు బూట్ నల్లని దుస్తులు ధరించి, పైన బూడిద రంగు రెయిన్ కోట్లు ధరించి ఉన్నారు.

వారు మోటార్ సైకిల్ పైనుంచి దిగి దానికి స్టాండ్ వేసారు.

వారిలో ఒకడు గేటు దగ్గరకి వచ్చి వాచ్‌మెన్ కోసం అటూ ఇటూ చూశాడు. ఎక్కడా వాచ్‌మన్ ఉన్న జాడ కనిపించలేదు.

రూట్ క్లియర్ అన్నాడు వాడు ఇంకొకడితో.

"అయితే పద త్వరగా పని ముగించుకొని పోదాం" అన్నాడు రెండో వాడు.

వాడికి అక్కడ రూమ్ దగ్గర విడిచి వచ్చిన రమ్‌సీసా, చుక్కలాంటి పిల్ల ఇంకా మదిలో మెదులుతానే ఉన్నాయి. మంచి మూడ్‌లో ఉండగా బాస్ దగ్గర నుంచి ఆర్డర్ వచ్చింది, పని త్వరగా ముగించుకు రమ్మని. బాస్ చెప్పిన పని క్షణాల్లో చేయాల్సిందే. లేకుంటే తమకు చావు మూడిందే.

పద అంటూ మొదటి వ్యక్తి గేటు తెరిచాడు.

గేటు దగ్గర నుంచి బిల్డింగ్ ముఖద్వారం వరకు నున్నటి తారురోడ్ పోసి ఉంది. రోడ్ కిరుప్రక్కలా పూలమొక్కలు నాటి ఉన్నాయి.

ఇద్దరూ త్వర త్వరగా అడుగులు వేసుకొంటూ డోర్ దగ్గరకి వెళ్ళారు. డోర్ లోపలి వైపు గడియ వేసి ఉంది.

ఇద్దరూ భవనం కుడివైపు ఉండే మెట్ల ద్వారా రెండవ అంతస్తు దగ్గరకి వెళ్ళారు.



కర్షక సంక్రాంతి

హలధారియై రైతు పొలమున పండించు
ధాన్య రాశుల జూసి తనివి పడగ
వరికుప్ప నూర్పులో వయ్యార మొలికించు
గ్రామీణను గదిసి క్షేమ మడగ
రంగ వల్లులతో డ పొంగులు వెల్గార్చు
తెలుగింటి పడతుల పలుకరింప
హరి నామ కీర్తన స్వర రాశినందించు
జియ్యర్ని రాగాలు తియ్యమనగ
గంగి రెద్దుల ఆటల హంగు జూడ
కోడి పందాల పోరాట వేడి జూడ
భోగి మంటల శోభను వేగ జూడ
వచ్చె కర్షక సంక్రాంతి వాడ వాడ

—తమ్మిశెట్టి రామారావు

ఆశయం

రెండో అంతస్తు ఎంట్రన్స్‌కు కుడివైపు ఉండే రెండో గదిలో తాము పని పూర్తి చేసుకొని వెళ్ళాలి

గది ముందు నిలబడ్డారు. ఆ గది లోపలి వైపు నుంచి లాక్ చేయబడి ఉంది దానిని ఎలా తీయాలా అని ఆలోచించసాగారు

అంతలో ఒకడి దృష్టి గదికి కుడివైపు ఉండే కిటికీపై పడింది అది ఫ్రెంచ్ టైపు విండో ఏమో ఊచలు ఉపయోగించకుండా అద్దాన్నే వాడారు ఆ కిటికీకి

చేతో సైగ చేసి చూపించాడు రెండో వాడికి

ఒకే అన్నాడు వాడు

పెటిల్మని కుడిచేతి పిడికిలితో అద్దాలని బ్రద్దలు కొట్టాడు ఒకడు

ఫెటిల్మని పగిలింది అద్దం

పగిలిన అద్దం ముక్కలు రూమ్ లోపల బయట చిందర వందరగా పడ్డాయి

అద్దం పగులకొట్టినవాడి చేతి వ్రేళ్ళలో కస్సున దిగబడ్డాయి కొన్ని అద్దం పలుకులు

కాని కార్యసాధన ముందు అటువంటి గాయాలు లెక్కచేసే వాళ్ళుకాదు వారు అందుకనే వారిని వాళ్ళ బాస్ అందరికన్నా ఎక్కువగా అభిమానిస్తాడు

అద్దం పగిలిన చప్పుడికి లోపల బెడ్‌పై ఏదో కదలిక ఏర్పడింది

ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉన్నారు వారు

తిరిగి మళ్ళీ మిగిలి ఉన్న అద్దం ముక్కల్ని కూడా అద్దుతొలగించుకుని ఆ కిటికీ ద్వారం లోపలికి ప్రవేశించారు ఇద్దరూ

ఇంతలో పోయిన కరెంట్ వచ్చింది

గదిలో ఉన్న ట్యూబ్‌లైటు దేదీప్యమానంగా వెలిగింది

ఆ గదిలో ఒక డబుల్‌కాట్ బెడ్‌పై దాదాపు 40 సంవత్సరాలున్న ఒక వ్యక్తి పడుకొని నిదరపోతున్నాడు పొట్టిగా, తెల్లగా చూడటానికి బలంగా ఉన్నాడు ఆ వ్యక్తి

లోపలికి ప్రవేశించిన ఆగంతకులు ఇద్దరూ మంచానికి ఇరు ప్రక్కలా వచ్చి నిలబడ్డారు వర్షానికి తడుస్తూ రావటంవలన వారు ధరించిన రైన్ కోట్లపైనుంచి ఇంకా నీళ్ళు కారుతూనే ఉన్నాయి

ఒకడు పడుకొని ఉన్న వ్యక్తిని దరలేపాడు

నిద్రపోతున్న అతను తట్టి లేపటంతో షడన్‌గా మేల్కొని, ఎదురుగా ఉన్న అగంతకులను చూసి అయోమయంతో "హా" ఎవరు మీరు"? అని అడిగాడు

సమాదానం చెప్పకుండా మౌనంగా నిలబడ్డారు వారిద్దరు

అతను అయోమయంగా లాక్‌చేసఉన్న డోర్‌వైపు చూశాడు లాక్‌వేసిన డోర్ అలాగే ఉంది అంతలో అతని చూపు అద్దాలు పగిలిన విండోపై పడింది

ఎవరు మీరు? అర్ధరాత్రి నా రూంలోకి ఎందుకు ప్రవేశించారు అడిగాడు ఆ వ్యక్తి.

మిస్టర్ గణేశ్. నా పేరు సలీమ్ నా ఫ్రెండ్ పేరు జావేద్ మేము నిన్ను చంపటానికొచ్చాము అన్నాడు ఆ ఆగంతకులతో ఒకడు, తాపీగా

ప్రక్కలో బాంబు పడ్డట్లు ఉలిక్కిపడ్డాడు ఆ వ్యక్తి వై వై ఎందుకు మీరు నన్ను చంపాలనుకొంటున్నారు అడిగాడు రెండడుగులు వెనక్కి వేస్తూ భయంతో

ఎందుకు? ఏమిటి? అనే ప్రశ్నలు నీ కనవసరం నువ్వడిగినా నీకు సమాదానం చెప్పటానికి జవాబు మా దగ్గర సిద్ధంగాలేదు అన్నాడు జావేద్

నేను మీకేమి ద్రోహం చేశాను అసలు మిరెవరో నాకు తెలియదు మనకు ఇంతవరకు పరిచయమేలేదు నన్ను చంపేంత అపకారం మీకేం చేశాను

అవన్నీ మాకు తెలియదు నిన్ను చంపమని మా బాస్ దగ్గర్నుంచి ఆర్డర్స్ వచ్చాయి అందుకని నిన్ను చంపుతున్నాము కాకుంటె నీకో చాన్స్ నిన్ను కత్తితో పొడిచి చంపమంటే చంపుతాము లేకుంటే రివాల్వర్‌తో కాల్చమంటే కాలుస్తాం కోరుకో నీ యిష్టం ఎలాంటి చావు కావాలో అన్నాడు సలీం

ఎవరు మీ బాస్ అడిగాడు గణేశ్ వారు ఎవరో, ఎందుకు చంపాలనుకొంటున్నారో గణేశ్‌కు అర్థం కావటంలేదు

చావబోయే వాడివి నీకు వివరాలు చెప్పినా నష్టం ఏమీలేదు విను మా బాస్‌పేరు ఏమిటో మాకు కూడా తెలియదు ఎప్పుడూ ముసుగులో ఉంటాడు కాబట్టి మేమంతా ముసుగుమనిషి అంటూంటాము అన్నాడు సలీమ్

ముసుగు మనిషా !?

'యస్ అన్నాడు జావేద్ క్షణంలో అతడు కోటుపాకెట్‌లోంచి రివాల్వర్‌తీసి గణేశ్ గుండెకు గురిపెట్టి కాల్చాడు,

కెవ్వుమనే కేకతో గుండె లరచేత పట్టుకుని వెనక్కు విరుచుకు పడిపోయాడు గణేశ్

నిశ్శబ్దంగా ఉన్న ఆ వాతావరణంలో కెవ్వుమని గణేశ్ వేసిన కేక భయంకరంగా విన్పించింది

* * * * * * * *

ఉదయం 9 గంటలు

సంతోష్ ఎంటర్ ప్రైజస్ ఆఫీస్ ముందు యువతీ యువకులు గుంపులు గుంపులుగా ఉన్నారు

సంతోష్ ఎంటర్‌ప్రైజస్‌లో జరిగే ఇంటర్వ్యూకు వచ్చారు వారందరూ

మేనేజర్ పోస్టుకై ప్రకటన చేయించింది పత్రికలో సంతోష్ ఎంటర్‌ప్రైజస్ మేనేజిమెంట్

ఉంది ఒక పోస్ట్ కాని దాదాపు 100 అప్లికేషన్‌లు వచ్చాయి

ఈ రోజు ఉదయమే ఇంటర్వ్యూ

కాని మేనేజర్ పోస్ట్ అప్పుడే ఫిల్ప్ అయిపోయిందని, ఎవరో ఎం ఎల్ ఏ గారి కాండిడేట్ కిచ్చేశారని అందరూ అనుకోసాగారు కాని ఇంకా ఆశ చావక ఇంటర్వ్యూలో తమపేరు పిలుపుకై ఎదురు చూస్తున్నారు

ఇంతలో

విజయ్‌కుమార్‌గారు విజయ్‌కుమార్‌గారు అంటూ పిలిచాడు ఆఫీస్ ప్యూన్ వచ్చి

ఒక మూలగా బెంచీపై కూర్చొని ఉన్న యువకుడు లేచి నిలబడి సర్టిఫికేట్స్ ఉన్న ఫైల్ చేత పట్టుకొని ఇంటర్వ్యూస్ జరిగే రూమ్‌లోనికి వెళ్ళాడు

ప్లీజ్ టేక్ యువర్ సీట్

థాంక్యూ అంటూ కుర్చీలో కూర్చున్నాడు ఆ యువకుడు

ఇంటర్వ్యూ చేస్తున్న వారివైపు చూశాడు విజయ్‌కుమార్

మొత్తం ముగ్గురు చేస్తున్నారు ఇంటర్వ్యూ వారిలో ఒకడు సంతోష్ ఎంటర్ ప్రైజెస్ ప్రొప్రయిటర్ సంతోష్‌కుమార్ ఇంకొక వ్యక్తి అతని లాయర్ ఇంకొక వ్యక్తి సంతోష్‌కుమార్ బావమరిది

'నీ పేరు' అడిగాడు సంతోష్‌కుమార్

'విజయ్‌కుమార్'

'ఎంత వరకు చదివావు'

ఎం ఎ ఫస్ట్‌క్లాస్" అంటూ సర్టిఫికేట్స్ ఉన్న ఫైల్ అందిచ్చాడు విజయ్‌కుమార్.

ఫైల్ తిరగేశాడు సంతోష్‌కుమార్

ఫైల్ చూస్తున్న సంతోష్‌కుమార్ కళ్ళు మెరిశాయి "ఓ. యూనివర్శిటీ ఫస్ట్. గోల్డ్ మెడలిస్ట్ అన్నమాట'

'యస్ సర్'

"సరే మేము కొన్ని ప్రశ్నలు వేస్తాము వాటికి సరియైన సమాధానాలు చెప్పండి'.

అడగండి"

"భూమి దేనిచుట్టూ తిరుగుతుంది' •

"డబ్బు చుట్టూ

'మనిషికి అన్నిటికన్నా ముఖ్యమైనది ఏది

'ఈ రోజుల్లో డబ్బు తర్వాతే ఏదైనా"

మిస్టర్ మేమడిగే ప్రశ్నలకు సూటిగా చెప్పండి' అన్నాడు సంతోష్‌కుమార్ విజయ్‌కుమార్ చెప్పే సమాధానాలు విని

"డియర్ సర్స్ మీరిచ్చేది మేనేజర్ పోస్ట్ కావాలంటే మీ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ప్రశ్నలు అడగండి సమాధానాలు చెపుతాను అవసరమైతే మెరిట్ చూడండి అంతేకాని ముందే కాండిడేట్‌ను నిర్ణయించుకొని, ఉద్యోగాలిచ్చేసి, తర్వాత నామమాత్రపు ఇంటర్వ్యూలు జరపటం దేనికి అన్నాడు కోపంగా విజయ్‌కుమార్ లేచి నిలబడుతూ

'మిస్టర్ ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా"

"యస్ ఎం. ఎల్. ఎ గారి కాండిడేట్‌కు ఉద్యోగమిచ్చి, ఇంటర్వ్యూ పేరుతో నిరుద్యోగులకు అప్లికేషన్‌లమ్మి, వార్ని లేనిపోని కష్టాలు పాలుచేసి వారి నెత్తురు కూడు తింటున్న దౌర్భాగ్యులతో" అన్నాడు కోపంగా వెనక్కి తిరిగి వెళుతూ విజయ్‌కుమార్.

"మిస్టర్ ఆగు"

"వాట్ అన్నాడు విజయ్‌కుమార్ ఆగి.

"అంత ఆవేశం పనికిరాదు ఉద్యోగం చేయాలంటే ఆవేశంకాదు కావాల్సింది అణకువ సరే నువ్వన్నట్లే ఎం ఎల్ ఎ గారి రెకమెండేషన్‌ను కాదనలేక మేనేజర్ పోస్ట్ వారి వ్యక్తికి ఇవ్వవలసి వచ్చింది. కావాలంటే ఇంకో పోస్ట్ క్రియేట్ చేస్తాము ఆ పోస్ట్ నీకిస్తాము అయితే ఓ షరతు

'ఏమిటి'

'నీకిచ్చే ఉద్యోగానికి మేమిచ్చే నెల జీతము వెయ్యి రూపాయలు అందుకు ప్రతిగా నువ్వు మాకు 20 వేల రూపాయలివ్వాలి

'లంచమా?'

"నువ్వు ఏ రూపంతో నైనా అనుకో అన్నాడు సంతోష్‌కుమార్

విజయ్ వారు కూర్చున్న టేబిల్ దగ్గరగా వచ్చి ఫోన్ అందుకొంటూ మీ ఫోన్ ఒక్కసారి వాడుకోవచ్చా అడిగాడు

ఎందుకు"

పోలీస్ స్టేషన్‌కి ఫోన్‌చేసి విషయం చెపుదామని

యూ బాస్టర్డ్ గెటవుట్ అంటూ అరచాడు సంతోష్‌కుమార్ విజయ్ చేతిలోని ఫోన్ అందుకుని విసురుగా టేబిల్‌పైపెడుతూ

'ఏదో పోనీలెమ్మని ఉద్యోగమిస్తానంటే నీకంత తలబిరుసా అన్నాడు సంతోష్‌కుమార్

'మిస్టర్ సంతోష్‌కుమార్! నువ్వు లంచం తీసుకొని ఇచ్చే ఉద్యోగం కొసం ఇక్కడ ఎవ్వరూ ఎదురు చూడటంలేదు నాకున్న అర్హతకు నా నిజాయితీతో ఎటువంటి రెకమెండేషన్‌లు, ఎటువంటి దక్షిణలు అక్కరలేకుండానే ఉద్యోగం సంపాయించుకొంటాను గుడ్‌బై" అంటూ విసురుగా స్ప్రింగ్‌డోర్ తెరుచుకొని వెళ్ళిపోయాడు విజయ్‌కుమార్

* * * * * * *

విజయ్ ఏమైందిరా నువ్వెళ్ళిన ఇంటర్వ్యూ అడిగింది విజయ్‌ని తల్లి సుందరమ్మ

చదవటం వరకేనమ్మా మన బాధ్యత మెరిట్ తెచ్చుకోవటం వరకే నా కృషి అంతా తర్వాత ఉద్యోగం అంతా రెకమెండేషన్‌లతోను లంచాలతోను ఉంది ఏదీ పెట్టలేని మనకెవ్వడిస్తాడమ్మా ఉద్యోగం అన్నాడు నిరాశగా విజయ్

'అలా అనుకొంటే ఎలారా ప్రయత్నం చేయటం వరకు మనవంతు ఆ తర్వాత అంతా ఆపైవాడి దయ నారుపోసినవాడు నీరు పోయకుంటాడా

"అలా అనుకొంటూనే ఉండండి పుణ్యకాలమంతా సరిపోతుంది వయస్సైపోయిన తర్వాత నువ్వు ఉద్యోగానికి పనికిరావు పోయి ఇంట్లో కూర్చో అంటూ సర్టిఫికేట్లు చేతికిచ్చి ఇంటికి పంపిస్తారు అంటూ అందుకొన్నాడు విజయ్ తమ్ముడు రాజేష్ అప్పుడే కాలేజినుంచి వచ్చి బుక్స్ రాక్‌లో పెడుతూ

'ఒరేయ్ నువ్వూరుకోరా అసలే వాడు ఉద్యోగం దొరకలేదనే నిరాశతో ఉంటే నువ్వింకా నిరాశపరుస్తావు" అంటూ కసురుకొంది సుందరమ్మ

"నువ్వెప్పుడూ ఇలాగే అంటావమ్మా నిజాయితికి విలువెక్కడమ్మా ఈ లోకంలో. అవినీతిదే పైచేయి ఈ సమాజంలో అన్నయ్యకన్నా తక్కువ మార్కులతో పాసైన సురేష్ 20 వేలు లంచంపెట్టి ఆఫీసరయ్యాడు గోల్డ్

గడుసులోకం —బాబు



ఆశయం

మెదలిస్ట్ అన్నయ్యే ఏమో ఇంకా నిరుద్యోగిలా చిరుద్యోగమన్నా లేకుండా ఉన్నాడు. అదే నేనైతేనా ఈ పాటికి చిన్న ఉద్యోగమైనా సంపాదించి ఉండేవాడిని' అన్నాడు రాజేష్

'రాజేష్ చదువుకొనే రోజుల్లో అందరూ నీలాగే కలలు కంటూంటారురా. నేనూ అలాగే కలలు కన్నాను కాని డిగ్రీ చేతికొచ్చాక వాస్తవ జగత్తులో పడ్డాకగాని అర్థం కావటంలా సమాజమంటే ఏమిటో, ఉద్యోగం మనబోటి మధ్యతరగతి కుటుంబీకులకు రావాలంటే ఎంత కష్టమో? అన్నాడు విజయ్

"అది కాదన్నయ్యా

'అవన్నీ నీ కిప్పుడే వద్దురా నువ్వు బాగా చదువుకో ముందు పరీక్షలు పాసుకా తర్వాత తీరిగ్గా ఆలోచిద్దువుగాని ఉద్యోగాల సంగతి' అన్నాడు నవ్వుతూ విజయ్

విజయ్, రాజేష్, సుమతి ముగ్గురూ సుందరమ్మ బిడ్డలు సుందరమ్మ భర్త రాఘవరావు పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడే యాక్సిడెంటులో చనిపోయాడు అప్పటి నుంచి ఉన్న కొద్దిపాటి ఆస్తితోనే పిల్లలను చదివించుకొంటూ కాలం గడుపుతుంది సుందరమ్మ

ఆమె కష్టం ఫలిస్తుందా అన్నట్లుగా విజయ్ ఎం ఏ ఫస్ట్‌క్లాస్‌తో గోల్డ్ మెడలిస్ట్ అయ్యాడు రాజేష్ ఈ సంవత్సరమే బి ఏ ఫైనల్‌కు వచ్చాడు సుమతి ఇంటర్ సెకండియర్ చదువుతుంది

అమ్మా నేనలా పార్కుకు వెళ్ళొస్తాను అంటూ పార్కుకు బయలుదేరాడు విజయ్

దారి పొడుగునా ఒకటే ఆలోచనలు, ఎప్పుడు ఉద్యోగం వస్తుందా, ఎప్పుడు తను కుటుంబ బాధ్యతలు తలకు ఎత్తుకుంటాడా అని ఆలోచిస్తూ పార్కుకు వచ్చాడు విజయ్

పార్కులో ఓ మూలగా ఎవ్వరూ లేనిచోట సిమెంట్ బెంచీపై కూర్చొన్నాడు విజయ్

ఒంటరిగా ఉంటే ఏదో ఒక ఆలోచనలు అనుకొంటూ బెంచీమీద అలా వెనుకకు వాలి కళ్ళు మూసుకొన్నాడు విజయ్.

అంతలో" ...

ఎవరో వెనుకగావచ్చి విజయ్ కళ్ళు మూశారు.

'ఎవరూ"

ఎవరో చెప్పుకో చూద్దాం"

అరుణ'

కాదు'

"జ్యోతి"

ఊహూ"

కల్పన"

ఏయ్ ఎవరు వీళ్ళంతా." అంటూ విసురుగా కళ్ళపై నుంచి చేతులు తీసి వచ్చి విజయ్ ప్రక్కనే సిమెంట్ బెంచీపై కూర్చుంది నర్మద

ఓహో అమ్మాయిగారికి కోపం వచ్చినట్లుందే' అన్నాడు తమాషాగా విజయ్

'రాదా మరి ఎవరెవరో అమ్మాయిల పేర్లు చెపుతుంటే– వారంతా నీ కళ్ళు మూసిపెట్టేంత చనువున్నవారా ఎవరసలు వాళ్ళు" అంటూ గద్దించింది నర్మద

అహ్హహ్హ" అంటూ పెద్దగా నవ్వాడు విజయ్

నీ కంతా నవ్వులాటగా ఉంది మరీ పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అట. అలా వుంది నీ వాలకం' అంటూ ఉడుక్కుంది నర్మద.

"మరి లేకపోతే నేనేదో తమాషాకంటే నువ్వెందుకు అలా ఉడుక్కుంటావు

విజయ్ నేనేదైనా సహిస్తానుగాని, నేను కోరుకున్న మనిషి నేను మనసుపడ్డ

మనిషి ఇంకో వ్యక్తిపై మనసుపడితే నేను సహించలేను దేంట్లోనైనా భాగమిస్తానుగాని నా జీవిత భాగస్వామిలో మాత్రం భాగం ఇవ్వను" అంది నర్మద

"ఛా! నిన్ను బాధపెట్టాలనిగాదు నర్మదా నేను తమాషాకు అలా అన్నాను

"అది సరేగాని ఇంతకూ మన పెళ్ళెప్పుడు" అడిగింది గోముగా నర్మద

తాను దూరేదానికి సందులేదుగాని మెడకొక డోలని నాకే టికానా లేకుంటే నిన్ను పెండ్లి చేసుకొని ఎలా పోషించమంటావు"

"అదా నీ సందేహం అలా అయితే ఏం భయపడవద్దు మా నాన్న నేను కోరినంత, మన జీవనోపాధికి సరిపడినంత డబ్బు ఇస్తాడు దాంతో మనం హాయిగా బ్రతకొచ్చు

"అలాంటి పిచ్చి పిచ్చి ఆశలేం పెట్టుకోవద్దు నా స్వశక్తి మీద నేను ఆధారపడతానుగాని ఆడపిల్ల ద్వారా సొమ్మును ఆశించేటంత నీచుడ్నికాదు అన్నాడు విజయ్

"అయితే మా నాన్నగారితో చెప్పి నీకేదైనా ఉద్యోగం ఇప్పిస్తాను దీనికైనా ఒప్పుకో బ్రతిమిలాడింది నర్మద

"చూడు నర్మదా నాకు డిగ్రీ ఉంది ఆ డిగ్రీతో ఉద్యోగం సంపాదించుకోగలననే నమ్మకం నాకుంది నేను ఉద్యోగం సంపాదించుకొనేదాకా నా కోసం నువ్వు వేచి ఉండాల్సిందే లేకుంటే వేరే ఎవరినైనా

టక్కున అరచేతో విజయ్ నోరుమూసింది నర్మద

"ఎన్ని జన్మలైనా నీ కోసం ఎదురు చూస్తానుకాని నా జీవితంలోనికి మనసులోనికి వేరేవాడి ప్రసక్తి రానీయను అంది నర్మద

"అది సరేగాని విజయ్ ఉదయం ఏదో ఇంటర్వ్యూకు వెళ్ళావంట ఏమైంది ' అడిగింది నర్మద

ఆ వెళ్ళాను ముందే ఎవరో అభ్యర్థికి పోస్టు ఖాయంచేశ్కాని తర్వాత కళ్ళనీళ్ళు తుడవటానికని ఇంటర్వ్యూకు పిలిచారు పైగా లంచం కావాలంట నాలుగు దులిపి వచ్చాను" అన్నాడు విజయ్

ఈ మాటలంటున్నప్పుడు విజయ్‌కి ఆనంద్ గుర్తుకొచ్చాడు

ఆనంద్ విజయ్ క్లాస్‌మేట్ ఇద్దరూ ఎం ఏ చదివేటప్పుడు మంచి ఫ్రెండ్స్ ఒకే రూమ్‌లో ఉంటూ ఒకరి కోసం ఒకరన్నట్టుగా ఉండేవారు

ఇద్దరూ అన్ని విషయాల్లో ఒకేలాగున్నా వారి వారి భావాలలో మాత్రం వేరు వేరుగా ఉండేవారు

ఏ పనినైనా నీతితో నిజాయితీతో చేయాలంటాడు విజయ్ ఎలాగైనాసరే న్యాయంతో 'కాకుంటే అన్యాయంగానైనాసరే విజయం సాధించాలంటాడు ఆనంద్

ఇద్దరూ ఫైనలియర్ పరీక్షలు రాసి విడిపోయేటప్పుడు ఈ విషయమై పెద్ద ఘర్షణ పడ్డారు

చూడు విజయ్ నువ్వు నీతి నిజాయితీ అంటూ బావిలో కప్ప మాదిరి అదే ప్రపంచమనుకొంటుంటే అభివృద్ధి చెందలేవు నీతి నిజాయితీ వదిలిపెట్టు డబ్బు సంపాయించటమే ధ్యేయంగా పెట్టుకో జీవితంలో పైకి వస్తావు అన్నాడు ఆనంద్

"విజయ్ ఏమిటి అలో చిస్తున్నావు"

ఆఁ ఏంలేదు నా ఫ్రెండ్ ఆనంద్ గుర్తుకొచ్చాడు" అన్నాడు విజయ్

ఆనందా? ఇప్పుడెక్కడున్నాడు"

"ఏమో? పరీక్షలైపోయిన తరువాత మళ్ళీ కలువలేదు ఇప్పుడెక్కడున్నాడో? ఏంచేస్తున్నాడో?

నర్మద కూడా ఎం ఏ లో విజయ్‌క్లాస్‌మేట్

నర్మద జిల్లా సూపరింటెండెంట్ కూతురు ఎం ఏ చదివేటప్పుడే విజయ్ వ్యక్తిత్వాన్ని నిరాడంబరతను చూసి అతన్ని ప్రేమించింది పెళ్ళి చేసుకోవాలనుకొంది దీనికి నర్మద తండ్రి కూడా అంగీకరించాడు కాని విజయ్ ఉద్యోగం వచ్చేదాకా ఆగమంటున్నాడు

పద నర్మదా చాలా టైమయింది అంటూ లేచాడు విజయ్

అనుసరించింది నర్మద

(ఇంకా ఉంది)



"సంక్రాంతి బొమ్మల కొలువు" ఫోటో : ఇసుకపల్లి సుజాత

బొమ్మల కొలువు

సవరించాం మా యింట్లో చక్కని బొమ్మల కొలువు
ఒక్కసారి చూడరండి ఉల్లము పులకించునండి

ముఖ్యులైన దేవతలు ముందే కూర్చున్నారు
ఇష్టకామ్యార్థసిద్ధి నిస్తామంటున్నారు

చలికాలపు తల్లి కడుపు చల్లగుండాలి అంటూ
దుప్పటిలో కొత్తజంట దూరి అంటున్నారిదుగో

ఇదుగో ఇది భోగిమంట హృదయోత్సాహపు వంట
కాదుకాదు – అనావృష్టి కల్పించిన కడుపు మంట
బంతిపూలు కోళ్ళపోరు బలు రంగుల రాట్నాలూ
సిరి ముగ్గులు గంగిరెద్దు హరిదాసులు మామూలే

గోదావరి వరదల్లో కొంపా గోడూ పోయి
అల్లాడే పేదరైతు అదుగో ఉన్నాడిక్కడ
తిండి కొరకు తిరుగుతూ ఎండుపుల్లలైన యీ
శ్రమజీవులు అనావృష్టి రాకాసికి బలిపశువులు

మెదడువాపు వ్యాదివచ్చి మృత్యు గహ్వరాన చొచ్చి
పితరుల శోకాబ్ధి ముంచి వెళ్ళిన పాపాయి యితడు
అహ్వానపు లేఖ గూర్చి అధిక కాలవ్యయం చేసి
పలు కష్టాలలో చిక్కిన ప్రభుత్వోద్యోగులరుగో

ఇదుగో సంక్రాంతిలక్ష్మి హితకారిణి వరదాయిని
వరదహస్త మిస్తున్నది వచ్చిన వారందరికీ
ఒక్కసారి చూడరండి ఉల్లము పులకించునండి
సవరించాం మా యింట్లో చక్కని బొమ్మల కొలువు

-సూర్యదేవర రవికుమార్

చిన్నారి బాలల దీన గాథలు



బలహీనులైనవారిపై బలవంతులు పెత్తనం చెలాయించటం దౌర్జన్యంతో వారినీ లొంగదీసుకుని అడుగులకి మడుగు లొత్తించుకోవటం అనాదిగా జరుగు తున్నదే కానీ ముక్కుపచ్చలారని అశం శుభం తెలియని అమాయక బాలలపై చేసే అమానుష కృత్యాల గురించి విన్నప్పుడు ఎటువంటి వారికైనా కళ్ళు చెమరుస్తాయి హృదయం ద్రవిస్తుంది

పిల్లల పట్ల క్రూరత్వాన్ని నిరోధించడానికి ఏర్పడిన జాతీయ సంఘం బ్రిటన్‌లో ఉన్నది అమాయకులైన చిన్నారి బాలల పట్ల జరుగుతున్న అత్యాచారాల గురించి తెలిపే వివరాలని ఇటీవల ఆ సంఘం ప్రకటించింది ఆ వివరాలని బట్టి గత సంవత్సరం కన్న ఈ ఏడాది పసిపిల్లలపై జరిగిన లైంగిక సంబంధమైన అత్యాచారాలు 125 శాతం పెరిగినట్లు తెలుస్తున్నది వాటిలో 68 శాతం పెరుగుదల ప్రాణాంతకంగా లేదా తీవ్రంగా గాయపడేలా పసిపిల్లలు అత్యాచారాలకి గురి అయిన సందర్భాలే ఉన్నాయి

తల్లిదండ్రుల నిరాదరణకి లేదా క్రౌర్యానికి వారానికి ముగ్గురు నలుగురు పిల్లలు బలైపోతున్నారు అని ఆ నివేదికనిబట్టి తెలుస్తున్నది పిల్లలపై అత్యాచారాలకి సంబంధించిన అక్కడి అధీకృత వ్యవస్థలో నమోదయిన వివరాలనిబట్టి ఇంగ్లాండ్ వేల్స్‌లలో అమానుష చర్యలకి గురైన పిల్లల సంఖ్య 42 శాతం పెరిగింది ముఖ్యంగా తల్లిదండ్రులు వల్లనే జరుగుతున్న ఈ దారుణాలకి కారణాలని వివరించలేక ఆ సంస్థ అవాక్కయిపోతూ ఉన్నది పైకి కనిపిస్తున్నదానికన్నా పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆ సంఘం డైరెక్టర్ డా అలాన్ గిల్‌మోర్ అన్నారు

పిల్లలపట్ల పెరుగుతున్న ఈ అమానుష కృత్యాలకిగల కారణాలలో ఒకటి వివాహ విచ్ఛిత్తి అని చెప్పబడుతున్నది వారి స్వంత తలిదండ్రులతో ఉన్న పిల్లలలో మాత్రమే 23 శాతం నిరాదరణకి గురైనవారు 32 శాతం ఆవేశం కారణంగా అఘాయిత్యాలకి గురైనవారు 39 శాతం శారీరకంగా గాయపరచబడినవారు ఉన్నారు భార్యాభర్తల సంబంధాలు విచ్ఛిన్నం కావటం పిల్లల సహజ ప్రవృత్తిని భరించలేకపోవటం అన్నవి పసివారిపట్ల జరిగే అకృత్యాలకి కారణాలుగా తరచు సంఘ సేవకులు చెపుతూ ఉంటారు

పిల్లలకు శాంతి కావాలి అన్న అంశంపై యూనిసెఫ్, భారత ప్రభుత్వం, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫోటో డివిజన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ద్వితీయ జాతీయ ఫోటో పోటీలో ప్రథమ బహుమతి రు 7 వేలు పొందిన చిత్రం. జంషెడ్‌పూర్‌కు చెందిన శ్రీ చంద్రదేవ్ భగత్ ఈ ఫోటో తీశారు.



పసిపిల్లలపై జరుగుతున్న అమానుష కృత్యాలని వివరించేందుకు అనేక హృదయ విదారకరమయిన ఉదాహరణలని ఆ నివేదికలో ఇవ్వటం జరిగింది

ఆరేళ్ళ వయసుగల పాల్‌ని కొద్దిగా ఆహారం నీరు మాత్రమే ఉంచి ఇంటిలో పెట్టి తాళంవేసి క్రిస్మస్‌నాడు అతను తనను వదలి వెళ్ళిన తల్లిని చూడడానికి వీల్లేకుండా చేసారు బిల్లీ అనే మూడేళ్ళ బాలుడిని పదిహేను నెలల వయసుగల అతని తమ్ముడిని ఆరంతస్తులుగల ఒక భవనం-లోని ఒక భాగంలో వాళ్ళమ్మ ఒంటరిగా వదలి వెళ్ళిపోయింది సంఘం అధికారి వెళ్ళి చూసేసరికి వాళ్ళిద్దరూ భయకంపితులై మూత్రంతో తడిసి ముద్దయిపోయి ఉన్నారు ఆ భవనంలోని చాలా భాగాలు ఖాళీగా ఉన్నాయి వాళ్ళు ఉన్న ఆ భాగం కూడా చాలా అసహ్యంగా ఉన్నది మరుగుదొడ్డి పనిచెయ్యటంలేదు స్నానాలగది మురికిగుడ్డలతో నిండి ఉన్నది అక్కడ ఒకే ఒక రొట్టె ముక్క ఉన్నది ఆ పిల్లల తండ్రి అందిన చోటల్లా అప్పులుచేసి పరారైపోయాడు అయనకి ఒక ప్రియురాలు ఉందని తెలిసిన ఆ పిల్లల తల్లి కూడా నిస్పృహతో ఇల్లు వదలి వెళ్ళిపోయింది

మూడేళ్ళ పాప సారాకి తన పేరు కూడా సరిగా తెలియదు, తలిదండ్రులు ఆమెని ఓయ్" అని

పిలిచేవారట. ఆ పాప వంటిమీద సరిగా దుస్తులు కూడా లేవు. ఆడుకోడానికి ఆ ఇంట్లో ఒక్క బొమ్మ అయినాలేదు. ఆపాప నిరాదరణకి గురి అవుతున్నదని పొరుగువారెవరో సంఘానికి తెలియపరిస్తే ఆ ఇంటికి వెళ్ళిన అధికారిని చూసి సారా ఆత్రంగా ఆయన దగ్గరకి పరుగెత్తుకువెళ్ళింది

జూడీ అనే మరో 8 సంవత్సరాల బాలిక తన తల్లి, సవతి తండ్రి అయిదుగురు తమ్ముళ్ళు, చెల్లెళ్ళ కోసం ఇంటిని నిర్వహించే భారాన్ని మోయాల్సి వచ్చింది. ఆ బాధ్యతకి తట్టుకోలేని ఆ పాప దుకాణాలలో చిన్న చిన్న దొంగతనాలకి అలవాటుపడింది కిటికీలు విరగగొట్టటం, కార్లమీద గీతలు పెట్టటం చేస్తూ ఉండేది. ఇప్పుడు ఆ బాలిక ఒకరు తప్ప మిగతా తమ్ముళ్ళు, చెల్లెళ్ళతో సంఘం సంరక్షణలో ఉన్నది.

ఇదివరకు ఒక చిన్న పాప ఎవరైనా తాను లైంగిక



సంబంధమైన అత్యాచారానికి గురి అయినట్లు చెబితే ఆమెని దుష్ట స్వభావం గలదానిగా, అబద్ధాలు చెప్పేదిగా చిన్నచూపు చూసేవారు ఈ సమస్యపట్ల అవగాహన పెరుగుతున్నకొద్దీ ఇప్పుడు అలాంటి పిల్లలు చెప్పే విషయాలని వినే అవకాశం ఎంతగానో ఉన్నదని డా. గిల్‌మోర్ అన్నారు ముఖ్యంగా అమానుషంగా ప్రవర్తించినది తమ కుటుంబంలో నివారే అయినప్పుడు నిస్పృహకి గురైన పిల్లలకి తాము సహాయం ఎక్కడ పొందవచ్చున్నది కూడా తెలియదని ఆ సంఘం పిల్లల విభాగం డైరెక్టర్ శ్రీ జిమ్‌హార్శింగ్ అన్నారు

రంగుల హరివిల్లులా, ఆనందోత్సాహాలతో గడిచిపోవలసిన భావిపౌరుల బాల్యావస్థ ఇంతటి క్రౌర్యానికి, అత్యాచారాలకి గురికాకుండా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉన్నది -(బి. వి.)

ఆంధ్రసచిత్రవారపత్రిక

పాఠకులకి మరో సరికొత్త శీర్షిక

చిన్నారి బాలల దీన గాథలు

మన భారతీయ సంస్కృతిలో పసి పిల్లలని దైవ స్వరూపులుగా భావిస్తారు వారిపట్ల అంతులేని ప్రేమాభిమానాలని ప్రదర్శిస్తారు వారిపై అత్యాచారాలు జరగటం అన్నది పూర్వం ఎంతో అరుదుగా ఉండేది కానీ ఇటీవల పరిస్థితి కొంత మారింది ముక్కుపచ్చలారని చిన్నారి బాలలని వెట్టిచాకిరీకి వాడుకోవటం, వారి బంగారు భవిష్యత్తుని మొగ్గలోనే తుంచివెయ్యటం జరుగుతున్నది చిన్న పిల్లలని అత్యంత ప్రమాదకరమైన వృత్తులలో, పనులలో అతి తక్కువ వేతనానికి నియమించటం జరుగుతున్నది వారు ప్రమాదాలకి గురై మరణించటమో, శాశ్వతంగా వికలాంగులై పోవటమో జరుగుతున్నది ఎందరో పసివారు పెద్దల నిరాదరణ కారణంగా అనాథ శరణాలయాల పాలవుతున్నారు తలి దండ్రుల నీడలో ప్రేమాభిమానాలతో పెరగవలసిన ఆ వయసులో వారు పెద్దల నిరాదరణకి, క్రౌర్యానికీ దారుణంగా గురవుతున్నారు అద్దంలాంటి స్వచ్ఛమైన వారి లేత మనస్సులపై అటువంటి అకృత్యాలు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి భవిష్యత్తులో వారేవిధంగా మారతారో, వారి మనః ప్రవృత్తులు ఏ విధంగా ఉంటాయన్నది ఊహించటం కష్టం

పసి పిల్లలపై జరుగుతున్న ఈ దారుణాలకి గల కారణాలని, వాటిని నివారించే పరిష్కార మార్గాలని చర్చించే సహేతుకమైన రచనలని పంపవలసిందిగా పాఠకులని కోరుతున్నాము

పరిశీలనకి పంపే రచనలు స్వంత రచనలై ఉండాలి ఒక అరఠావు పేజీ మించకుండా కాగితానికి ఒకవైపే రాసి పంపాలి రాసిన వారి పేరు, పూర్తి చిరునామా వ్రాత ప్రతిపై స్పష్టంగా రాయాలి రచనతో పాటు అది రాసిన వారి ఫొటో కూడా జతపరచి పంపవచ్చు ప్రతి రచనతో కింద ఇచ్చిన కూపన్ జతపరిచి పంపాలి

ప్రచురణకి స్వీకరించిన రచనలని అవి రాసిన వారి ఫొటోలతో (పంపి ఉంటే) వీలువెంబడి ప్రచురిస్తాము ప్రచురణకి స్వీకరించని రచనలని తిప్పి పంపగోరేవారు స్వంత చిరునామాకల, తగినన్ని తపాలాబిళ్ళలు అతికించిన కవరు జతపరిచి పంపవలసి ఉంటుంది వాటిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరుపబడవు ప్రచురించిన ప్రతి రచనకూ పారితోషికం ఉంటుంది

పాఠకులు తమ రచనలని 'చిన్నారి బాలల దీన గాథలు శీర్షిక పేరె సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-520003 అనే చిరునామాకి పంపాలి

–సంపాదకుడు

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చిన్నారి బాలల దీన గాథలు

రచన పంపిన వారి పేరు :...

పూర్తి చిరునామా :...

....

....

పిన్ కోడ్

కాంతికిరణం.... అయినాల రామకృష్ణారావు

'రా అన్నయ్యా, రా'

అంటూ శాంతమ్మ వెంకట్రామయ్యని సాదరంగా ఆహ్వానించింది. ఆమె గొంతులో వచ్చిన మార్పు చెవిలో పడగానే ఆశ్చర్య పోయిన వెంకట్రామయ్య గేటు తలుపు తీసుకు లోపలికి వస్తూ, ఆవిడ చేస్తున్న పనిని చూసి మరింత మతి పోగొట్టుకున్నాడు వీధిలో ఉన్న ఆ కాస్త ఖాళీ జాగాలో ఆవిడ ఆ వయసులో బంతినారు ఒకటీ ఒకటీ విడదీసి లైనుగా నాటుతోంది!

'ఎలా వుంది యివాళ మీ అమ్మగారికి, కొంచెమైనా ఎంగిలి పడ్డాదా?' ఆ లోపలి గుమ్మం దాటి యివతలికొచ్చేది కాదు ఇప్పుడిప్పుడు గాలీ వెలుతుర్లలోకి రావడమే కాకుండా ఎదుటివారి కష్ట సుఖాలు కనుక్కొనే నిండు తనం సంతరించుకుంది, మనసుని ఎక్స్‌రే తీసి భావాలు వెలికి లాగ కలిగే పరికరం ఏదైనా ఉంటే వెంకట్రామయ్యకి ఆ క్షణంలో కలిగిన తృప్తికి యిలా వాక్యరూపం ఇచ్చి ఉండును ఇంత వయసులో ఎలాంటి ఆర్థిక పుష్టీ లేని నా పంచ చేరిన నా కన్న తల్లి ఒక్కర్తే కాదు, ఈ లోకమంతా వెర్రి తల్లుల మయం ఇలాంటి వాళ్ళకి కొన్నాళ్ళ కయినా కాస్తయినా జ్ఞానం ప్రసాదించేటట్టు చేస్తే అంతకంటె నా జన్మకి సార్థకత ఏముంది!.

★ ★ ★ ★ ★

అబ్బో, ఎప్పటి మాట అది!

ఆరోజుల్లో ఎప్పుడైనా సాయంకాలం, తనకి తీరిక చిక్కిన వేళ వెంకట్రామయ్య శాంతమ్మకి గీతాసారం వినిపించడానికి వస్తూండేవాడు పేరుకి ఏదో వింటున్నట్టు తల ఊపేది గాని శాంతమ్మ మనసు ఎప్పుడూ కొడుకు చుట్టూ తిరుగుతూ ఉండేది

జీవితంలో చాలా ఒడుదుడుకులు పడిన సామాన్య సంసారి వెంకట్రామయ్య గ్రాడ్యుయేటు అయి ఉద్యోగం లేక తిరుగుతూండే వాడు అతని ఒక్కగా నొక్క కొడుకు. పాతిక వేలు లంచం కడితే బాంకి ఉద్యోగం వస్తుందని తండ్రిని నమ్మించి, బంగారం లాంటి పొలం సగం రేటుకి అమ్మించాడు డబ్బు చేతిలో పడ్డాక మరి ఆ మనిషి అయిపు లేడు! మెడ్రాసులో ఎక్స్‌ట్రా సప్లై దారుగా ఎవర్నో పెట్టుకు ఉన్నాడని ఆ తర్వాత కబురు తెలిసింది. అంతే! ఆ దెబ్బకి తట్టుకోలేక గిలగిల కొట్టుకు పోయాడు వెంకట్రామయ్య అలాంటి స్థితిలో చేయిచ్చి లేవనెత్తి మళ్ళీ మనిషిని చేశాడు శాంతమ్మ భర్త సీతాపతి ఆయన ఆ రోజు చేసిన సాయం జన్మలో మరచి పోలేదు వెంకట్రామయ్య సీతాపతి పోయి ఎన్నో ఏళ్ళయినా వారానికోసారి అగడప ఎక్కి ఆ యిల్లాల్ని పలకరించి రాందే ఉండలేదు వెంకట్రామయ్య.

ఆ రోజుల్లో శాంతమ్మ మనసుకి ఏ మాత్రం ధైర్యంతో చేదికాదు 'ఏదో వస్తాడు, ఏవో పురాణ ప్రవచనాలు వల్లిస్తాడు, వెడతాడు ఇందువల్ల నా గుండె వెలితి ఎలా నిండుతుంది!' అనుకునేది ఆ చివరి రోజులు అంత దుర్భరంగా గడుస్తాయని ఆమె అనుకోలేదు

ఆవాళ వాడి పుట్టినరోజు లేచి తల నెప్పిగా ఉందని ఇంత కాఫీ కాచుకు తాగింది, అంతే ఇంకేం చేసుకోవాలని పించలేదు రెండ్రోజుల కిందట కొడుకు దగ్గిర్నుంచి వచ్చిన కవరు దిండు కింద నుంచి పైకి తీసి గుండెల మీద ఆనించుకు పట్టుకుంది వందడాలర్లకు చెక్కు కాక అందులో అంతకు మించిన విలువైన ముక్కలున్నాయి

'అమ్మా, ఎప్పట్లా నా పుట్టిన్రోజు మళ్ళీ వస్తోంది నే నెక్కడున్నా నా మనసు నీ దీవన కోరుతూనే ఉంటుంది ఈ డబ్బుతో నీకు నచ్చింది ఏదైనా కొనుక్కో నన్ను మనసారా ఆశీర్వదించు'

ఎప్పుడూ లేంది కోపంతో ఆమె మనసు ఆనాడు తిరగబడింది 'నాన్నా, నానిగా! ఏనాడైనా ఏ తల్లైనా కొడుకు పుట్టిన్రోజు నాడు ఏం చెయ్యాలనుకుంటుందో నీకు తెలీదా! తలంటు పోస్తుంది కొత్త బట్టలు కొనిస్తుంది వాడికిష్టమైన ముద్దినుసు పిండి వంటలూ చేసి పెడుతుంది దగ్గిరగా తీసుకుంటుంది దిష్టి తీసి దీవిస్తుంది పది కాలాల పాటు చల్లగా చూడమని వెయ్యి దేవుళ్ళకి మొక్కు కుంటుంది తనకి నచ్చింది కొనుక్కుంటుందిట్రా ఎక్కడైనా!'

సంక్రాంతి చెంచు
చిత్రం: డి. వి. ప్రసాద్



ఇప్పుడేం మొత్తుకుంటే ఏం లాభం!

మొదట్నుంచీ ఇన్ని ఆశలు కల్పించింది వాడే! ఆ పద్ధతే వేరు వాడికంటే పెద్దాళ్ళు ఇద్దరు ఆడపిల్లలున్నారు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసి తనకా బరువు మిగలకుండా చేశాడు పాపం ఇంటాయన అంతేకాదు, వాళ్ళకంటె అయిదారేళ్ళ చిన్న వాడయిన సూర్యం చదువు పూర్తయేదాకా ఉన్నాడు తనకే పూచీ మిగల్చ లేదు ఆడపిల్లలు అత్తారిళ్ళలో వాళ్ళ కాపరాలు వాళ్ళు చేసుకుంటున్నారు సాదారణంగా తలిదండ్రుల పట్ల ఆడపిల్లల కున్న ఆపేక్ష మగపిల్లలకి ఉండదంటారు శాంతమ్మ పిల్లలు మాత్రం దీనికి పూర్తిగా వ్యతిరేకం ఇప్పుడు పెళ్ళిళ్ళై ఎవరి సంసారాలు వాళ్ళు దిద్దుకుంటున్నప్పటి మాట కాదు మొదట్నుంచీ ప్రతి చిన్న విషయంలోనూ పేచీలే వాళ్ళు నానిగాడు మాత్రం అలాకాదు ఆ అక్కల్లా కాకుండా చిన్న చిన్న పనులు చేసిపెడుతూ కూడా కూడా తిరిగేవాడు కత్తిపీట దగ్గర కూచుని తను కూరలు తరుగుతూ ఉంటే ముచికలూ తుక్కూ అవీ తనే ఎత్తి పారపోసేవాడు తను బట్టలు ఉతికితే స్టూలు ఎక్కి తనే ఆరేస్తానని అల్లరి పెట్టేవాడు తన కంటె ముందు నిద్ర లేచి బాయిలరు అంటించినవాడు, తను వంటిల్లు కడుక్కుని ముగ్గేసేదాకా ఆగి, దానికి తాళం వేసి వచ్చేదాకా తనని వదిలేవాడు కాదు

రెండు చేతుల గుప్పిళ్ళూ మూసి బుగ్గల మీద ఆనించుకుని తన కళ్ళల్లో కళ్ళు పెట్టి ఎప్పుడూ అలా చూస్తూ ఉండేవాడు. తన కంట్లో ఏ మాత్రపు కన్నీటి పొర పసిగట్టినా తల్లడిల్లి పోయేవాడు తన మనసు మళ్ళీ స్థిమిత పడ్డానికి ఎన్ని చెయ్యాలో అన్నీ చేసేవాడు.

తన పాలరుచి ఏ తల్లికీ తెలీదు. ఆ పాలు తాగిన పేగు పంచి యిచ్చిన ప్రేమరుచి ఏ కొద్దిమంది అదృష్ట వంతురాళ్ళో తప్ప ఎరగరు. అందులో తనూ ఒకర్తె నని శాంతమ్మ మురిసి పోయేది

'ఎందుకూ ఎద్దుల్లా ఎదిగారు. ఆడపిల్లలు మళ్ళీ! చెప్పిన ముక్క ఒక్కటి వినిచావరు. ఇది కావాలని అడక్కుండానే చేసి పెడతాడు, నాని. చిన్న వాడైనా వాణ్ణి చూసి సిగ్గు పడాలి మీరు'

అంటూ ఒక్కొక్కప్పుడు కూతుళ్ళ చేష్టలు చూసి విసుక్కునేది 'ఓయబ్బ' చాలా మందిని

చూశాం, యిలా కబుర్లు చెప్పిన వాళ్ళని పెద్దై పెళ్ళాం అన్నది రానీ ఏమే చెల్లీ?'

'ఇంకా అందుకు సందేహమా! నెత్తి మీద ఇంత బండ ఎత్తకుండా ఉంటే చాలు పెళ్ళాం పక్కలోకొచ్చేదాకా ప్రతీ కొడుకూ బంగారు కొండే! కదుటే అక్కా!'

అంటూ ఇద్దరూ కలసికట్టుగా చెప్పినట్టు చెప్పారు

"ఛ! అసలు నేను పెళ్ళి చేసుకోను అని అడ్డంగా బుర్ర ఆడించేవాడు నాని తప్పుబాబూ, అలా అనకూడదు అని తల్లి మందలించేది బిడ్డ కడుపులో పడ్డాక నవమాసాలూ మోస్తుంది తల్లి, ఎదుగుతున్న కడుపుని తడుముకుని ఆశలు పెంచుకుంటుంది తల్లి ఆ తొమ్మిది నెలలకీ ఎన్ని రోజులో, ఎన్ని గంటలో, ఎన్ని నిమిషాలో కనీసం అన్ని కోరికలయినా పేర్చుకుంటుంది పుట్టిన బిడ్డ పున్నమి చందమామలా తయారవడమేగాక తలలో నాలికలా మసులుతూ ఉంటే ఏ తల్లి మురిసిపోదు!

అంతకుముందే ఆడపిల్లలు పెళ్ళిళ్ళై వెళ్ళిపోయారు ఆ తర్వాత ఆరేళ్ళు దాటకుండా ఆ మగమహారాజు కాలగర్భంలో కలసి పోయాడు ఒంటరిగా మిగిలింది గాని ఆ ఒంటరితనం ఉన్నట్టు శాంతమ్మకి ఎప్పుడూ తోచనివ్వలేదు, చేతికి ఎదిగి వచ్చిన కొడుకు

మొగుడు ఉన్నప్పుడు, ఎప్పటిమాట అది, కొడుకు నామకరణం విషయంలో పట్టుదల పట్టి, తన మాటే నెగ్గించుకుంది శాంతమ్మ. తల్లి పేరు పెట్టుకుంది. సూరమ్మ గారు సూర్యనారాయణ మూర్తిగా తమ యింట ఉదయించాడు. ఇప్పుడింత వాడయాడు గాని ఎప్పుడూ 'తన కంటికి వెర్రినాగమ్మగానే కనిపిస్తాడు. నిన్న మొన్నటిదాకా తన పక్కలో చేరి, తన డొక్కలో దూరి, "అమ్మా, నీ ప్రేమ ఒక్కటీ నాకు చాలమ్మా!" అని కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసి చెబుతున్నట్టే ఉంటుంది. అలా చూస్తుంటే వాడి స్థానంలో తన తల్లిని చూసుకున్న భ్రమ కలిగేది శాంతమ్మకి. 'తనే తన తల్లితో అవే మాటలు అంటున్న భావనకు లోనయేది.

వేలెడంత లేనివాడు చూస్తుండగా చేయెత్తితే వాసాలు అందుకొనేటంత వాడయాడు అక్షరాలు దిద్దితే వేళ్ళు కంది పోతాయేమో అనిపించిన కుర్రసన్నాసి తను రీసెర్చి చేసే సబ్జక్టుకి యీ దేశంలో ఏ యూనివర్సిటీలోనూ వసరులు లేవేమో అనే విద్యాస్థాయికి చేరుకున్నాడు! ఆ బ్రాంచిలో ఫారెన్ స్కాలర్‌షిప్ దొరకడమే వారి అనుబంధానికి ప్రతిబంధకమయిందేమో! ఆ విరహం ఊహించలేక ఆ తల్లి మనసు అల్లకల్లోలమై పోయింది వాడిలా అన్నాడు

నీ కంట్లో విషాదరేఖ నేను భరించలేను నువ్వు నవ్వుతూ పంపకపోతే నాకు విజయం లభించదు కూడా. అసలు నేనే నిన్ను విడిచి ఉండలేను. ఇప్పుడున్న నా చదువుకి ఇక్కడే మంచి ఉద్యోగం దొరక్కపోదు అనే సూర్యం మాటలు ఆ రాత్రి తెల్లవార్లూ మననం చేసుకుంది గుండె దిటవు చేసుకుంది రెండేళ్ళు ఎంతలో తిరిగి రావాలి! ఏ కూతురి దగ్గరుంటే దినం వెళ్ళి పోదు! మనసు రాయి చేసుకుంది ఏరోడ్రోముకి వెళ్ళి వీడ్కోలు చెప్పి వచ్చింది

కూతుళ్ళ దగ్గిరకి వెళ్ళింది గాని ఎక్కడా ఎక్కువ రోజులు ఉండలేక పోయింది ఆ వాతావరణంలో ఇమడలేకా, వాళ్ళ వాళ్ళ మాట తీరు సరిపెట్టుకోలేకా నాదంటూ నాకో యిల్లు లేకపోతే కదా అనుకుని ఇల్లు చేరుకుంది కొడుకు నడయాడని, బావురు మంటున్న ఆ యిల్లు చూసుకుని "నాదంటూ ఏం మిగిలిందని!" అని కొట్టుకు పోయేది ఆ తల్లి ప్రాణి.

ఆ రెండేళ్ళూ ఎలా గడప గలిగిందో శాంతమ్మకే తెలీదు విస్తట్లో అన్నీ వడ్డించుకుని కూచునేది, తినకుండానే లేచి పోయేది! దుప్పటి దులుపుకుని మంచం మీద వేసుకునేది, పడుకోకుండా గంటలు గంటలు లేచి కూచొనేది! ఆ గచ్చు చల్లగా ఉందని ఎప్పుడూ ఆవేళప్పుడు గదిలో దొర్లేది, అక్కడేదో ఆధారం చిక్కుతుందని కాదు! అతడేదో చదివి వినిపిస్తున్నాడని భగవద్గీత వినేది, వెంకట్రామయ్య చెబుతున్నది తన బుర్ర కెక్కుతోందని కాదు! అంత దూరంలో ఆ దేశంగాని దేశంలో వేళ కింత నోటికి అమరక పాపం నానిగాడి కడుపు ఎంత లోటుకు



పోయి ఉంటుందో!" అనేది ఒక్కటే ఆ అమ్మ తపన.

వెంకట్రామయ్యతో ఆవిడకున్న అనుబంధమూ అంతంత మాత్రమే. పేరుకి ఆ వీధి చివర ఓ చిన్న పెంకుటి కొంప అంటూ అతనికి లేకపోలేదు గాని ఒక్కొక్కప్పుడు నెలకి నెలలు ఆ ఇంటికి తాళమే. కొడుకు కోసం అప్పటికప్పుడు అమ్మగా మిగిలిన అర ఎకరం అతని బావమరిది అమరకంలో ఉంది. దాని శిస్తు వసూలు కోసం కాకపోయినా పెళ్ళాన్నీ కూతుర్నీ చూసి రాడాని కయినా అప్పుడప్పుడు ఆ ఊరు వెళ్ళిరాక తప్పదు. వెంకట్రామయ్య పెళ్ళాం మొగుడితో దెబ్బలాడి వాళ్ళన్నయ్య దగ్గరకి చేరి ఏడాదిన్నర దాటింది. చుట్టపు చూపుగా పెద్ద కొడుకు వెంకట్రామయ్య దగ్గర కొచ్చిన అతని విధవ తల్లికి పక్షవాతం వచ్చి, అక్కడే ఉండిపోవలసి వచ్చింది. అది అతని పెళ్ళానికి కంట గింపయింది. ఇన్నాళ్ళూ ఆవిడ ఒంటిదు నగలూ ఒకటీ ఒకటీ అమ్ముకు తినడానికి నా తోటి కోడలికి అత్తగారు పని కొచ్చిందా? ఈనాడు రోగాన పడిందని బోసిమెడ చేసి చాకిరీకి నా యింటికి దిగబెడుతుందా! మీ తమ్ముడిపాటి బుద్ధి మీకు ఉండదనే! వెంటనే అత్తగార్ని రైలెక్కిస్తారా లేదా!" అని మ...డు రోజుల పాటు అహోరాత్రాలు మొగు...తో పోరాడింది. వెంకట్రామయ్య విన లేదు. కూతుర్ని తీసుకుని ఆవిడే బస్సెక్కేసింది.

అసలు వెంకట్రామయ్యే డయబెటీసు పేషెంటు. ఎంతగా వైద్యం, పత్యం చేసినా ఒక్కొక్కప్పుడు

సుప్రభాతం

ప్రభాత కిరణమల్లె
ప్రపంచమంతా వెలుగులు నింపె
సుప్రభాతం పాడు
గోమాతేమో పాలిస్తోంది
కామధేనువై అందరికి
పచ్చనిచేలో రైతన్నేమో
నందనవనమే నాటినులే
ముంగిట పడుచులు ముగ్గులువేయ
హరిదాసే నీ కీర్తన పాడె
పూజారేమో కోవెల తలుపులు
తెరిచెను– పూజకు వేళాయె
శుభం– శుభం– శుభం–
తెల్లవారె వెలుగులు నీవు
సుందర శుభకర దేవా
దినకర నీదే– మంగళరూపం
మధుర మనోహర నీ గీతం
ఇదే– ఇదే– యిదే?

–డా. గంధం సాయిరమేష్ (రాధ)

కాంతి కిరణం

చెప్పలేని నీరసం ప్రాణాలు తోడేస్తూ ఉంటుంది. కట్టుకున్న దాని సాయంతోనే ఎత్తలేని బరువు తనకి. అన్నీ మంచం మీదే అవుతున్న ఈ తల్లిని. కాని ఇలాంటప్పుడు కన్న తల్లిని చూస్తూ చూస్తూ ఎలా దిగబెట్ట గలడు! మరదలు తన పెళ్ళాం కంటె నాలుగాకులు ఎక్కువే చదువుకుంది యిలాంటి విషయాలలో. చీకటింట వెడితే మళ్ళీ చీకటి పడితేగాని ఇంటికి చేరుకోలేని ఉద్యోగం తమ్ముడిది. ఎవర్నని ఏం లాభం!

తమ్ముడొచ్చి చెప్పి వెడుతూంటాడు.

"అమ్మని ఈ వయసులో యిక్కడ చేర్చి నీకూ నీ వాళ్ళకీ దూరం చేశాను. అసలే జబ్బు మనిషివి. ఒక్కడివీ ఎలా నిర్వహించుకు వస్తున్నావ్.... పొద్దుట్నుంచీ సాయంకాలం దాకా ఇల్లు కనిపెట్టుకు ఉండే పనిమనిషిని పెట్టుకో. వేరే వంట మనిషి కోసం చూడు. ట్రై చేస్తే దొరక్క పోరు. ఎంత కావలిస్తే అంత నేను పంపుతానుగా!" ఊరికే నోటి మాట కాదు. నోట్ల కట్టలు అందించి మరీ.

అయినా వృద్ధాప్యం. రోజు రోజుకీ సన్నగిల్లుతున్న ఆరోగ్యం. ఒంటరితనం. నిస్సహాయత. ఒకొక్కప్పుడు ఎంత సరిపెట్టుకుందా మన్నా వెంకట్రామయ్య క్రుంగి పోతూ ఉంటాడు. అలాంటప్పుడు భగవద్గీత తీసుకుంటాడు. చదవడానికి కాదు, అలా అది గుండెలమీద పెట్టుకుని పడుకుని, తనకి తను ధైర్యం చెప్పుకోడానికి.


మన కెక్కడా తారసిల్లని, మన అనుభవంలోకి మాట వరసకైనా తొంగి చూడని, ఓ మహావీరుడి ధర్మ సందేహం అది. "అంతటి సన్నిహితులతో యుద్ధం

ఎలా చెయ్యనూ!" అని నారాయణుడి సమాధానం అది పైనుంచి చూస్తే "సామాన్యులకేం ఉంది ఇందులో నా మొహం!" అనిపించక మానదు. కాని బాగా ఆలోచిస్తే ఏ ఉద్దేశంతో అయినా సందేశం సూచనాప్రాయంగానే ఉంటుంది. విషమ పరిస్థితులు నరవరులకే కాదు నరులందరికీ ఎదురౌతాయి. ఎటో దారి చూపే డిటో నారాయణులు ఎప్పటికప్పుడు దొరకరు. ఎవరికి వారే జవాబు చెప్పుకుని ముందుకి సాగాలి. అంతే. ఆ ఊహ ఇచ్చిన ఊతతో ఉత్సాహంగా లేచి కూచుంటాడు వెంకట్రామయ్య.

తన పనులే కాదు, తల్లీ పనులు కూడా చకచకా చక్క బెట్టేస్తాడు. పనిపిల్లని అక్కడ కూచో బెట్టి శాంతమ్మ దగ్గరకి పరిగెడుతాడు 'చూశారా ఈ పెద్ద మనిషి దురాశ! లేని ఓపిక తెచ్చుకుని ఎందుకలా పరుగెడుతున్నాడో ఆ శాంతమ్మ గారింటికి!' ఈ లేకుండా మాటాడ గలదు ఈ మధ్య పరీక్షకూడా పాసయింది. ఇప్పటి నవలలూ సినిమాలూ టీవీ షోలూ రుచి ఎరిగిన నవ నాగరీకురాలు. గాలిలో కాకుండా భూమ్మీద ఎందుకు నడవాలి? ఇక వాళ్ళమ్మకి ఆ చాత కాని ముద్దుని కట్టుకోడం చేత ఏ కోరికా తీరిచావలేదు. కొడుకైనా ఉద్ధరిస్తాడనుకుంటే మొదట్లోనే కొంప నిలువునా ముంచేశాడు. ఇంకా అన్నా వదినా మంచి వాళ్ళు కాబట్టి ఎన్నాళ్ళయినా తన్ని తగిలెయ్య కుండా ఇంత అన్నం పెడుతున్నారు ఇక తనకి ఏ ముద్దూ ముచ్చటా తీరినా ఈ బంగారపు బొమ్మ వల్లనే. ఏమో దీని ద్వారా తనకి విదేశయానం రాసి పెట్టుందేమో ఎవరు చెప్పగలరు! వారం దాటకుండా తల్లీ కూతుళ్ళు తండ్రితో స్వంతింటికి ప్రయాణం కట్టేశారు. 'ముసిలావిడ కంపు'ఈ సారి వాళ్ళని అట్టే బాధించినట్టు లేదు తల్లీ కూతురూ వెంకట్రామయ్యకి ఓ మోస్తరు పాయం

చూసుకుని ఉండి పోదామని కాదుట తల్లితో మనసులోని ఆకబురు చెప్పి అనుమతి తీసుకుని మళ్ళీ పదిహేను రోజుల్లో వెళ్ళి పోడానికట. అతని రీసెర్చి పథకం ఇంకా పూర్తి కాలేదు దానికి తగిన ఖరీదైన పరికరాలు అక్కడ తప్పలేవు అతన్ని గైడు చేసే ప్రొఫెసరు ఎక్కడున్నా ప్రతిభని గుర్తించి ప్రోత్స హించే ఆదర్శ శాస్త్రజ్ఞుడు. అతని రికమెండేషను వల్లనే సూర్యం స్కాలర్‌షిప్ మరో రెండేళ్ళు పొడి గించ బడింది అతని చలవ వల్లే సూర్యానికి ఓ పార్ట్ టైమ్ జాబ్ దొరికింది కూడా గత ఆరు నెలలుగా అలా సంపాదించి కూడ బెట్టిన సొమ్ముతోనే సూర్యం ఇప్పుడు రిటర్న్ టిక్కెట్టు కొనుక్కు వచ్చినది.

శాంతమ్మ కూచుని ఉంటే ఆవిడ ఒళ్ళో తల పెట్టుకుని పడుకుని, ఆవిడ ఇచ్చిన చేగోడీలు ఒకటీ ఒకటీ నవులుతూ ఎక్కళ్ళేని కబుర్లూ అందిస్తున్నాడు సూర్యం ఈ భోగట్టా లన్నీ



సంక్రాంతి – మయూరి ముగ్గు

యస్. మంగేశ్వరి, విజయవాడ

మధ్యనే మరింత ఎక్కువ చూపిస్తున్న ఈ అభిమానాల వెనక ఏముందో ఎవరెరగరూ! సూర్యం ఈ నెలాఖరుకో వచ్చే నెల మొదట్లోనో స్వదేశం తిరిగొస్తున్నాడాయె. అతని వయసుకి జోడైన కూతురు జానకి ఇతనికీ ఉందిగా! ఇప్పట్నుంచీ ఎంత పెద్ద వల వేసుకు రాక పోతే అంత పెద్ద చేప పడుతుందీ!' అని ఒకరిద్దరంటే మొదట్లో విని విన నట్టు ఊరుకునే వాడు. 'అత్యాశే కావొచ్చు పోనీ మనమూ ప్రయత్నించి చూస్తే తప్పేమిటి? బియ్యే అయితే తనంతట ప్రైవేటుగా కట్టుకుని మంచి మార్కులతో పాసయింది గాని, తన కూతురు తండ్రి సాయం లేకుండా మొగుణ్ణి తెచ్చుకోలేదుగా!' అనుకున్నాడు వెంకట్రామయ్య. శిస్తుల కోసం ఈ సారి ఆ ఊరు వెళ్ళి నప్పుడు వాళ్ళ దగ్గిర ఈ ప్రసక్తి తెచ్చాడు. దాంతో ఆ తల్లీ కూతుళ్ళకి ఎక్కళ్ళేని చైతన్యమూ పుట్టుకొచ్చింది!


జానకి అందమైనదే గాక అది మరింతగా తీర్చి దిద్దు కోడం తెలిసిన అమ్మాయి. ఇంగ్లీషు తప్పులు చేస్తున్నారు కూడా పట్టుదల వస్తే ఏవో సవాలక్ష అనుకుంటాం పెద్ద వాళ్ళు చేయించుకోక తప్పుతుందా, మాలాంటి వాళ్ళం చెయ్యక తప్పుతుందా" అనే సన్నాయి నొక్కులు నొక్కుతూ


ఓ మంచి రోజు చూసి కూతుర్ని తీసికెళ్ళి శాంతమ్మకి దండం పెట్టించాడు వెంకట్రామయ్య 'రెండేళ్ళలో బాగా ఎదిగి పోయిందే! తగినట్టు ఒళ్ళు చేసింది కూడాను. ఇంటి కెళ్ళగానే నీ పెళ్ళాం చేత దిష్టి తీయించు అన్నయ్యా ఏ అదృష్ట వంతుడు ఎదురు చూస్తున్నాడో మీ జానకిని చేసుకోడం కోసం' అనేసింది అమాయకంగా అది విన్న జానకి మనసు మరుక్షణం సూర్యంతో హనీ మూన్‌లో ఐఫిల్ టవర్‌లో ఉంది!

ఇంతకీ సూర్యం స్టేట్సు నుంచి తిరిగొస్తూ తీసుకొచ్చిన కబురు ధాటికి వచ్చిన చిల్లర సంబంధాల పేక ముక్కలతో పాటు ఈ తురుపు ముక్క కూడా ఉఫ్ మని ఎగిరి పోయింది!

సూర్యం ఇండియా వచ్చింది, ఇక్కడేదో ఉద్యోగం ఉత్తరం రాసి పడెయ్యొచ్చు ఇంత ఖర్చు పెట్టుకుని స్వయంగా వచ్చి చెప్ప నక్కర్లేదు కాని స్వయంగా తప్ప చెప్ప లేని విషయం ఒకటుంది. తీరా అదే నోరువిప్పి చెప్ప లేక పోడం అతనికే ఆశ్చర్యం కలిగించింది ఆవేళకి వెంకట్రామయ్య అక్కడికి రావడంతో అతనికి పోయిందేదో దొరికినట్టు అనిపించింది వెంటనే లేచి అతని చెయ్యి పట్టుకున్నాడు

'మీతో ఓ ముఖ్య విషయం చెప్పాలి అంకుల్, ఓ సారి అలా పార్కుకి వెళ్దాం వస్తారా!' అంటూ లాక్కు పోయాడు అక్కడ చేరగానే విషయమంతా క్లుప్తంగా వివరించాడు బతిమాలాడు 'వెంటనే మీతో విషయం కాస్త అమ్మకి నచ్చ చెప్పరూ!' అని ఎదురు చూడని ఆ భోగట్టాకి మరొకడయితే మ్రాన్పడి పోయేవాడే తన తొట్రు బాటు పైకి తేల నివ్వక 'మా అమ్మని డాక్టరుకి చూపించాలి సూర్యం వీలు చూసుకు కలుద్దాంలే' అంటూ వెనక్కి తిరక్కుండా వడివడిగా ఇంటికి





జారుకున్నాడు ఆ మర్నాడు కూడా శాంతమ్మ గడప తొక్కడానికి వెంకట్రామయ్యకి మనస్కరించలేదు ఆవిడ సమస్య అలా ఉంచి తన కూతుర్ని చేసుకుంటాడనే ఆశకి కూడా ఆస్కారం లేకుండా పోయింది, ఇప్పుడు సూర్యం చెప్పిన కబురుతో ముఖ్యంగా అంతటి ఆశాభంగానికి ఆ తల్లీ కూతుళ్ళు తట్టుకో లేక పోయారు ఇక అతని పెళ్ళాం అడిన మాటలు ఒకటీ రెండూ కావు 'తమ నిర్వాకం ఇంతలా అఘోరిస్తుందని తెలిసే సిగ్గు విడిచి ఎక్కడికో వెళ్ళి తలదాల్చుకోవలసి వచ్చింది! తల్లికి చాకిరీ చేయించుకోడానికి కాక పోతే ప్రత్యేకించి సుఖాన ఉన్న వాళ్ళం మళ్ళీ మమ్మల్ని ఈ రొంపిలోకి దింపడం దేనికి! వాడెవర్తినో అక్కడ పెట్టుకునే ఉన్నాడన్న కబురు తమకి ముందే తెలియలేదంటే ఇప్పుడెవరు నమ్ముతారు! ఇంకా ఎందుకీ దొంగ కబుర్లు?' అంటూ ఆ రోజే బస్సెక్కేశారు

వాళ్ళ సాయంతో ఈ మధ్య కాస్తయినా ఊపిరి తిరిగేది వెంకట్రామయ్యకి, ఆ ఆసరా పోయింది. వాళ్ళే నిందవేసినా తనమటుకు తనే కట్టుకున్న ఆశా సౌధం ఉండనే ఉంది, అదీ కూలిపోయింది. ఏం కొడుకులు, ఏం లోకం! కొడుకేదో యింకా తనని ఉద్ధరిస్తాడనే వెర్రి భ్రమతో ఉంది ఇంకా ఆ శాంతమ్మ. ఈ వార్త తనే చెవిన వెయ్యాలా! తనకి తోచిన కాస్త వెలుగూ మరి కనిపించ కుండా చేసిన సూర్యం తరఫున తను వెళ్ళి శాంతమ్మకి నచ్చ జెప్పాలా! ఉహుఁ వెంకట్రామయ్య మనసు మొదట్లో మొండికేసుకు కూచుంది

అయితే తన పొరపాటు తను తెలుసుకోడానికి ఆ సహృదయుడికి అట్టే రోజులు పట్టలేదు వెంకట్రామయ్య తమింటికి రాలేదని తెలుసుకున్న సూర్యం వరసగా ఆ రెండ్రోజులూ ఆయనింటికే వెళ్ళేవాడు గంటలకి గంటలు తన పొజిషన్ ఎక్స్‌ప్లెయిన్ చేసేవాడు తన ప్రాజెక్టుకి సంబంధించిన కాగితాల కాపీలు చూపించి అతనికి బోధపడేటట్టు చెప్పేవాడు తనూ, తన ప్రొఫెసరూ, తను పెళ్ళాడదామనుకుంటున్న వాళ్ళమ్మాయి లూసీ – వీళ్ళ ఫోటోలు ఉన్న ఆల్బం – తల్లికి చూపిద్దామని తెచ్చినా తను చూపించలేనిది –

కాంతి కిరణం

వెంకట్రామయ్య ముందు పరచాడు 'నాకు తెలుసు కడుపున పుట్టిన కూతుళ్ళతోనే సరిపెట్టుకోలేని సున్నిత హృదయం మా అమ్మది లూసీని పెళ్ళాడితే అక్కడే ఉండిపోవాలి గాని మరి ఈ దేశం వచ్చే అవకాశం లేని పరిస్థితులు నావి తనే అక్కడికి వచ్చి మాతో ఉండిపోవాలి అదైనా ఇంకో రెండేళ్ళ తర్వాత, నేను తనకి వీసా సంపాదించగలిగాక అలా అమ్మ ఇష్టపడితేనే ఈ పెళ్ళి చేసుకుంటాను కన్నతల్లి కన్నీటి రేఖ నేను ఊహించలేను ఆవిడకి ఇష్టంలేని పని చెయ్యలేను అలా చేసి ఆ విషాద భావాన్ని క్షణం క్షణం గుర్తు చేసుకుంటూ జీవితాంతం భరించలేను కాదూకూడదంటే రిజైను చేసి ఇండియా వచ్చేస్తాను ఖర్చు పెట్టిన సొమ్మంతా వెనక్కి తిరిగి వాళ్ళకి ఇవ్వవలసి ఉంటుందనుకోండి. చాలా పెద్ద మొత్తమే కాని నన్ను వెన్నాడే వ్యథ కంటె ఇదేం ఎక్కువ కాదు మొదట్లో నన్ను అసహ్యించుకున్నా ఇప్పటికైనా అర్థం చేసుకున్నారు తనకి ఏమాత్రం సమ్మతం కాకపోయినా ఎదుటి వారి ఆలోచనల తీరు కనీసం చివరి దాకా వినడానికయినా ఎంతటి సహనం సంస్కారం కావాలి!' అంటూ అన్నీ వివరించి వెళ్ళిపోయాడు సూర్యం.

వెంకట్రామయ్య గుండెల మీద ఆ బండ బుక్కు అలా ఉండనే ఉంది వెల్లకిలా పడుకున్న వాడు అలాగే ఉన్నాడు. గంటలకి గంటలు అలా గడచిపోతున్నాయి కాని తీర్పు చెప్పే జేగంట అతనిలో ధ్వనించలేదు సూర్యం దగ్గిర బయటపడలేదు గాని ఆ ఉదయం శాంతమ్మకి ఆ ఘోరవార్త తన నోటితో తను అందించడం జరగనే జరిగింది! అది తట్టుకోలేక ఎంతో సేపు గిలగిల కొట్టుకుంది ఆ పిచ్చితల్లి. ఆ షాక్ నుంచి తేరుకున్నాక ఆవిడ వెలిబుచ్చిన అభిప్రాయం ఇదీ

'ఏ నాడు యీ యింట్లో అడుగు పెట్టానో అప్పట్నుంచీ ఈ ఇంటికీ ఈ వీధికీ అతుక్కు పోయింది నా ప్రాణం పుట్టింటి దత్తత లేకపోడం చేత మా అత్తగారే నా మూడు పురుళ్ళూ ఈ యింట్లోనే పోశారు. నా పిల్లలు పెరిగింది ఇక్కడే. మా అత్తగారే కాదు మా ఇంటతనూ కాలం చేసింది ఇక్కడే ఏళ్ళ తరబడి యిక్కడే మసలడం చేత కాబోలు ఇది కన్నతల్లిలా తోస్తుంది గాని ఇల్లనిపించదు నా ప్రాణానికి ఓ వారం రోజులు దీన్ని విడిచి వెడితేనే తిరిగి వచ్చే దాకా ఏదోలా ఉంటుంది నాకు అలాంటిది తెలిసిన పరిసరాలు విడిచి ఎరిగిన మొహాలు కాదని ఇంత వయసులో నేనంత దూరం వెళ్ళి ఎలా ఉండగలను అన్నయ్యా!'

'మా నానిగాడికి దోసావకాయ ఇష్టం బాగా వెల్లుల్లి వేసి కొట్టిన తెలగ పిండి గుండ ఇష్టం బాగా చిన్న చిన్నవిగా ఎర్రగా వేయించిన ఉల్లిపాయ పకోడీలు ఇష్టం ఇలాంటివి నా కొడుక్కి నా చేత్తో నేను చేసి పెట్టాలని కోరుకోడం తప్పా అన్నయ్యా! ఎక్కడ పడితే అక్కడ, మన మాటా మనసూ అర్థం చేసుకోలేని చోట, ఇలాంటి నా చిన్న చిన్న కోరికలైనా తీరుతాయంటావా!'

'ఇష్టా ఇష్టాల ప్రసక్తి ఎలాగా వచ్చింది గనక ఓ మాట అడుగుతాను, నీకు కోపం రాదుగా చెల్లెమ్మా! నీ కొడుక్కి ఏవేవి యిష్టమో అవన్నీ చేసి పెట్టాలనుంటుందని ఇప్పుడే ఓ లిస్టు ఇచ్చావు ఏవి, దోసకాయ, తెలగపిండి గుండా, ఉల్లిపాయ పకోడీలూ . ఇప్పుడు ఆ లిస్టులో కొత్త యిష్టం ఒకటి వచ్చి చేరింది అది వీటన్నిటి కంటె సూర్యానికి యిష్టమైనది దాని పేరు లూసీ. పూర్తిగా చెప్పలేం గాని ఆ ఆల్బంలోని ఆ అమ్మాయి ఫోటోలు చూస్తే కొంతవరకైనా ఆ గుణగణాలు ఊహించవచ్చు ఆ బట్టలూ ఆ చూపులూ ఎంతో గౌరవప్రదంగా సంస్కారాన్ని సూచించేలా ఉన్నాయి అలాంటి అమ్మాయిని కావాలనుకున్న వాడు వ్యామోహంతో ఆ నిర్ణయానికి వచ్చాడని మాట వరసకైనా అనిపించదు వాళ్ళిద్దరూ ఒకే సబ్జక్టులో రీసెర్చి చేస్తున్నారనీ, అలాగే ఒకరికొకరు సన్నిహితులయారనీ సూర్యం చెప్పాడు ఆ అమ్మాయి ఒంపు సొంపులే కోరితే పాతికేళ్ళ నీ కొడుక్కి వెంటనే పెళ్ళాడ్డానికి ఏ అడ్డూ లేదు. నీ అనుమతి కోసం ఇంత దూరం రానక్కర్లేదు

కాలం మారుతోంది తరానికీ తరానికీ అభిరుచుల్లో అంతరాలు పెరగడం సహజమే తమ పిల్లలు చాలా పెద్ద చదువులు చదువుకుని ఏ



"సన్నాయిపాట – సరదాల ఆట" రేఖా చిత్రం. పల్లపరిశి నాయుడు

సంక్రాంతి సొగసులు

తెలి మంచు ముత్యాల దొంతర్లలో తడిసి మెరిసే సోయగంతో విచ్చిన పచ్చని ముద్ద బంతుల దరహాసాలతో చిరుగాలి కదలికల సంగీత మధురిమలతో గ్రామ సీమలలో ఆనందంతో పులకించే సస్యలక్ష్మి అందాలతో సర్వతోముఖ సమృద్ధిని ప్రకటిస్తూ తెలుగు ముంగిట వచ్చి నిలిచింది సంక్రాంతి లక్ష్మి.

కవి హృదయంలో మధుకలశం పరవశంతో పొంగి పొర్లగా, సుమనోహరంగా అక్షర బద్ధమయినాయి సంక్రాంతి సొగసులు

"వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి
వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి
తేనె వాకలు పారు తెనుగు వాడలకు
అందాలు పొంగేటి ఆంధ్ర భూములకు
పంట రాసులపైన పవళించి లేచి
తేనె తటాకాల తీర్థమ్ములాడి
వన్నె ముగ్గులు పెట్టి వాకిళ్ళముందు
పూదేనెతో నారు పోతాము రావే."

అంటూ సంక్రాంతి లక్ష్మిని అద్భుతంగా అభివర్ణించారు రాయప్రోలు సుబ్బారావు గారు.

తేనె తటాకాలతో తీర్థములాడి అందాలు పొంగే ఆంధ్ర భూములకు తరలి వచ్చే సంక్రాంతి లక్ష్మి వారి మనో నేత్రానికి సర్వాంగ సుందరంగా దర్శన మిచ్చింది.

"ముద్ద చేమంతి పూవులు ముడిచినట్టి
జడలతో గ్రీత్తవర్ణితో అడుగులబడి
చిందులం ద్రొక్కు పరికిణి చెలువుతోడ
కాళ్ళ పారాణి కాటుక కన్నుగవను
దిద్దుకొని మురిపమ్ము ముద్దులొలుక
నగు మొగమ్ముల తోడ కన్యకలు నీకు
నర్చనల నొసగగ నిలిచిరి
వచ్చిపోవమ్మ మా యింటి పజ్జకీవు
పరమకల్యాణి మా తల్లి సౌఖ్యలక్ష్మి

చేమంతులను జడలో తురిమి కొత్త పరికిణి వల్లెవాటులతో, కాళ్ళకు పారాణి పెట్టి, కంటి నిండా కాటుక దిద్ది ముద్దులొలికే తెలుగు కన్నియల మురిపాలు అతి సహజంగా నయనానందకరంగా వర్ణించారు మరొక కవీంద్రులు

సంక్రాంతి ముందు నెల రోజులూ మహిళలందరూ తమ గృహ ప్రాంగణాలను చక్కగా శుభ్రం చేసుకుని పేడనీళ్ళు చల్లి రకరకాల ముగ్గులు వేసి వాటిని రంగులతో అలంకరిస్తారు పది పన్నెండు సంవత్సరాల వయసులోని ఆడపిల్లలు ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ఆ ముగ్గుల మధ్య అమర్చి పసుపు కుంకుమలతో గుమ్మడి పూవులతో పూజిస్తారు

"సుబ్బి గొబ్బెమ్మా సుఖమునియ్యావే
తామరపువ్వంటి తమ్ముడి నియ్యావే
చేమంతి పువ్వంటి చెల్లెల్నియ్యావే
మొగలి పువ్వంటి మొగుణ్ణియ్యావే
పనస పండంటి పాపణ్ణియ్యావే

అని పాడుతూ బుగ్గల్లో సిగ్గులు మొగ్గలు వేస్తుండగా ఆ గొబ్బెమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ తిరిగే తెలుగు కన్నె పిల్లలు ఒక మరపురాని మనోజ్ఞమైన దృశ్యం హరిదాసుల హరినామస్మరణ, చెక్క భజనలు, గంగిరెద్దు మేళాలు వీటన్నిటితో ఆహ్లాదకరమైన ధనుర్మాస ప్రభాత సమయాలు తెలుగు సంస్కృతీ వైభవాన్ని హృద్యంగా ప్రకటిస్తాయి

పండుగ నాలుగు రోజులలో మొదటిది భోగి భోగినాడు తెల్లవారు ఝామున భోగి మంటలు వేస్తారు సాయంత్రం పిల్లలకు భోగిపళ్ళు పోస్తారు చిన్నారుల నవ్వుల కేరింతాలతో భోగి పండుగ పూర్తవుతుంది రెండవ రోజయిన సంక్రాంతికి మహిళలు బొమ్మల కొలువులు పెట్టి పేరంటాలు చేస్తారు స్నేహితు లందరికీ నువ్వులు బెల్లం కలిపి తయారు చేసిన చిమ్మిలిని ప్రసాదంగా పంచుతారు ఇది వారి మధ్య గల స్నేహమాధుర్యం కలకాలం నిలిచి ఉండాలన్న సద్భావానికి గుర్తు కర్షకుల కృషికి సత్ఫలితాల నందించే సంక్రాంతి పండుగ మూడవ రోజు కనుమ ఇది రైతుల పండుగ ఈ రోజు పశువులను, పూవులతో, పూసలతో, గంటలతో అలంకరించి పూజించి నైవేద్యాలు పెడతారు పొంగళ్ళు చేసి పొలాలలో పొలి చల్లుతారు నాల్గవ రోజు ముక్కనుమనాడు చాలా మంది స్త్రీలు గౌరీదేవి విగ్రహాన్ని బంకమట్టితో చేసి స్థాపించి సావిత్రి గౌరిదేవి వ్రతం ప్రారంభిస్తారు. తొమ్మిది రోజులు గౌరీదేవిని భక్తితో సేవించి నదిలో నిమజ్జనం చేస్తారు

దిగ్దిగంతాలను తన దివ్య కిరణాలతో చైతన్యవంతం చేసే సూర్యనారాయణుడు మానవునికి ఆరోగ్యాన్ని ఆనందాన్ని ప్రసాదించటానికిగాను సంక్రాంతి శుభ ఘడియలలో ఉత్తరాయణంలో ప్రవేశిస్తాడు నిష్కామకర్ముడైన సూర్యభగవానుని సేవించి 'కృషి దైవారాధనే' అన్న సత్యాన్ని గ్రహించమని ఆదేశిస్తోంది సంక్రాంతిపర్వం

-పి. ఆదిలక్ష్మి

క్రాంతి లేని సంక్రాంతి

ఏది సంక్రాంతి
మరేది సరికొత్త క్రాంతి
ఎటు చూచిన భ్రాంతి
ఇది క్రాంతిలేని సంక్రాంతి
గుమ్మడి పువ్వుల పుప్పొడి
మిరప పండుల పసిడి
చెఱకు గడల తీపి జల్లులు
కన్నెపిల్లల రంగవల్లులు
చామంతుల సీమంతం
నేడేవి సౌఖ్యలక్ష్మికి స్వాగతం?
హరిదాసు గొంతు బొంగురుపోయె
గంగిరెద్దులోడి సన్నాయి మూగబోయె
రైతన్న గుండె చెరువాయె
బసవన్న బ్రతుకు బరువాయె
తుఫాను పసిడి పంటలు ఊడ్చుకుపోయె
కరువు ఆకలిమంటలు రగిల్చిపోయె
ఇదే నేటి సంక్రాంతి!
ఇది క్రాంతిలేని సంక్రాంతి!!

-ఎ. నాగవేణి



(గత సంచిక తరువాయి)

ప్రణీత్ గదిలో మంచం మీద పడుకున్న దాక్షాయణి గుండెలు భయంతో ఎగిరెగిరి పడుతున్నాయి...

పాపారావు.. కూతురు కూతురంటూ ఎన్ని కబుర్లు చెప్పాడు! అమ్మో! ఆ హరిణి ఈ విధంగా అడ్డుకుని రక్షించకపోతే తన గతి ఏమయ్యేది?!

ఇప్పుడీ ఇంట్లో మాత్రం తను నిశ్చింతగా ఉండొచ్చా? ఈ పోలీసుల గురించి ఎన్ని కథలు వినటం లేదు?

పాపారావు మనుషులొచ్చి ఈ ఇంటి మీద పడితే.. బయట పడుకున్న రాంబాబు, కానిస్టేబులూ తనను రక్షించగలరా?

వీళ్ళు కూడా పాపారావు మనుషులతో చేతులు కలపరని గ్యారంటీ ఏమిటి? అసలీ పోలీసులకి అసలు సిసలైన స్నేహితులు పాపారావులాంటి వాళ్ళే తను ఇక్కడ నుంచి పారిపోతే?

ఈ పాటికే వాడి మనుషులు ఊరి మీద పడి ఉంటారు తన కోసం ఇక్కడ నుంచి పారిపోయి, ఈ పల్లెటూర్లో తను ఎక్కడ దాక్కోగలదు?

ఇక్కడ నుంచి బయటకొస్తే రక్షణ ఉండదనీ . ఎస్.ఐ గారు వచ్చే వరకూ కనీసం కిటికీలో నుంచి కూడా బయటకు చూడొద్దనీ.. అన్ని తలుపులూ వేసుకుని పడుకోమని చెప్పింది హరిణి కళ్ళు మూతలు పడటం లేదు దాక్షాయణికి అప్పటికి రాత్రి ఒంటిగంటయింది. ప్రతి చిన్న శబ్దానికీ ఉలికులికి పడుతోంది భయంతో ప్రాణాలు కడంటిపోతున్నాయామెకు

జరిగిన కథ–10: బాబూరావు అహంకారంవల్ల ఆగిపోయిన ప్రణీత్, మంజీరల పెళ్ళి రాజకుమార్ సాయంతో జరుగుతుంది నవవధూవరుల్ని బాబూరావు అవమానించి వెళ్ళగొడతాడు. మంజీరతో సంబంధాలు తెంచుకోవాలని ఇంట్లో కట్టడి చేస్తాడు బాబూరావు కుడిభుజంగా పనిచేసే పాపారావు ప్రణీత్‌మీద ద్వేషాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తుంటాడు పాపారావు హైదరాబాద్‌నుంచి వస్తుండగా కలిసిన అమాయకురాలు దాక్షాయణిని పావపుటాలోచనతో ఇంటికి తీసుకొస్తాడు పాపారావు భార్య హరిణి దాక్షాయణిని తప్పించి ప్రణీత్ ఇంటికి చేరుస్తుంది

"నువ్వు కూడా లోపలికొచ్చి పడుకో" అని రాంబాబునడగటానికింకా భయపడుతోంది అసహాయంగా ఏడుస్తోంది..

వెచ్చని అమ్మ ఒడిలో నుంచి, ఈ దిక్కుమాలిన ప్రపంచంలోకి ఒంటరిగా ఎందుకొచ్చానా అని పశ్చాత్తాపపడుతోంది ..

నవలా హీరోలా తన ప్రియుడు కూడా ఉదాత్తంగా ప్రవర్తిస్తాడని నమ్మింది. "ఒక మగాడిని నమ్మి, వాడి వెంట లేచి వచ్చేస్తే వాడు చేసే మోసాల గురించి దారుణాల గురించి . ఆ తరువాతి పరిణామాల గురించి వర్ణిస్తూ విశదంగా రాసిన ఏ నవలా ఆ అమ్మాయి మనసునాకర్షించలేదు "

ఇంకో సంవత్సరం పోతే తన వాళ్ళు తనకు పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారు వరుడు తన బావ, తనలాగే పల్లెటూరి మనిషి రైతు బిడ్డ.

ఢిల్లీ నుంచి వచ్చిన మాస్టారి బావమరిది వేష భాషలు . నాగరికత .. మాటల్లో సొంపు, తీపి తనను విపరీతంగా ఆకట్టుకున్నాయి అతని ముందు .. తనకు నిర్దేశింపబడ్డ వరుడు ఉట్టి వాజమ్మలా అడివి మృగంలా.. పల్లెటూరి బైతులా తోచాడు

ఆ ఢిల్లీ అబ్బాయి పేరు జగదీష్

చాలా అందంగా మాట్లాడేవాడు కొన్ని మాటల మీద నొక్కుతూ కొన్నిటి మీద దీర్ఘాలు తీస్తూ కంఠాన్ని ఒక్కోసారి బాగా తగ్గించి .. రిథమిక్‌గా మాట్లాడుతూ ఒంటి మీద చెయ్యి వెయ్యకుండా మాటల్లోనే దగ్గరతనాన్ని సూచిస్తూ గొప్పగా ప్రవర్తించేవాడు. ఆశ్చర్యంగా ఆసక్తిగా తన మాటల్ని కళ్ళింత చేసుకుని అమాయకంగా వింటూ ఉండే ఈ పల్లెటూరి పిల్ల మీద అతి తేలికగా గెలుపు సాధించొచ్చని అతనికి తోచి వుంటుంది

తన ఒంటి మీద ఇరవైనాలుగ్గంటలూ ఉండే బంగారు నగలు అతని దృష్టిని ఆకర్షించి ఉంటాయి

ముందూ వెనుకా చూసుకోకుండా... కండ కావరంతో అతని వెనక లేచి వచ్చిన తనదే తప్పసలు!

కని పెంచిన తల్లి దండ్రులు.. కలిసి పెరిగిన తోబుట్టువులు : శ్రేయోభిలాషులు . వీళ్ళందరికన్నా ఎక్కడి నుంచో హఠాత్తుగా వచ్చి నాగరికత ప్రదర్శించిన ఒక పురుషుడికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి. . ఒక్క తృటిలో కుటుంబ బంధాల్ని తెంపేసుకుని అతని వెంట పడి వచ్చిన తనదీ తప్పు!

తనలాంటి ఆడపిల్లలున్నచోటే జగదీష్‌లాంటి మగవాళ్ళు కూడా ఉంటారు.

ఇప్పుడేడిసే ఏం లాభం?

తల్లి రెక్కల కింద ఒదిగి, నిశ్చింతయిన జీవితాన్ని వాళ్ళ పర్యవేక్షణలో గడుపుతున్న తను ఒక తెలివి తక్కువ చర్యతో క్రూర మృగాలతో నిండి ఉన్న ఈ జనారణ్యంలోకి కొట్టుకొచ్చింది వాటి బారి నుంచి తప్పించుకోటానికి దిక్కు తెలియక పరుగులు పెడుతోంది

మళ్ళీ తను సురక్షితంగా తల్లిని చేరగలదా? తండ్రి రానిస్తాడా?

అద్భుతమైన సంగతేమిటంటే జగదీష్ తన నగలు తీసుకు పారిపోయాడేగానీ తననేం చెయ్యలేదు ఊరికే తాకి ఒదిలేసేవాడు

పాపారావన్నట్టు బహుశా అతను నపుంసకుడయి ఉంటాడు అఖరుకు నపుంసకుడైన మగాడికి కూడా.. వీలు దొరికితే ఆడదాన్ని మోసగించాలనే తపనే!

ఇంకా నయం! అతను తననెవరికన్నా అమ్మి పారెయ్యలేదు ఏం నయం? ఇప్పుడు మాత్రం తన స్థితి అంతకన్నా మెరుగ్గా ఉందా?

"నిప్పు ముట్టుకుంటే కాలుతుంది. ఏడిస్తే ఆ బొబ్బలూ, మంటలూ పోవు"

అలాగే తప్పంటూ చేశాక శిక్ష అనుభవించక తప్పదు. పశ్చాత్తాపపడ్డా ఫలితముండదు

ఏడుస్తూనే ఎప్పటికో నిద్రలోకి జారింది దాక్షాయణి ఒక పెద్ద చప్పుడుకు అదిరిపడిందామె

పాపారావు మనుషులొచ్చి ఆమెను పట్టుకుని లాక్కెడుతున్నారు తప్పించుకోటానికి పెనుగులాడుతోందామె...

వాళ్ళ నుంచి తప్పించుకోలేక నిస్సయంగా ఏడుస్తోంది వాళ్ళకు దొరికితే జరగబోయేది తలుచుకుని కుమిలిపోతోంది.

హఠాత్తుగా మెలుకువ వచ్చింది దాక్షాయణికి నది మంచం మీద కూర్చుని కిటికీ వేపు చూసింది ఒణికిపోతూ...

పిల్లి పిల్ల ఇంకా తొంగి చూస్తోందక్కడ నుంచి పై నుంచి కిందికి దూకి ఎలుకను పట్టుకునే ప్రయత్నంలో టేబులు మీదున్న గాజు గ్లాసును తన్నేసి, తిరిగి, బయటకు పారిపోబోతోందది. . అది చూశాక కూడా దాక్షాయణి గుండెల్లో అదటు తగ్గలేదు .

రెండే అయింది

ఇంకా ఎస్ ఐ రాలేదు.

అసలతనెటువంటి వాడు? ఒంటరిగా దొరికిందని తన పని పట్టకుండా ఉంటాడా? హరిణికి అతని మీదున్న నమ్మకంలో ఎంత నిజముంది?

తన నుంచి ఆమె మొగుడిని రక్షించుకోటం కోసం తనను, లాక్కొచ్చి ఈ ఇంట్లో వీళ్ళ పాలిట పడేసిందా ఆమె?

ఈ ఇనస్పెక్టర్ తాగి వచ్చి "ఎక్కడ నుంచి ఎగిరొచ్చి నా గూట్లో వాలావే చిలకా" అంటూ తన మీద పడితే?

ఆ తరువాత రాంబాబు కానిస్టేబులూ వరసగా తనని . ఇలాంటి కథలు ఎన్ని వినలేదు?

ఒంటరి ఆడపిల్ల పోలీసుల శరణు కోరి అర్ధ రాత్రి నుంచీ వాళ్ళ పర్యవేక్షణలో గడిపి, తెల్లారి సురక్షితంగా బయట పడ్డ సంఘటనల్ని గుర్తు తెచ్చుకోటానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది దాక్షాయణి

కానీ. ఇలాంటి సంఘటన ఒక్కటంటే ఒక్కటి కూడా ఆమెకు గుర్తు రావటం లేదు

ఇహ ఆమెలో ఈ రకమైన టెన్షన్ కూడా మొదలయింది

ఒంకెనున్న తెల్ల చొక్కా వేపు చూసింది నీట్‌గా ఒంకెకు వేలాడుతున్న ముడతలు నలగని ఆ చొక్కాల్లో ప్రణీత్‌ని మంచివాడుగా ఊహించుకోటానికి ప్రయత్నిస్తూ, ఆలోచనల్ని డైవర్ట్ చేసుకోవాలని ఆ భయం నుంచి బయట పడాలనీ పెనుగులాడుతోంది

ఈ ఎస్ ఐ డ్రింక్ చేస్తాడా? తాగకుండా ఉంటే కొంత వరకూ ఇతన్ని నమ్మొచ్చు

ఆ మూల గూట్లో ఏం సీసాలవి?

నెమ్మదిగా లేచి అటు నడిచింది దాక్షాయణి

అవి ఫినాయిల్ టర్పెంటయిన్ ఇంకా ఏవో సీసాలు మొత్తానికి మత్తు పదార్థాలేం లేవు



ఒడిలో చెలి మోహన రాగం

అలమర తెరచి చూసింది అక్కడా ఏం లేవు

ఆమె చూపులు గదంతా తిరిగాయి

తను పడుకున్న పక్కతో సహా నీట్‌గా పొందికగా ఎక్కడి వస్తువులక్కడ అమర్చబడి పరిశుభ్రంగా ఉన్నదా గది. "తాగుడు అలవాటుంటే ఈ గది అస్తవ్యస్తంగా ఉండేది!" అనుకుంటూ ఆ నీట్‌నెస్‌లో ప్రణీత్ మంచితనపు ప్రతిబింబాన్ని చూడటానికి విఫల ప్రయత్నం చేస్తోందామె ఫొటోను బట్టి అంచనా వేద్దామని గదంతా వెతికింది ఒక్క ఫొటో కూడా కనపడక, నిరాశగా వచ్చి మంచం మీద కూర్చుంది నెమ్మదిగా వెనక్కి వాలి బ్లాంకెట్ కప్పుకోబోతుంటే అప్పుడు వినిపించింది వాకిటి తలుపు తడుతున్న శబ్దం. ఒక్క ఉదుటున లేచి కూచుని చెవి ఒగ్గి వింది మళ్ళీ తలుపు మీద వేళ్ళతో కొడుతున్న శబ్దం, "తలుపు తియ్యండి" అంటున్న రాంబాబు స్వరం వినిపించాయి అంటే ఎస్ ఐ వచ్చేశాడా? గడియారం వేపు చూసింది పావు తక్కువ మూడు

తెల్లారే వరకూ అతనితో ఈ ఇంట్లో తను ఏకాంతంగా గడపాలి! అతనీ అవకాశాన్ని ఒదులుకుంటాడా?

భయం భయంగా వెళ్ళి తలుపు తీసింది దాక్షాయణి డ్రస్సులో ఉన్న ప్రణీత్ లోపలికొచ్చాడు అతన్ని అంచనా వెయ్యటానికి ప్రయత్నిస్తోందామె

డ్రస్సు మార్చుకుని లుంగీలోకి మారుతూ రాంబాబు చెపుతున్న దాన్ని శ్రద్ధగా వింటున్నాడు ప్రణీత్

"పాపారావు భార్య స్వయంగా ఈ అమ్మాయిని వెంట బెట్టుకొచ్చిన విషయాన్నెవరికీ తెలియనివ్వద్దన్నారావిడ అలా తెలిస్తే వాడామెను ఇంట్లో నుంచి గెంటేసినంత పని చేస్తాట్ట" టీ కలిపి తెచ్చి ప్రణీత్‌కిస్తూ అన్నాడు రాంబాబు

"తలుపు వేసెయ్యి నువ్వు కూడా లోపల పడుకో మడత మంచం తెచ్చి హాల్లో వెయ్యి నాకు " అన్నాడు ప్రణీత్

"మంచి వాడిలా ఉన్నాడు నువ్వు బయట పడుకో అని రాంబాబుకు చెప్పి, అతనొచ్చి తన గదిలో దూరలేదు

ఏమో! ఇద్దరూ కలిసి తనను " హఠాత్తుగా అంత వెదును చూసిన దాక్షాయణి ఏ కాస్త మంచినీ అంత సులభంగా నమ్మలేకపోతోంది

"మొదట్నుంచీ చెప్పమ్మా! అసలేం జరిగింది?" అన్నాడు ప్రణీత్ జగదీష్‌తో తన పరిచయం మొదలు అన్ని సంగతులూ చెప్పి "రిపోర్టు రాయించి కేసు పెట్టొద్దు కోర్టులూ గొడవా ఇదంతా జరిగితే " అంటున్న దాక్షాయణి భయాన్ని అర్థం చేసుకున్నాడు ప్రణీత్

అతను కొన్ని సూత్రాలను నమ్ముతాడు వాటిని ఆచరిస్తాడు, అలా ఆచరించేటప్పుడు చేతులారా కొన్ని చిక్కుల్ని కొని తెచ్చుకుంటాడు అయినా అతనా పంథాను మార్చుకోటానికిష్టపడడు ఒకసారి

చెంచులయ్య అనే భూస్వామి కొడుకు నడి రోడ్డు మీద ఓ ఆడ పిల్ల భుజం మీద చెయ్యేసాడు అందరూ కళ్ళారా చూసారు. మనసులో తిట్టుకున్న వాళ్ళేగానీ సాహసించి ఎవరూ వాడిని ఆపలేకపోయారు. లక్కీగా ఆ వేపు నుంచి వస్తున్న ప్రణీత్ అక్కడ ఆగాడు "నువ్వు నన్నేం చేస్తావులే," అన్నట్టు ఆ భూస్వామి కొడుకు నిర్లక్ష్యంగా చూశాడు

ఆ పిల్ల ఏడుస్తూ ప్రణీత్‌కు ఫిర్యాదు చేసింది "నేను అనాథననే కదా వీడింత నీచానికి దిగజారాడు చట్టం వాడినేం చెయ్యలేదనేగా వాడి ధీమా!" అని నిలదీసింది

"మీ చట్టాన్ని తీసికెళ్ళి అవతల పారెయ్యండి అది వాడిలాంటి వాడికే తప్ప మాలాంటి నిస్సహాయులకు ఉపయోగపడదు నేను రిపోర్టు రాసిస్తాను మీరు వాడిని పట్టికెడతారు. ఒక గంట సేపు గడిచీ గడవక ముందే వాడు బెయిలు మీద బయటకొచ్చి మన ముందే నిలబడి సవాలు చేస్తాడు నేనే తనను రమ్మన్నానని చెపుతాడు సాక్ష్యాలు సృష్టించుకుని, వాటిని నిలుపుకోగల కెపాసిటీ ఉన్నవాడు కనక కోర్టు, "వాడు నిర్దోషి" అని తీర్పు ఇస్తుంది. వాడింకా విజృంభిస్తాడు ఏమీ తోచక మీకు ఫిర్యాదు చెయ్యటమేగానీ మీరు రక్షించగలరనే నమ్మకంతో కాదు " అంటున్న ఆ అమ్మాయి మాటలకు ప్రణీత్‌కు కోపం రాలేదు

ఆమె చెపుతున్నది అక్షరాలా నిజమే అయినప్పుడు ఇంక కోపమెందుకు?

కానీ ప్రణీత్ ఊరుకోలేదు తిరిగి ఆ అమ్మాయి చేత అదే స్పాట్‌లో చెప్పుదెబ్బ తినిపించి వాడిని తన్నించాడు ప్రజలు. ముఖ్యంగా ఆడవాళ్ళు ప్రణీత్ చర్యను సమర్థించారు అయినా అది అంతటితో పోలేదు

"చట్టాన్ని నీ చేతుల్లోకి తీసుకుంటావా!?" అనే విసుర్లూ చిర చిరలూ పై వాళ్ళ పంటింగూ భరించక తప్పలేదతనికి .. స్థానికుల్లో మూడొంతులమంది ప్రణీత్‌ని అభిమానించే వాళ్ళుంటే ఒక వంతు ఇలాంటి అసమ్మతి వర్గం కూడా ఉందతనికి ముఖ్యంగా పాపారావు వర్గం నుంచి గట్టి వ్యతిరేకతనెదుర్కుంటూ ఉంటాడు

అయినా అతను కేర్ చెయ్యడు

రిపోర్టూ ఒద్దు కేసూ ఒద్దు నిన్ను ఈ ఉదయం పది గంటల బస్సులో తీసికెళ్ళి మీ వాళ్ళకప్పగిస్తాను నువ్వెళ్ళి నిశ్చింతగా పడుకోమ్మా!" అన్నాడు ప్రణీత్

"మా నాన్న నన్ను ఇంట్లోకి రానివ్వడు " బేలగా అన్నది దాక్షాయణి

"నేను నచ్చ చెపుతాను "

"మీరు పోలీసులని తెలిస్తే. మీ వెంట ఎందుకొచ్చానని ఏదో జరిగి ఉంటుందనీ ఊరూరా గుప్పుమంటుంది "

ఇన్ని తెలిసిన ఈ అమ్మాయి అంత తేలికగా జగదీష్‌తో ఎలా వచ్చేసిందో. అప్పుడీ భయాలన్నీ ఏమయినాయో అర్థం కాలేదు ప్రణీత్‌కి

"నేను మఫ్టీలో వస్తాలే పోలీసులమని ఎవరికీ తెలియనివ్వం. నీకెందుకు నువ్వు పడుకో నేను మానేజ్ చేస్తాగా," అంటున్న ప్రణీత్ మొహంలో అలసటను గుర్తించి గదిలో కెళ్ళి పడుకుంది దాక్షాయణి

ఇప్పుడు కాస్త నిశ్చింత'గా ఉందామెకు టెన్షన్ తగ్గటంతో వెంటనే నిద్ర పట్టేసింది

తెల్లారి, రాంబాబు లేపే వరకూ మెలకువ రాలేదామెకు

"ఎంతాలస్యంగా లేచానో!" అని నొచ్చుకుంటున్న దాక్షాయణిని చూసి "పర్లేదులేమ్మా! త్వరగా బ్రష్ చేసుకొస్తే బ్రేక్ ఫాస్ట్ తీసుకుందాం" అన్నాడు ప్రణీత్


అప్పటికే అతను రెడీ అయి ఫ్రెష్‌గా ఉన్నాడు

చక చకా మొహం కడుక్కొచ్చి, తనూ రెడీ అయింది దాక్షాయణి

టేబుల్ మీద ప్లేట్లలో ఉప్మా చిన్న చిన్న గిన్నెల్లో పంచదార టమేటా చెట్నీ ఉన్నాయి

"సారీ! మా గౌరమ్మకు ఉప్మా తప్ప, ఇంకోటి చెయ్యటం రాదు " అన్నాడు ప్రణీత్

"ఏదయితే ఏం లేండి అసలు పెందలాడే లేచి నేనే చెయ్యాల్సింది," అన్నదామె





రచయిత్రి జవాబులు

కె. సతీష్‌కుమార్, కొల్హాపూర్

ప్ర : మీరు ప్రణీత్ మంజీరల కథ సుఖాంతం అయేలా రాస్తారా లేక పాఠకులకు నీతి బోధించేలా రాస్తారా?

జ కొంచం ఓపిక పట్టి వేచి చూడండి

ఎమ్. నాని, రాజమండ్రి

ప్ర. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలలో మత కలహాలను రెచ్చగొట్టటం వెరీ థ్రిమ్‌లీగా రాశారు ఇంకా "ఎలా బొరేట్" చేస్తే బావుండేదనిపిస్తోంది

జ ఔను కానీ మెయిన్ థీమ్ దెబ్బతినకూడదు గదా!

షేక్ కరీముల్లా, పెదనందిపాడు

ప్ర ఎన్ని నవలలు చదివినా మీ నవల చదివినంత తృప్తి ఉండదు "ఒడిలో చెలి మోహనరాగం చాలా బావుంది

జ థాంక్స్!

టి. రాజ్యలక్ష్మి, తిరువూరు

ప్ర . కోడళ్ళను రాసి రంపాన పెట్టే అత్తలనేం చెయ్యాలి? మీ చిరునామా తెలపండి?

జ రాయకుండానే రంపాన పెట్టాలి

చిరునామా –

ఆదూరి సావిత్రి,
కేరాఫ్ ఆంధ్రసచిత్ర వారపత్రిక, గాంధీనగరం,
విజయవాడ-520003

వి. లజపతిరాయ్, కొత్తగూడెం

ప్ర ఆడది అర్ధరాత్రి రోడ్లంట తిరగటం దేనికి?

జ అదే నాకూ అర్థం కాదు

ఉత్తమ ప్రశ్న

కాజ హనిత, ఏలూరు

ప్ర : నేటి సాహిత్యంలో వస్తున్న అనూహ్యమైన మార్పుకు కారకులు రచయిత (త్రు) లా లేక పాఠకులా?

జ : పాఠకులే. పాఠకులు కోరుకునే విధంగా రచనలు చెయ్యాల్సిన అవసరం రచయిత (త్రు)ల కుంది. కానీ .. వాళ్ళు రాసిన ప్రతి చెత్తా చదవాల్సిన అవసరం పాఠకులకు లేదు.

టి. శశిధరకుమార్, తిరువూరు

ప్ర సావిత్రిగారూ! మీరు క్రైం, డిటెక్టివ్ తరహా నవలలు ఎందుకు రాయరూ? అలా రాస్తే పేరు వస్తుంది గదా?

జ ఇలా రాస్తే రాదంటారా?

ప్ర దయచేసి మీ ఫోటో పంపరూ?!

జ వారం వారం పత్రికలో పడుతూనే ఉందిగా!

బెజవాడ కృపానందం, గూడూరు

ప్ర మీ నవలలో ఝామ పాత్ర నాకు చాలా నచ్చింది స్నేహం గురించి మీ అభిప్రాయం తెలుపగలరు

జ థాంక్స్!

'ఎంత మందితో స్నేహం చేశాం' అనే దాని కన్నా 'ఎంత మంది స్నేహాన్ని నిలుపుకోగలిగాం' అనే దానికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలని నా అభిప్రాయం

పి. చాముండేశ్వరి, చిలకలూరిపేట

ప్ర ఈనాడు మీ రచనలు ఇంతగా పాప్యులర్ అవటానికి కారణం మీరు తీసుకునే కథా వస్తువా లేక మీ శైలా?

జ మీ అభిమానం

శ్రీపాద శ్రీనివాస్, బొబ్బిలి

ప్ర 'నీతులు' నవలలలోని పాత్రలను నడిపించ డానికే గానీ రచయిత (త్రు)లు ఆచరించరని నా అభిప్రాయం మీరేమంటారు?

జ నిజమే! 'నీతులు' నవలలలో చదివి వదిలెయ్యటమే గానీ ఆచరించే అలవాటు పాఠకులకు లేనట్లే! □

గౌరమ్మ ప్రణీత్ ఇంట్లో పని చేస్తుంటుంది

అన్నం.. పప్పు. చారు ఉప్మా ఇవే చెయ్యటం వచ్చామెకు ఏం వండినా ప్రణీత్ పట్టించుకోడు అంత తీరికా, ఇంట్రస్టూ ఉండవతనికి క్యాజువల్‌గా తినేసి వెళ్ళిపోతాడు కాఫీ రెండు గుక్కల్లో తాగేసి నిలబడుతూ "ఇంకో పదిహేన్నిముషాల్లో బయల్దేరదాం!" అన్నాడు ప్రణీత్ రాంబాబు కూడా వాళ్ళతో బయల్దేరుతున్నాడు.

"బస్టాండులో పాపారావు మనుషు లెదురయితే?" భయంగా అన్నది దాక్షాయణి

"అయితే ఏం?" ప్రశాంతంగా అన్నాడు ప్రణీత్

"నన్ను లాక్కు పోరూ?"

"గుండా చెరువా! నేను పక్కనుండగా. మిమ్మల్ని లాక్కుపోవటమా! బొమికలు కూడా మిగలవు"

"పాపారావేం అనడా? ఈ ఓటమినంగీకరిస్తాడా?"

"అంగీకరించకేం చేస్తాడు? అన్నీ మీరే చూద్దురుగాని తొందరపడకండి." అన్నాడు రాంబాబు

బస్టాండులో దాక్షాయణి పక్కనున్న ప్రణీత్‌ని చూసి నిశ్చేష్టులయ్యారు పాపారావు మనుషులు.

ఆదరాబాదరా పరుగెత్తికెళ్ళి ఈ వార్తను పాపారావుకు చేరవేశారు

వాళ్ళ ఉరుకులు, పరుగులు చూసి, పొంగుకొస్తున్న నవ్వును పెదవుల వెనకే అణిచి పెడుతున్నాడు ప్రణీత్

హరిణి నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంది .

పాపారావు నివ్వెరపోయాడు అతనీ పరిణామాన్ని ఊహించటం లేదు నిప్పులు తొక్కిన కోతిలా మారాడు తను

ఈ ముండకా ఎస్ ఐ గాడింటికెళ్లాలనే ఆలోచనెందుకొచ్చింది? పోలీస్ స్టేషన్‌కెళ్ళకుండా వాడింటికెలా వెళ్ళింది? అసలు తన మీద అనుమానమెలా వచ్చింది దానికి? దానికోసం వచ్చి, దాన్ని ఇంటికి చేర్చినవాడెవడు?

"నువ్వేమన్నా చెప్పావా దానితో?" అనుమానంగా అడిగాడు హరిణిని

చాల్లే ఊరుకోండి నాకేం పనీ పాటా లేదనుకున్నారా? మీరెవరితో ఊరేగితే నాకెందుకు? నే నెప్పుడయినా వాళ్ళ సంగతులు పట్టించుకున్నానా? అలాంటి వాళ్ళకి ఉండీ ఉండీ ఒక్కోరకం తెగులు పుట్టుకొస్తుంది అయినా ఇక్కడ ఎగరటం దేనికి? వెళ్ళి దాన్నే అడగరాదూ?' అంటూ విరుచుకుపడింది హరిణి

"నిజమే ఇదెప్పుడూ ఇలాంటి పన్లు చేసి ఎరుగదు మరి అదెలా వెళ్ళింది

ఆ ప్రణీత్‌గాడి కెంత ధైర్యం! తన మనిషని తెలిసి కూడా ఆశ్రయమిస్తాడా! స్వయంగా వెంట బెట్టుకుని బస్టాండు కొస్తాడా? రాత్రి తెల్లవార్లూ వాడుదాన్ని వాడుకుని ఉంటాడు ఎర్రగా బుర్రగా ఉన్నాడు గనక ఇది కూడా ఇష్టపడే ఉంటుంది!

తను తెచ్చి అమర్చుకున్న దాన్నెవరో తన్నుకు పోయి ఎంజాయ్ చేశారనే విషయం ఆ వ్యక్తి తన శత్రువైన ప్రణీత్ కావడం గంగవెర్రులెత్తించింది పాపారావుని చొక్కా తొడుక్కొని, పెద్ద పెద్ద అంగలేసుకుంటూ బస్టాండువేపు నడిచాడు .

నమస్కారం పాపారావుగారూ బావున్నారా?' ప్రణీత్ పలకరింపులో ధ్వనిస్తున్న వ్యంగ్యానికి పాపారావు మొహం ఎర్రబడింది

ఏదో! మీ దయవల్ల బాగానే ఉన్నాం! ఈ పిల్ల నెక్కడ కొట్టుకొచ్చారు?' అన్నాడు పాపారావు కోరగా దాక్షాయణివేపు చూస్తూ

"అంతేలెండి ఎలాంటి అలవాట్లున్న వాళ్ళకలాంటి పలకరింపులే వస్తుంటాయి పచ్చ కామెర్ల సామెత ఈ దేశంలో పుట్టిందేగదా మరి అయినా ఆడపిల్లల్ని నీ తండ్రిలాంటి వాడిని' అంటూ కొట్టుకొచ్చే వయసూ, అలవాటూ మీలాంటి పెద్దలకుంటాయిగానీ నిన్నకాక మొన్న కళ్ళు తెరిచిన

ఒడిలో చెలి మోహన రాగం

నాలాంటి వాడికెందుకుంటాయి?" అన్నాడు ప్రణీత్.

ఈ సంభాషణని చుట్టుపక్కల వాళ్ళు ఆసక్తిగా వినటం... కొందరు ముసి ముసిగా నవ్వుకోటం... మరి కొందరు దాక్షాయణినీ, తననీ అనుమానంగా మార్చి మార్చి చూడటం... ప్రణీత్ ఎత్తు పొడుపుల్లో శ్లేష... ఇవన్నీ చూసిన పాపారావు కన్నంలో తేలుకుట్టిన దొంగలా అయిపోయాడు.

"ఈ అమ్మాయి నా చెల్లెలు. కూతురులాంటి దానివంటూ ఒంటరి ఆడపిల్లల్ని మోసగించే ప్రబుద్ధులకి ఈ బంధం అపహాస్యంగానే కనపడుతుందనుకోండి..." అంటూ ప్రణీత్ తనను గుంభనగా చావు దెబ్బలు కొడుతుంటే కసితో పళ్ళు నూరుకోటంతప్ప ఏమీ చెయ్యలేక పోతున్నాడు పాపారావు. డైరెక్టుగా ప్రణీత్‌మీద దాడి చెయ్యటానికిది అనువైన ప్రదేశంకాదు...

తనే స్వయంగా రంగంలోకి దిగి, చేతులకు మట్టి అంటించుకునేంత తెలివితక్కువవాడుకాదు పాపారావు.

అతని మనసు అవమానంతో కుతకుతలాడి పోతోంది... అయినా నిగ్రహించుకున్నాడు....

కల్పించుకుని, ఇంకో వ్యక్తితో సంభాషణ మొదలెట్టాడు, ప్రణీత్‌ని పట్టించుకోనట్టు....

ఆ రోజు నుంచే పాపారావుకు ప్రణీత్ అగర్భశత్రువయ్యాడు.....

★ ★ ★ ★ ★ ★ ★ ★

బస్సు దిగి, ఊళ్ళో కడుగుపెడుతుంటే భయంతో ఒణికింది దాక్షాయణి శరీరం.....

"నువ్వలా భయంగా... బేలగా ఉండకు.. నవ్వుతూ హుషారుగా ఉండు. అలా అయితేనే నువ్వు బంధువులింటికెళ్ళి వచ్చినట్టు ఊళ్ళోవాళ్ళని నమ్మించొచ్చు. నీ అంతట నువ్వే బయటపడిపోకు...." అన్నాడు ప్రణీత్.

ఊళ్ళో ఎదురయి ప్రశ్నించిన వాళ్ళకి తను దాక్షాయణి పింతల్లి కొడుకుగా పరిచయం చేసుకున్నాడు ప్రణీత్. పదిరోజులుంచుకుని పంపిద్దామని తీసికెడితే... నాలుగు రోజులకే బెంగపెట్టేసుకుందని.... అందుకే వెంట బెట్టుకు తీసుకొస్తున్నానని చెప్పాడు ప్రణీత్.


ఏ విధమైన తడబాటూ లేకుండానవ్వుతూ.... కులాసాగా మాట్లాడుతూ దాక్షాయణి ఇంటి సమీపానికి చేరాడు.

ఇల్లు దగ్గర పడగానే ఆమెలో మళ్ళీ భయం మొదలయింది.....

పరవాలేదన్నట్టు కళ్ళతోనే సౌంజ్ఞ చేశాడు ప్రణీత్. ఆమెను తీసుకుని నేరుగా లోపలికి ప్రవేశించాడు. రాంబాబు వరండాలో ఆగిపోయాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది....

దాక్షాయణి తల్లి దండ్రులు నడుము విరిగి పోయిన వాళ్ళలా... దక్షిణంవేపు గదిలో ముణగదీసుకు పడుకున్నారు ఒంట్లో బాగాలేదని వంకబెట్టి.



దాక్షాయణి బంధువులింటి కెళ్ళిందని ఊళ్ళోవాళ్ళకు చెప్పి తాత్కాలికంగా వాళ్ళ బారినుంచి తప్పించుకో గలిగారు.

ఆ తరువాత?

"ఆమె ఎటుపోయింది? ఎప్పుడొస్తుంది" అనే ప్రశ్నలకు సమాధానాలేవి? ఎన్నాళ్ళు మభ్య పెట్టగలరు? ఆ తరువాత ఏం చెయ్యాలి? అనే ప్రశ్నలు.... బాధ.... అవమానం ఆ ముసలి దంపతుల మనసుల్ని కోసేస్తున్నాయి...

పాలగ్లాసు తీసుకుని ఆ గదిలో కెళ్ళ బోతున్న కాత్యాయని చటుక్కున ఆగిపోయి భయంగా.... ఆశ్చర్యంగా చూసింది. ఆ తరువాత సంభ్రమంగా "అమ్మా! అక్కొచ్చింది!" అంటూ అరిచింది....

దాక్షాయణి తల్లి ఒక్క ఉదుటున లేవబోయి భర్త ముఖం చూసి గబుక్కున ఆగిపోయి తలదించుకుంది....

ఆయన మొహంలోకి అసంకల్పితంగా వచ్చిన వెలుగు అంతలోనే ఆరిపోయింది....

దాక్షాయణితో సహా ఆ గదిలో అడుగుపెట్టిన ప్రణీత్‌ని చూసి "నువ్వేనా దాన్ని తీసుకుపోయిన ప్రబుద్ధుడివి? సిగ్గులేదూ? ఎవర్నడిగి ఈ ఇంట్లో అడుగుపెట్టావ్?" అన్నాడాయన అసహ్యించుకుంటున్నట్టుగా.

ప్రణీత్ దీన్ని ముందే ఊహించాడు గనుక తడబడలేదు.

"ఆ ప్రబుద్ధుడిని నేనుకాదు. దయచేసి నేను చెప్పేది ఓపికగా వినండి. అరిచి గొడవ చేసుకోవద్దు." అంటూ నెమ్మదిగా జరిగినదంతా చెప్పాడు ప్రణీత్.

దాక్షాయణి తలవంచుకు కూర్చుంది.

సిగ్గుతో... భయంతో తలెత్తి చూడలేక పోతోందామె. "ప్రణీత్ వెళ్ళిపోగానే వీళ్ళు తనను చంపేస్తారు" అనుకుంటోంది. ఆ క్షణంలో ఆమెకు ఆ ఇంట్లో వాళ్ళకన్నా ప్రణీత్ ముఖ్యాతి ముఖ్యమైన వ్యక్తిగా అనిపిస్తున్నాడు. అతను కొన్ని రోజులిక్కడుంటే బావుండుననిపిస్తోందామెకు...

"జరిగిందేదో జరిగిపోయింది. ఇంతవరకూ అదృష్టవంతులమే అనుకోవాలి. ఈ అనుభవంతో మానసికమైన మార్పుతో పాటు.... భయంతో బిక్క చచ్చిపోయి.... మనసు చెదరి ఉందీ అమ్మాయి. ఈమెనేమీ అనకండి.

బిడ్డ చేసిన తప్పును తల్లిదండ్రులే కడుపులో దాచుకో లేకపోతే ఇహ లోకానికేం పట్టింది? మీరు కఠినంగా ప్రవర్తించి ఈమెను ఆత్మహత్యవేపు తరమకండి..." అంటూ వాళ్ళకు నచ్చ చెప్పాడు ప్రణీత్...

ఆ ఇంట్లో అందరి మొహాలూ తేటపడ్డాయి...

"ఈ పూట కిక్కడ భోంచేసి వెళ్ళండి నాయనా! చిన్నవాడివయినా.... పెద్ద మనసు చేసుకుని ఇంత దూరమొచ్చావు బాధ్యతగా.

పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో నీలాంటివాళ్ళ సంఖ్య పెరిగినప్పుడే ప్రజలు పోలీసుల్ని శత్రువులుగా కాకుండా.... ఆత్మీయులుగా.. తమలో ఒకరిగా చూడగలుగుతారు." అంటూ దాక్షాయణి తలిదండ్రులు బలవంతపెడితే ఆ పూటకి అక్కడుండిపోయాడు ప్రణీత్....

★ ★ ★ ★ ★ ★ ★

డ్యూటీకి సంబంధించిన ఇలాంటి పన్లు కూడా సొంతరిస్కు మీద చేస్తున్న తనకొడుకులో మానవత్వాన్ని చూసి గర్వపడింది కామేశ్వరి.....

"ఆ అమ్మాయితో రాత్రిపూట అంతసేపు ఏకాంతంగా గడిపినప్పుడు మీకేం అనిపించలేదూ?" అన్నది మంజీర.

"ఏమనిపిస్తుంది?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రణీత్.

"అదే! ఆ అమ్మాయిని....."

"ఆ అమ్మాయిని.........."

"అనుభవిం....."

"ఛీ! నోర్ముయ్యి. నేనంత బేవార్సుగా కనిపిస్తున్నానా నీకు?


నీతో ప్రణయం నెరిపాను గనుక... ప్రతి ఆడపిల్లతోటీ అలాగే సరసాలాడతానని ఊహిస్తున్నావా నువ్వు? ఆడబుద్ధి పోనిచ్చుకున్నావుకాదు."

అతని ఉక్రోషం చూసి నవ్వుతూ "తమాషాకన్నాను బాబూ. ఇదిగో లెంప లేసుకుంటున్నాను." హాస్యంగా అన్నది మంజీర.

"తమాషాకి కూడా ఎప్పుడూ అలా ఊహించకు."

"చిత్తం"

(ఇంకా ఉంది)


ఐటెక్స్
శాస్త్రీయ విధానంలో తయారుచేయబడు
ఐటెక్స్ కాటుక మీ కళ్లను దోషమేమి
చేరనీయక చల్లగా కాపాడుతుంది.
ఐటెక్స్ 48 సంవత్సరములుగ మీ
నమ్మకానికి పాత్రమైన ఉన్నతమైన చిహ్నం.
EYETEX
REGD.
Eyetex
అరవింద్ లాబరేటరీస్ మద్రాసు 600 033



బి. ఎస్. ఆర్. ఇచ్ఛాపురం

★ పాఠకుల ప్రశ్నలకు సమాధానాలివ్వడమే మీ పనా? యింకేదైనా ఉద్యోగం చేస్తున్నారా?

● ఇంకో ఉద్యోగం – చేయడం లేదు!

కె. సి. ఎం. ఆర్. తంబళ్లపల్లి

★ బహు సంతానం వల్ల కలిగే హాని ఏమిటి?

● ఎప్పుడూ వినలేదా మంది ఎక్కువ అయితే మజ్జిగ పల్చన అవుతుందని?... ఒకరిద్దరుంటే వారి అచ్చటా ముచ్చటా తీర్చడానికి ఓపిక వుంటుంది పది మంది వుంటే – ఏం వుండదు.

డి. ఎల్. ఆర్. విజయవాడ

★ మనిషి చావగానే ఏడుస్తారు బ్రతికున్నప్పుడు పట్టించుకోరు. ఎందుచేత?

● చచ్చాక కదా తెలిసేది – జీవితం ఎంత చిన్నదో, ఎంత సున్నితమైనదో?!

ఎస్. వి. సంగం జాగర్లమూడి

★ ప్రభుత్వమే హింసను ప్రోత్సహిస్తూ అవసరం అయినపుడు శాంతి ప్రవచనాలు పల్కుతూంటే ఆ ప్రభుత్వంపై సామాన్యుని ఆలోచన ఎలా వుంటుంది?

● ఏలిన వారికి సామాన్యుని ఆలోచన ఎలా వున్నా పని లేదు! గిల్లినప్పుడు ఏడవడం, ఊయల ఊపినప్పుడు నిద్ర పోవడం – నేర్చుకున్నాడు

ఆర్. బల్లార్పూరు

★ కొందరు తమ మనోభావాలను అందంగా వర్ణించి వ్రాయకలరు. కొందరు అందంగా చెప్పకలరు ఏది గొప్పది?

● వర్ణించడమే అందంగా చెప్పడం భాయీ! దీట్లో మళ్లీ తేడా లేమిటి?

బి. ఎ. ఆర్. కాకినాడ

★ ఇప్పుడు వాల్ పోస్టర్ల మీద డబ్బు కోసం స్త్రీ నగ్నంగా పోజులిస్తూంది పుస్తకాలలో కథలలో కొన్ని చిత్రాలు చాలా అసభ్యంగా వున్నాయి. ఇక కామ సూత్రాలు చెప్పనే అక్కరలేదు బట్టలు విప్పుకొన్నట్టు లేవా?

● స్త్రీ నగ్న దర్శనం యిస్తే గాని గల్లా పెట్టి నిండదు అన్న నమ్మకం ముదిరి యీ సినిమా సంస్కృతి నేడు వెర్రితలలు వేస్తూంది. కాని దీనికి స్త్రీని తప్పు పట్టారెందుకు?... నేనొక ప్రముఖ గాయనిని అడిగా 'ఈ పాట పాడడానికి మీకు సిగ్గు వేయలేదా' అని 'నేను పాడనంటే – ఓ పదిమంది ముందు కొస్తారు – పాడడానికి దాని వల్ల ప్రయోజనం ఏముంది?' అంది నిజమే. వృత్తి పాడడంగా పెట్టుకొంటే తప్పదు కదా. అంచేత పాడించే వారికి, తీసే వారికి సభ్యత కావాలి అది ప్రస్తుతం చాలా తక్కువగా వుంది!

ఎస్. ఆర్. శ్రీకాకుళం

★ ప్రేమ పవిత్రమైనది కదా? అలాంటి ప్రేమను పది మందితో పంచుకొనే ప్రేమని ఏమనాలి?

● అది – ప్రేయసీ ప్రియుల మధ్య ప్రేమే అనుకుంటే ఎలా? ప్రేమ – పలువన్నెల ఇంద్రధనుస్సు.

★ ప్రకృతిలో ప్రేమ విలువ ఎంత?

● మగవాడికా? ఆడదానికా? మగాడికైతే గేమ్ ఆడదానికైతే బర్డెన్ అందుకదుగుతున్నాను

కె. ఎమ్. డి. కాకినాడ

★ నాడు సభ్యతగా వస్త్రాలంకరణ, మరీ మరీ వినాలనిపించే పాటలు, నటుల నటన నేడు కానరావు నేడు, ఖుప్పిగంతులు, వినలేని షాటలు, క్షుద్రపూజలు. అర్ధనగ్న నృత్యాలు; పూజలు, దిగంబర సాధువులు, నగ్న దృశ్యాలు వచ్చినా రేపు రావచ్చు. ప్రజలు కూటికి లేకపోయినా సినిమాలు చూస్తారనుకోవడంలో సందేహం లేదు. నిజమేనా సోదరీ?

● అక్షరాలా సత్యం ... ఆ నమ్మకంతోనే కదా నేడు దిగజారిన సంస్కృతి – దినదినాభివృద్ధి సాధిస్తోంది!

ఆర్. ఆర్. సత్తెనపల్లి

★ అమ్మ! రామలక్ష్మమ్మ కలలో కూడా నీ విశ్వరూపం చూపించకమ్మా చూసి పాఠకులు జడుసుకుంటారు యిక వుంటా తల్లి

● ఉండు భక్తా! వుండు సాక్షాత్కార దర్శనానికి కూడా భక్తునికి అదృష్టం వుండాలి కదా?!

ఎన్. ఎన్. ఆర్. నేలకొండపల్లి

★ కె ఆర్ గారూ నేను టెన్తు ఫెయిల్ను అయినా కవితలు, కార్టూన్‌లు, కథలు రాస్తుంటాను అది నా సైడ్ హాబీ

● బ్రతికించావు వృత్తే అది అయ్యాక – చదువు కుందుకు టైముండదు ముందుగా చదువు సంగతి చూడు హాబీ బువ్వ పెట్టదు

పి. డి. ఆర్. ఖర్గపూర్

★ నేటి సమాజంలో స్త్రీకి వున్న విలువ?

● ఎదురు డబ్బిచ్చి బానిస అవుతూంది. ఇంకా ఈమె విలువకి అంచనాకూడా కట్టాలా?

★ మనిషి దేనికి బానిస అవుతాడు?


● అలవాటుకి


★ ప్రేమలో ఓడిపోయిన వారేం చేయాలి?

● ఇంకొకరిని తక్షణం ప్రేమించడం ప్రారంభించాలి లేకపోతే ప్రమాదం– ఏ దేవదాసులుగానో, నీచ మానవులుగానో మారే ప్రమాదం ఏర్పడుతుంది

★ ఎన్నేళ్లనుంచి జవాబులిస్తున్నారు?

● జ్ఞాపకం లేదయ్యా? నేను ఏ వారానికా వారం బ్రతుకుతాను! □





నాలుక ఇంత పొడుగు బయటకు తీసి వెక్కిరించి పారిపోతున్న పార్వతిని తరిమి తరిమి జడగంటలు దొరకబుచ్చుకుని ఒక్క గుంజు గుంజి మొట్టికాయ వేసాడు రంగుమని - రాముడు

కీచుమంటూ అరిచి ఆరున్నొక్క రాగాన్ని అందుకున్న ఏడేళ్ల పార్వతిని బెల్లం ముక్క పెట్టి ఊరుకోబెట్టలేక సతమతమయింది వర్ధనమ్మ

'వదినా' ఇంత చిన్నప్పుడే క్షణం పడక కొట్టుకు చస్తున్న వీళ్లిద్దరికీ పెళ్లి చేద్దామంటున్నావు వీళ్లు సవ్యంగా కాపరం చేస్తారంటావా?'

సీతమ్మ మాటలకు ఫెళ్ళున నవ్వింది వర్ధనమ్మ

'ఈ దెబ్బలాటనేం చూసావు? ఇంకో క్షణం ఆగు - వీళ్ల బండారం బయట పడుతుంది '

మెల్లిగా అత్తయ్య ఒడిలోంచి జారిపోయి పారిపోతున్న చిన్న పార్వతిని టక్కున పట్టుకుంది వర్ధనమ్మ

'ఏమే కోడలు పిల్లా! అంత బెల్లం ముక్క తింటే జబ్బు చేస్తుంది ఇలా తే'-

'మరి బావకు కూడ పెడతాగా' - కళ్ళు చక్రాల్లా తిప్పింది పార్వతి

'ఇపుడే కదే, వాడు కొట్టాడని పెంకు లెగిరి పోయేలా ఏడ్చావు '

'మరి జడ పట్టుకుని గుంజితే మెడ నొప్పెట్టదేంటి?'


'అసలు రాముడు నిన్నెందు కొట్టాడే పారూ'-

అత్తయ్య ప్రశ్నకి పార్వతి కళ్లల్లో రోషం కదిలింది

మరి బొమ్మల పెళ్లిలో మగ పెళ్లివారికి పెట్టాల్సిన అటుకులు సెనగపప్పు దొంగతనంగా అంతా తినేసాడత్తయ్యా బావ? నాకెంత అవమానం - అసలే ఆడపిల్ల తల్లిని - అందుకే కంద ఊడొచ్చేలా గిల్లేసాను పాపం నొప్పెట్టిందేమో బావకి?

గుండ్రాయంత బెల్లం ముక్కని పరికిణీ చాటున దాచుకుని ముసిముసిగా నవ్వుకుంటూ పోతున్న కూతుర్ని చూసి ముక్కున వేలేసుకుంది సీతమ్మ

మూణ్నెల్ల తర్వాత ఏడేళ్ల పెళ్లికూతురు - తొమ్మిదేళ్ల పెళ్లికొడుకు - ఆ పెళ్లిని చూసి అంతా ముచ్చటపడిపోయారు పెళ్లి పీటల మీదే జుట్టూ జుట్టూ పట్టుకున్న జంటను చూసి ముసి ముసిగా



నవ్వుకున్నారు

* * * *

సరిగ్గా ఏభైయ్యేళ్ల తర్వాత -

రామచంద్రయ్య గారి చావును పెళ్లి వేడుకలా జరిపించి బంధువులంతా వెళ్లిపోయారు అయితే నాన్నమ్మ పార్వతమ్మ బొట్టు చెరిపేసి గాజులు బద్దలు కొడుతున్నప్పుడు మాత్రం పెద్దకొడుకు కూతురు మైత్రి ఆవేశంగా అరిచింది

'ఇది చాల అన్యాయం - నాన్నమ్మకి ఈ బొట్టూ పూలూ గాజులు తాతయ్య పెళ్లి చేసుకున్నప్పుడు వచ్చినవి కావు తాతయ్య పోగానే వాటిని తీసేసే అధికారం ఎవరికీ లేదు అనాదినుంచే స్త్రీకి ఈ కుళ్లు సంఘం ఇలాగే అన్యాయం చేస్తోంది ఇదే అమెరికాలో అయితేనా ' మైత్రి బాధకు అర్థం లేకపోలేదు

పార్వతమ్మ పచ్చని ముఖం మీద కాసంత, కుంకుమ బొట్టు - మండే సూర్యుడిలా - కాళ్లకి మురుగులు - చెవులకు ఎర్రరాళ్ల దుద్దులు, కళ్లనిండా కాటుకతో ఎప్పుడూ కళకళ్లాడే నాన్నమ్మ మొహం బోసిగా కళా విహీనంగా చూడలేక కన్నీరు వరదలా పొంగి పోతోంది మైత్రికి

మైత్రి మాటలకు మూగ లేగదూడలా కళ్లెత్తి చూసింది తప్ప పన్నెత్తి పలుకలేదు పార్వతమ్మ ఐదుగురు కూతుళ్లు ఆరుగురు కొడుకులూ తల్లిని తమతో తీసుకుపోవాలని ఎంతగా గొంతులు పగిలేలా వాదించుకున్నా పెదవి విప్పింది కాదు పార్వతమ్మ

'కూలిపోతున్న ఈ పాత కొంపలో పడి ఉండాల్సిన ఖర్మ నీకేం పట్టిందమ్మా? ఎవరి దగ్గరుంటే నీ బ్రతుకు వెళ్లిపోదు నా మాట విను-' పెద్దకూతురు అమెరికా తీసుకు పోవాలని ఆలోచన-

'తండ్రి పోగానే తల్లిని దిక్కులేని దాన్ని చేసారనే నింద మా మొహాన రాసి పెట్టి వుంది కాబోలు' - ఆఖరి కొడుకు నిష్ఠూరమాడాడు

'అమ్మా నీ ఆస్తి మాకేం అక్కర్లేదమ్మా? కన్నతల్లిని కష్టంలో ఆదుకున్నా మన్న తృప్తి మిగలనీ - మాతో వచ్చెయ్' - మరో కొడుకు

'పోనీ పార్వతమ్మా పోయిన మారాజెలాగూ పోయాడు లంకంత కొంపలో ఒక్కతెవూ ఏం ఉండ గలవు? ఆ ఎకరా చెక్కా తెగనమ్మి నీ కిష్టమైన కొడుకు దగ్గరో కూతురు దగ్గరో ఉండచ్చుగా-' గ్రామ పెద్ద నోరు విప్పాడు

'నీకేం అదృష్టవంతురాలివి కొడుకుల చదువులు ఉద్యోగాలూ, కూతుళ్ల పెళ్లిళ్లు అన్ని బాధ్యతలూ ఆముసలాయన ఉండగానే తీర్చేసాడు చీకూ చింతా లేకుండా రామా కృష్ణా అనుకుంటూ కూర్చోవడమే'

ఊరి పెద్దల మాటలుగాని కొడుకుల ఆదరింపులు గాని కూతుళ్ల నిష్టూరాలు గాని పార్వతమ్మ చెవిని సోకడం లేదు ఆమె కళ్లు దేన్నో వెతుకుతున్నాయి చెవులు ఏదో వినాలని తాపత్రయ పడుతున్నాయి గుండె ఏ పిలుపు కోసమో వెర్రెత్తి ఆవేదన పడుతోంది


ఆ కొంపలోంచి ఆమెను కదప లేక పోయిన బంధువులంతా విసుక్కుంటూ వెళ్ళిపోయారు మైత్రి మాత్రం నానమ్మను అలా వదిలేసి అమెరికా వెళ్లలేక పోయింది చిన్నప్పట్నుంచే భారతదేశ వాతావరణం ముఖ్యంగా పల్లెలంటే ప్రాణం పెట్టే మైత్రి చిన్నప్పుడు ఆరేసి నెలలు నానమ్మ తాతయ్యల దగ్గరే ఉండి పోయేది చల్ల చిలుకుతూ పార్వతమ్మ పాడే తత్వాల కోసం చెవి కోసుకునేది మైత్రి ఎంత చలిలోనయినా నానమ్మ గొంతువిని మంచం మీద చటుక్కున లేచి కూర్చునేది కూతురి అభిరుచి తెలిసినా మైత్రిని వదిలి ఉండలేని పార్వతమ్మ పెద్ద కొడుకూ కోడలూ అమెరికాలోని సంబంధమే చేసారు ఆమెకు దాంతో ఈ మధ్య కాలంలో ఇండియా రాలేక పోయింది నానమ్మ తేరుకుంటే తప్ప అప్పుడే అమెరికా రాను అన్న కూతుర్ని నొప్పించ లేక, అల్లుడికి ఏం సర్ది చెప్పాలో నని భయపడుతూ వెళ్లిపోయారు పెద్ద కొడుకు కోడలు-

* * * * *

పార్వతమ్మ కళ్లు అర్ధ నిమీలితాలయ్యాయి

తీర్చిన రంగవల్లులు - ఫొటో ఏలేశ్వరపు నరసింహారావు





Sobhagya H/RCF/86



అభినేత్రి భానుప్రియ సమాధానాలు

దేవులపల్లి జనమేజయ, హైదరాబాదు

నా స్థానంలో మీరుంటే ఏం ప్రశ్నిస్తారు?

ఇదే ప్రశ్న వేస్తాను!

కె. శివరామకృష్ణ ప్రసాద్, ఏలూరు

'భాను'డు ఉదయించేటప్పుడు 'ప్రియ' మెవరికి?

సూర్య కాంతి నాశించే ప్రాణులకి!

మీరు హిందీ సినీ రంగంలోకి కూడా ప్రవేశించారు కదా? మీ ప్లేస్‌లో మీ సోదరి రేఖను ప్లేస్ చేస్తున్నారు. అంతేనా?

కాదు.

ఎ. దేవి, కరీంనగర్

ఈనాడు దేశములో ఇన్ని అనర్థాలు జరగడానికి కేవలం సినిమాలే అంటాను మీరేమంటారు

నేనేమీ అనను.

ఎం. కె. శ్రీనివాసులు, ఆదోని

సమాజంలో స్త్రీ పాత్ర ఎటువంటిది?

ఉత్తమ మైనది, ఉన్నతమైనది, ఉదాత్తమైనది!

సి. హెచ్. శ్రీనివాసరావు, అనకాపల్లి

మీ అభిమానుల యందు మీకున్న అభిప్రాయం ఏమిటండీ?

సదభిప్రాయమే.

హెచ్. వత్సలాబాయి, హిందూపూర్

మీలో అందచందాలు ఉండి, యాక్షన్ టేలెంట్ వుండి, మీరు సూపర్ హీరోయిన్‌గా రాకపోవడానికి కారణమేమిటి

ఏమీ లేదు!

ఎం. వి. సుబ్బారావు, పామూరు

నేడు మన సమాజంలో మార్పు తీసుకు రావడానికి వరకట్న సమస్య మీద ఎన్ని చిత్రాలు వస్తున్నా, వరకట్న పిశాచికి ఎందరో బలి అవుతున్నారు దీనికి కారణము చెప్పగలరా?

చెప్ప లేను.

ఎస్. సుదర్శన్, ఆర్మూర్

ఈనాటి ప్రపంచములో అందరూ మెచ్చే పాత్ర ఏది?

'ధన పాత్ర'

పక్కి రాధాకృష్ణ, బల్లిగూడ (ఒరిస్సా)

చిత్రాలలో మీ నటన మెచ్చుకున్న వాడ్ని తెర వెనుక, తెర ముందు ఒకేలా నటిస్తుంటారా!

నిజ జీవితంలో నటించే వాళ్లంటే నాకసహ్యం!

ఉత్తమ ప్రశ్న

బి. శ్రీనివాస్, విశాఖపట్నం

నేటి తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంజనీరింగ్, మెడిసన్ వగైరాల్కకే పరిమితం చేస్తారు గాని, గవాస్కర్‌లా, పి టి. ఉషా వంటి క్రీడాకారులుగా తీర్చిదిద్దక పోవడానికి కారణము?

చదువులు డబ్బులిచ్చి కొనుక్కోవచ్చు. 'టేలంట్' పుట్టుకతో – పెరుగుదలతో – పట్టుదలతో రావాలి!

బి. ఎల్. నరేష్‌కుమార్, రాజంపేట

రజతోత్సవ , స్వర్ణోత్సవ చిత్రాల భానుప్రియగారూ? డబ్బులిచ్చి 'సూపర్‌స్టార్' అవటం (కొనుక్కోవటం) గొప్ప లేక అనతికాలంలోనే అఖిలాంధ్ర ప్రేక్షకుల అభిమానంతో ఉన్నత శిఖరాలను అధిరోహించటం గొప్పా?

మీరే నిర్ణయించండి!

కె. వి. ఎస్. కోటిన్స్, తాళ్ళపూడి

'అనాదిగా ఆడది'లో మీ పాత్ర ధరిస్తున్నప్పుడు ఎటువంటి అభిప్రాయం కలిగింది మీకు?

బాన్ ది డౌరీ అనిపించింది.

గంపల భాస్కరరావు, పొదలకూరు

మీరు దేవుడ్ని నమ్ముతారా– నమ్మరా? (కాష్మోరాలో నమ్మ లేదు గనుక)

'కాష్మోరా' సినిమా కనక!

జె. వి. వి. ఎల్. సత్యనారాయణ, విజయవాడ

భానుప్రియగారూ! అసలు మీరు సినిమా రంగంలోకి ఎందుకు ప్రవేశించాలనుకున్నారు?

నటించడానికి.

ప్రవేశించిన కొద్ది కాలంలోనే మంచి హీరోయిన్ అయ్యారు కారణమేమిటి?

మీ అందరి అభిమానం.

నాగండ్ల వెంకటేశ్వరరావు, దోర్నకల్

ఎలాంటి ప్రశ్న రాస్తే నాకు మీ ఆటోగ్రాఫ్ కలర్ ఫోటో లభిస్తుందంటారు?

ఇలాంటి ప్రశ్న రాస్తే మాత్రం కాదు.

మా అభిమాన నటుడు నందమూరి బాలకృష్ణపై, మా అభిమాన దర్శకుడు జంధ్యాలగారిపై మీ అభిప్రాయం?

చాలా మంచి అభిప్రాయం!

ఎ. గులాం అలీబేగ్, ఏనుగొండ

సినిమా తారలకు సౌందర్యము కోసం సబ్బు 'లక్స్' అంటారు మీరు కూడా లక్స్ వాడుతారా?

అందానికి కారణం సబ్బులే అయితే – ప్రపంచంలో అసలు అనాకారులే వుండరు. □

కూపన్.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
భానుప్రియ సమాధానాలు

ప్రశ్న : ______________________________

____

____

పంపిన వారి పేరు ______________________________

పూర్తి చిరునామా ______________________________

____

అభిమాన తారలపై అభిప్రాయం

నా అభిమాన నటుడు సుప్రీమ్ హీరో చిరంజీవి. చిరంజీవి నటించిన చిత్రాలు దాదాపు అన్నీ చూశాను. "శుభలేఖ", "విజేత" చిత్రాలలో ఆయన యాక్షన్ సూపర్బ్. "చంటబ్బాయ్" చిత్రం ద్వారా హాస్య పాత్రనైనా చక్కగా పోషించగలనని నిరూపించారు. తెలుగు చలన చిత్ర రంగంలో ఏ పాత్రనైనా అవలీలగా పోషించగల హీరో చిరంజీవి





అంటే అతిశయోక్తి కాదు. ఈ మధ్య విడుదలైన చిత్రాలు చూస్తుంటే చిరంజీవి ఫైట్స్‌కే ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా వుంది. నా అభిమాన హీరోకి నేను ఇచ్చే చిన్న సలహా ఏమిటంటే కథాబలం గల చిత్రాలలో నటించమని.

–యు. విజయ, తూరంగి, కాకినాడ

★ ★ ★

నా అభిమాన నటుడు రెబల్ స్టార్ కృష్ణంరాజు గారు. నాటి 'కటకటాల రుద్రయ్య' తోనే తెలుగు ప్రేక్షకుల హృదయ కవాటాలలో "బందీ" అయిన మహానటుడు మా కృష్ణంరాజు. నటించిన ప్రతి చిత్రంలోను ఆయన నటన అపూర్వం.

నటునిగానే కాక, సమర్పకునిగా ఆయనందించిన 'అమరదీపం', 'భక్త కన్నప్ప', 'బొబ్బిలి బ్రహ్మన్న' చిత్రాలు ఆణిముత్యాలు. మిగిలిన చిత్రాలలో ఆయన నటన ఒక ఎత్తు, కాగా ఈ మధ్యే విడుదలైన 'తాండ్రపాపారాయుడు' చిత్రంలో ఆయన నటన మహోన్నతం. కేవలం నటుడిగానే కాక మానవత్వం, సేవానిరతి కల్గిన మానవతా మూర్తి మా కృష్ణం




రాజు గారు.

పట్టి మాటలు కట్టి పెట్టవోయ్, గట్టి మేలు తల పెట్టవోయ్ అన్న గురజాడ వారి మాటలు నిజం చేస్తూ, వరద తాకిడికి గురైన ప్రజలకు పదిలక్షల రూపాయల విలువగల అన్న వస్త్రాలు అందించిన నిజమైన "ధర్మాత్ముడు" మా ధృవతార.

తెలుగు చిత్ర రంగంలో ఎన్నో వైవిధ్యం ఉన్న పాత్రలకు జీవం పోసిన "రావణబ్రహ్మ" మా కృష్ణం రాజు.


మాస్ చిత్రాలకు ప్రాధాన్యత నివ్వకుండా ఫామిలీ సెంటిమెంట్ చిత్రాల్లో నటిస్తూ, తను సొంత నిర్మాణ సంస్థ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుర్తుంచుకోదగ్గ చిత్రాలు నిర్మించాలని, కథాబలం లేని చిత్రాలలో నటించి అభిమానులను నిరాశ పరచవద్దని మనవి.

-జి. వి. ఆర్. ఎ. ప్రసాద్, దత్తాత్రేయ కాలనీ, హైదరాబాద్

★ ★ ★

నేను అభిమానించే కథానాయిక జయప్రద. ఆమె నటించిన తెలుగు, హిందీ చిత్రాలెన్నో చూసాను. తెలుగు, హిందీ చిత్రాలలో అభిమాన నటి అగుటకు ఆమె పాత్రల పట్ల చూపించే శ్రద్ధే కారణము. 'సిరి సిరి మువ్వ' 'సీతారాములు' 'సాగర సంగమం' 'స్వర్గ్ సే సుందర్' చిత్రాలలో ఆమె నటించింది అనే కంటే జీవించింది అంటే అతిశయోక్తి కాదు. ముఖ్యముగా డాన్స్ చేయటంలో ఆమెకు సాటిలేరు.

మంచిపేరు తెచ్చి పెట్టిన తెలుగు చిత్రాలలో ఈ మధ్య అరుదుగా కన్పిస్తున్నారు. ఆమె చిరకాలవాంఛ 'జాతీయ అవార్డు' రావాలంటే




మంచి కథాబలమున్న చిత్రాలను ఎన్నుకోవాలని అభిమానిగా నా సూచన.

-సి. పద్మశ్రీ, విశాఖపట్నం

★ ★ ★

ఆమె ముగ్ధమోహన రూపసి.... ఆమె స్నిగ్ధ సౌందర్యరాశి.... ఆమె చూపులు చంద్రోదయాలు.... ఆమె నవ్వులు మల్లెలజల్లులు.... ఆమె నటన అపూర్వం.... ఆమె కనిపిస్తే ప్రేక్షకులలో హర్షాతిశయం.... ఆమె యువకుల స్వప్నసుందరి.... ఆమె మహిళాలోకం ఆరాధ్య దేవత .... ఇంతకీ ఆ ముద్దుగుమ్మ ఎవరనుకొంటున్నారు? ఆమె మధురమనోహర సుందర దరహాసిని సుహాసిని గాక మరింకెవరు? పెదవి కదపకనే ఆ ఇంద్రనీలాల కనుదోయితో వేవేల భావాలొలికించి, ముద్దు ముద్దు మాటలతో ప్రేక్షకులనలరించి, అద్భుత నటనా వైదుష్యంతో..... అపురూపాభినయ చాతుర్యంతో.... లక్షలాది అభిమానుల గుండెల్లో గుడికట్టుకొన్న మంజులదరస్మిత సుహాసిని నా అభిమానతార! ఆమెలో 'ఇది' అని చెప్పలేని ప్రత్యేకత ఉంది..... అంతులేని సౌందర్యముంది.... సాటిలేని మేటి నటన ఉంది.... అందుకే ఆమె లక్షలాది అభిమానుల మనోమందిరాలలో నిలచి పూజలందుకొంటోంది. "కొత్త జీవితాలు" చిత్రంలో అమాయకురాలిగా సాగి చివరన దుష్టుడిని సంహరించిన పాత్రలో అసమానంగా నటించి.... 'మౌనగీతం'లో మధుర ప్రణయాన్ని చిలికించి..... 'ముద్దుల మనవరాలు'గా నవ్వులు కురిపించి..... "కర్పూరదీపం"లో ప్రేక్షకులచే కంటతడి పెట్టించి..... "స్రవంతి"గా, "సింధుభైరవి" గా, "లేడీ డాక్టర్"గా..... "అనుపమ"గా.... సోయగాలు చిందించి..... నటనలో




"ఛాలెంజ్"గా తీసుకొని తారాపథంలోకి "బుల్లెట్"లా దూసుకు పోతున్న అందాల "కథానాయిక" సుహాసినికి మహోన్నతమైన భవిష్యత్ ఉంది. ఆమెను చూస్తుంటే చాలు... హృదయం అపూర్వంగా స్పందిస్తుంది. అందుకే ఆమె నా అభిమాన తారామణి. ఆమె హిందీ చిత్రాల్లో కూడా నటిస్తే యావద్భారతం ఆ అందాలమాలను చూసి పరవశిస్తుంది కదా! వరదబాధితులను చాలా ఉదారంగా ఆదుకొన్న మానవతా వాది సుహాసిని అని చెప్పుకోను గర్విస్తున్నాను. ఆమె భరతనాట్య భంగిమల్లో కనిపిస్తే పులకిస్తాను! అలా కనిపించాలని నా ఆశ!

-వేముల వాణి, అల్లూరు(నెల్లూరు)

★ ★ ★

సహజ నటుడు శరత్‌బాబుగారు నా అభిమాన నటుడు. ఎటువంటి క్లిష్టతరమైన పాత్రలనైనా, సునాయాసంగా పోషించి మెప్పించగల నటుడు శ్రీ శరత్‌బాబు. శ్రీ శరత్‌బాబు సంభాషణలను మృదు మధురంగాను, స్పష్టంగానూ వ్యక్తీకరిస్తాడు. సహాయ పాత్రలు, అతిథి పాత్రలు, క్యారెక్టర్




పాత్రలు, మరి ఏ ఇతర పాత్రలనైనా, సమర్థవంతముగా పోషించి, తన పాత్రకు న్యాయం చేకూర్చగల నటుడు శరత్‌బాబు. కొన్ని చిత్రాలలో హీరోగా నటిస్తున్న శరత్‌బాబుగారు ఎంతైనా అభినందనీయులు. సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకున్న శరత్‌బాబు గారు, తన అత్యద్భుత నటనా సామర్థ్యంతో సినీ ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయి నొందగలరని ఆశిస్తున్నాను.

–చింతల శివశంకర్, సరూర్‌నగర్, హైదరాబాద్ □



"అల్లరి క్రిష్ణయ్య"లో బాలకృష్ణ, భానుప్రియ

సినిమా



"ఉమ్మడి మొగు

కృష్ణ, కోడి రామకృష్ణ కాంబినేషన్‌లో చిత్రీకరణ ముగిసిన దొంగోడొచ్చాడు

కృష్ణగారిది ఏనోపచరితమయిన పాత్ర ఇది ఆయన అభిమానులకు ఎంతో వెరైటీగా ఉంటుంది డిసెంబర్ 3నుంచి 10 వరకు ఆఖరి షెడ్యూల్‌ను పూర్తిచేశాం అన్నారు కోడి రామకృష్ణ ఈయన స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో ఎన్ రామలింగేశ్వరరావు సమర్పించే శ్రీ మూవీస్‌వారి పై చిత్రంలో రాధ గొల్లపూడి గిరిబాబు జీవా త్యాగరాజు రాజా జయంతి సాగరిక గెస్ట్‌గా శ్రీధర్ నటించారు శ్రీనివాసచక్రవర్తి కథకు సత్యానంద్ సంభాషణలకర్త చక్రవర్తి స్వరకల్పనలో వేటూరి గీతాలు రాశారు ఎ ఎస్ ఆర్ స్వామి ఛాయ.

"తిరగబడ్డ తెలుగుబిడ్డ"లో రమ్య, అర్చన



రామచంద్రసింగ్ శిల్పం. ఎన్. ఎ. ప్రసాద్ -బి. ఎం. రాము ప్రొడక్షన్. సలీం నృత్యాలు. నాగేశ్వరరావు - సత్యం కూర్పు. బి.బలి సుబ్బారావు నిర్వహణతో ఘట్టమనేని విజయలక్ష్మి. పెమ్మసాని జనార్ధనరావు నిర్మాతలు.

శోభన్‌బాబుతో "దొరికితే దొంగలు"

"శోభన్‌బాబుగారిది నవ్వించే పాత్ర. జనవరి, ఫిబ్రవరి, మార్చినెలల్లో 1-13 తేదీల మధ్య జరిగే

—జి.వి.జి.



"లో రాధిక, కీర్తి

మూడు షెడ్యూళ్ళతో షూటింగ్ పూర్తవుతుంది అన్నారు. శ్రీ మురళీమోహనరావు ఈయన దర్శకత్వంలో ఎస్ దివాకరరెడ్డి నిర్మించే శ్రీ కామాక్షి క్రియేషన్స్‌వారి ప్రై చిత్రంలో విజయశాంతి రావు సత్యనారాయణ గిరిబాబు గొల్లపూడి నూతన్‌ప్రసాద్ వేలు వరప్రసాదరావు రమాప్రభ మమత వగైరా తారాగణం సంభాషణ సత్యానంద్ రచన వేటూరి గీతాలు చక్రవర్తి సంగీతం సుధాకరరెడ్డి ఛాయ పట్టాభి-రాజు- వారి ప్రొడక్షన్ శ్రీనివాసరావు



"నమ్మిన బంటు"లో మురళీమోహన్, రజని

జ్యోతేంద్ర సహకార దర్శకత్వం నరసింహారావు కూర్పుతో ఎస్ కృష్ణప్రసాద్‌రెడ్డి ఈ నిర్మాత

కృష్ణతో శుభోదయా చిత్రం

జనవరి నుంచి షూటింగ్ ఆరంభం శుభోదయా ఆర్ట్ ప్రొడక్షన్స్ అధినేత వై సత్యనారాయణ (అప్పులు) ఈయన నిర్మాతగా కృష్ణ హీరోగా నాయక పాత్ర నిర్వహించే చిత్రంలో విజయశాంతి నాయిక సత్యనారాయణ నూతన్‌ప్రసాద్ గొల్లపూడి మారుతీరావు శుభలేఖ సుధాకర్ ప్రభృతులు ఇతర పాత్రధారులు పాయినాట్ కథ మాటలు సమకూర్చారు చక్రవర్తి సంగీతం అందిస్తారు వి ఎస్ ఆర్ స్వామి ఛాయాగ్రాహకుడు ఈ చిత్రం తర్వాత ఈ సంస్థ మార్చి నుంచి ఆగస్టు వరకు ఒకే చిత్రంలో రమేష్ వారా

"కాబోయే అల్లుడు"లో చంద్రమోహన్, రేఖ



తమిళనాడులో సంక్రాంతి

–జ్యోతిలక్ష్మి



సంక్రాంతికి
ప్రతీ సమస్యకు దారి దొరుకుతుంది

సంక్రాంతి పండుగను మన దేశంలోని వివిధ రాష్ట్రాలలో అక్కడి ఆచారాలు పద్ధతుల ప్రకారం ఎంతో వైభవంగా జరుపుకుంటూంటారన్న విషయం అందరికీ తెలిసిందే

తమిళనాడులో ఈ పండుగను పొంగల్ అంటారు పొంగల్ అంటే కాంతి దైవం విశ్వ చైతన్యం కోసం నిరంతరం శ్రమిస్తూ ధనుర్రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశిస్తాడు మన ప్రత్యక్ష దైవమైన సూర్యుడు అంచేత, ఆ భగవానుని గమనానికి చెందిన పేరునేపెట్టారు

తై పిరందాళ్ వఴి పిరక్కుం అంటారు సంక్రాంతి సమయాన తమిళ పంచాంగం ప్రకారం 'తై నెల వస్తుంది ఈ నెల ఆరంభమవగానే ప్రతి సమస్యకూ ఏదో దారి దొరుకుతుందనీ ఈ ఉత్తరాయణ కాలం సర్వ సుఖ సౌభాగ్యాలనూ ప్రసాదిస్తుందనీ పెద్దల నమ్మిక

ఈ పొంగల్ తమిళనాడులో పంటల పండుగ అనే చెప్పాలి ఇక్కడ భోగిమంట ఆచారం లేదు రతనాలు పొంగినట్టుండే రంగవల్లులు తప్పనిసరి కొన్ని కుటుంబాలలో మహిళలు గౌరీ పూజ చేస్తారు అనంతరం పాలు పొంగించి అందులో చెఱకు ముక్కలు అరటి పిలకలు బియ్యం బెల్లం వేసి పొంగలి చేస్తారు దీనిని సూర్యభగవానునికి నైవేద్యం పెట్టి అందరికీ పంచుతారు

కనుమ పండుగ తమిళనాడులో ఎంతో విశేషంగా

పంటల పండుగ





చెరకు వింటి నారి


జరుపబడుతుంది ముందు రోజు రాత్రి అన్నం వండి అందులో పాలు కాచి తోడి పెడ్తారు వేకువ ఝామునే ఆ అన్నాన్ని ముద్దలుగా అరటి ఆకుల్లో ఉంచుతారు కాకుల కోసం ఆ తర్వాత వ్యవసాయానికి ఎంతో అవసరమైన ఎరువును ఎద్దును ఇచ్చే గోమాతల పట్ల గల కృతజ్ఞతకు చిహ్నంగా వాటిని ఎంతో ఆకర్షణీయంగా అలంకరిస్తారు కొన్నిచోట్ల ఎద్దు కొమ్ములకు పూల దండలు నాణేలు కట్టి తోలుతారు డప్పుల చప్పుళ్ళు చేస్తూ పరుగెత్తే ఆ ఎద్దును పట్టుకున్న వాళ్ళువాటి కొమ్ములకు కట్టిన నాణేలను తీసుకో వచ్చు దీనిని జల్లి కట్టు అంటారు ఈ ప్రయత్నంలో కొందరు గాయపడ్తారు కూడా

ప్రతి సంక్రాంతీ కొత్త కాంతులు విరజిమ్ము తూంటుంది

–సేకరణ జి వి జి


ఫొటోలు : శివం

"ఆస్తులు- అంతస్తులు"లో రాజేంద్రప్రసాద్, రమ్యకృష్ణ



"ప్రతిస్పందన"లో ఒక దృశ్యం




మహేశ్వరీ మూవీస్
దొంగ మొగుడు
ఎ.కోదండరామిరెడ్డి
యస్.పి.వెంకన్నబాబు
యండమూరి వీరేంద్రనాథ్-సత్యానంద్-చక్రవర్తి-లోక్‌సింగ్
LAKSHMI PUBS



"సామ్రాట్"లో విజయశాంతి

కె. రాఘవ చిత్రం "యుగకర్తలు"

"ఒక యువకుడు నిరుద్యోగి మరో యువకుడు రాడికల్ భావాలు గలవాడు మూడో యువకుడు ఆఫీసులో జరిగే రాజకీయాల వల్ల విరక్తి చెంది ఉద్యోగాన్ని వదులుకున్న యువకుడు ఈ ముగ్గురూ "యుగకర్తలు"గా ఎలా మారారన్నదే ఇతివృత్తం ఈ ముగ్గురు యువకులుగా డాక్టర్ రాజశేఖర్ సాయికుమార్ విద్యాసాగర్ జర్నలిస్ట్‌గా జీవిత నటిస్తున్నారు నిర్విరామంగా జనవరి 5కి షూటింగ్ పూర్తయింది, అన్నారు ఆదిత్య ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ప్రతాప్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ అధినేత కె రాఘవ నిర్మించిన పై చిత్రంలో కల్యాణ్ ఎం వి కె. ప్రసాదరావు, ఎ జె వి ప్రసాదరావు, అరుణ, పూర్ణిమ ఇతర నటవర్గం' యడవల్లి రచయిత కె శ శిశ్రీ, సి నారాయణ రెడ్డి కవితలను సుభాష్- గోపి స్వరపరిచారు, జి మోహనకృష్ణ ఛాయాగ్రహణ దర్శకత్వం, ధొమ్మేటి సుబ్రహ్మణ్యం ఛాయ వి కృష్ణమూర్తి శిల్పం టి కృష్ణ సంకలనం వగైరా సాంకేతిక వర్గం

కల్యాణ చక్రవర్తితో సత్యామూవీస్ చిత్రం

"డిసెంబర్ 3 నుంచి 10 వరకు మొదటి షెడ్యూల్ పూర్తి చేశాం జనవరి 1 నుంచి 10 21 నుంచి 30 వరకు రెండో షెడ్యూల్" అన్నారు కె ఎ ఎ సత్యనారాయణ ఈయన సమర్పణలో కె రామమోహనరావు నిర్మిస్తున్న సత్యామూవీ క్రియేషన్స్ వారి చిత్రంలో కల్యాణ చక్రవర్తి సరసన రమ్య పూర్ణిమ నాయికలు గొల్లపూడి నాగేష్ తతిమా పాత్రధారులు సుదర్శన్ భట్టాచార్య మాటలు వేటూరి గీతాలు కె వి మహదేవన్ సంగీతం వి లక్ష్మణ్ ఛాయ, అప్పారావు సహకార దర్శకత్వం కుదరవల్లి నాగేశ్వరరావు శిల్పం కె సత్యం కూర్పుతో మౌళి కథ స్క్రీన్‌ప్లే దర్శకత్వం నెరవేరుతున్నారు

తమ్మారెడ్డి భరద్వాజ దర్శకత్వంలో శ్రీనివాసా చిత్రాలయా చిత్రం

"స్టూడెంట్స్ సమస్యలు ప్రధానాంశం మిట్ట మధ్యాహ్నం అందరి కళ్ళెదుట హాస్టల్‌లో జార్జ్ రెడ్డిని హతమార్చిన ఉదంతం కూడా ఈ చిత్రంలో ఉంటుంది హైదరాబాద్‌లో జనవరి 10కి షూటింగ్ ప్రారంభమై ఫిబ్రవరి కల్లా పూర్తయి పోతుంది." అన్నారు గతంలో గణనీయమైన చిత్రాలు నిర్మించిన తమ్మారెడ్డి భరద్వాజ. ఈయన తొలిసారిగా స్క్రీన్‌ప్లే దర్శకత్వ బాధ్యతలు వహించే శ్రీనివాస చిత్రాలయావారి తొలి చిత్రంలో సుమన్ నూతన్ ప్రసాద్, పి ఎల్ నారాయణ నిర్మల వీరభద్రరావు, హైదరాబాద్‌లో ని కళాకారులు పాల్గొంటున్నారు పి ఎల్. నారాయణ కథకు దివాకర్ బాబు సంభాషణల కర్త సీతారామశాస్త్రి గీతాలకు జాయ్ ఆనంద్ స్వరకర్త మహీధర్ ఛాయ సుధాకర రెడ్డి సహకార దర్శకత్వం మురళీరామయ్య కూర్పుతో ఎ చంద్రకాంత్ నిర్మాత

అర్జున్‌తో విశ్వ చిత్ర కొత్త చిత్రం

"డిసెంబర్ 31, జనవరి 1న షూటింగ్ జరిపాం మిగతా భాగం జనవరి 26 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఒకే షెడ్యూల్లో పూర్తవుతుంది." అన్నారు జి ఆర్. కె. రాజా ఈయన నిర్మిస్తున్న విశ్వచిత్ర వారి 7వ చిత్రానికి చక్రవర్తి సంగీత దర్శకుడు, రవిరాజా పినిశెట్టి స్క్రీన్‌ప్లే దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు

పాత్రలో లీనమై నటిస్తుంటే "కట్" అంటారేమిటి? ఇట్లా అయితే నాకు ఎవార్డు ఎలా వస్తుంది?





నటవిరాట్
రావు గోపాలరావు
సమర్పించు
జె.బి.ఆర్ట్స్ క్రియేషన్స్
భార్గవ రాముడు
దర్శకత్వం ఎ.కోదండరామిరెడ్డి నిర్మాత ఎస్.జయరామారావు
పరుచూరి బ్రదర్స్ · వేటూరి · చక్రవర్తి, నందమూరి మోహనకృష్ణ
శ్రీలక్ష్మి పిక్చర్స్
SREE LAKSHMI ADS

చిన్ననాటి సంక్రాంతి

-ధమ్

'సంక్రాంతి' అంటే అందరికీ అనిపించేదీ, గుర్తొచ్చేదీ కొత్త పంటలు గొబ్బిళ్ళు చలిమంటలు పెద్ద పెద్ద ముగ్గులు భోగిపళ్ళు వగైరా

కాని నాకు ?

నేను చదువు వెలగబెట్టే రోజుల్లో

(ఫ్లాష్ బాక్ లోకి వెళ్దామా?)

మా ఊరికి కాకినాడ పన్నెండు మైళ్ళు సాధారణంగా సంక్రాంతికి ఎక్కువ పిక్చర్లు విడుదలవుతూంటాయి కదా? కాకినాడ 'ఎ' సెంటరు ఆ కొత్త పిక్చర్లు మా ఊరికి ఎప్పుడో గాని రావు అంచేత, ముందే చూసెయ్యాలనే తహతహ మా మిత్రుడొకడితో సైకిల్ మీద వెళ్దామనుకున్నా వెళ్ళేటప్పుడు వాడు, వచ్చేటప్పుడు నేను సైకిల్ తొక్కాలని నిర్ణయించుకున్నాం సెకెండ్ షో వదిలాక అక్కడ్నుంచి ఒంటి గంటకు బయలుదేరితే మూడు గంటల కల్లా మా ఇంటికి చేరుకోవచ్చు

వెళ్ళే ముందు మా తమ్ముడి నాయకత్వాన చలి మంటలు వెయడం కోసం ఎక్కడెక్కడ ఎ ఏ కలప సంపాదించాలో (దొంగిలించినవి అయితే అదో థ్రిల్ కదా?) చెప్పి పురమాయించి బయలుదేరా



సరే మాట్నీ ఫస్ట్ షోలు చూశాం సెకెండ్ షోకి మరో థియేటర్‌లో వెళ్ళి కూర్చున్నాం అక్కడ ముందు బెంచీలలో కూర్చొని ఉన్న యువకులు ఒకటే అల్లరి ఇద్దరు హీరోల అభిమానులు కొట్టుకునే దాకా వెళ్ళింది పరిస్థితి ఆ గొడవను ఎవరూ పట్టించుకోవడం లేదు నాకు చిరాకేసింది లేచి, మేనేజర్ గదిలోకి వెళ్ళాను మేమెలాగండీ పిక్చర్ చూసేదీ? అని మొరపెట్టుకున్నాను

మా హాలులో ఇది మామూలే, సార్' అన్నాడాయన

పోలీసుల్ని పిలవొచ్చు కదా?

పిలిచి ఏం ప్రయోజనం, సార్? పోలీసులు వస్తారు వెళ్తారు వాళ్ళు వెళ్ళిపోయాక వీళ్ళ అల్లరి షరా మామూలే!

'అలా ఊరుకుంటే లాభం లేదు ఆ రౌడీమూకకు సభ్యత నేర్పాలి, అంటూ ఆయన టేబుల్ మీదున్న రిసీవర్ అందుకుని పోలీసులకు రిపోర్ట్ చేశా వస్తున్నాం,సార్' అన్నారు వాళ్ళు సార్? అని వాళ్ళు సంబోధించినందుకు ఎంతో మురిసిపోతూ, కాలరెత్తుకుని, దర్జాగా ఓ సిగరెట్ వెలిగించి దంకొడ్తూ, థియేటర్‌లోకెళ్ళి, గేటు దగ్గరే నిలుచున్నా పిక్చర్ మొదలైంది నా మిత్రుడు అందులో లీనమై పోయాడు నేను సిగరెట్ వెలిగిస్తూ, పోలీసుల కోసం ఎదురుచూస్తూ అక్కడే నిలుచుండి పోయా అభిమానుల అల్లరి ఇంకా తగ్గలేదు

హఠాత్తుగా నా మెడమీద చెయ్యి పడింది తిరిగి చూద్దును కదా- ఇద్దరు పోలీసులు రండి-రండి' అని పళ్ళు ఇకిలించాను థియేటర్‌లో సిగరెట్ తాగడమే కాక - రండి రండి, అని ఆహ్వానిస్తున్నావా? నీకెన్ని గుండెలోయ్' అన్నాడొకడు

బాబూ! అసలు మీకు ఫోన్ చేసింది నేను ఎందుకని అడగరేం? అన్నాను బిక్కచచ్చి

ఏడ్చావ్‌లే పద! అంటూ రెండో అతను ఒక్క తోపు తోశాడు వెళ్ళి వేన్‌లో పడ్డా ఆ వేన్‌లో మరి కొందరు కూడా ఉన్నారు- నా బాపతే ననుకుంటా వాళ్ళతో పాటు నేను కూడా పోలీస్ స్టేషన్‌లో ఆ రాత్రంతా జాగారం చేయక తప్పింది కాదు అక్కడున్న రైటర్‌తో ఎంత మొత్తుకున్నా ప్రయోజనం లేకపోయింది ఇన్స్పెక్టర్‌గారొచ్చాక చెప్పుకోవయ్యా , అన్నాడు

వేకువ ఝామున పండగంది, అని ప్రాధేయ పడ్డా నేను ఇంకొకందుకు మీకు ఫోన్ చేస్తే, చివరికి నేనే మీ స్టేషన్‌లో కొచ్చి పడ్డా , అని బావురుమన్నాను

దాంతో అక్కడ జాగారం చేస్తున్న మిగతా పదిహేనుమంది ఏమిటీ! ఫోన్ చేసి పోలీసులను రప్పించింది నువ్వా' నీ సంగతి తర్వాత చూస్తాం , అన్నారు

గజగజ వణికిపోయాను భయంతో, చలితో నా మిత్రుడు పాపం నా కోసం ఎక్కడెక్కడ వెతుకుతున్నాడో' చివరికి వాడే సైకిల్ తొక్కుకుని వెళ్ళిపోయి ఉంటాడేమో' ఈ పాటికి హాయిగా చలిమంటలు కాచుకోవలసిన నేను ఇక్కడ ఆమోరిస్తున్నాను

తెల్లారింది తొమ్మిది దాటింది తలా పది రూపాయల అపరాధం అన్నారు ఏడుస్తూ చెల్లించి, బస్సు చార్జీలకు చిల్లర లేక కాలినడకనే ఇంటికి పరుగు తీశా

ఇల్లు చేరేసరికి మధ్యాహ్నం ఒంటి గంటయింది నాన్న సుష్టుగా భోంచేసి ఇంట్లోంచి బయటకు వస్తున్న వారల్లా నన్ను చూడగానే అడ్డగాడిదా' ఎక్కడ తగలడ్డావురా పండగపూట' అంటూ నా వీపు మీద ధమ్మని ఒక్కటిచ్చారు

థియేటర్‌లో దమ్ కొట్టినందువల్ల ఈ దమ్‌క ఆ సంక్రాంతి నాడు ఎంతటి పండుగ జరిగింది'

ఇటీవల లేడీస్ టైలర్ చిత్రం విడుదలైన సందర్భంలో ఆ థియేటర్‌కే వెళ్ళా లోపలికి వెళ్ళడమా మానడమా అని ఆలోచిస్తూ, పాకెట్ లోంచి సిగరెట్ తీశా అగ్గిపెట్టి కనిపించలేదు ఇంతలో ఒక పోలీసు సరాసరి నా దగ్గరికే వచ్చాడు శవాల పోటో గ్రాఫర్‌గా ఏం బాగా ఆక్ట్ చేశారు, సార్' అంటూ జేబులోంచి అగ్గి పెట్టి తీసి, నా సిగరెట్ వెలిగించి నవ్వుకుంటూ పోయాడు'

(జి వి జి)



తొలి సంక్రాంతి

-రేఖ

మా స్వస్థలం రాజమండ్రిలో ఉన్నప్పుడు సంక్రాంతి పండుగను ఎంతో సంరంభంగా జరుపుకునేదాన్ని

భోగిమంటలు ముత్యాల ముగ్గులు చేమంతుల తోరణాలు గొబ్బిపాటలు హరిదాసుల కీర్తనలు జంగందేవర శంఖారావం గంగిరెద్దుల మేళాలు పిండివంటలు కొత్త బట్టలు కోడి పందేలు ఎడ్ల పందేలు కనుమనాటి వేడుకలు పిల్లల సందడి

ఓహ్' ఎంత ఉత్సాహంగా ఉండేది'

ఈ ఏడు సంక్రాంతిని ద్విగుణీకృతోత్సాహంతో జరుపుకోబోతున్నాను నిజమే

ఈ మారు నా జీవితంలో సంక్రాంతికి ఓ విశేషముంది

నేను నటించిన తొలి చిత్రం కాబోయే అల్లుడు అతి త్వరలో విడుదలవబోతోంది అందుకే నా నట జీవితంలో ఇది తొలిసంక్రాంతి !

నేను నటిస్తున్న మరి కొన్ని చిత్రాలు

1 శ్రీ విజయ బాపినీడు దర్శకత్వంలో శ్రీనాద్ ఆర్ట్ పొడక్షన్స్ నాకూ పెళ్లాం కావాలి

2 శ్రీ కె ఎస్ ఆర్ దాస్ దర్శకత్వంలో నవభారత్ బాబూరావుగారి చిత్రం

3 శ్రీ ఈరంకి శర్మ దర్శకత్వంలో చేగొండి హరిరామ జోగయ్యగారి అగ్నిపుష్పం

4 శ్రీ రవిరాజా పినిశెట్టి దర్శకత్వంలో ప్రసాద్ ఇంటర్నేషనల్ వారి చిత్రం

5 శ్రీ గంగై అమరన్ దర్శకత్వంలో ఒక తమిళ చిత్రం

మీ ఆశీస్సులు నాకు సదా ఉండాలని కోరుతూ, మీ అందరికీ నా హృత్పూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు అందజేస్తున్నాను

-(జి. వి జి.)

1986 లో విడుదలైన తెలుగు చిత్రాలు

చిత్రం పేరు	దర్శకుడు	సంగీత దర్శకుడు
కిరాతకుడు	ఎ కోదండ రామిరెడ్డి	చక్రవర్తి
కృష్ణగారడి	విజయ బాపినీడు	చక్రవర్తి
శ్రావణ సంధ్య	ఎ కోదండరామిరెడ్డి	చక్రవర్తి
నాగదేవత	రామనారాయణ	చక్రవర్తి
డ్రైవర్‌బాబు	బోయిన సుబ్బారావు	చక్రవర్తి
స్రవంతి	క్రాంతికుమార్	చక్రవర్తి
భలే మిత్రులు	ఎ మోహన్‌గాంధి	శంకర్–గణేశ్
రెండు రెళ్ళు ఆరు	జంధ్యాల	రాజన్ – నాగేంద్ర
ఉక్కు మనిషి	ఎస్ ఎస్ రాజ్‌భరత్	శంకర్ – గణేశ్
నాంపల్లినాగు	ఎం ఎస్ కోటారెడ్డి	సత్యం
మాకూ స్వాతంత్ర్యం కావాలి	పి ఎస్ ప్రకాష్	రమేష్‌నాయుడు
కొండవీటి రాజా	కె రాఘవేంద్రరావు	చక్రవర్తి
శ్రీదత్త దర్శనము	కె కామేశ్వరరావు	కె. వి. మహదేవన్
నిప్పులాంటి మనిషి	ఎన్ బి చక్రవర్తి	చక్రవర్తి
మా వారి గోల	వి విద్యాసాగర్‌రెడ్డి	రాజ్ – కోటి
అనాదిగా ఆడది	అనిల్‌కుమార్	సత్యం
బ్రహ్మాస్త్రం	జి రామమోహనరావు	చక్రవర్తి
ఆక్రందన	తాతినేని ప్రసాద్	చక్రవర్తి
పట్నంపిల్ల–పల్లెటూరి చిన్నోడు	వహాళి	కృష్ణ–చక్ర
మోహినీ శపథం	బి. విఠల ఆచార్య	పార్థసారథి
కుట్ర	కె. ఎస్ ఆర్ దాస్	సత్యం
లేడీ జేమ్స్‌బాండ్	పి చంద్రశేఖరరెడ్డి	రాజ్–కోటి
మనోశక్తి	ఎస్ కృష్ణంరాజు	నరహరి
ముద్దుల క్రిష్ణయ్య	కోడి రామకృష్ణ	కె వి మహదేవన్
మగధీరుడు	విజయ బాపినీడు	ఎస్ పి బాల సుబ్రహ్మణ్యం
ఇదే నా సమాధానం	రాజాచంద్ర	చక్రవర్తి
స్వాతిముత్యం	కె విశ్వనాథ్	ఇళయరాజా
ప్రతిధ్వని	బి గోపాల్	చక్రవర్తి
సింహాసనం	కృష్ణ	బప్పిలహరి
మిస్టర్ భరత్	రాజాచంద్ర	ఇళయరాజా
మల్లెమొగ్గలు	వి మధుసూదనరావు	రమేష్‌నాయుడు
పుణ్యస్త్రీ	రవిరాజా పినిశెట్టి	చక్రవర్తి
ఖైదీరాణి	కె ఎస్ ఆర్ దాస్	సత్యం
కాష్మోరా	ఎన్ బి చక్రవర్తి	చక్రవర్తి
మంచి మనసులు	మోహన్‌గాంధి	ఇళయరాజా
జీవనపోరాటం	రాజాచంద్ర	చక్రవర్తి
జయం మనదే	కె బాపయ్య	చక్రవర్తి
సీతారామ కల్యాణం	జంధ్యాల	కె వి మహదేవన్
నిరీక్షణ	బాలు మహేంద్ర	ఇళయరాజా
కొంటె కాపురం	రేలంగి నరసింహారావు	చక్రవర్తి
పవిత్ర	వినయ్	కృష్ణ–చక్ర
దాగుడుమూతలు	రవీంద్రబాబు	జె వి రాఘవులు
ఇదే నా న్యాయం	ఎం నందకుమార్	చక్రవర్తి
ప్రతిభావంతుడు	ప్రభాకరరెడ్డి	సత్యం
ఆలాపన	వంశీ	ఇళయరాజా
పాపికొండలు	గవిని కృష్ణ	చక్రవర్తి
విక్రం	వి. మధుసూదనరావు	చక్రవర్తి
సత్యం - శివం - సుందరం	కట్టా సుబ్బారావు	చక్రవర్తి
మానవుడు–దానవుడు	రమణబాబు	జె వి రాఘవులు
కెప్టెన్ నాగార్జున	వి బి. రాజేంద్ర ప్రసాద్	చక్రవర్తి
ఆడపడుచు	ఎ మోహన గాంధి	రాజన్-నాగేంద్ర
శ్రీకృష్ణ పరమాత్మ	విజయ నిర్మల	జె వి రాఘవులు
రేపటి పౌరులు	టి కృష్ణ	చక్రవర్తి
ఖైదీ రుద్రయ్య	ఎ కోదండరామిరెడ్డి	చక్రవర్తి
జీవనరాగం	బి వి ప్రసాద్	సత్యం
కోటిగాడు	ఎస్ రామచంద్రరావు	జె వి రాఘవులు
ఆదిదంపతులు	దాసరి నారాయణరావు	సత్యం
సంసారం ఓ సంగీతం	నరసింహారావు రేలంగి	పుహళేంది
రావణబ్రహ్మ	కె. రాఘవేంద్రరావు	జె వి రాఘవులు
ఇద్దరు మిత్రులు	బి లీలావరప్రసాదరావు	సత్యం
అనసూయమ్మగారి అల్లుడు	ఎ కోదండరామిరెడ్డి	చక్రవర్తి
ధాకూరాణి	కె ఎస్ రెడ్డి	శంకర్–గణేష్
కర్పూర దీపం	రాజాచంద్ర	చక్రవర్తి
సమాజంలో స్త్రీ	ముక్కామల రామకృష్ణ	కృష్ణ–చక్ర
బంధం	రాజాచంద్ర	చక్రవర్తి
అరుణకిరణం	ముత్యాల సుబ్బయ్య	చక్రవర్తి
నేటి యుగధర్మం	జి రామ్మోహనరావు	జె వి రాఘవులు
కిరాయి మొగుడు	కె జి. రాజశేఖర్	సత్యం
కారు దిద్దిన కాపురం	డి వి నరసరాజు	సత్యం
అత్తగారూ స్వాగతం	కోడి రామకృష్ణ	కె వి మహదేవన్
దేశోద్ధారకుడు	ఎస్ ఎస్ రవిచంద్ర	చక్రవర్తి
శ్రీ వేమన చరిత్ర	సి ఎస్ రావు	సత్యం
వేటగాళ్ళు	జి సి శేఖర్	చక్రవర్తి
లవ్ మాస్టర్	పి డి ప్రసాద్	రాజ్–కోటి
కలియుగ పాండవులు	కె రాఘవేంద్రరావు	చక్రవర్తి
చంటబ్బాయ్	జంధ్యాల	చక్రవర్తి
ధర్మపీఠం దద్దరిల్లింది	దాసరి నారాయణరావు	జె వి రాఘవులు
రాక్షసుడు	ఎ కోదండరామిరెడ్డి	ఇళయరాజా
పోలీస్ ఆఫీసర్	విజయ బాపినీడు	వాసూరావు
పదహారేళ్ళ అమ్మాయి	పి ఎస్ కృష్ణమోహన్‌రెడ్డి	శివాజీరాజా
ఉగ్ర నరసింహం	దాసరి నారాయణరావు	సత్యం
మన్నెంలో మొనగాడు	కోడి రామకృష్ణ	కె వి మహదేవన్
నాపిలుపే ప్రభంజనం	పి చంద్రశేఖరరెడ్డి	రాజ్–కోటి
శ్రావణ మేఘాలు	క్రాంతికుమార్	చక్రవర్తి
కలియుగ కృష్ణుడు	కె మురళీమోహనరావు	చక్రవర్తి
మారుతి	ఎ సుగంధ రమేష్‌రాజ్	చక్రవర్తి
తాండ్రపాపారాయుడు	దాసరి నారాయణరావు	ఎస్ రాజేశ్వరరావు
అపూర్వ సహోదరులు	కె రాఘవేంద్రరావు	చక్రవర్తి
ఒక రాధ–ఇద్దరు కృష్ణులు	ఎ కోదండరామిరెడ్డి	ఇళయరాజా
తలంబ్రాలు	కోడి రామకృష్ణ	సత్యం
చల్లని రామయ్య– చక్కని సీతమ్మ	కోడి రామకృష్ణ	కె వి మహదేవన్
అడవిరాజా	కె మురళీమోహనరావు	చక్రవర్తి

ఆంధ్రసచిత్రవారపత్రిక

1986 సినిమా బాలట్ పత్రం

ఉత్తమ చిత్రం ______

ఉత్తమ నటుడు ______

ఉత్తమ నటి. ______

ఉత్తమ దర్శకుడు. ______

ఉత్తమ సంగీత దర్శకుడు. ______

ఉత్తమ సహాయ నటుడు. ______

ఉత్తమ సహాయ నటి. ______

ఉత్తమ హాస్యనటుడు. ______

ఉత్తమ హాస్య నటి. ______

ముగింపు తేది : 7-2-1987

పంపిన వారి పేరు ______

చిరునామా ______

______

శ్రీమతి కానుక	అనిల్‌కుమార్	చక్రవర్తి
దొరబిడ్డ	ధవళ సత్యం	సత్యం
పసుపుతాడు	ఎం బాలయ్య	చక్రవర్తి
అర్ధరాత్రి స్వతంత్రం	ఆర్ నారాయణమూర్తి	సత్యం
చాదస్తపు మొగుడు	శరత్	సత్యం
బ్రహ్మరుద్రులు	కె మురళీమోహనరావు	చక్రవర్తి
అష్టలక్ష్మీ వైభవము	సి ఎస్ రావు	కె వి మహాదేవన్
ఈ ప్రశ్నకు బదులేది?	కె ఆదిత్య	సుభాష్–గోపి
పరశురాముడు	విజయనిర్మల	చక్రవర్తి
విజృంభణ	రాజాచంద్ర	సత్యం
సక్కనోడు	బి భాస్కరరావు	కె వి మహాదేవన్
కౌబాయ్ నెంబర్-1	కె ఎస్ ఆర్ దాస్	చక్రవర్తి
ఇల్లాలి ప్రతిజ్ఞ	తాతినేని ప్రసాద్	సత్యం
మామా కోడలు సవాల్	బి భాస్కరరావు	సత్యం
ధైర్యవంతుడు	లక్ష్మీదీపక్	రమేష్‌నాయుడు
పరాజిత	తాతినేని ప్రసాద్	చక్రవర్తి
కోనసీమ కుర్రోడు	రవిరాజాపినిశెట్టి	చక్రవర్తి
హెచ్చరిక	సత్యారెడ్డి	శివాజీ రాజా
మల్లెల మనసులు	కె వి నందనరావు	సత్యం
లేడీస్ టైలర్	వంశీ	ఇళయరాజా
వివాహబంధం	జి రామమోహనరావు	చక్రవర్తి
శాంతి నివాసం	జి రామమోహనరావు	చక్రవర్తి
భయం భయం	ఎస్ రామచంద్రరావు	జె వి రాఘవులు
జైలుపక్షి	కోడి రామకృష్ణ	కె వి మహాదేవన్
చాణక్య శపథం	కె రాఘవేంద్రరావు	చక్రవర్తి
పూజకు పనికిరాని పువ్వు	ఎ మోహనగాంధీ	చక్రవర్తి
గురుబ్రహ్మ	బోయిన సుబ్బారావు	చక్రవర్తి

(సేకరణ : జి. వి. జి)




కరకరలాడే రుచికి
పాల సత్తువను పెంచే
న్యూట్రిన్ మిల్క్ బిస్కెట్స్
nutrine
BISCUITS
MILK
nutrine
భారతదేశంలో అత్యధికంగా
అమ్మకమౌతున్న మిఠాయిలను
తయారుచేయువారు
ACIL/009/86-Tel

వ్యక్తిగతం



సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మిఖయిల్ గోర్బచేవ్‌తో పాటు ఇటీవల భారత దేశాన్ని సందర్శించిన ఆయన సతీమణి శ్రీమతి రైసా మాక్సి మోవనా గోర్బచేవా విషయ పరిజ్ఞానానికి ఇక్కడి పండితులు కూడా ఆశ్చర్య చకితులైనారు మనదేశ సంస్కృతి, కళల గురించి ఆమెకి ఉన్న పరిజ్ఞానం ముందు తాము నిలవలేకపోయామని ఢిల్లీలోని జాతీయ పురావస్తు ప్రదర్శనశాల డైరెక్టరు శ్రీ ఎల్. పి. షిహారే అన్నారు. ఆమె ఢిల్లీలోని జాతీయ పురావస్తు ప్రదర్శనశాలని, జాతీయ ఆధునిక చిత్రకళా ప్రదర్శనశాలని సందర్శించారు బౌద్ధుల కాలంనాటి కళలని, అక్కడ భద్రపరిచిన టాగూర్, జమిని, అమృతాషేరగిల్ తైలవర్ణ చిత్రాలని ఆమె మెచ్చుకున్నారు. రవీంద్రనాధ్ టాగూర్‌ని చదవటంతో భారత దేశాన్ని గురించి తెలుసు కోవటం మొదలు పెట్టామని, ఆయన రచనలు తమని ఎంతగానో కదలించాయని ఆమె అన్నారు అందమైన రూపం, అందుకు తీసిపోని వస్త్రా లంకరణపై అభిరుచి కల శ్రీమతి రైసా గోర్బచేవా ఉన్నత విద్యావంతురాలు కూడా ఆమెకి తత్వ శాస్త్రంలో డాక్టరేట్ పట్టా ఉన్నది. శ్రీ గోర్బచేవ్ సో యూ. కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక అయేవరకూ ఆమె మాస్కో విశ్వ విద్యాలయంలో కళల గురించిన తత్వశాస్త్ర బోధకురాలిగా పని చేసారు. కొంత కాలం క్రితం ఆమె లండన్ సందర్శించి నప్పుడు కూడా అక్కడి జాతీయ పురావస్తు ప్రదర్శనశాలలోని కళా రూపాల గురించి ఆమెకి వివరించేవారు తమకన్నా ఆమెకే ఎక్కువ విషయాలు తెలుసని అంగీకరించారట! □



అమెరికన్ పాత్రికేయుడు నికొలస్ గొన్సాదిన్ డానిలోఫ్ హఠాత్తుగా అసాధారణమైన ప్రాముఖ్యతను సంపాదించుకున్నారు సోవియట్ చెరసాలలో బందీగా ఉన్న డానిలోఫ్‌ను విడుదల చేయించడానికి స్వయంగా అధ్యక్షుడు రీగన్ రంగంలోకి దిగవలసి వచ్చింది డానిలోఫ్ గత తొమ్మిది సంవత్సరాలుగా మాస్కోలో అమెరికన్ పత్రిక యు. ఎస్. న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్‌కు విలేఖరిగా ఉన్నారు. గత అగస్టు చివరి వారంలో ఆయనను అరెస్టు చేసి 13 రోజుల పాటు లిఫార్ట్‌వొ కారాగారంలో నిర్బంధించారు. గంటల తరబడి వేధింపులతో ఆయనకు మనశ్శాంతి లేకుండా చేయడానికి కె. జి. బి. తీవ్రంగా ప్రయత్నించింది. ఆ సమయంలోనే ఐక్యరాజ్య సమితిలో ఉద్యోగిగా ఉంటూ గూఢచార కార్యకలాపాలకు పాల్పడు తున్నారన్న ఆరోపణపై అమెరికన్ ప్రభుత్వం సోవియట్ పౌరుడు గెన్నాది జకరోవ్‌ను అరెస్టు చేసి ఉంచింది. జకరోవ్ అరెస్టుకు ప్రతీకారంగానే సోవియట్ ప్రభుత్వం డానిలోఫ్‌ను అరెస్టు చేసింది చివరికి డానిలోఫ్‌ను విడుదల చేస్తే జకరోవ్‌ను విడుదల చేస్తానని అమెరికన్ అధ్యక్షుడు రీగన్ చేసిన సంధి రాయబారం జయప్రదమై డానిలోఫ్ విడుదలయ్యాడు. కాని ఈ అరెస్టుతో కె. జి. బి. శైలి గురించి, కె. జి. బి. అనుసరించే మానసిక హింసా పద్ధతుల గురించి ప్రపంచానికి మరోసారి బాగా తెలిసే అవకాశం కలిగింది.... □

వారఫలం

16-1-1987 శుక్రవారం నుండి
22-1-1987 గురువారం వరకు

★ **మేషం :** చాల మార్పులు వచ్చాయి 'బుధ శుక్రులు మీకు అనుకూలంగా ఉన్నారు 'గురుడు' అనుకూలం కానున్నాడు వ్యాపార లోపం కనిపించదు ఆరోగ్య రీత్యా లోపం కనిపించదు మరేం కావాలి? ధనమా? తప్పక అందుతుంది స్త్రీలకు ఉద్యోగ రీత్యా మేలుంటుంది

★ **వృషభం ·** ఇటీవల లేనిపోని యిబ్బందులు తెచ్చుకొన్నారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొండి గొడవ తెచ్చుకొన్నారుగా' ముందు వెనుకలు ఆలోచించి ఏ కార్యానికైనా దిగాలి పట్టిన పట్టు వదలరాదు రాజకీయంగా ఎలాంటి మేలు జరుగదని గ్రహించాలి స్త్రీలకు ఆనందం, అతిథి సపర్యలకు అవకాశమున్న వారం

★ **మిధునం** గమనించండి మీకు శని గ్రహం అనుకూలదాయకుడు ఆరోగ్య సంపదకు లోపం లేదు అనుకోకుండా బంధు మిత్ర సమాగం ఈ వారంలో చెప్పదగిన ముఖ్యాంశం, వాహనం కొందరకు సమకూడటం కూడా అనుకొనదగిన అంశమే స్త్రీలకు కుటుంబానందం, కళారంగాన ఖ్యాతి, శత్రువుల లొంగుబాటు

★ **కర్కాటకం .** నూతనాంశాలందు చొరవ లాభదాయకమని గ్రహించాలి వ్యాపార రీత్యాగాని, వ్యవహార మూలంగా గాని ఎలాంటి యిబ్బందులు రావని గ్రహించాలి వ్యాపార సంబంధంగా కొంత అనానుకూలత సంభవించవచ్చు స్త్రీలకు సుఖ శాంతులు, వస్త్ర సేకరణకు అవకాశం స్వల్పంగా ఆదాయం

★ **సింహం :** ఇరుగు పొరుగు గొడవలు రాకుండా చూచుకోవాలి స్థితి గతులందు పెంపు చేకూరుట గమనింపతగిన అంశం వ్యవహారం ఏదయినా పరిష్కరింపబడకపోతే, ఈ వారం అనుకూలమని గ్రహించండి ఏవో వస్తువులు సేకరించాలనుకొంటారు, కాని కాలం కలసి రాలేదని గ్రహించాలి స్త్రీలకు సాటి వారితో గొడవలు రాకుండా చూచుకోవాలి

★ **కన్య :** ఉత్తమ ఫలదాయకం మీ యింట శుభం జరుగవచ్చు మీ మాటకు విలువ పెరుగవచ్చు, మీ అభీష్టం నెరవేరే మార్గముంటుంది. కళా రంగాన మీకు చక్కని అవకాశాలు లభ్యం కావటం విశేషం. స్త్రీలకు : అనుకూల వార్తా శ్రవణం, అభీష్ట సిద్ధి.

★ **తుల** అనుకొన్న విధంగా అన్ని పనులు నెరవేరితే అంతా మన ప్రజ్ఞ అనుకొంటాంగా' అందుకని కొన్నే నెరవేరుతాయి. అంటె గ్రహచారం అడ్డు తగులుతుందన్నమాట ప్రతిభా వ్యుత్పత్తులు రాణించగల దినం స్త్రీలకు ఉద్యోగరీత్యా అనుకూలం అనవసరంగా పొరపాట్లు చేసామని బాధపడుతారు

★ **వృశ్చికం ·** ప్రయత్నించి, లభ్యమవుతుందని ఒకానొక విషయంలో మానుకోవటం జరుగుతుంది రాజకీయ వ్యవహారాలలో మీ మనస్సునకు ఎలాంటి తృప్తి కలుగదు వస్తు వాహన సేకరణకు అనుకూలం స్త్రీలకు ఉద్యోగరీత్యా మేలు చేకూరుతుంది, ధనలబ్ధి

★ **ధనుస్సు** చేసిన పనినే చేయవలసి వస్తుంది అత్యవసరంగా ఒకానొక వ్యవహారం అనుకూలం కాగలదు అప్రయత్నంగా ఆదాయం కూడా చేకూరుతుంది స్థితియందు అంతో యింతో పెంపు చేకూరుతుంది ఆదాయాన్ని మించిన వ్యయం కూడా చెప్పదగిన అంశమే స్త్రీలకు వస్తు వాహనానుకూలతకు అవకాశమున్నది, గ్రహించాలి

★ **మకరం :** సర్వ విధాలా అనుకూల వారం వ్యాపార సంబంధంగా, వస్తు సేకరణకై దూర బారాలకు కొందరు ప్రయాణించవలసిన అగత్యమేర్పడుతుంది డబ్బు వస్తుంది శక్తి వంచన లేకుండా పాటు పడితే మేలు జరుగుతుంది గమనించాలి స్త్రీలకు సుఖ శాంతులు, విందు వినోదాలు, శుభ ప్రస్తావనలకు అవకాశం

★ **కుంభం :** ఏది చేయాలో ఏది మానాలో, ఏ వ్యాపారం లాభదాయకమవుతుందో తెలియక తికమక పడుతారు విద్యా సంస్థలయందు పని చేసేవారు, ప్రభుత్వ రంగాన పని చేసే వారికి అనుకూలం ఆదాయమందు వృద్ధి చేకూరుతుంది వివాహ యత్నాలు సానుకూలమయ్యే సమయం స్త్రీలకు సర్వానుకూల వారం

★ **మీనం .** ఇంట ఎధైనా అనానుకూలం జరుగవచ్చు ముఖ్య వస్తువులు సమయానికి కనిపించకపోవచ్చు ఒక వేళ దొంగతనం జరిగే అవకాశం కూడా ఉంటుందని గ్రహ స్థితి ఇతరులకు అప్పులివ్వటం, వసూలు కాకపోతే యిబ్బంది పడటం చెప్పదగిన అంశం స్త్రీలకు చక్కని కళా రంగావకాశాలు అనుకొన్న రీతిని ఆదాయం అవసరాలు తీరటం, ఉద్యోగ రీత్యా అనుకూలత కనిపించగల వారం.

-విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి

పడగనీడ!

వడ్లమన్నాటి కుటుంబరావు



మా ఎదురుగా ఇంట్లో ఉన్న భుజంగం అంటే అందరికీ హడల్! నల్లగా... లావుగా... చింతనిప్పుల లాంటి కళ్ళతో వికృతంగా ఉంటాడతను. అతను చూస్తుంటే నిలువునా కాలుస్తున్నట్టు.... మాట్లాడుతుంటే, అబోతు రంకేస్తున్నట్టూ.... ఉంటుంది. అతనేం చేస్తుంటాడో కుటుంబాన్ని ఎలా పోషిస్తుంటాడో ఎవరికీ తెలియదు. కానీ... అతని సంసారం సజావుగానే సాగిపోతూ ఉంది. పి.ఏ గారితో మంచిగా ఉంటే ఆఫీసరుగారి మంచితనాన్ని చూరగొన్నట్టే అన్నట్టుగా..... మా బజారులోని ఆడవాళ్ళంతా, శ్రీమతి భుజంగానికి నమస్కారాలు పెడుతూ.... కాకా పడుతుంటారు! దానికి మినహాయింపల్లా మా శ్రీమతి ఒక్కటే! "నువ్వు కూడా ఆమెతో కాస్త మంచిగా ఉంటే ఏం పోయింది? ఎదురూ బొదురూ ఇళ్ళు కదా? అన్నాను ఒకసారి. దాంతో – పరిపూర్ణ వ్యక్తిత్వం కల నా అర్ధాంగి తారాజువ్వలా లేచింది నా మీదకు. "అలా అని బెదురు పెడుతున్నారా? దానికి... ఆఫ్ట్రాల్ ఓ గూండాగాడి పెళ్ళానికి.... చెంచాగిరీ చెయ్యవలసిన అవసరం నాకు లేదండి" 'పోనీలే!' అని ఊరుకున్నాను.

ఆ రాత్రి మా బజారులోకి దొంగొకడొచ్చాడు. మా పక్కింట్లో దూరి సామానులు సవరిస్తుండగా వాళ్ళకి మెలకువ వచ్చి కేక లేశారు. ఇక చూడండి! భుజంగం– తన యింట్లోంచి ఆ యింట్లోకి పరుగెత్తి దొంగని దొరక పుచ్చుకుని చెప్పుతీసి చొంగ కారేలా కొట్టాడు! దొంగ గిలగిలలాడి పోయి భుజంగం కాళ్ళు పట్టేశాడు రక్షించమంటూ "నాయాల! మళ్ళీ ఎప్పుడన్నా ఈ బజారుకొచ్చావో? ఎముకల్లో సున్నం లేకుండా విరగ్గొడతాను!" అన్నాడు గర్జిస్తూ.

మీరుండగా ఈ చాయలకే రానంటూ పలాయన మంత్రం చిత్తగించాడు దొంగ!

అందరూ భుజంగాన్ని మెచ్చుకున్నారు. నేను కూడా! "చాలా మంచి పని చేశాడు కదూ!" అన్నా నేను లోపలికొచ్చిన తరువాత మా ఆవిడతో.

"ఆఁ! పోదురూ! పడగనీడ! ఏ క్షణం,

ఎటుపడుతుందో ... ఏమవుతుందో తెలియదు ఏదన్నా తగాదా వస్తే. .. ఆ దొంగాణ్ణి చితక బాధినట్టు మనల్ని కూడా చితక బాదుతాడు' అందుకని మనం వాడికి అంటీ ముట్టనట్టుగా దూరంగా ఉండాలి!" అంది

నేనేమీ జవాబు చెప్పకుండా ఊరుకున్నాను

ఓ వారం రోజుల వరకూ ప్రశాంతంగానే ఉంది మా బజారు

తరవాత ఒక బాధాకరమైన సంగతి జరిగింది అది నా మనసు కలిచివేసింది.

మా అబ్బాయి. . భుజంగం కొడుకు ఇద్దరూ ఒకే స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్నారు .

ఆటల్లో ఏదో పేచీ వచ్చి- మా అబ్బాయిని ముక్కుమీద కొట్టాడు భుజంగం కొడుకు అసలే పీలగా ఉంటాడేమో- మా వాడు, ఆ దెబ్బకి గింగిరాలు తిరిగిపోయాడు. ముక్కునించి రక్తం కారుతుండగా పరుగెత్తుకుంటూ వచ్చి మా ఆవిడతో చెప్పాడు జరిగిన సంగతి. "మా నాన్న పెద్ద రౌడీ తెలుసా! నాతో పెట్టుకుంటే నీ పని ఖాళీ! అన్నాడు మమ్మీ' అని కూడా చెప్పాడు 'పోనీలే పోనీ! వాళ్ళతో మన కెందుకు గొడవ!" అని సర్దెయ్య బోయాను నేను

కానీ మా ఆవిడ ఊరుకోలేదు వీరనారిలా లేచి ఉద్రేకంతో ఊగిపోయి చకచకా మా వాడ్ని తీసుకెళ్ళి భుజంగం భార్యకి చూపించి..' ఎంత రౌడీగాడి కొడుకయితే మాత్రం! ఇంత అన్యాయంగా రక్తం కారేలా కొడతాడా?' అంది ఆవేశంగా


అదుగో! ఆ మాటతో నిప్పురాజుకుంది అసలే భుజంగం భార్యకి లోలోపల నా భార్యమీద కసిగా ఉందేమో ఒక్క పెట్టున విరుచుకు పడిందామె

"ఏమిటే? మా ఆయన్ని రౌడీ అంటావా! రానీ! ఆయనతో చెప్పి. నీ పని పట్టిస్తాను!" అంటూ హుంకరించింది

ఇదేమిట్రా బాబూ! కథ ఇలా అడ్డం తిరిగింది అనుకుంటూ కంగారు పడిపోయిన నేను చటుక్కున వెళ్ళి మా ఆవిణ్ణి రెక్కపుచ్చుకు లాక్కొచ్చాను

ఆవేశంలో అన్నదేగానీ . లోపలికి రాగానే మా

(21 చుక్కలు ప్రక్క చుక్కలు ఒకటివరకు)



గులాబీల ముగ్గు
సి.హెచ్. రంగవల్లి , మండపేట

పడగ నీడ!

ఆవిడ కూడా కంగుతినేసింది "తొందరలో నోరు జారానండీ! ఆ గూండా ముండావాడు రాగానే ఏ ఆపద రానున్నదో ఏమిటో ." అంటూ హడావిడిగా మా వాడికి గృహ వైద్యం చేసి ఇద్దరం బిక్క బిక్కుమంటూ కూర్చున్నాం హాల్లో

నా గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నయ్ భుజరిగం రాగానే ఏం చెప్పాలో... ఏం చెయ్యాలో అర్థం కావటంలేదు

అప్పుడే ఒకరిద్దరు అమ్మలక్కలు మా ఆవిడ దగ్గరకొచ్చి ఓదారుస్తూ అన్నారు "ఇంకా నువ్విక్కడే ఉన్నావా తల్లీ! వెంటనే బస్సెక్కి మీ ఊరెళ్ళిపో! వాడు రాగానే. . బార్య నోటి వెంట జరిగిన సంగతి వినగానే ఇంకేమన్నా ఉందా? ప్రతిఘటన సినిమాలో ఆ రౌడీగాడు విజయశాంతిని చేసినట్టు చేస్తాడు ఊఁ వెంటనే బయలుదేరు! అన్నయ్య గారూ మీరన్నా చెప్పండి త్వరగా'

ఆ మాటలకి మా ఆవిడ ఏడుపు లంకించుకుంది నాకూ లోలోపల గుండె పీచుమంటోంది "దాన్నేం చేస్తాడో నన్నేం చేస్తాడో?" ఊహించుకుంటున్న కొద్దీ గుండెలు తల్లడిల్లిపోతున్నయ్!

మా ఆవిడ్ని పుట్టింటికి పంపటమే మంచిదని నిశ్చయించుకుని త్వరగా రడీ అవ్వమన్నాను ఆమె ఆ సన్నాహంలో ఉంది

కొన్ని క్షణాలు గడిచినాయేమో! ఈలోపుగా భుజంగం రిక్షాలో తన యింటి ముందు దిగటం... స్రరున లోపలికెళ్ళటం జరిగిపోయింది అది చూసి గుండెలదిరి పోయిన నేను ఇప్పుడు మా ఆవిణ్ణి బయటకు తీసుకెళ్ళటం క్షేమం కాదనుకుని... పంటింట్లో దాక్కొని తలుపులు వేసుకోమన్నాను మా అబ్బాయిని తీసుకుని అలాగే చేసిందామె నేను మనసులో సమస్త దేవుళ్ళకి పేరు పేరునా మొక్కుకున్నాను ఎలాగైనా ఈ గండం నుంచి కాపాడి గట్టెక్కించమని ఇరుగు పొరుగువారు కొంతమంది బాధగా మరి కొంతమంది ఆసక్తిగా కిటికీల దగ్గర చేరారు ఏం జరగబోతోందో చూద్దామని

ఏయ్ పంతులూ! బయటికిరా! అని భుజంగం సింహ గర్జన

నవనాడులూ కుంగిపోగా ఎలాగో గుండెలు బిక్క బట్టుకుని . బితుకు బితుకుమంటూ బయటికొచ్చాను వేసుకున్న బనీను సగభాగం చెమటతో తడిసి పోయింది


'అదికాదు భుజంగంగారూ! అసలేం జరిగిందంటే " అతన్ని శాంతింప జేయటానికి ప్రయత్నించాను


నా కంతా తెలిసింది


నీ పెళ్ళాన్ని ముందు బయటికి రమ్మనమను' హుంక హుంకరించాడు

హత విధీ! అయిపోతోంది నా పరువు నడి బజార్లో కలిసి పోబోతోంది కొన్ని క్షణాల్లో ఏం చేయలేని అశక్తుణ్ణి నేను

'పిలు' తొరగా గట్టిగా అరిచాడు లోపలికెళ్ళి తలుపుతట్టి మా ఆవిణ్ణి పిలిచాను వణికి పోతూ రానంది 'రానంటే వాడు ఇంట్లోకి జొరబడి తలుపులు పగలగొట్టి నానా గందరగోళం చేస్తాడు ఎలాగోలా ధైర్యం చేసుకుని దేవుడిమీద భారం ఉంచి బయటికిరా! ఇంతమంది జనం ఉన్నారుగదా ఊరుకుంటారా!" అన్నాను నేను సగం







"యూఎల్ఐపి ఇచ్చినంత మరి ఏ ఇతర పెట్టుబడి పథకమూ ఇవ్వదు"

శ్రీ సి.పి.కె.ఎస్. నందనన్
—మధురా కోట్స్‌లో ఉన్నతాధికారి

యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాను మీకు రూ. 3,000 నుండి 40,000 దాకా పెట్టుబడి పెట్టే అవకాశాన్నీ, ప్రమాదాలనుంచీ భీమా, జీవిత భీమా రక్షణనూ, కాలపరిమితి ముగిసిన తరువాత 7.5% వరకూ బోనస్‌నూ, ఇంకా ఐటి అక్టు 80C ప్రకారము పూర్తి ఆదాయపు పన్ను మినహాయింపును కలుగజేస్తుంది.

సభ్యత్వమునకు వయస్సు అర్హత 50 సం॥లకు పెంచబడినది.

రూ. 40,000 గరిష్ఠ మొత్తానికి ఏటా రూ. 4,000 చెల్లించటంద్వారా, 10 సంవత్సరాల తరువాత మీరు సుమారు రూ. 65,000 మొత్తాన్ని పొందగలరు.

యుఎల్ఐపి మీ కుటుంబానికి రక్షణ కల్పిస్తే, యుఎల్ఐపి వెనుకనున్న యుటిఐ మీ పెట్టుబడి మొత్తమునకు రక్షణ కల్పిస్తుంది.

అందుకే సరైన నిర్ణయంతీసుకోండి. ఈ రోజే మీకు దగ్గరలో ఉన్న ఏ కెనరా బ్యాంకు శాఖ వారినిగాని లేదా యూనిట్ ట్రస్టు ఏజెంటు లేదా ముఖ్య ప్రతినిధులను కలవండి.

—ఇతర వివరాలకు ఈ కూపను పోస్టుచేయండి.

Unit Trust of India, Post Bag 5063, Madras - 600 001.
Please send me the free ULIP brochure
Name: ______________________
Address: ______________________
____
____
19

యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా

హెచ్.ఓ. బొంబాయి-400 020.
(ఒక పబ్లిక్ సెక్టార్ ఆర్థిక సంస్థ)

రీజనల్ ఆఫీసు: రెజినామాన్షన్, 46. 2వ లైను బీచి, మద్రాసు-600 001 ఫోను: 27433, 24146
విజయవాడ ఆఫీసు: 27-11-6బి మేరీస్ట్రీట్, గవర్నరుపేట విజయవాడ-520 002, ఫోను: 63964

ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య ప్రతినిధులు:
శ్రీ కె.బి. తిలక్, గుంటూరు. ఫోను: 24964, 31839 ● శ్రీ వై. సోమసుందరరావు, తణుకు. ఫోను: 2440 ● శ్రీ సి. నారాయణస్వామి, విశాఖపట్టణం. ● శ్రీ ఎస్. వీరరాఘవులు, గుంటకల్లు. ఫోను: 579 ● శ్రీ వి.ఆర్. కృష్ణారెడ్డి, కడప. ఫోను: 2766 ● శ్రీ కె.వి. కోటవీరయ్య, తిరుపతి ఫోను: 3004 శ్రీ పి. వెంకటరమణ, కాకినాడ. ● శ్రీ ఎ. సత్యనారాయణ, నెల్లూరు.

యుఎల్ఐపి సకలమూ ఉన్న పథకం

Sista's - UTI.639.86 TE A

దీపావళి కథలపై వ్యాసరచన పోటీలో రెండవ బహుమతి రు. 150/-పొందిన వ్యాసం

మంచులాంటి మంచి మనసుకి ప్రతిబింబం

ఈ సంవత్సరం దీపావళి కథల పోటీలో ఎన్నికైన ఆరు కథలలోనూ అక్షరక్రమంలో ఆరవదైనా నాకు నచ్చిన క్రమంలో, నేను మెచ్చిన క్రమంలో మొదటి కథ "శిఖరం మీద'

'శిఖరం మీద' నిజానికి చెప్పాలంటే ఒక కథ కాదు ఇది ఒక సగటు తండ్రి మంచులాంటి, మంచి మనసుకు ప్రతిబింబం పట్టాభి రెండవ కొడుకు రామ్మూర్తికి తండ్రంటే ప్రేమ వుంది తండ్రిని సుఖ పెట్టాలనే తపన వుంది మామగారి మనస్సు నొప్పించకుండా ఆయన వృద్ధాప్యంలో అన్నీ అమర్చి పెట్టాలనే అభిమానం వున్న మనిషి చిన్న కోడలు శారద 'నువ్వెక్కడే ఇంచక్కా మా దగ్గరే వుండిపో తాతయ్యా' అని ఆప్యాయంగా అభ్యర్థించే మనుమలు అన్నీ అమర్చిన వడ్డించిన విస్తరిలాంటి సంసారం చిన్న కొడుకుది అయినా పట్టాభి ఆ పాలరాతి బాత్ రూముని, ఇంద్ర భవనం లాంటి ఇంటిని, వెన్న చిలికిన మజ్జిగను, గడ్డ పెరుగును అన్నిటినీ కాదని, సమస్యల బుట్ట నెత్తికెత్తుకొని సహనం చెప్పుల జతలో బతుకీడుస్తున్న తన పెద్ద కొడుకు 'చలపతి' ఇంటికే చేరిపోయాడు చివరికి ట్యూషన్లు చెప్పి నాలుగు రాళ్ళు సంపాదించి, పెద్ద కొడుకు సంసారానికి తోడు కావటంలో వున్న ఆనందం మరెందులోనూ లేదనిపించింది ఆ మహా మనిషికి నిజంగా పట్టాభిగారు 'శిఖరం మీద' చిరంజీవే! ఈ కథలో ఏముంది అని అడిగితే ఏం చెప్పాలి? జీవితం వుంది అందుకే ఈ కథ నిజంగా సాహిత్య శిఖరం మీద నిలిచేదిగా వుంది

ఆరు కథల్లోనూ రెండవస్థానం 'ఆ తృప్తి చాలు సామీ!' కథది అమ్మా ఆకలవుతోంది ఓ ముద్ద పెట్టరూ అంటూ తనను దీనంగా అర్థించిన 'ఓబులు'కు ముద్దతో పాటు, ముద్దూ మురిపెం కూడా పెట్టి కన్న తల్లిని మరిపించింది పిల్లా పాపా లేని సరస్వతి తండ్రి కాకపోయినా తండ్రిలాగే 'ఓబులేసు'ను తన ఒడిలోకి తీసుకున్నాడు ఎర్రమనాయుడు అయినా అతడిలో ఏమూలో దాగివున్న స్వార్థం ఓబుళేసు కడసారిగా కన్న తల్లిని చూసుకునే భాగ్యాన్ని కాలరాచింది అయినా తల్లి కాని తల్లి 'సరస్వతి'కి తాను దాచిన డబ్బుతో ఆపరేషన్ చేయించి ఆమెలోనే తన తల్లిని చూసుకున్నాడు ఓబుళేసు. ఓబుళేసు వ్యక్తిత్వం ముందు ఎర్రమనాయుడు చలి చీమ కంటే చిన్నవాడనిపించాడు మహోన్నతమైన మానవత్వం ముందు ఎంతటివారైనా చివరకు తలవంచాల్సిందే అని చెబుతుంది ఈ కథ ఈ కథా రచయిత(త్రి) ఎక్కడైనా ఎదురైతే "మీ కథ చదివాను ఎంతో బాగుంది పాఠకునిగా నాకీ తృప్తి చాలు సామీ!"- అని భక్తితో నమస్కరించాలనిపించేటంత ఉన్నతంగా వుంది ఈ కథ

నాకు నచ్చిన మూడవ కథ నామకరణం" నేటి కాలంలో అనసూయ బ్రోతల్‌హౌస్ నిర్వహిస్తుంది 'భీముడు' పేరు గల మనిషి గాలికి ఎగిరిపోయేంత బలహీనంగా వుంటున్నాడు 'సుందరి' అంద విహీనంగా వుంటూంది. అయితే ఈ కథలో శివ కామేశ్వరమ్మగారు నామకరణం చేసిన సీతాలు, బాల గోపాలం ఆ పేరుకు తగ్గ సార్థకతను సాధించారు చివరకు ఆమె తన ముని మనుమరాలికి 'కరుణ' అని పేరు పెట్టడంతో కమ్మగా ముగుస్తుంది కథ పేరులో ఏముంది అని తేలిగ్గా ఆలోచించకపోతే ఆ పేరు వెనుక ఆ పేరు పెట్టినవారి పెద్ద మనసు కనిపిస్తుంది ఈ కథలో చివరకు శివ కామేశ్వరమ్మగారి పేరు వెండితెరమీద కూడా కనిపించబోతూందని చెప్పటం కొండంత సంతృప్తిని కలిగిస్తుంది

ఇక నాకు నచ్చిన నాల్గవ కథ 'మాయ' 'సుమ తనకు కావాలనీ, ఆమెను తన దానిగా చేసుకోవాలని ఆశించాడు 'వంశీ' కాని 'సుమ' అకాల మరణం అతనిలోని కోరికను చంపి విరక్తిని కలిగిస్తుంది కాని కోయ యువతి తన దాహం తీర్చగానే, ఆమెలోని అందాలు చూసి అతనిలో మళ్ళా కోరిక తలెత్తుతుంది నిజమే ఇదంతా ఒక మాయ ఈ కథలో వేపకాయంత వేదాంతం వుంది ఆ వేదాంతం వెనకాల మానవ బలహీనత, పురుష ప్రవృత్తి తీలగా దర్శన మిస్తాయి బస్సు ఏక్సిడెంట్‌ను పాఠకులు ముందే ఊహిస్తారు తన రచనా విధానంలో ఒక 'మాయ'ను చొప్పించి దీనిని మంచి కథను చేశారు రచయిత(త్రి)

ఇక అయిదవ కథ 'బుద్ధుడు పుట్టిన భూమిలో' నేడు మనిషి మరో మనిషిని నడి రోడ్డుమీద పట్ట పగలు చంపుతున్నాడు ఇట్లాంటి సమాజంలో భూత దయకు రవ్వంత చోటు లేదు అయినా రాఘవుడు ఓ మూగ జీవాన్ని బలి నుంచి రక్షించబోయి రెడ్డిగారి మునికోల దెబ్బలకు గురయ్యాడు. ఈ కథలో రాఘవుడు పట్ల మూగజీవిపట్ల కలగవలసిన సానుభూతి ముత్యాలమ్మ తిరుణాల హోరులో కలిసి పోయింది.

ఇక చివరి కథ బరువు - బాధ్యత చెల్లెలి సంసారాన్ని సరిదిద్దటం అన్నకు బరువు. కూతురు సంసారాన్ని సరిచేయటం తండ్రికి బాధ్యత ఈ విషయాన్ని చెప్పబోయి, మరేదో చెప్పి తాను కన్‌ఫ్యూజ్ అయి, పాఠకులను కన్‌ఫ్యూజ్ చేశారు రచయిత(త్రి) ఈ కథలో ఊహ మంచిదే! అయితే దానికి ఊపిరి పోయలేకపోవటం ఈ కథలోని లోపం. అంద వికారమైన చట్రంలో బిగించిన ఒక అందమైన బొమ్మ ఈ కథ.

వక్కలంక రామారావు

చచ్చి

పులి గుహలోకి ప్రవేశిస్తున్న లేడిపిల్లలా బయటికొచ్చింది మా ఆవిడ ఆమె వెనుక ఏడుస్తూ మా అబ్బాయి' ఆ పని బయటికి చెయ్యలేని నేను"

ఇప్పుడు భుజంగం పక్కన అతని భార్య, కొడుకు కూడా ఉన్నారు

'హే! భగవాన్' ఏం జరగబోతుందిప్పుడు' నా మనసు మూగగా రోదిస్తోంది గుండెనెవరో పట్టిపిండుతున్నట్టుంది

ఇంకాస్త ముందుకురా' నా భార్యని శాసించాడు

ఎందుకు అంటూ వణికి పోతూ ఒక్కడుగు ముందుకేసింది

అంతే!

పడగ నీడ!

మరు క్షణంలో భుజంగం– అతని భార్యను నా భార్య కాళ్ళ మీద పడేలా అతని కొడుకును మా అబ్బాయి కాళ్ళమీద పడేలా తోశాడు

ఎవరూ ఊహించని ఆ సంఘటనకి ప్రాన్పడిపోయాను నా శ్రీమతి పరిస్థితీ అలాగే ఉంది విషాదంలో ఆనందం ఎంత విచిత్రం!

పంతులూ! మా అబ్బాయి తరపున దీని తరపున మీ భార్యా భర్తలిరువురూ నన్ను క్షమించండి ఇంకెప్పుడిలాంటి పొరపాటు జరగనియ్యను రౌడీగాడన్న ముద్ర పడి నా బతుకెలాగూ చెడి పోయింది రౌడీగాడి కొడుకు రౌడీగాడి పెళ్ళాంలా ఈ లిద్దరూ బతకటానికి ఈల్లేదు జనాలమీద జులుం చెలాయిస్తే నేనూరుకోను వస్తా!

పదండెహె!"అన్నాడు భార్యని కొడుకునుద్దేశించి

చిన్నబోయిన ముహంతో, అతని భార్య ఆమె వెనకాలే అతని కొడుకు ఇంట్లోకి వెళ్ళిపోయారు

నా భార్య అప్రయత్నంగా చేతులు జోడిస్తూ గద్గదికంగా అంది– భుజంగం ఈ రోజునుంచి నాకు అన్నయ్యలాంటివాడు అతనిది పడగనీడకాదు భద్రమైన గొడుగునీడ"

నేను కూడా అతని గొప్ప మనసుకి లోలోపలే జోహారు లర్పించుకున్నాను అతన్ని తప్పుగా అంచనా వేసుకున్నందుకు విచారించాను

ఇదేమి అర్థంకాని మా అబ్బాయి తెల్లముఖం వేసుకుని చూస్తూ ఉండిపోయాడు □

రీటా

తక్కువ తలనూనెల కంటె ఎక్కువ వచ్చి మీకు డబ్బు ఆదా చేయును

ఒక సీసా రీటా 20 ML 5 నుంచి 10 రెట్లు కొబ్బరి లేక ఆవ లేక నువ్వుల నూనెలో కలిపినచో ఈ విధముగా వచ్చును

రీటా	20 ML
వేరే నూనె 5 రెట్లు	100 ML
కలిపిన తరువాత మొత్తం	120 ML
లేక	
రీటా	20 ML
వేరే నూనె 10 రెట్లు	200 ML
కలిపిన తరువాత మొత్తం	220 ML

నేడే ఒకసీసా కొనండి ప్రతిచోటా దొరకును



స్త్రీలూ పురుషులూ వాడవచ్చును

రీటా మీ కేశ సంపదకు

86/3

సీరియల్

ఆరోహణ

శైలకుమార్



(గత సంచిక తరువాయి)

మరుసటి రోజు ఉదయాన్నే వాళ్ళనీ వీళ్ళనీ అడుగుతూ అతికష్టం మీద నాగార్జున నగర్‌లో వున్న డైరక్టర్ సత్యం ఇంటికి వెళ్ళాడు చక్రవర్తి. విశాలమైన కాంపౌండుతో చాలా పెద్ద ఇల్లు అది అప్పటికే మూడు కార్లు నిలిచి వున్నాయి ఇంటి ముందు

తన రచనలను జాగ్రత్తగా పట్టుకుని భయం భయంగా ఇంటి గేటు తీసుకుని లోపలికి అడుగు పెట్టాడు. పెద్ద వరండా. పది పన్నెండు కుర్చీలు వేసి వున్నాయి.

ఓ అబ్బాయి ఎదురొచ్చాడు చక్రవర్తికి.

"డైరక్టర్‌గారున్నారా" అడిగాడు చక్రవర్తి బిడియంగా.

"ఉన్నారు మీరెవరు?"

"వారిని కలుసుకోటానికి వచ్చాను" వివరాలు చెప్పకుండా అన్నాడు.

"కూర్చోండి మాట్లాడుతున్నారు."

కూర్చున్నాడు చక్రవర్తి. అభ్యుదయ భావాలతో సినిమాలు తీసే సత్యం తనకు తప్పకుండా అవకాశం ఇస్తాడు అనుకున్నాడు. మొదటి సినిమాలోనే తన ప్రతిభ అంతా చూపించాలి అందరూ మెచ్చుకునేట్లు రాయాలి

అరగంట గడిచింది. లోపల నుంచి ఎవరో ఇద్దరు బయటికి వచ్చారు వాళ్ళతో పాటు బయటికి వచ్చాడు సత్యం

కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు చక్రవర్తి.

"అలాగే తప్పకుండా పదిహేను పైన డేట్సు ఇచ్చేట్లు చూస్తాను అని నవ్వుతూ వాళ్ళను సాగనంపాడు సత్యం

"నమస్తే సర్" అన్నాడు చక్రవర్తి

'నమస్తే" అన్నాడు సత్యం పట్టించుకోకుండా

జరిగిన కథ–6: ఆఫీసులో హేళనలకు గురవుతూ మనశ్శాంతికోసం కపిలతీర్థం వెళ్ళిన చక్రవర్తికి నీలిమ పరిచయమవుతుంది నీలిమతో సాన్నిహిత్యాన్ని చక్రవర్తి శాశ్వతం చేసుకోవాలనుకుంటాడు. నీలిమకు పెళ్ళయిందనీ, భర్తకు ప్రమాదంలో కాళ్ళుపోయాయని తెలిసి హతాశుడవుతాడు ఆ నిరాశలో తిరుపతి వదిలి మద్రాసు వెళతాడు. మద్రాసు సినిమా రంగంలో చక్రవర్తికి కొత్త అనుభవాలు ఎదురవుతుంటాయి.

వాళ్ళు కారెక్కిన తరవాత ఇంట్లోకి వెళ్ళిపోయాడు సత్యం మరో అరగంట తరువాత కాని ఆయన బయటికి రాలేదు

"సార్" అన్నాడు చక్రవర్తి

ఆగి చక్రవర్తి వైపు తిరిగి ఎవరీ కొత్త ముఖం అన్నట్లు చూశాడు సత్యం మొహంలో భయం, చేతిలో ఫైలు చూడగానే అర్థమైంది ఆయనకు వేషం కోసమో మరిదేని కోసమో వచ్చాడని

'ఏమిటి" అన్నాడు హుందాగా.

"మీతో కొంచెం మాట్లాడాలి "

ఎగాదిగా చూశాడు చక్రవర్తిని సత్యం.

"చూడండి షూటింగ్ కెళుతున్నాను వీలైతే స్టుడియోకి రండి బ్రేక్‌లో మాట్లాడుకుందాం అని సమాధానం కోసం కూడా చూడకుండా వెళ్ళి కారులో కూర్చున్నాడు సత్యం కారు కదిలింది

షూటింగ్ ఎక్కడండి" గేటు వేసుకోవటానికి వచ్చిన అబ్బాయిని అడిగాడు చక్రవర్తి

'ఏ.వి ఎమ్.సెకండ్ ఫ్లోర్‌లో '

ఏ. వి ఎమ్. స్టుడియో వైపు నడక సాగించాడు చక్రవర్తి అతనికి మద్రాసుతో పెద్దగా పరిచయం లేకపోవటం వల్ల చాలా ఇబ్బందిగా వుంది తమిళ భాష కూడా రాకపోవటంతో ఎవరినైనా అడగటానికి వాళ్ళు చెప్పింది అర్థం చేసుకోవటానికి కూడ కష్టంగా వుంది.

నడుచుకుంటూనే స్టుడియో చేరుకున్నాడు స్టుడియో ముందు భాగంలో గ్లోబ్ ఆకారంలో వున్న దానిపై ఎ. వి. ఎమ్. అన్న ఇంగ్లీషు అక్షరాలు చూసే సరికి ప్రాణం లేచి వచ్చింది చక్రవర్తికి

లోపలికి వెళ్ళబోతున్న చక్రవర్తిని ఆపాడు గూర్ఖా

క్యాహోనా కర్కశంగా వుంది అతని కంఠం

"సత్యం గారిని కలవాలి

"ఏ సత్యం."

"డైరక్టరు గారు ".

"పర్మిషన్ లెటరుందా "

దిగులుగా చూశాడు చక్రవర్తి గూర్ఖా మొహంలోకి.

"లేదు కాని ఆయన రమ్మన్నారు.'

"నై నై ఆయన మాకు చెప్పలేదు '

హారను మ్రోగించుకుంటూ ఒక పెద్ద కారు గేటు దగ్గరకి వచ్చింది. చక్రవర్తిని పక్కకి లాగి కారులోని వ్యక్తికి సెల్యూట్ చేశాడు గూర్ఖా కారులోకి తొంగి చూశాడు చక్రవర్తి తెలుగు సినిమా ప్రపంచాన్ని ఎదురు లేకుండా ఏలుతున్న హీరో 'సాగర్' కూర్చుని వున్నాడు వెనక సీటులో హుందాగా

కారు లోపలికి వెళ్ళిపోయింది

"ఆయన నన్ను రమ్మన్నారండీ కావాలంటే ఎవరినన్నా పంపించి తెలుసుకోండి" తిరిగి గూర్ఖా వైపు తిరిగి అన్నాడు చక్రవర్తి

అరె నై నై జావ్' చక్రవర్తి మాటల్ని పట్టించుకోలేదతను

చేసేది లేక వెనక్కి తిరిగాడు చక్రవర్తి సాయంత్రం సత్యంను కలుసుకోవచ్చు అనుకుంటూ నడుస్తున్న అతనికి 'విజయా గార్డెన్స్' అన్న పెద్ద పెద్ద అక్షరాలు కనిపించాయి ఆగి చూశాడు విశాలమైన గేటు, గేటుకు ప్రక్కగా గూర్ఖా కనిపించారు నిట్టూర్పు కదిలాడు చక్రవర్తి

దారిలో నే అతనికి 'విజయ - వాహిని' స్టుడియో కనిపించింది బయటి నుంచే దాన్ని పరిశీలనగా చూశాడు

ఇలా ఈ స్టుడియో గేట్లు ముందు ఎంవరు ప్రముఖ నటీనటులు, రచయితలు తమ తొలి దినాలలో నిలబడ్డారో, ఎందరు కళాకారులు ఈ గేట్లు ముందు నిలబడి జీవితాలను పణంగా పెట్టారో, ఎందరు ఈ గేట్లు ముందు రంగు రంగుల కలలు కన్నారో, ఎందరు ఈ మృగ తృష్ణలో నీరు త్రాగాలని ప్రయత్నించి బతుకులు బలి చేసుకున్నారో అనుకున్నాడు

ఆ సాయంత్రం నాలుగు గంటలకే సత్యం ఇంటి ముందుకు వచ్చి నిలబడ్డాడు చక్రవర్తి సాయంత్రం ఆయన ఖాళీగా వుంటాడని అతని ఉద్దేశం

ఆరు గంటల ప్రాంతంలో డైరక్టర్ సత్యం కారు వచ్చి ఇంటి ముందు ఆగింది ఆయన ఇంటిలోకి వెళ్ళిన పది నిమిషాలకు లోపలికి వెళ్ళాడు చక్రవర్తి

ఎరండాలోకి వచ్చిన సత్యం చక్రవర్తిని చూడగానే విసుగ్గా మొహం పెట్టాడు.

"కూర్చోండి' అన్నాడు తప్పదన్నట్లు కూర్చుని తన పేరు, వివరాలు చెప్పాడు చక్రవర్తి

'ఏం కావాలంటారు

"సినిమాకు వ్రాయటానికి తమరు ఏదైనా అవకాశం కల్పించాలి "

ఏం రాయగలరు

కథ, మాటలు, పాటలు ఏమైనా రాయగలను సార్ తన రచనల ఫైలు సత్యం చేతికి అందించాడు చక్రవర్తి

ఇవన్నీ నా రచనలు సార్ తమరొక సారి చూడండి '

అసహనంగా ఆయన నాలుగైదు పేజీలు తిప్పాడు ఏవీ వివరంగా చూడకుండా ఆయన విపులంగా చూస్తాడనుకున్న చక్రవర్తికి ఆశాభంగమైంది

ఫైలు మూసి చక్రవర్తికి అందించాడు

తమరు ఎలాగైనా అవకాశం కల్పించాలి సార్" వినయంగా అన్నాడు

'అవకాశాలంటే అంత తేలిగ్గా వస్తాయేమిటయ్యా' దానికి ఎంతో కృషి వుండాలి అంత సులభమనుకున్నావా సినిమాకి రాయటం



ఆరోహణ

"అవకాశం ఇస్తే శాయశక్తులా ప్రయత్నిస్తాను సార్. నచ్చితేనే తీసుకోండి '

"నచ్చటం నచ్చక పోవటం కాదు లక్షలతో వ్యాపారం చేసే ప్రొడ్యూసరు కొత్త వాళ్ళతో రిస్క్ చెయ్యలేదు మీకా వర్క్ తెలీదు తీరా పెట్టుకున్నాక మా ప్రాణం తీస్తారు" విసుగ్గా అన్నాడు సత్యం

"మీరే అట్లా అంటే ఎలా సార్ "

"ఔనయ్యా ఏం చేస్తాం మార్కెట్ లేని వాళ్ళను పెట్టుకుంటే సినిమాకి ఫైనాన్స్ ఎవడు చేస్తాడు అక్షరాలు దిద్దటం సరిగ్గా రాక ముందే ఆబగా వస్తున్నారు మద్రాసుకు" లేచాడు సత్యం లోపలికి వెళ్ళటానికి

హృదయంలో గాయం చేసి ఆ గాయాన్ని ముల్లుతో కెలికినంత బాధ కలిగింది చక్రవర్తికి ఆ మాటల వల్ల

ఇంతలో గేటు తీసుకుని ఓ వ్యక్తి లోపలికి వచ్చాడు ఇరవై రెండేళ్ళ వయసు వుంటుంది అతనికి అందంగా వున్నాడు

"మాట్లాడాను సార్ రేపు ఉదయం మీకు ఫోన్ చేస్తానంది" అన్నాడు వచ్చిన వ్యక్తి సత్యంతో

"అలాగా" అంటూ చక్రవర్తి వైపు తిరిగాడు సత్యం

రేపు వారం కనిపించండి ఏమైనా వీలుంటే చూద్దాం."

తల ఊపాడు చక్రవర్తి

కొత్త వాళ్ళు పరిశ్రమకు రావాలని, తాను కొత్త వాళ్ళకు ఎంతో ప్రోత్సాహం ఇస్తానని ఎన్నో పేపరు స్టేటుమెంట్లు ఇచ్చిన ఆ అభ్యుదయ దర్శకుడు అలా మాట్లాడతాడని చక్రవర్తి ఊహించలేదు

మొదట కలిసిన వ్యక్తే ఇలా మాట్లాడాడే అన్న బాధ కలిగింది

రోడ్డు మలుపు తిరుగుతూ వుండగా ఎవరో పిలచినట్లయి ఆగాడు చక్రవర్తి. ఇందాక సత్యం ఇంటి దగ్గరకు వచ్చిన వ్యక్తి.

"హలో మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుగా వుంది "


"నేను మద్రాసు వచ్చి రెండు రోజులే అయింది "

'అలాగా వేషాల కోసమేనా' నవ్వుతూ అడిగాడు అతను

"కాదండి నేను రైటర్ని

'కాని మీ బాడీ మీ ఫేసు చూసి వేషం కోసమేమో అనుకున్నాను" నవ్వాడు చక్రవర్తి. కించిత్తు గర్వం కలిగింది అతనికి.

"రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం బైది బైనా పేరు శశాంక" పరిచయం చేసుకున్నాడు అతను.



తన పేరూ చెప్పాడు చక్రవర్తి ఇద్దరూ రోడ్డును ఆనుకుని వున్న టీ బంకులో కూర్చున్నారు

అంటే చక్రవర్తి పేరు మీద వచ్చిన కథలన్నీ మీరు రాసినవే అన్నమాట అన్నాడు శశాంక నిజానికి అత నెప్పుడూ చక్రవర్తి పేరు వినలేదు

ఔనండీ అన్నాడు చక్రవర్తి గర్వంగా మద్రాసులో కూడ తనని ఒకరు గుర్తు పట్టినందుకు ఆనందం కలిగింది

"మీలాంటి వాళ్ళు ఇండస్ట్రీకి రావాలండి అప్పుడే ఇది బాగు పడుతుంది. పాత వాళ్ళ పుచ్చు డైలాగులతో చచ్చిపోతున్నా మనుకోండి

సిగరెట్ వెలిగించి చక్రవర్తికి ఆఫర్ చేశాడు శశాంక

"ఈ విషయం కోసమేనా సత్యంగారి దగ్గరకి వచ్చారు

'ఔనండీ కాని ఆయన చాలా బాధ కలిగించేలా మాట్లాడాడు "

"కొత్త వాళ్ళంటే వీళ్ళలాగే మాట్లాడతారు ఒకప్పుడు తామూ ఇండస్ట్రీకి కొత్త వాళ్ళమని, ఎన్నో బాధలు పడ్డామని మర్చిపోతారు అయినా మీకో సలహా సినిమా వాళ్ళ నెప్పుడూ సాయంత్రాలు మాత్రం కలవకండి' నవ్వుతూ చెప్పాడు శశాంక

"ఎందుకు?

"పగలంతా పని చేసి అలసిపోయి వుంటారా సాయంత్రం అయ్యేసరికి మందు కొట్టడానికో లేక ఏ ఆడదాని దగ్గరకో బయలుదేరుతూ వుంటారు అప్పుడు ఎవరైనా వెళ్ళారా ఇక అంతే చిరాకంతా వాళ్ళ మీద చూపిస్తారు

'అందరూ అంతే నంటారా" అనుమానంగా అడిగాడు చక్రవర్తి

"దాదాపు అంతే మనీ, మందు, మగువ ఈ మూడే సినిమా ప్రపంచానికి కావలసింది '

శశాంక మాటలు చక్రవర్తిని ఎంతో ఆకట్టుకున్నాయి సినిమా ప్రపంచంలో బాగా అనుభవము, పరిచయము వున్న వాడిలా కనిపిస్తున్నాడు శశాంక అతను మాట్లాడుతున్న తీరు మరీ నచ్చింది అతని గురించి వివరాలు తెలుసుకోవాలని, పరిచయం పెంచుకోవాలని అనుకున్నాడు

"మీరేం చేస్తుంటారు "

"నేనా" చక్రవర్తి మొహంలోకి చూశాడు శశాంక

ఈ పరిశ్రమలో ఏం చెయ్యలేదని ఆశగండి ఓ పది సినిమాలకు అసిస్టెంటు డైరక్టర్ని ఇప్పుడు ఓ సినిమా నేనే డైరెక్టు చేస్తున్నాను గర్వంగా చెప్పాడు

"ఏ సినిమా"

"ఇంకా షూటింగ్ మొదలు పెట్టలేదు అసలీ పాటికి సగం సినిమా అయిపోవాల్సింది కాని సడన్‌గా ప్రొడ్యూసరు ఫాదరు పోవటంతో ఆయన ఊరెళ్ళారు రాగానే మొదలౌతుంది

'రైటరు ఎవరండీ" కుతూహలంగా అడిగాడు చక్రవర్తి

"నేనెప్పుడూ కొత్త వాళ్ళనే లైక్ చేస్తానండీ దీనికీ ఓ కొత్త ఆయనతో వ్రాయించాను బ్యాడ్ లక్ సరిగ్గా రాయ లేదాయన. ఈ లోపల మీరు కలిశారు మీరూ నేనూ కలసి వర్కు చేయగలమేమో చూద్దాం' చక్రవర్తిలో ఆశ కలిగిస్తూ అన్నాడు.

ఒక డైరక్టరు తనతో టీ తాగుతూ అంత బాగా మాట్లాడుతున్నందుకు, సినిమా ఇస్తానన్నందుకు చాలా ఆనందం, ఆశ్చర్యం కలిగాయి చక్రవర్తికి

'మీరు అవకాశం ఇవ్వాలే గాని నా శక్తి కొద్దీ కృషి చేస్తాను

"చూద్దాం. ప్రొడ్యూసరు రానివ్వండి ఆయనకూ చెప్పాలి గదా ఈ లోపల మీకో రెండు సీన్లు చెబుతాను రాసి వుంచండి ఆయనకు చూపించవచ్చు "

"అలాగే ఆనందంగా అన్నాడు చక్రవర్తి

"మీ రెక్కడుంటున్నారు' అడిగాడు శశాంక. తాను వుంటున్న హోటలు పేరు చెప్పాడు చక్రవర్తి


"నేనూ అటే వెళ్ళాలి పదండి నడుస్తూ మాట్లాడుకుందాం' లేచాడు శశాంక శశాంక వద్దంటున్నా వినకుండా టీ బిల్లు తానే చెల్లించాడు చక్రవర్తి

ఇద్దరూ పాండీ బజారు కేసి నడవసాగారు

"సత్యంగారు అలా మాట్లాడుతారనుకోలేదండి. అయినా వచ్చే వారం కలవమన్నారు."

ఖాదీ జీవన విధానం

ఖాదీ పల్లె ప్రజల, ముఖ్యంగా ఆడబడుచుల
ఉపాధి కల్పనకు సాధనం



గాంధీజయంతి
సందర్భంగా
స్పెషల్ రిబేటు అమ్మకాలు

ఖాదీ కొనండి
నూలు వడకు వారిని,
నేత వారిని ఆదుకొనండి


శీతాకాలం వెచ్చగా వేసవికాలం చల్లగా హాయిని అందించే "నూలు ఖాదీపై"	– 40%
దర్జా, నాజూకు తనాన్నిచ్చే "సిల్కు" ఖాదీపై	15% నుండి – 25% వరకు
నాణ్యతకు, వెచ్చదనానికి "ఉన్ని ఖాదీపై"	15% నుండి – 25% వరకు
"పాలీ వస్త్రములపై"	– 30%

రెండవ స్పెల్ – 1-12-'86 నుండి
18-1-'87 వరకు

మూడవ స్పెల్ – 20-2-'87 నుండి
31-3-'87 వరకు

డైరక్టరు,
ఖాదీ గ్రామోద్యోగ కమీషను
రాజ్య కార్యాలయం,
గాంధీ భవనము,
హైదరాబాదు-1.

ఖాదీ గ్రామోద్యోగ కమీషను వారిచే ప్రమాణ పత్రము పొందిన
ఖాదీ భాండారు, ఖాదీ భవనముల నుండి మాత్రమే
కొనుగోలు చేయండి.



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

స ఎ ఆర్ – రావులపాలెం

సాధారణంగా ప్రతి వంద మంది మనుష్యులలో 99 మందికి చిన్నప్పుడు కంటి చూపు బాగా వుంటుంది కదా! కాని వారి వయస్సు ముదిరిన కొలది కంటి చూపు క్రమంగా తగ్గుతూ వస్తుంది ఇది కేవలం విటమిన్ 'ఏ' లోపమని నేను చాలా పుస్తకాలలో చదివాను

★ విటమిన్ 'ఎ'లోపం వల్ల రేచీకటి, కండ్లలో పుండు ఏర్పడటం, కండ్లు కనబడక పోవటం జరుగుతుంది. కాని వయస్సు ముదిరే కొలది దృష్టి మాంద్యం రావటం జరుగదు. వయస్సు మీరిన వారిలో తప్ప, మామూలు వారిలో సాధారణంగా కంటి చూపు తగ్గుతూ రావటం జరగదు. అలా జరిగినపుడు కళ్ళలో ఏర్పడే ఇతర రోగాలు కారణం అవుతాయి.

బి. ఎస్. – కోడూరు

నాకు 2 సంవత్సరములుగా కుడి కాలిపాదం మడమ మీద పగుళ్ళు వున్నాయి పగుళ్ళు లోతుగా వున్నాయి లోపల చీములాంటి పదార్థం కనబడుతున్నది చాలా నెప్పిగా వుంటున్నది

★ దీనిని ఎపిడెర్మో ఫైటోసిస్ అని అంటారు. ఈ పగుళ్ళకు పై పూతగా విట్ ఫీల్డ్ ఆయింట్‌మెంట్ కొన్నాళ్ళు వాడవలసి వుంటుంది. చీములాగ కనబడేది నిజంగా చీముకాదు. కాలి మడమలో ప్రకృతి సిద్ధంగా వుండే ప్లాన్‌టార్ అపోన్యూరాసిస్

లోనికి మల్టీ విటమిన్ మాత్రలు పూటకి ఒకటి వంతున, రోజుకి రెండు పూటలుకొన్ని నెలలు వాడండి.

ఎం. కె. – కోరుకొండ

నా వయస్సు 16 సం లు నేను నిద్రలో మాట్లాడుతూ ఉంటాను ఒక్కోసారి కేకలు పెడతాను ఇది తగ్గటానికి ఏదైనా మందు ఉందా?

★ ఇది ఒక మానసిక రుగ్మత. సైకియాట్రిస్టుల సహాయంతో ఈ లక్షణాన్ని తేలికగా పోగొట్టుకో వచ్చును.

ఆర్. ఎ. – బాపట్ల

నా వయస్సు 20 సంవత్సరములు. సన్నగా వుంటాను నాకు ఆకలి వేస్తుంది గాని ఎక్కువగా తినలేక పోతున్నాను మట్టి లాంటి పదార్థాలు తినాలనిపిస్తుంది ఇది ఏదైనా వ్యాధి లక్షణమా? దీనికి పరిష్కారం తెల్పండి.

★ దీనిని పెర్వర్టెడ్ అప్పిటైట్ అని అంటారు. పైకా అని గూడా దీనిని వ్యవహరిస్తారు. మానసిక ఆందోళన, విరక్తి వల్ల ఇలా ఏర్పడే అవకాశం వున్నది. అనీమియా వున్న వారికి ఇటువంటి కోరిక వుంటుందని శాస్త్రజ్ఞుల అంచనా.

మల పరీక్ష చేయించు కొని క్రిములు వున్నవని తేలితే తగిన చికిత్స చేయించుకోవటం మంచిది. లోనికి ఇనుప ధాతువు మాత్రలు తీసుకోవటం అవసరం □

ఆరోహణ

"ఒక్క సత్యమే కాదండీ ఈ పరిశ్రమలో దాదాపు అందరూ అంతే. కొత్తవాడు అంటే చాలు వాడికేమీ తెలీదన్నట్టు మాట్లాడతారు. ఇక్కడ పైకి రావాలి అంటే ఏ ప్రొడ్యూసరో, ఫైనాన్సరో, డైరక్టరో వెనక వుండాలి. పైగా కుల రాజకీయాలు" విసుగ్గా సినిమా ఫీల్డు నంతా చదివేసిన వాడిలా అన్నాడు శశాంక.

"అందరూ అలాంటి వాళ్ళే వుంటారా. మీలాంటి మంచి వాళ్ళూ వున్నారు కదండీ."

"మంచితనం ఇక్కడ పనికి రాదండి. కాకా పట్టే వాడికి, కాళ్ళు పట్టే వాడికే ఇక్కడ అవకాశాలు నా విషయమే తీసుకోండి. ఎప్పుడో డైరక్టరు కావలసిన వాడిని. నేనెవర్నీ అడక్కపోవటం వల్లనే ఇలా వుండిపోయాను. ఇప్పుడు కూడ మా ప్రొడ్యూసరు పట్టుబడితే ఈ సినిమా చేస్తున్నాను.'

"ఎవరి దగ్గర పని చేశారండీ అసిస్టెంటుగా."

పేర్ల లిస్టు చెప్పుకుంటూ పోయాడు శశాంక. ఆ పేర్లు విని నోరు తెరిచాడు చక్రవర్తి

నేను అసిస్టెంటుగా వున్నపుడే 'సాగర్'ను పరిచయం చేశాను ఈ రోజు చూడండి ఎలా వెలిగి పోతున్నాడో '

"మీలాంటి వారితో పరిచయం కావటం నా అదృష్టం."

"అలాంటి మాటలు ఎందుకండీ మీలో శక్తి వుంది అవకాశం కోసం చూస్తున్నారు నేను కాకపోతే మరొకరు మీకు తప్పక సహాయం చేస్తారు "

శశాంక మాటలు చక్రవర్తిలో ఎంతో నమ్మకాన్ని పెంచాయి ఎంతో నమ్మదగ్గ వ్యక్తిలా కనిపించాడు శశాంక మద్రాసులో అతను పరిచయం కావటం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అనుకున్నాడు చక్రవర్తి

పానగల్ పార్కు దగ్గరికి వచ్చారు ఇద్దరూ

"రండి భోజనం చేద్దాం" శశాంకను పిలిచాడు చక్రవర్తి తన హోటల్ దగ్గరికి రావటంతో

"వేరే వాళ్ళు పిలిచారండీ."

"పరవా లేదు భోజనం టైం ఎలాగూ అయింది కలసి భోం చేద్దాం రండి కాసేపు ఆలోచిస్తున్నట్టు వుండిపోయాడు శశాంక

"సరే పదండి మీరింతగా అడిగితే ఎందుకు కాదనాలి

హోటలులోకి వెళ్ళారు ఇద్దరూ. భోజనం టిక్కెట్టు తనే కొన్నాడు చక్రవర్తి చక్రవర్తి వివరాలూ, అతని ఆర్థిక పరిస్థితి అన్నీ అడిగి తెలుసుకున్నాడు శశాంక

"మీ రెలాగైనా నాకు సహాయం చేయాలి "

"తప్పకుండా మనం ఒకరికొకరు సహాయం చేసుకోకపోతే ఎలా "

భోజనం పూర్తి చేశారు.

"నాకు తెలిసిన ప్రొడ్యూసర్లను డైరక్టర్లను కూడ మీకు పరిచయం చేస్తాను. వాళ్ళ ద్వారా కూడ ప్రయత్నించండి' చెప్పాడు శశాంక

"చాలా సంతోషమండీ "

"రేపు ప్రొద్దున్నే మీ రూముకు వస్తాను రడీగా వుండండి స్టుడియో కెళదాం "


"అలాగే" అన్నాడు కృతజ్ఞతా పూర్వకంగా చక్రవర్తి శలవు తీస్కుని వెళ్ళిపోయాడు శశాంక.

మద్రాసులో తనకో మార్గం దొరుకుతున్నట్టు, త్వరలోనే తాను సినిమాకు రచన చేయబోతూ వున్నట్టు అనుకున్నాడు చక్రవర్తి తనకు కాస్త స్థిరత్వం దొరకగానే ప్రభాకర్‌కు ఉత్తరం రాయాలి తాను ఎదిగితే సంతోషించే వాళ్ళల్లో వున్నది నీలిమ తర్వాత ప్రభాకరే

కలలు కంటూ నిద్రపోయాడు ఆ రాత్రి చక్రవర్తి.

(ఇంకా ఉంది)

ధాన్యలక్ష్మి నాట్యమాడె ముంగిట్లో
ఆనందోత్సాహాలు వెల్లివిరిసె రైతుగుండెల్లో...



సంక్రాంతి సిరులను రైతుకందించి పండుగ సంబరాలను ఆనందోత్సాహాలతో వుప్పొంగ చేస్తుంది...

..."స్వస్తిక్ బ్రాండ్ రామగుండం యూరియా".

పంట దిగుబడులనధికం చేసి, రైతు సంతోషంలో పాలుపంచుకోవాలన్నదే...

...ఫర్టిలైజర్ కార్పొరేషన్ వారి నిరంతర ధ్యేయం.



ది ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

మార్కెటింగ్ విభాగం 6-2-30/c, లక్డికాపూల్, హైదరాబాద్ - 500 004

"శుభ సౌభాగ్యాలకు చిహ్నం స్వస్తిక్ బ్రాండ్ రామగుండం యూరియా".

"సంక్రాంతి శుభాకాంక్షలు"

FCI 0648 Tel

మోక్షం

నా కిచ్చిన గవర్నమెంటు బంగళాకు సరిగ్గా ఈశాన్య దిశలో ఎత్తయిన జాగాలో బొక్కి షెడ్డులోనున్న, ఆషా యింఢస్ట్రీస్‌కి మధ్యలో ఒక ముళ్ల తీగల కంచె వుండేది ఈ కంచె చాలచోట్ల తెగిపోయింది. కొత్తగా యింట్లో దిగిన నేను ఆ షెడ్డు నించి వచ్చే ధ్వనులకు రెండు రోజులకే విసిగి పోయాను అందుకే కామోసు అటువేపు నించి వచ్చిన మనుమలంటే ఒకవిధమైన అసూయ యేర్పడింది. ఉదయం, సాయంత్రం ఒక ముసలాడు మా యింటి ప్రక్కనించే వెళ్లేవాడు. వాడి వెనుకను ఒక ఘూర్కా ప్లాస్టిక్ బాల్చీ పట్టుకుని కదిలేవాడు. ఈ ముసలాడు గట్టిగా వాగకపోతే నడవ లేడేమో? నా కేంటో వీడు కదులుతుంటే ఆ బొక్కి షెడ్డే మా యింటి వేపు కదలినట్లు అనిపించేది. మాట కలిపితే అంటుకుంటాడేమోనని తప్పించుకునే తిరిగాను ఒకనాటి ఉదయం వాడే మా యింటి తలుపు తట్టాడు మీ గార్డెన్‌లో నున్న కొళాయి దగ్గర స్నానం చేసి ఒక బాల్చీ నీరు తీసుకుంటే మీ కభ్యంతరమా అని స్వచ్ఛమైన మర్యాదైన యింగ్లీషులో అడిగాడు

"అభ్యంతరం లేదు" అని, 'మీ యిండస్ట్రీ దగ్గర కొళాయి లేదా?" అని అడిగాను. లేదు అని చెప్పే బదులు అన్నాడు.

"నా కనీస అవసరం నీరు. కొళాయి కోసం అధికారుల దగ్గరకు తిరిగి విసిగి ఒక సామెత వాడికి వినపడేటట్లు అరిచాను."

"ఏమిటా సామెత?" అని అడగకుండా వుండలేక పోయాను!

"అధికారికి ముందు చూపు లేకపోతే చచ్చింది మనం నీరు ఆ యెత్తుకు యెక్క దంటున్నాడు

"మీ పేరు?'

"విశ్వంభర భట్" అన్నాడు

ఆ స్నానం ఒక అరగంట పట్టింది ఈ అర గంటలో గంగ స్తుతితో మొదలిడి గాయత్రీ మంత్రం వరకు స్వచ్ఛమైన స్వరంతో సాగింది.

"మంచి అలవాటు చేసారని " రెండో రోజు యిలా జరిగాక మా ఆవిడ అంది ఈ మాట విన్నాడేమోనన్న అనుమానం వేసినట్లు మూడో రోజు నించి రాలేదు ఇదివరకు వెళ్లే మిగతా క్వార్టర్స్ వేపు వెళ్లిపోయాడు అలా వెళ్లిపోతూ ఒకసారి యేదో చెప్పదలచు కున్నట్లు మా యింటి ముందు ఆగి కదిలేవాడు ముఖం కనిపిస్తే ఒక అరగంట స్నానమో, ఒక అరగంట లెక్చరో వినే ఓపికలేక, దొంగచాటుగా వాడిని చూసి తప్పించుకునే వాడ్ని

గొంతుక వినగానే కొన్ని గజాల దూరంలో భట్ వున్నాడని పోల్చుకునే వాడిని. ఏదో చెప్పడానికే అలా అగుతున్నాడని అనిపించింది. బహుశః యీ వయసులో తను యిలా కేక లేసుకుంటూ, యెండనక వాననక కడుపు కోసం కష్టపడవలసిన అవసరం యెందు కొచ్చిందో చెప్పుకుంటాడేమోననిపించి ఒకరోజు తనకు యెదురెళ్లి నిల్చున్నాను నన్ను చూడగానే పెరటనున్న నా పూలతోటలో వున్న తులసి మొక్కను చూపిస్తూ-

"ఆ తులసి మొక్కను పూజ చేస్తున్న దెవరు?"

"మా అమ్మ" అన్నాను.

"సౌభాగ్యం సంతతం దేవి- ధన ధాన్యంచమే సదా, ఆరోగ్యం, శోకశమనం, కురుమే మాధవ ప్రియే" అని శ్లోకం వర్ణించి తులసి ఆకులు పది రోజూ తింటే ఆరోగ్యానికి మంచిదని చెప్పాడు.

ఇంకా అక్కడ నిల్చుంటే తులసి జలంధరుల చరిత్ర చెప్పుక కూర్చుంటాడని కదలితే-

"మీ అమ్మగారితో మాటాడవచ్చా?"

ఆ మాటల్లోనైనా తన గురించి చెప్పుకుంటాడేమోనని యింట్లోనికి తీసుక వెళ్లాను గోడనున్న వెంకటేశ్వరస్వామి పటానికి "బాలాజీ' అంటూ మొక్కాడు నేను లోన గదిలోనికి వెళ్లి మా అమ్మతో -

"ఆ భట్టు నిన్ను చూస్తానంటున్నాడు."

"ఎవడ్రా అతను?

"అతను అదిగో ఆ ఆషా యింద్రస్ట్రీసులో మేనేజరుగాపని చేస్తున్నాడు అతనూ కాపలాకాసే ఘూర్కా అందులో నే బస."

"పెళ్లాం పిల్లలు?"

'అదేదో నివ్వే అడుగు "

మా అమ్మవచ్చి చాటుగా నిల్చోగానే కూర్చున్న భట్ లేచి నమస్కరించి-

"పెరట తులసి పూజ చేస్తున్నారు ఎంతో పుణ్యం యీ యింటివాళ్లకు సంపాదించి పెడుతున్నారు ఒక్కడేనా కొడుకు?"

'వాడొక్కడే నా సంతానం."

'చాలా శ్రమపడి పైకితెచ్చినందుకు మీరంటే యెంత భక్తితో వున్నారో చూస్తే ముచ్చటేస్తున్నది." నిల్చున్న నావేపు చూస్తూ

"నేనేం శ్రమ పడలేదు వాళ్ల నాన్నకీ వాడు హెచ్చు శ్రమ యివ్వలేదు చదువుతూనే ఆర్జించుకుని యిలా అంచెలమీద పైకొచ్చాడు."


'పుణ్యం చేసుకున్న వాళ్లను దర్శించితే పాపం కొంత కడిగేసు కుంటామని మిమ్మల్ని చూడడానికి వచ్చాను. వస్తాను" అని నమస్కరించి తన గురించి యేమి అడుగుతారేమోనన్నట్లు బయటకు వచ్చేసాడు వీళ్లద్దరికీ మధ్య నేను దుబాషి నయ్యాను.

రాను రాను ఇతని గురించి తెలుసుకోవాలన్న నా తాపత్రయానికి, కారణం లేకపోలేదు ఇతను సంస్కృతం, యింగ్లీషులో అపారమైన కృషి చేసాడని, అతను షేక్స్‌పియర్ దగ్గర నించి ఇలియట్ వరకూ, ఋగ్వేదం నించి సౌందర్య లహరి వరకూ నిల్చున్నపాటున వల్లించ గలుగుతున్నాడు. ఇతను యే ప్రొఫెసర్‌గా పనిచేసి, యేదో గొప్ప ఘోరాన్ని భరించలేక యీ మారుమూలలో యిలా చేరుకున్నాడని పించింది ఎదుటివాళ్ల విషయాలన్నీ తనకు కావాలి తన విషయం యినప్పెట్టిలో దాచుకున్నట్లు యేదీ చెప్పడం లేదు

ఇలాంటి పరిస్థితిలో గవర్నమెంటు వాళ్ళు ముళ్లకంచె లాభంలేదని ఆరడుగుల గోడ కట్టడానికి పునాదులు తవ్వారు. భట్టు గెంత లేనంతగా వారం రోజులకే గోడ లేచిపోయింది. చుట్టూ తిరిగివస్తే నా యిల్లు ఫ్యాక్టరీకి కిలో మీటరు దూరం వుంటుంది. అందుకే ఘూర్ఖా బహదూర్ గోడగెంతి వచ్చాడు ఒక వారం. వాడు నీరు పట్టుకుంటున్నప్పుడు ఒకనాడు భట్ గురించి అడిగాను

"మేం యిద్దరం ఒక గదిలో నే వుంటాం కానీ అతని గురించి నాకేం చెప్పలేదు తెలీదు' అన్నాడు

పెళ్లాం పిల్లల గురించి తెలుసుకోవటం గానీ, ఏదైనా ఫోటో యైనా చూసావా? ఉత్తరాలు రావచ్చు కదా!



పువ్వుల రథం
మంతెన విజయలక్ష్మి
విజయవాడ

'అదేం లేదు" అన్నాడు అబద్ధం యెరగని బహదూర్

గోడ లేచిపోయింది ఒక వుదయమే "రావుజీ' అని కేకలు వినిపిస్తున్నయి. అది భట్ గొంతుకని పోల్చి నా పెరటి తోటకు అనుకునివున్న గోడ దగ్గరకు వెళ్ళాను.

"బహదూర్‌కి జ్వరం. చుట్టూ తిరిగి రాలేను. ఒక బకెట్ నీరు యెలాగైనా గోడమీద నించి యిటు ప్రక్క మెల్లగా పొయ్యిగలవా? అలా పోస్తుంటే స్నానం చేసి పూజ చేసుకుంటాను "

మాటాడకుండా అలా పోస్తుంటే భట్ స్నానం చేస్తూ కమ్మని స్వరంతో నవగ్రహ స్తోత్రం చేస్తున్నాడు ఒకటి కాదు రెండు బకెట్లు ఆ స్వరం వినడానికే పోసాను ఇతనిలో నిష్ఠ నియమాన్ని చూసి నాలో ఒక వూహ మెసిలింది

రోజూ కేక వెయ్యండి నా దగ్గరున్న రబ్బరు గొట్టం కొలాయికి తగిలించి గోడపై నించి విసురుతాను రోజూ మీక్కావలసినంత నీరు పట్టుకోండి '

నీలాంటి ధర్మాత్ముని వంశంలో బిడ్డగా వచ్చే జన్మలో పుడతానులే' అన్నాడు

ఇలా కేక కోసం వేచి వుండటం నాకు అలవాటై పోయింది దీనివలన నాకు మేలు కూడా కలిగింది ఇదివరకు కాస్త ఆలస్యంగా లేస్తున్న వాడిని ఉషస్సమయానికే లేచిపోయి పెరటి వరండాలో కూర్చునే వాడిని ఆ లేత వెలుతుర్లో కదిలే చిన్న పక్షులు, వాటి సరాగాలు, చిరు గాలికి కదిలే ఆకులూ, పూల భంగిమలు... యివన్నీ చూస్తుంటే ముందు రోజు పనిలోని చికాకులు జీవితంలో విసవిసలు అన్నీ సమసి పోయేవి మనసు మళ్ళీ కడిగిన పలకలా మెరిసేది


ఓ పదిహేను రోజులనాడే ఆ వుదయమే భట్ గొంతుక బదులు బహదూర్ గొంతుకవినిపించింది 'రావుజీ' భట్‌జీ మంచం రాత్రి నుంచీ దిగలేదు. మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారు "

గబగబ స్కూటర్‌మీద చుట్టూ తిరిగి ఆషా యిండస్ట్రీస్ దగ్గరకు వెళ్ళాను షెడ్ మూసివుంది బయట ఒక రేకులు కప్పిన గదిలో మంచంమీద భట్ పడివున్నాడు. అసలే యెముకలపోగు. ముడతలుపడ్డ ముఖంలో కళ్ళు, గొంతుకే ప్రధానంగా వుండేవి. ఇప్పుడా కళ్ళు సగానికి కృంగినట్లు కనిపించాయి గొంతుకలో యిదివరకున్న ధాటీ లేదు

"డాక్టరును తెస్తాను ' అన్నాను.

'వద్దు" అని సైగ చేసాడు బహదూర్‌కి సైగచేసి అతని మంచం దగ్గరలో కుర్చీ వెయ్యించుకుని నన్ను కూర్చోమన్నాడు

నాకో వుత్తరం రాసిపెట్టు నా చేతితో రాసే శక్తి లేదు '



దీపావళి కథలపై వ్యాస రచన పోటీలో మూడవ బహుమతి రు. 100/-పొందిన వ్యాసం

కథలో జీవం - కథనంలో ప్రత్యేకత

దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన ఆరు కథలలో నా దృష్టిలో అగ్రస్థానానికి అర్హమైనది "బుద్ధుడు పుట్టిన భూమిలో" అనే కథ. ఈ కథలో జీవం ఉంది. కథనంలో ప్రత్యేకత వుంది. మానవత్వపు విలువలను మరచి, దయా దాక్షిణ్యాలను విడనాడి కర్కశంగా ప్రవర్తించే అనేకమందికి యీ కథ కనువిప్పు కాగలదు. ఈ కథలోని యితి వృత్తం చాలా సున్నితమైనదే కాక సందేశాత్మకమైనది. మూగజీవుల ఎడల కరుణను, ఆత్మీయతను కలిగి వుండాలే తప్ప ఆచారాల పేరిట, సంప్రదాయాల చాటున వాటిని బలిగొనడం అమానుషం అని ప్రబోధించే యీ కథలోని రావుడి పాత్ర ఔన్నత్యము హిమాలయ శిఖరాలను తలపింపచేస్తుంది.

మనిషికి, మనిషికి మధ్య అనుబంధానికి అర్థాలే మారిపోతున్న యీ రోజుల్లో కేవలం పెంచిన ధర్మానికి కట్టుబడి, అమ్మకాని అడదానిలో తన తల్లిని తనివితీరా చూసుకుంటూ తృప్తి పొందడమే కాకుండా, ఆ తల్లి ప్రాణాలు కాపాడి, స్వంత తల్లిని చివరి క్షణాల్లో దర్శించలేని ఓ త్యాగమయుడి కథ "ఆ తృప్తి చాలు సామీ!". ఓబులేసు త్యాగం హృదయాలను కరిగించి కన్నీరు కురిపిస్తుంది. హృదయపుటంచులను తాకి రసానుభూతిని రేకెత్తించిన యీ కథ ద్వితీయ స్థానానికి అర్హమైనది.

"బరువు - బాధ్యత" కథ యీనాటి సమాజంలోని అనేక కుటుంబాలకు, అందులోని వ్యక్తుల మనస్తత్వాలకు చక్కని చిత్రీకరణ. బాధ్యత అనేది ఎవరికి వారు గ్రహించాలి తప్ప యితరుల ప్రమేయంతో సమస్యలు వక్ర మార్గాలు పట్టే అవకాశం వుంది. ఈ కథలో బరువు - బాధ్యతల మధ్య నలిగిపోయిన మధ్య తరగతి మనిషిగా చిత్రింపబడిన శివరామయ్య పాత్రలో సహజత్వం వుంది, సన్నిహితం వుంది. అందుకే యీ కథకు తృతీయస్థానం యిస్తున్నాను.

నాలుగవ స్థానానికి,అర్హమైన కథ "మాయ"లో ఒక చక్కని నీతి, వేదాంతసారం యిమిడివుంది. సుఖము - కోరిక - విరక్తి యివన్నీ మనిషిని వెంటాడే బలహీనతలు. అరిషడ్వర్గాలకు అతీతమైన స్థాయికి మనసు ఎదగ గలిగితే ఆ మనిషి ఉన్నతుడు క్రిందే లెఖ్క. అది లేనివాడు "వంశీ"లాగ శ్మశాన వైరాగ్యం అనుభవించక తప్పదు, సుఖాలకై ఆరాటం తప్పదు.

ఆస్తి, అంతస్తులతో మనిషి సుఖపడగలడు అనటంలో పూర్తి యదార్థం లేదు. మానసికంగా తృప్తి లేని మనిషి ఎంత ఐశ్వర్యాన్ని అనుభవిస్తున్నా, అతని మనస్సు మాత్రం ఏదో వెలితిని అనుభవిస్తూనే వుంటుంది. పట్టాభిగారు పెద్ద కొడుకు దగ్గరే తృప్తి పడగలిగాడు అంటే యీ నిజం కారణం అని చాటిచెప్పే కథ "శిఖరం మీద"కు అయిదవస్థానం యిస్తున్నాను.

ఈ రోజుల్లో రక్త సంబంధీకులమధ్య కరువైపోతున్న ఆప్యాయతలకు, ఆదరణకు యీ కథలో ("నామకరణం") చక్కని రూపం కల్పించారు. కామేశ్వరమ్మ పొందుతున్న గౌరవాలు, ఆవిడ పెద్దరికానికి అన్ని తరాల వారిచ్చే స్థానం మనస్సును ఆహ్లాదపరుస్తుంది. మనస్సు మంచిది కావాలే కాని ఆ మనిషి పొందే గౌరవ ప్రశంసలకు లోటుండదు అని చాటి చెప్పే యీ "నామకరణం" కతకు ఆరవస్థానం యిస్తున్నాను.

ఇ. టి. రామారావు

బహదూర్ కాగితం కలం అందిచ్చారు. భట్ మెల్లగా ఆగి ఆగి యింగ్లీషులో చెప్తుంటే రాస్తున్నాను.

"రామప్రసాద్‌కి,

చచ్చిపోయే ముందు నీకు నా దస్తూరితో ఉత్తరం రాద్దామన్న నా కోరిక నెరవేర లేదు. ఒక సన్మార్గుడైన రావుజీ దస్తూరితో నీకీ వుత్తరం రాయించాను.

నీ అమ్మ నీ ఐదేళ్ళప్పుడు గతించింది. అమ్మ-నాన్న నేనే అయి నిన్ను సంఘం మెచ్చిన మనిషిగా చేద్దామని అన్ని బాధలను ఓర్చాను. ఈ నా

మోక్షం

త్యాగానికి ప్రతిఫలంగా నేనొక్కటే అడిగాను. నా మతం నన్ను గమ్యానికి మోసుకు వెళ్ళే వాహనం లాంటిది. విశ్వాసం యీ వాహనానికి పెట్రోలు లాంటిది. అందుకే పిండం పెట్టినప్పుడు ముందు మూడు తరాలను జ్ఞప్తికి చేసుకుంటాం. ఈ నా నమ్మకం వమ్ము చెయ్యొద్దన్నాను. ఎంత బ్రతిమాలినా తలకొట్టుకున్నా నీ మాట నీదే నన్నావు. అన్యమతం పిల్లను నా ప్రమేయం లేకుండా యెంచుకుని పెళ్ళి చేసుకున్నావు. ఉల్లిపాయ తినటం యెరుగని నాచేత యేమేమేటి తినిపించాలని చూసావో?

నేను నిన్ను వదిలి వస్తుంటే-

"పిచ్చి" అని గొణిగావు. నీ కది పిచ్చి, నా కది పట్టుదల. అది వదలితే నేను వెన్న ముద్దలా కరిగి నామరూపాలు లేకుండా పోతాను.

ఈ రావుజీ స్వయం కృషి వలన పైకి వచ్చినవాడు. అయినా తల్లిని యెంతగా గౌరవిస్తున్నాడో? ఆ యింట్లో కాలు పెడ్తే భక్తి భావం కలుగుతుంది. ఈ సాంప్రదాయం తెగిపోకుండా కాపాడుతూ వస్తున్నాడు.

నేను కళ్ళు మూస్తే యెవరికి యెవరు? నా చితిని నా క్రింద సేవ చేసిన బహదూర్ గానీ నాలో మానవత్వం మీద పోయిన నమ్మకాన్ని మళ్ళీ తెప్పించిన రావుజీగానీ.... వెళిగిస్తే.... నా కర్మ పరిపక్వం జెందుతుంది...."

చెప్పటం సరి. భట్ మెల్లగా సంతకం పెట్టాడు. ఇది చెప్పడానికి అలసి పోయాడు. తరవాత యెడ్రసు యిలా ఆగి ఆగి చెప్పాడు.

"రామ్ ప్రసాద్ భట్, ఐ. ఎ. ఎస్.,

కలక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్,

ఆగ్రా."

నేను ఓ క్షణం ఆగి వుత్తరం చివర జాగాలో రాస్తున్నాను.

"ఏమిటి యింకా రాస్తున్నారు?" అని అడిగాడు భట్. నేను రాసింది యిలా గట్టిగా చదివి వినిపించాను....

"పి. ఎస్. శ్రీరామ్ ప్రసాద్‌గారికి-

నేను మీలాగే మతాంతర వివాహం చేసుకున్నాను. మా అమ్మ నాపై ఆధారపడకుండా మా నాన్నగారు చాలా వదలి పోయారు. ఆమె కాదన్న పెళ్ళి నేను చేసుకున్నా ఒకరోజు మా యింట్లో తనంతట తానే కాలుపెట్టి,

"నా కొడుకు దగ్గరుంటేనే నాకు మోక్షం." అంది. మా ఆవిడ ఆమెను స్వంత తల్లికన్నా మిన్నగా చూసుకోడానికి కారణం మా అమ్మ చూపించిన యీ ఔదార్యమే.

రావ్"

విశ్వంభర భట్ కళ్ళు నిలబెట్టి రావుజీ వేపు చూసాడు. ఏదో పొరపాటు చేసిన వానిగా బాధతో కళ్ళల్లో నీరు కారాయి. □

మెలికేసినట్లు అట్నుమీదుండేసరికి నా ప్రాణం చివుక్కుమంది ఈ కార్యక్రమం సమర్పించిన రవిశంకర్‌జీ ఈ పొరపాటు చేసినందువల్ల కుండెడు పాలల్లో ఒక విషపు చుక్కపడ్డది □

సిల్కురోడ్డు-కొత్త నాటిక



దూరదర్శనం

లత

బునియాద్" తిరిగి ప్రారంభమయిన తరువాత ఇది రెండో వారం. కాందిశీకుల శిబిరంలో ప్రస్తుతం కథ జరుగుతున్నది, - ఈ 'బునియాద్' అసలే అల్లకల్లోలంగా ఉన్న దేశాన్ని రెచ్చగొడుతుందని ఇదివరకే మనవి చేశాను. ముఖ్యమైన ఈ అంశం వదిలిపెడితే సుదీర్ఘంగా సాగుతున్న ఈనాటిక సిప్పీ మనకి అందించిన గత చరిత్రలోని పగిలిన ముక్కలు. చూద్దాం. చూడక చేసేదేమిటి? రెండున్నర నిముషాలు దృశ్య రహిత శబ్దాలు వినవచ్చినయి – అనంతరం తెరలోంచి కనపడ్డట్టు దృశ్యం కనిపిస్తున్నది ఇది మన హైపవర్ ట్రాన్స్‌మిషన్ తప్పుకాదు కదా? విజయవాడలో ఒక్క నా టి వి సెట్టు తప్ప అన్నీ గోలగా ఉన్నాయని వార్తలు – అసలు ఢిల్లీ కనెక్షనూ – ఉపగ్రహం కనెక్షనూ కూడా ఊడిపోయినయ్యా అయిదు నిముషాలపాటు ఏ చర్య తీసుకోలేదు ఇంజనీర్లు – ఢిల్లీ అంటే మొగలాయిదర్బారు. మన హైద్రాబాద్ పత్తర్ కాదర్వాజా. ప్రయోజనం కనిపించటం లేదు ఎంత మొత్తుకున్నా. పేలాలు వేగి వేగి వచ్చినట్లే వచ్చి.. మళ్లీపోయింది

ఘోరం వార్తల్లో మళ్లీ డిస్ట్రబెన్స్ ఢిల్లీనుంచే వార్తల్లో ఫిలిమ్ తెగితే – సిగ్నేచరు ట్యూన్ వెయ్యాలి ఉపగ్రహ విన్యాసమైతే ఢిల్లీనుంచి ఏదివచ్చినా పేలాలు వేగటం తప్ప వినిపించదు కనిపించదు. కాక మన హైపవర్ ట్రాన్స్‌మిటరయితే. ఇంజనీర్ల బద్ధకంవల్ల కనెక్షన్ ఊడిఉంటుంది ఉపగ్రహం తప్పుచేయదు – న్యూస్‌లో మాత్రం ఢిల్లీ బొంబే- హైద్రాబాద్- విజయవాడ అలిక్కిన రీలే అవుతుంది మరో కార్యక్రమం సంగతి ఏమో కాని. కనెక్షన్‌పోయి పదిన్నరవరకూ రాలేదు కనక శనివారం (13–12–86) లేట్ ప్రోగ్రాంలు సమీక్షించలేకపోతున్నాను క్షమించాలి ఆదివారం (14–12–86) కొంచెంసేపు టి వి పేలాలు వేగింది అంటే మన హైపవర్ ట్రాన్స్‌మిషనుదే తప్పు

అప్పూ – ఔర్ పప్పూ

పిల్లలనాటిక అయినా ఆ ఏనుగ మహాసరదాగా నటిస్తున్నది నాది పసిపిల్ల మనస్తత్వం నాకు బాగానే ఉంటుంది జంతువులూ, అడవులూ, జలపాతాలూ నాకు ఇష్టం. కాని పిల్లల కార్యక్రమాల పేరుతో వచ్చే అన్నీ బాగుండవు. షెర్లాక్ హోమ్స్ అయిపోవటం కాస్త నిరాశగానే ఉంది దాని బదులు మరేదో సీరియల్ ఇస్తారట సరే అప్పూ నటన చూద్దాం- అప్పూతో పాటు మరో చిరుతపులి నేస్తం దొరికింది పప్పూకి అడవి. అడవి న్యాయం వేరు జంతువుల్ని ప్రేమించడం, చెట్లని ముద్దు చేయడం- ప్రకృతిని ఆరాధించడం ఉత్తముడూ సృష్టిలో సర్వశ్రేష్ఠుడూ అయిన మానవుడి ధర్మం

అమీర్ ఖుస్రూ ఖవాలీలో 'కృపాకరో మహరాజ్' బాగుంది

అప్నే ఆప్

ఇల్లూ ఫర్నిచరూ వాటికాంబినేషన్ గురించిన కార్యక్రమం మధ్య తరగతి జీవులకు రెండు మురికి గదులు దొరికితే అదే భాగ్యం కిందవాళ్లకి చెట్లూ, ఫుట్‌పాత్‌లూ ఉన్నాయి భాగ్యవంతులకు ఏదోలాటి సొంత ఇల్లుంటుంది కాని నేడు మన కార్యక్రమంలో చూపించిన ఇల్లు మల్టీ మిలియనీర్స్‌కే సాధ్యం ఇండియాలో– టి వి చూసి కూడా కోరికలు పెంచుకోవచ్చును ఊహా జీవులు

సితార్ కృష్ణుని వేణువు నటరాజు ఢమరుకం సరస్వతి వీణ ఇవి ప్రాచీన సంగీతవాద్యాలు. మృదంగం - తాళం - చిరతలూ కూడా ప్రాచీనమైనవే. వేణువే కాకుండా షెహనాయి ఏమో కాని సారంగి ప్రాచీనమే-సితార్ వీణకు మరో రూపం సరస్వతి వీణా పుస్తకపాణి శృతివీణ నారదీయ వీణ - మయూరీ వీణ -లక్ష్మి వీణ - త్రితంత్రి వీణ కచ్ఛపవీణే ఆధునిక సితార్- అంటే సరస్వతీ వీణే సితార్ అన్నమాట 17వ శతాబ్దంలో తాన్‌సేన్ దీన్ని సంస్కరించి మరింత శబ్ద తంత్రిని చేశారు.

ఆఫ్రికాలో కిసార్ - పర్షియాలో సహకార్ - కాశ్మీర్‌లో సైతార్ మొదలైనవీ కచ్ఛపీ రూపాలే కావచ్చును సంగీతం తెలుసుగాని గొప్పగా తెలియదని ఒప్పుకుంటున్నాను సంగీతవేత్తలు క్షమించాలి- అమీర్‌ఖాన్ బహదుర్దుల్లాఖాన్‌జీలు దీన్ని సుసంపన్నం చేశారు చరిత్రలో ఇది చాలా చిన్నది అన్ని సంగీత వాద్యాలకన్నా చిన్నది వీణకి మొదటి రూపం రుద్రవీణ, చివరిది సితార్.

విలాయత్‌ఖాన్ సితార్‌ని గిటార్ స్వరాల్లో పలికించేవాడట - నిఖిల్‌బెనర్జీ కూడా చెప్పుకోదగ్గ సితార్ నిపుణుడు సితార్ గురించి చెప్పటం అయింతర్వాత ఒక పుస్తకం చూపించారు ఒక అర్ధనగ్న స్త్రీ తన రెండు కాళ్లతో సితార్‌ని



"సంక్రాంతి లక్ష్మి"
చిత్రం: దేవు దీక్షితులు

స్వాగతగీతం

పరిమళించిన
ప్రకృతి ఒడిలో
విరిసి విప్పారిన
బంతీ,
చామంతీ
స్వాగత గీతికలు
ఆలపిస్తున్నాయి
సంక్రాంతికి!
ముత్యాల తివాసీలా
రమణీయంగా పరుచుకొన్న
రంగవల్లులు ఇంటి ముంగిట
అడుగులకు
మడుగు లొత్తుతున్నాయి
సంక్రాంతికి!
ముద్దుగుమ్మలు తీర్చిదిద్దిన
గొబ్బెమ్మలు నిండుగా నవ్వుతూ
వడివడిగా రారమ్మని
సంక్రాంతిని పిలుస్తున్నాయి!
శ్రమించిన శ్రమకు
తీయని గుర్తుగా నిలిచి
బంగారు వన్నెలు వొలకపోస్తూ
స్వాగతమంటోంది
సంక్రాంతికి ధాన్యరాశి!
ఇంటిల్లపాదికీ
ఆనందాన్ని ప్రోదిచేస్తూ
పరవశించి పులకరిస్తోంది
సంక్రాంతి!

-కొడిమెల శ్రీరామమూర్తి

సీరియల్

ఒకటి ఒకటో మూడు

తేజోమతి



(గత సంచిక తరువాయి)

రోజులు గడుస్తున్నాయి డాక్టరు పంపించిన చీరలు ఒక్కటి కూడా కట్టలేదు లక్ష్మి ఆ యూనిఫాం చీరలు తప్ప.

ఆయన గమనించినా ఎందుకు కట్టలేదని మందలించలేదు హోటలు భోజనం కూడా కష్టమనిపించటంలేదు ఎందుకంటే పల్లెటూళ్ళ నుండి వచ్చిన వాళ్ళు అన్నం వండుకోడానికి ఒక పక్కగా కొన్ని పొయ్యిలు వగైరాలున్నాయి ఆ ఆస్పత్రిలో. అలా వంట చేసుకున్నవాళ్ళు 'నర్సమ్మగారూ తీసుకోండి' అంటూ ఏదో ఒకటి తెచ్చి పెట్టేవాళ్ళు రాత్రిళ్ళు కూడా అందరితో కూర్చుని కబుర్లు చెబుతూ పలకరిస్తూ, వాళ్ళను చూస్తూ వుండడంతో అందరూ ఎంతో అభిమానంగా వాళ్ళు పల్లెటూళ్ళ నుండి తెచ్చుకున్న ఫలహారాలతో సహా బలవంతంచేసి పెట్టేవాళ్ళు .

కానీ ఆ గది వొక్కటే చాలా సమస్యగా వుండేది డాక్టరుగారు వున్నంత-సేపూ ఆ గది తీసి వుండాల్సిందే ఒక్కోసారి రాత్రి పది పదిన్నర దాకా మెడికల్ జర్నల్స్ అన్నీ తిరగేస్తూ కూర్చునేవారాయన లక్ష్మికి కూర్చోవాలన్నా, పడుకోవాలన్నా మొహమాటంగా వుండేది

ఒక రోజు చాలా ఆకలిగా వుంటే తలుపులు దగ్గరగావేసి భోజనం చేస్తోంది లక్ష్మి

ఇంతలో తలుపులు తెరుచుకున్నాయి గుమ్మంలో నిలబడి. భోజనం చేస్తున్నావా? నన్ను పిలవలేదేం షేర్ చెయ్యమని 'అన్నారు నవ్వుతూ

వూరి నుండి వచ్చాక ఆయన నవ్వుతూ మాట్లాడటం అదే లక్ష్మి తెగ మొహమాట పడిపోయి కంచంలో చెయ్యి కడిగేసుకోబోతుంటే,

"అహహ్.. ఎందుకు చెయ్యి కడుక్కోడం? తినేసెయ్యి " అంటూనే,

లక్ష్మీ ఒంటరిగా కూర్చుంటే అన్నం తినాలనిపిస్తుందా" అని అడిగారు మొహంలోకి చూస్తూ

లక్ష్మి యిబ్బందిగా ఫీలయింది ఏం జవాబు చెప్పలేదు ఆయనే అన్నారు-

"ఒంటరిగా కూర్చుంటే నాకు సయించదు లక్ష్మి అందుకే ఒక్కోసారి ఏమీ తినకుండా పాలు తాగేసి పడుకుంటాను

ఆయనలా అంటూంటే లక్ష్మికి ముద్ద దిగలేదు తినాలని అనిపించలేదు అంతా వదిలేసి లేస్తుంటే,

"అంతా వదిలేశావేం"? హోటలు అన్నం బాగుండలేదా పోనీ ఓ పనిచేద్దాం అది అలా వదిలేసెయ్యి ఆ చీర మార్చుకునిరా ఏదన్నా మంచి హోటలుకు వెళ్ళి భోజనంచేసి . అటునుండి ఏదన్నా పిక్చర్‌కు వెళ్ళివద్దాం నువ్విక్కడికి వచ్చిన తర్వాత ఎక్కడికీ బయటకు వెళ్ళలేదుకదూ అన్నారు

లక్ష్మికి ఏమీ పాలుపోలేదు

అహ వద్దులెండి నాకు ఎక్కడికీ బయటకు వెళ్ళాలని వుండదు అన్నది

డాక్టరుగారు చిన్నగా నిట్టూర్చి చప్పున తిరిగి తన గదిలోకి వెళ్ళిపొయ్యారు రాత్రి ఎనిమిది తర్వాత కన్సల్టింగ్ రూమ్‌లో ఎవ్వరూ వుండరు నైట్ డ్యూటీ అసిస్టెంట్ కూడా మందులిచ్చే చోట పడుకుని నిద్రపోతాడు

లక్ష్మికి బాగా నిద్ర ముంచుకొస్తోంది తలుపులు దగ్గరగా వేసి నిద్రలో కొరిగిన లక్ష్మికి సడన్‌గా మెళుకువ వచ్చి చూస్తే గంట పదకొండున్నర చూపిస్తున్నది పక్క గదిలో యింకా లైటు వెలుగుతుండడంతో లైటు తియ్యకుండా వెళ్ళి పొయ్యారు కాబోలునని తలుపు తీసుకు వచ్చింది లక్ష్మి .

డాక్టరుగారు యింకా చదువుకుంటూనేవున్నారు

"మీరింకా యింటికి వెళ్ళలేదా?

ఆయన తలెత్తి "యింటికి వెళ్ళినా యీ పనేగా చేసేది .. అందుకని యిక్కడే కూర్చుని చదువుకుంటున్నాను." అన్నారు.

'మరి భోజనం?"

ఆయన చిన్నగా నవ్వేసి మళ్ళీ పుస్తకంలో పడిపొయ్యారు

లక్ష్మి మనసును ఎవరో మెలి దిప్పినట్లయింది ...

వెంటనే వెళ్ళి పళ్ళెంలో జంతికలు, అరిసెలు పెట్టుకుని వచ్చింది...

"యివెక్కడివి?" ఆశ్చర్యంగా అడిగారాయన.

"ఆ పేషెంట్లతో వచ్చినవాళ్ళు తెచ్చుకుంటారు . వద్దన్నా వినకుండా తినమని పెట్టిపోతారు "

"అలాగా . నేనింకా నువ్వు వాళ్ళ పొయ్యిదగ్గర కూర్చుని తయారు చేసేవేమో ననుకున్నాను అన్నారు నవ్వుతూ అవి తీసుకుని తింటూ

జరిగిన కథ–9: ఆత్మహత్యకు తలపడిన సీతకు కోడలిస్థానం ఇచ్చి ఆశ్రయం కల్పిస్తుంది కృష్ణవేణమ్మ. కాని శ్యామసుందర్ భార్యగా మాత్రం తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవద్దని శాసిస్తుంది. అత్తలేని సమయంలో భర్త మంచితనం సీతకు అర్థమవుతుంది. భార్యను తల్లి పనిమనిషిలా చూస్తున్నదని శ్యామసుందర్‌కు తెలుస్తుంది. పనిమనిషి కొండమ్మ ద్వారా అత్త నిజ స్వరూపం, శ్యామసుందర్ మొదటి భార్య ఆత్మహత్య వివరాలు సీతకు తెలుస్తాయి. సీతకు శ్యాంసుందర్ ఇంటి అధికారాన్ని అప్పగించడంతో కృష్ణవేణమ్మ మండిపడుతుంది ఆ పరిస్థితిని భరించలేక సీత ఇంటినుంచి వెళ్ళిపోతుంది. ఐదు సంవత్సరాల తర్వాత సీత పోలికలతో ఉన్న లక్ష్మిని శ్యామసుందర్ రెండునెలలకోసం తనదగ్గరికి నర్సుగా తెచ్చుకుంటాడు

లక్ష్మి మంచి నీళ్ళు తెచ్చిపెట్టి, "యింకొంచెం పెడతాను" అంటుంటే,

"యిక వద్దుకానీ... ఎంతసేపు నిలబడతావ్.... అలా కూర్చో." అన్నారు...

లక్ష్మి మొహమాటంగానే కూర్చుంది... రాత్రి డెలివరీ కేసుతో నిద్రలేదు... అందుకని కూర్చున్నది అట్లాగే వెనక్కు వాలి నిద్ర పోయింది లక్ష్మి...

కొన్నేపటికి సడన్‌గా మెళకువ వచ్చి చూస్తే తన దిండూ, పక్కా...

ఆశ్చర్యంగా లేచి కూర్చుంది ఎక్కడున్నానా అనీ.... తను యిందాక కుర్చీలో పడుకుని నిద్రపోయింది.... మరిక్కడకు ఎలా వచ్చింది?

తిరిగి చూస్తే డాక్టరుగారు పక్కనే నిలబడి వున్నారు... తన కళ్ళల్లోకి చూస్తూ, "మెడ పట్టుకుంటుందని తీసుకొచ్చి పడుకోబెట్టాను." అన్నారు....

లక్ష్మి మొఖం ఒక్కసారిగా పాలిపోయింది....

"ఏం ఎందుకంత కంగారు పడతావ్?.... యిప్పుడేం చెయ్యలేదుగా నిన్ను...." అంటూనే తన చూపుడు వేలుతో లక్ష్మి పెదాలపైన సుతారంగా అలా అన్నారు....

లక్ష్మి శరీరం పులకరించింది.

తన శరీరం తన వశం తప్పుతుందేమో నన్నంత భయం వేసింది. చప్పున నిగ్రహించుకుని,

"మీరు చదువుకోండి... నేను అలా వెళ్ళి అక్కడ ఆడవాళ్ళు పడుకుని వున్నారు... వాళ్ళ దగ్గర పడుకుంటాను." అని దిండూ, దుప్పటి తీసుకుని వెళ్ళబోతుంటే,


"అక్కర్లేదు లక్ష్మి... నేనే వెళ్ళి పోతున్నానులే." అన్నారు....

మర్నాడు అలాగే జరిగింది... డాక్టరుగారు చదువుకుంటూ కూర్చున్నారు.... లక్ష్మి తలుపులు చేరవేసి పడుకున్నది... ఆయన వెళ్ళాక భోజనం చెయ్యచ్చుని.....

అలా పడుకున్న మనిషికి ఎప్పుడు నిద్రపట్టిందో మెళుకువ వచ్చేసరికి యింకా పక్కగదిలో లైటు వెలుగుతూనే వుంది.... గదిలో తెచ్చిన కారియరు విప్పకుండా అలాగే వుంది.... కడుపులో ఆకలి అన్నం తినలేదని గుర్తు చేస్తుంటే లేచి తలుపుతీసి యివతలకు వచ్చింది.

డాక్టరుగారు చదువుకొంటున్నారు.... టేబిల్‌మీద సీసా..... ఆయన చేతిలో గాజుగ్లాసు... అందులో ఎర్రటి ద్రవం......

అదేమిటో తెలుసుకోలేనంత అమాయకురాలుకాదు లక్ష్మి... ఒక్కసారిగా ఏదో తెలియని పిచ్చి కోపం వచ్చింది....



పౌష్యలక్ష్మి

కనిపించు నింటింట కనుల విందొనరించు
నూతనోత్సాహ వినూత్న కాంతి;
కనిపించు వాకిళ్ళ కనక రాశులమించు
ముత్యాల ముగ్గుల మోహనాలు;
కనిపించు ప్రతివారి కళ్ళలో, ఇంటి లో -
గిళ్ళలో క్రొంగొత్త జల్లులెన్నొ;
కనిపించు నంతట కర్షక స్వేదము
రాల్చిన ధాన్యపు రాశులెన్నో;

వచ్చి పోవును సూర్యుడు ప్రతిదినమ్ము
నేడు కనిపించె వానిలో నిండుదనము;
వచ్చిపోవును తారకల్ ప్రతిదినమ్ము
నేటి చుక్కల గనిపించె మేటి 'ధనము

-డి. లక్ష్మణాచార్య

ఒకటి ఒకటి మూడు

ఒక్క అంగలో వెళ్ళి ఆ సీసా ఎత్తి సింక్‌లో కుమ్మరించబోయింది

పుస్తకంలో నుండి తలెత్తిన డాక్టరుగారు ఛివాలున లేచి ఒకే ఒక్క అంగలో వచ్చి లక్ష్మి చెయ్యి పట్టుకున్నారు సీసా వొంపెయ్యకుండా

నువ్వేం చేస్తున్నావో దాని ఖరీదు ఎంతో నీకు తెలుసా?

దాని ఖరీదు ఎంతన్నా కానీ అది మీ ఆరోగ్యానికి మంచిదా?

'నా ఆరోగ్యం గురించి పట్టించుకోడం మానేసి చాలా రోజులయిందని చెప్పాను

అయినా యిప్పుడు నాక్కావలసింది ఆరోగ్యం కాదు తెల్లవారి మళ్లీ పేషెంట్లు వచ్చేదాకా కాలం గడిచేమార్గం నిద్రవచ్చే వుపాయం కావాలి

'నిద్ర పట్టాలంటే వేరే వుపాయాలు లేవా?'

వున్నాయి. నిద్ర మాత్రలు వేసుకోవచ్చు లేదా మార్ఫియా తీసుకోవచ్చు అవి దీనికంటే బెటర్ అంటావా?

అయినా ఎప్పుడూ హద్దులు తెలుసునని, నా స్థానం తెల్సునని అనేదానివి యీ రోజు నీ స్థానం మర్చిపొయ్యావా? నువ్వు నా దగ్గర పని చేసే కేవలం ఒక నర్సువి

వెంటనే సీసా వదిలేసి, క్షమించండి అంటూ విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయి తలుపు గడియ పెట్టబోతుండగా ఒక్క అంగలో గుమ్మంలో నిలబడి చిన్నగా నవ్వుతూ అన్నారు

నేను యిద్దరు భార్యలతో కాపురం చేశాను. కానీ వాళ్ళెవరూ ఎప్పుడూ నా మీద యిలా అలిగి మొహంమ్మీద తలుపేసుకోలేదు '

లక్ష్మి మొఖం ఎర్రగా కందిపోయింది సిగ్గుతో రెండు చేతుల్లోనూ మొషం దాచుకుంది ఎరుపెక్కిన బుగ్గలు కనబడకుండా

ఆయన ఒకడుగు లోపలకువేసి, ఆ రెండు చేతులూ విడదీస్తూ, భోజనం చెయ్యలేదేం?' అన్నారు కళ్ళల్లోకి చూస్తూ

'షేర్ చేసుకోడానికి పిలవలేదన్నారుగా నిన్న వస్తారా?' అని అడిగింది లక్ష్మి

ఇద్దరికీ సరిపోతుందా ఆ కారియరు?

'ఆ లక్షణంగా. పైగా వాళ్ళెవరో పులిహోర కూడా తెచ్చిపెట్టారు

అయితే డాక్టరుకంటే నర్సుపనే బాగున్నట్లుందిగా సరే పెట్టు వద్దంటే మళ్లీ అలిగి యీ సారి ఆ గదిలో కెళ్ళి తలుపేసుకుంటే నేను యీ గదిలో చిక్కుకు పోతాను అన్నారు నవ్వుతూ

ఆ గదిలో ఒక టేబిల్, రెండు కుర్చీలు కూడా వున్నాయి లక్ష్మి సహజంగా ఆ టేబిల్ వాడదు టాయిలెట్ సామాన్లు పెట్టుకోడం తప్ప గబగబా ఆ టేబిల్ క్లీన్‌చేసి మంచినీళ్లు పెట్టి కారియరు తీసింది

అందులో ఒక్కటే అరిటాకు లక్ష్మికి ఒక్క సెకనుపాటు ఏం చెయ్యడానికి తోచలేదు ఆ తర్వాత చప్పున దాన్ని రెండుగా చీలుస్తుంటే కుర్చీలో కూర్చుని అంతా గమనిస్తున్న డాక్టరుగారు,

లక్ష్మి రేపు నీకు పెళ్ళయి మీవారూ నువ్వూ ఏ హనీమూన్‌కో వెళితే ఒక్క ఆకును యిలా రెండుగా చీలుస్తావా లేక పక్క పక్కన కూర్చుని ఒక్క ఆకులోనే యిద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తింటారా?'

లక్ష్మికి ఒక్కసారిగా దుఃఖం పొర్లుకొచ్చింది రెండు చేతుల్లోనూ మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తుంటే డాక్టరుగారు దగ్గరగా వెళ్లి రెండు చేతుల్లోకి తీసుకుని ఆ కన్నీళ్లు తుడుస్తూ, ఎందుకు లక్ష్మి ఏడుస్తావ్? నీ మనసు నొచ్చుకునే మాట ఏమన్నా అన్నానా?' అన్నారు అనునయంగా

లక్ష్మి అంతలో తనను తను కంట్రోలు చేసుకుంది ఆయన చేతులు విడిపించుకుని, విస్తరిమీద నీళ్లు చల్లి అన్నం వడ్డిస్తూ-

కొందరి కొందరి జాతకాల్లో కొన్ని కొన్ని సుఖాలు రాసిపెట్టి వుండవు నాకు పెళ్లి చేసుకోవాలనే తలంపులేదు కనుక దయచేసి ఆ విషయాలు నా దగ్గర ప్రస్తావించకండి' అన్నది

డాక్టరుగారు చిన్నగా నిట్టూర్చారు మౌనంగా భోజనంచేసి వెళ్ళిపొయ్యారు

ఆయన వెళ్ళాక తలుపులేసుకుని భోజనం చేస్తున్న లక్ష్మికి ఒకటే ఆలోచన తను యీ గదిలో వుండడం కష్టం అది భావ్యంకాదు ఏదో ఒక బలహీన క్షణాన తను ఆయనకు లొంగిపోతానేమోనన్న భయం కూడా కల్గుతోంది ఆ అమ్మాయికి సమస్యల మయమైన జీవితంలో మరో సమస్యను కూడా సృష్టించుకోడం ఎందుకు?

లక్ష్మికి వేరే చోట గది తీసుకుని వెళ్ళి పోవడం వుత్తమమనిపిస్తోంది యిక్కడకు వచ్చాక డబ్బులు ప్రాబ్లమ్ కూడాలేదు ఆపరేషన్ చేయించుకున్న పేషెంట్లు వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరూ పది రూపాయలకు తక్కువ కాకుండా యిచ్చి వెళ్తుంటారు ఆ విధంగా రోజుకు ముప్పయి నలభై రూపాయలకు తక్కువ కాకుండా వస్తుంటాయి లక్ష్మికి

అసలు ఆ అమ్మాయి ఎవ్వరినీ అడగాల్సిన పనిలేదు. అడగదు కూడా హెడ్ అసిస్టెంటు అచ్యుతరావు వసూలు చేసి సాయంత్రం వెళ్ళి పొయ్యేటప్పుడు అందరికీ పంచుతాడు

అసలు తను పొరబాటు చేసింది . ఏదో విధంగా ప్రశాంతంగా సాగిపోతోంది జీవితం అక్కడ అలాంటిది యీయన వచ్చి అడగడం డాక్టరమ్మగారు ఒప్పుకోడం తను కూడా మెత్తబడకుండా వుండాల్సింది రానంటే ఎవరేం చెయ్యగలిగేవాళ్లు ఏ శక్తి ఆ రోజున తన చేత తలవూపించిందో తెలియదు!

లక్ష్మి ఆ ఆలోచనలతోనే గడిపింది చాలాసేపు ఆ రాత్రి

★ ★ ★ ★ ★ ★

ఆ రోజు ఆదివారం సినిమా హాలు దగ్గర జనం కిటకిటలాడి పోతున్నారు అప్పుడే మొదటి ఆట వదిలిన జనం, రెండో ఆట టిక్కెట్లకు తన్నుకుంటున్న జనం

లక్ష్మివాళ్ళు ఆ జనంలో నుండి తప్పించుకుని కొంచెం దూరం వచ్చాక, అచ్యుతరావు రిక్షామాట్లాడి,


లక్ష్మి మీరీ రిక్షాలో ఎక్కండి మిమ్మల్ని నర్సింగ్‌హోమ్ దగ్గర దించేసి అంటుండగా వెనక కారాగిన శబ్దమయింది తిరిగి చూస్తే డాక్టరుగారు దిగుతున్నారు!

అచ్యుతరావ్ ' అన్నారు

'సార్!" ఆశ్చర్యంగా చూశాడు అచ్యుతరావు

"ఆ అమ్మాయిని నేను నర్సింగ్‌హోమ్ దగ్గర దింపుతాను నువ్వెళ్ళిపో మీ యింటికి "

ఆ చూపుల్లో కోపం, ఆ మాటల్లో పదును చూసి అచ్యుతరావుకు సవాలక


మొటిమలు ?
బైద్యనాథ్ సురక్తాస్ట్రాంగ్
మొటిమలు, చర్మవ్యాధులకు కారణమైన అపరిశుద్ధ రక్తమునకు కారణము
అంత్రములు ఉదరము సరిగా పనిచేయకపోవటమే
సురక్తా జీర్ణక్రియ సరిగా జరుగుటకు సహాయపడి
చర్మమును మృదువుగాను, సుందరముగాను
చేయును.
సురక్తాస్ట్రాంగ్ మలిన రక్తమునుండి
చర్మరోగములనుండి మిమ్ములను కాపాడును.
Baidyanath
SURAKTA
STRONG.
బైద్యనాథ్ సురక్తాస్ట్రాంగ్
మొటిమలు మొదలగువాటి నివారణకు సురక్షితమైన
విశ్వసనీయమైన ఆయుర్వేద ఔషధము

SKT 67 T SVR

ఒకటి ఒకటి మూడు

ప్రశ్నలు తోస్తే తోచి వుండచ్చు కానీ అవేమీ అతడువ్యక్తం చెయ్యకుండా, "లక్ష్మీ డాక్టరుగారు డ్రాప్ చేస్తారట... కార్లో వెళ్ళిపోండి అంటూ అచ్యుతరావే బాక్ డోర్ తెరిచి ఆ అమ్మాయి ఎక్కాక తలుపు వేసి, "గుడ్‌నైట్ సర్" అన్నాడు

"గుడ్‌నైట్ తలుపు మూసిన తీరు చూస్తే లక్ష్మి గుండెలు దడదడ లాడాయి . భయంతో చెమట పోస్తోంది అయినా మాట్లాడకుండా వెనక సీటులో వొదిగి కూర్చుంది

"ఈయనకు ఎప్పుడు కోపం వచ్చినా డ్రైవ్ చేస్తున్నది కారని, జాగ్రత్తగా డ్రైవ్ చెయ్యకపోతే ప్రమాదమని ఎందుకు మర్చిపోతారో తెలియదు' అనుకుంటూ వెనక్కు వాలి కళ్ళు మూసుకుంది

నర్సింగ్ హోమ్ కొంచెం దూరంలో వుండగా కారుకు బ్రేక్ పడింది ఆశ్చర్యంగా కళ్ళు తెరిచిన లక్ష్మికి తన కళ్ళల్లోకి మింగేసేలా చూస్తున్న డాక్టరుగారు కన్పించారు

అగ్నిమేఘం వర్షిస్తున్నట్లున్నాయి ఆ కళ్ళు .

న నర్సింగ్ హోమ్ . వచ్చిందా?' బిక్కు బిక్కుగా అడిగింది లక్ష్మి

లేదు

కారు . కారు ఆగితేను '

'నీతో మాట్లాడాలని ఆపాను '

లక్ష్మికి ముచ్చెమటలు పోస్తున్నాయి

"నా యింట్లో అయిదు నిముషాలు ఆగి ఫలహారం చేస్తే పరువు పోతుందని అట్టహాసం చేసిన దానివి అచ్యుతరావుతో సినిమాకు వెళితే ఆ పరువు పబ్లిక్ అవుతుందా? పదును పెట్టిన చాకుల్లా వున్నాయి మాటలు

"నేను అచ్యుతరావుతో సినిమాకు వెళ్ళలేదు "

మరి నేను మాట్లాడింది అచ్యుతరావు ఘోస్ట్‌తో నా?

కాదు వాళ్ళమ్మగారికి వొంట్లో బాగులేక, డ్రెస్సింగ్ చెయ్యాలంటే వాళ్ళ యింటికి వెళ్ళాను అక్కడ వాళ్ళ చెల్లెలూ, వదినా వాళ్ళు బలవంతం చేసి సినిమాకు తీసుకు వచ్చారు వాళ్ళిద్దరూ ఒక రిక్షా ఎక్కారు నేను వేరే రిక్షా ఎక్కబోతున్నాను

'అచ్యుతరావు వాళ్ళమ్మకు ఒంట్లో బాగుండకపోతే హాస్పిటలుకు తీసుకు రావచ్చుగా నేను ఫ్రీగా ట్రీట్‌మెంట్ యిచ్చేవాడిని అంతేగానీ యింటికి వెళ్ళాల్సిన అవసరం ఏమిటి?

- ఎలాంటి వాళ్ళయినా ఎంత గొప్పవాళ్ళయినా నా దగ్గర పని చేసేవాళ్ళను ముఖ్యంగా ఆడవాళ్ళను ఒకరింటికి పంపించనని వాళ్ళకు తెలుసే

లక్ష్మి మాట్లాడలేదు ఏమంటే ఏం కోపం వస్తుందోనని బెల్లం కొట్టిన రాయిలా చూస్తోంది

ఇక ముందెప్పుడూ నన్నడక్కుండా, నాకు తెలియకుండా ఎక్కడికీ వెళ్ళడానికి, ఎవరితో నూ తిరగడానికి వీల్లేదు.

సుధకు నేను చేసిన ప్రామిస్‌లో నీకు ఫ్రీ బోర్డింగ్ లాడ్జింగ్ యిస్తానన్నాను కానీ, ఏ దారిన పొయ్యే దానయ్యతోనో పెండ్లి జరిపించి పంపిస్తానని చెప్పలేదు అది మనసులో పెట్టుకుని మసలుకో."

పాము బుస కొట్టినట్టున్నాయి మాటలు ... లక్ష్మి జవాబు చెప్ప బొయ్యేంతలో సడన్‌గా కారు స్టార్టు చేసి నర్సింగ్ హోమ్ దగ్గర ఒక్క జర్క్‌తో ఆపేశారు .

లక్ష్మి దిగుతున్నప్పుడు కానీ, తలుపు వేసినప్పుడు కానీ శ్యామసుందర్ గారు తిరిగి చూడలేదు ఆ కోపం తాలూకూ వుధృతం తెలుసు కాబట్టి కారే కన్నీళ్ళు తుడుచుకుంటూ లోపలకు వచ్చింది లక్ష్మి.

మర్నాడు నర్సింగ్‌హోమ్ అంతా అట్ట పెనంమీద పేలిపోతున్నట్లే వుంది అర్ధరాత్రి అపరాత్రి సినిమాలకు తిరిగి వచ్చేవాళ్ళకు తలుపులు తీస్తున్నావా అని రామూను, ఎక్కడో కాస్త తుక్కు కనబడిందని స్వీపరు నాగమ్మను, డ్రిప్ పెట్టడం ఆలస్యమైందని అచ్యుతరావును, మందు తీసుకుంటున్న వాళ్ళను క్యూలో నిలబెట్టలేదని కాంపౌండరును, చివరికి పేషెంట్లు రెస్ట్ తీసుకోకుండా పొద్దుగూకులూ డిస్టర్బ్ చేస్తున్నారని వాళ్ళ తాలూకూ బంధువులక్కూడా చివాట్లు తప్పలేదు

గాలొస్తుంటే గదిలో ఫాను వేసుకున్నారని ఒక పేషెంటును, గాల్లేనప్పుడు ఫానెందుకు వేసుకోలేదని యింకో పేషెంటును ఆయన కోప్పడినప్పుడు మాత్రం లక్ష్మికి చచ్చే నవ్వొచ్చింది .

మొత్తానికి ఆ రోజంతా నర్సింగ్‌హోమ్ ఎక్స్‌ప్లోజివ్స్ పెట్టినట్లు పేలిపోతూనే వుంది .

లక్ష్మి యిది ముందుగానే వూహించింది కనుక పొద్దున్నే లేచి ఆయన టేబిలు, గది అంతా నీట్‌గా సర్దిపెట్టి, ట్యూబెక్టమీ ఆపరేషనున్న పేషెంటును ప్రిపేర్ చేసిపెట్టి, ఆయనకు సాధ్యమైనంత వరకూ తప్పించుకు తిరుగుతూ దూరదూరంగానే వుంది

ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలకే డాక్టరుగారు బయటకు వెళ్ళిపోతే, అమ్మయ్య యీ రోజుకు గాలివాన తప్పించుకున్నాను. అనుకుంటూ వెయిల్ తీసేసి మామూలుగా జడ అల్లుకుని తెల్ల చీర విప్పి రాత్రిళ్ళు కట్టుకునే మామూలు చీరకట్టుకుంటుండగా తలుపు కొట్టిన చప్పుడయింది

తీసి చూస్తే డాక్టరుగారు!

కళ్ళు అగ్నిగోళాల్లా వున్నాయి

శ్వాస నిప్పులు వెదజల్లుతోంది .

భయంతో ఒక్కడుగు వెనక్కు వేసింది లక్ష్మి.

ఈ గది ఖాళీ చేసి వేరే యిల్లు చూసుకుంటున్నావుటగా " పిచ్చి కోపాన్ని బలవంతంగా నిగ్రహించుకుంటున్నట్లున్నాయి ఆ మాటలు

లక్ష్మి గజగజ లాడిపోయింది

ఎవరు ఎవరు చెప్పారు? అన్నది

అచ్యుతరావు వాళ్ళ యింటి దగ్గర యిల్లు తీసుకుంటానన్నావుటగా?


నిజానికి లక్ష్మి యీ గది యిబ్బందిగా వుందని, ఎక్కడన్నా గది చూసుకోవాలని అన్నప్పుడు అచ్యుతరావు వాళ్ళ యింటి దగ్గరే ఒక గది వుందని, ఆడవాళ్ళు వొంటరిగా ఎక్కడో దూరంగా వుండేబదులు వాళ్ళ యింటి దగ్గరయితే వాళ్ళమ్మా వాళ్ళంతా తోడుంటారని అనడంతో ఆదివారం సాయంత్రం నర్సింగ్ హోమ్ అవుట్ పేషెంట్సుకు డిస్పెన్సరీ మూసేస్తారు, డాక్టరుగారు రారు గనుక ఆ సాయంత్రం వాళ్ళ యింటికి వెళ్ళింది లక్ష్మి ఎలాగో వెళ్ళింది గనుక ముసలమ్మకు డ్రెస్సింగ్ చేసి వచ్చింది

ఈ రోజు డాక్టరుగారు యింటికెళ్ళి అచ్యుతరావును పిల్చి, మీ అమ్మకు వొంట్లో బాగుండక పోతే డ్రెస్సింగ్ కావలసి వస్తే యిక్కడికెందుకు తేలేదని అడిగినప్పుడు అచ్యుతరావు జరిగిందంతా చెప్పేశాడు

ఆయనలా అడగింతర్వాత యిల్లు చూసుకుంటున్నానని చెప్పే వమ్ములేకపోయింది లక్ష్మికి.

అందుకే మౌనంగా గుటకలు మింగుతూ నిలబడిపోయింది.

"ఏం యీ గది నచ్చలేదా?" ఆయన మళ్ళీ అడిగారు..



"కొంచెం దూరంగా వుంటే – బాగుంటుందని. " తలొంచుకుని చెప్పింది

'అంటే – దూరంగా వుంటే నువ్వు ఎక్కడ తిరిగినా, ఎవరితో గడిపినా నాకు తెలియకుండా వుంటుందనా?"

లక్ష్మి వులిక్కిపడింది

"డాక్టర్రుగారూ!' అన్నది నిర్ఘాంత పోయి .

"ఏం అమాయకురాల్లా ...' ఎందుకలా చూస్తావ్?... యిక్కడుంటే అచ్యుతరావుతో నో, కాంపౌండరుతో నో, మేల్ నర్సులతో నో సినిమాలకు షికార్లకు తిరగడానికి లేదనేనా వెళ్ళిపోవడం?"

లక్ష్మికి పిచ్చి కోపం వచ్చింది... ఏం మాట్లాడుతున్నదో కూడా తెలియనంత ఆవేశంలో.

'నేను ఎక్కడ వుంటున్నానో, ఎవరితో తిరుగుతానో మీకనవసరం మీ డ్యూటీ టైములో ఎక్కడి కన్నా వెళితే అడగండి, డ్యూటీ సరిగ్గా చెయ్యకపోతే అడగండి అంతే గాని డ్యూటీ లేని వేళల్లో నా యిష్టం నేనొకళ్ళకు జవాబు చెప్పాల్సిన పని లేదు ." అన్నది

"జవాబు చెప్పాల్సిన పని లేదా?' ఒక్క అంగలో వచ్చి యీ చెంపా ఆ చెంపా వాయించేశారు.

దిమ్మ తిరిగి పోయింది లక్ష్మికి నర్సుగా తను దెబ్బలు తినడం యిది రెండో సారి .

ట్రయినింగుకు చేరిన కొత్తల్లో ఆపరేషను థియేటరులో తప్పు చేసిందని దెబ్బలు తిన్నది డాక్టరుగారి చేత.. అయితే ఆయన పెద్దవాడు, కోపం ఎక్కువని సరిపెట్టుకుంది

కానీ యీ నాడు అనవసరంగా మాటలనడమే కాకుండా చెయ్యి చేసుకోడం కూడా! లక్ష్మికి కోపం వచ్చింది.

ఎర్రబడ్డ కళ్ళతో సూటిగాచూస్తూ,

'నేను నర్సును మీరు డాక్టరు .. నేను వుద్యోగం చేస్తున్నాను మీ దగ్గర నా పని నచ్చకపోతే. మా డాక్టరమ్మగారి దగ్గరకు పంపించెయ్యండి

అంతేగానీ నన్ను కొట్టే అధికారం మీ కెవరిచ్చారు?' అన్నది

"అధికారం ఎవరిచ్చారా? ..' సూటిగా కళ్ళల్లోకి చూసేసరికి, ఎర్రటి జపా పుష్పాల్లా వున్న ఆ కళ్ళల్లోకి చూడలేక కళ్ళు వాల్చేసింది లక్ష్మి. .

"నిన్ను డాక్టరమ్మ దగ్గరకు పంపించెయ్యాలా?..

ఏం అక్కడెవరన్నా వున్నారా ఫ్రెండ్స్? . గేట్‌మాన్‌లూ, వాచ్‌మన్‌లూ నువ్వు లేవని దిగులు పడుతున్నారా?'

లక్ష్మికి దుఃఖం పొంగులా వచ్చింది

"ఏమండీ . " అంటూ రెండు చేతుల్లో మొహం దాచుకుని లోపల కెళ్ళిపోయి తల పిచ్చిగా గోడ కేసి కొట్టుకుంటుంటే, అపర రుద్రమూర్తిలా లోపలకు వచ్చిన డాక్టరు గారు జడ పట్టి లాగి, ఆ అమ్మాయిని మంచం మీద పడేసి.

"యీ సారి పిచ్చి పిచ్చిగా ప్రవర్తించావంటే ఆ పని నేను చేస్తాను మైండ్ దట్' విసురుగా తలుపులు దగ్గరకు వేసి వెళ్ళిపోయ్యారు

లక్ష్మి ఏడుస్తూ అలాగే పడిపోయింది . తన జీవితం అంతా యింతే కాబోలుననిపించింది ఆ అమ్మాయికి..

మంచికి పోవడం, అనవసరంగా అపవాదులు పడడం, నానామాటలూ భరించడం జీవితంలో సుఖం శాంతీ అనే వాటికీ మరీ మరీ దూరమవడం

తన సమస్యకు పరిష్కారం ఏమిటి?

తన జీవితానికి మార్గం ఏమిటి?

ఎవ్వరితో చెప్పుకోగలదు?

ఎవరిని సలహా అడగ్గలదు.

పక్క గదిలో లైటు వెలుగుతూనే వుంది అర్ధరాత్రి దాటిన తర్వాత మెలుకువ వచ్చింది... డాక్టరు గారు వెళ్ళిపోతే తలుపు లేసుకోవాలని అనుకుంటూ పక్కగదిలోకి వచ్చింది..

కుర్చీలో వెనక్కు వాలి నిద్రపోతున్నారు డాక్టరుగారు. ఎదురుగా తెరిచి పెట్టిన మెడికల్ జర్నల్... పక్కన మళ్ళీ అదే బాటిల్ ..

లక్ష్మి లోపలికి వెళ్ళి తన దిండు తీసుకొచ్చి నెమ్మదిగా తలకింద సర్దుతుంటే కళ్ళు తెరిచి చూశారాయన..

మెడ . పట్టుకుంటుందేమోనని " అన్నది బిక్కగా మళ్ళీ ఏమంటారో నన్నట్టు చూస్తూ

చిన్నగా నిట్టూర్చి, "థాంక్స్" అనేసి ఆ దిండు సరిచేసి పెట్టుకుని మళ్ళీ నిద్ర కుపక్రమించబోతుంటే,

"రాత్రికి యింటికి వెళ్ళి. భోజనం అదీ ఏమీ చెయ్యరా?" అన్నది..


ఒక్క తృటికాలం మండుతున్న కళ్ళతో అలా చూసి, "నేను డాక్టర్ని. నువ్వు నర్సువి నేను తింటానో మానుతానో పడుకుంటానో వూరేగుతానో . అడిగే అధికారం నీకుందా?" అన్నారు.

"సారీ" అనేసి తన గదిలో కెళ్ళిపోయి బోల్టు పెట్టుకుంది లక్ష్మి . ఆయన ఎప్పుడు లేచి యింటికి వెళ్ళారో .. అసలు వెళ్ళలేదో కూడా తెలియదు ఆమెకు ..

ఏడున్నర ప్రాంతంలో తలుపు కొడితే మెళకువ వచ్చింది తలుపు తీస్తే ఎదురుగా స్వీపరు నాగమ్మ

"డాక్టరు గారు పిలుస్తున్నారు." అంటూ, "అదేంటమ్మా అట్లా వున్నారు. మొఖం వుబ్బరించింది కళ్ళు వాచి వున్నాయి కారియరు మూత కూడా విప్పినట్టు లేదు.. రాత్రి జ్వరమేమన్నా తగిలిందా ఏమిటి?" అంటూ లోపలకు వచ్చింది..

లక్ష్మి గబగబా మొహం కడుక్కుని, బొట్టు పెట్టుకుని వచ్చేసరికి



"సిజేరియనుంది పేషెంటును ప్రిపేర్ చెయ్యి " తలెత్తి ఆ అమ్మాయి వైపు కూడా చూడకుండా చెప్పారు

సిజేరియన్ సంగతి మర్చిపోయి ఎండెక్కే దాకా పడుకుంది తను నలుగురి ముందు ఏమంటారో డ్యూటీ సరిగా చెయ్యలేదని అనుకుంటూ అలాగేనని వెళ్ళిపోయింది

డాక్టరు గారు థియేటరులో వున్నప్పుడు కానీ, కన్సల్టింగ్ రూమ్‌లో కానీ అసలు తెలిసినట్టు కూడా వుండరు తలెత్తి చూసే ప్రశ్న కూడా లేదు.

ఎబ్డామినల్ కావిటీ రిట్రాక్టర్ క్లాంప్స్ ఫొర్సెప్స్ యిలా యంత్రంలా అందిస్తూ పోవలసిందే

ఇక్కడికి వచ్చాక గమనించింది ఆయనకు పొద్దునంతా ఆపరేషను కేసులతో సరిపోతుంది సాయంత్రమే మామూలు పెషెంట్సును చూసేది

ఆపరేషను అయిపోయి పేషెంటును తీసుకొచ్చి పడుకోబెట్టగానే సెలైన్ పెట్టి క్రిందికి వచ్చింది

ఈలోగా డెలివరీ కేసు అలాంటి కేసులో నాగమ్మ కొంచెం సాయం చేస్తుంది మామూలుగా అయితే అచ్యుతరావు వాళ్ళు కూడా సాయం చేస్తారు వాళ్ళందరూ చాలా అనుభవం వున్న వాళ్ళు తనకు సాయం చెయ్యడమో సలహా యివ్వడమో చేసేవాళ్ళు ఈ రోజు అంతా థియేటరులోనే వున్నారు

ఒకటి ఒకటి మూడు

లక్ష్మి డెలివరీ పెయిన్స్ అవునో కాదో చూసుకుని, ఎనీమా అదీ యిచ్చి, డయలటేషను చూసుకొని నొప్పులు పెరగడానికి యింజక్షను చేసి . ఆ కేసు దగ్గరే వుంది...

మనసంతా కకావికలుగా వుంది . రాత్రి సంఘటన, డాక్టరు గారి కోపం ఆ తర్వాత ఆయన ఆ కుర్చీలో వాలిపోయిన తీరు. ఎన్నిసార్లు 'మర్చిపోదామని ఎంత ప్రయత్నించినా మర్చిపోలేక పోతోంది.. మనోఫలకం మీద మళ్ళీ మళ్ళీ అవే ప్రత్యక్షమవుతున్నాయి .

కాలం గడిచిపోతోంది నొప్పులు ఎక్కువ కావడానికి కొంత టైము తర్వాత మళ్ళీ యింజక్షను యిచ్చింది

డెలివరీ అయ్యాక బేబీని క్లీన్ చేసి, బరువు తూచి వుయ్యాల్లో పడుకో బెడుతుండగా సడన్‌గా గుర్తొచ్చింది తను ఆ సిజేరియన్ పేషెంటును గురించి పట్టించుకోలేదని ..

వాళ్ళెవరూ వచ్చి గుర్తు కూడా చెయ్యలేదు.

ఒక్క వుదుటున వెళ్ళింది లక్ష్మి . చూస్తే పల్స్ అందటం లేదు . బి. పి బాగా పడిపోయింది. బ్లీడింగ్ కూడా ఎక్కువైంది.

లక్ష్మికి చమటలు పోశాయి.. మనసు బాగుండక తను యీ పేషెంటును గురించి పట్టించుకోలేదు . యిప్పుడు పరిస్థితి యిలా వుంది . డాక్టరు గారు ఏమంటారో...

ఏమైతే అయింది.. ఏమన్నా అననీ.. లక్ష్మి థియేటరు దగ్గరకు పరుగెత్తింది

శ్యామసుందర్ గారు అప్పుడే థియేటరు నుండి యివతలకు వచ్చారు యాంటీ రూమ్‌లో వున్నారు. యింకో ఆపరేషను లోపల కాఫీ తాగుతున్నారు.

లక్ష్మి వెళ్ళి "ఏమండీ?" అన్నది వణికే గొంతుతో ఏమిటన్నట్లు చూశారాయన

"ఇప్పుడే సిజేరియన్ చేసిన పేషెంటు కండిషను బాగుండలేదు పల్స్ అందటం లేదు బి పి పడిపోయింది "


'డ్రిప్ చూసుకోలేదా?" కళ్ళల్లోకి చూస్తూ అడిగారు లక్ష్మి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి .

అవునన్నట్లు తలాడించింది

తాగబోతున్న కాఫీ కప్పు అక్కడ పెట్టేసి, మాస్కు తీసేసి వెంటనే వచ్చేశారాయన .

వెంటనే యింజక్షన్సు యిచ్చి మళ్ళీ డ్రిప్ పెట్టించి స్పీడప్ చేసి కాసేపు 'అక్కడే వున్నారు . మళ్ళీ పల్స్ స్టెడీ అయి బి. పి కొంచెం రెయిజ్ కాంగానే లక్ష్మికి యిన్‌స్ట్రక్షన్సు అన్నీ యిచ్చి వచ్చేస్తుంటే అన్నది లక్ష్మి చిన్నగా

"థాంక్యూ సోమచ్ సర్ '



ఆగి ఒక్క సెకను పాటు ఆ కళ్ళల్లోకి చూసి,

ఇట్సాల్ రైట్ అని మళ్ళీ థియేటరులోకి వెళ్ళబోతూ, "మన పర్సనల్ ప్రాబ్లమ్స్ మనం డ్యూటీలో వున్నంత మటుకు మరిచిపోవాలి " అనేసి లోపలకు వెళ్ళిపొయ్యారు

అంటే – తన మనసు బాగుండలేదని ఆయన గ్రహించారన్నమాట ఇదే తను క్రొత్తల్లో పని చేసిన డాక్టరయితే ఎంత కోప్పడేవారో రాత్రి అంతగా కోపగించుకున్నాయన యీ రోజు నలుగురి ముందు పన్నెత్తు మాట అనలేదు!

రాత్రే ఆయన్ను సవాలు చేసింది తను డ్యూటీలో తప్పు జరిగితే అడగమని. యీ రోజు తను ఫెయిల్ అయింది!

ఆ రోజంతా లక్ష్మి మధ్యాహ్నం కూడా ఒక్క నిముషమైనా రెస్టు తీసుకోకుండా ఆ పేషెంటును చూసుకుంటూనే వుంది

ఆ రాత్రి పేషెంట్లు వెళ్ళిపోగానే ఒక చాప, దిండు తీసుకుని పల్లెటూళ్ళ నుండి వచ్చిన పేషెంట్ల తాలూకూ ఆడవాళ్ళు పడుకున్న చోట పంచలో వాళ్ళతో బాటు కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నది లక్ష్మి

తను అలా వెళ్ళడం చూసినా డాక్టరు గారు ఏమీ అనకపోవడం ఆశ్చర్యం కలిగించింది లక్ష్మికి

అలాగే నాలుగయిదు రోజులు పూర్తిగా ఆయన్ను తప్పించుకు తిరిగింది డెలివరీ కేసెస్ లాంటి వుంటే అసిస్ట్ చెయ్యడం లేకుంటే జనరల్‌గా పేషెంట్ల టెంపరేచరు నోట్ చెయ్యడం మొదలైన పన్లు ఏవో కల్పించుకుని, మిగతా వాళ్ళకు సాయం చేస్తూ అలా అలా దూరంగా తిరుగుతోంది.

నాలుగు రోజుల తర్వాత కాబోలు డాక్టరు గారు రౌండ్స్‌లో వున్నారు ఆపరేషన్లన్నీ అయిపోయి యింటికి వెళ్ళబోయే ముందు ఒకసారి పేషెంట్సును అందర్నీ చూసుకు రావడం ఆయన అలవాటు

అలాగే చూసుకుంటూ వస్తుంటే స్పెషల్ రూములో వున్న ఆయన ఫ్రెండు ఒకాయన అడిగారు

"హు యీజ్ దట్ యంగ్ అండ్ బ్యూటిఫుల్ నర్స్ డాక్టర్" అని

ఆయన అర్థంకాక పక్కనున్న అచ్యుతరావు వైపు, సదాశివరావు వైపు ప్రశ్నార్థకంగా చూస్తుండగా

"అదే టెంపరేచరు చూద్దామని వచ్చింది పొద్దున ఆ అమ్మాయి యిది వరకు మీ హాస్పిటల్లో చూడలేదు నేనా అమ్మాయిని అన్నాడా పేషెంటు అచ్యుతరావు, పొద్దున లక్ష్మి టెంపరేచరు తీసింది ' అన్నాడు డాక్టరుగారి మొఖం సీరియస్‌గా అయిపోయింది

లక్ష్మినా షి యీజ్ రిలేటెడ్ టు మి యిదివరకున్న సావిత్రి మెటర్నిటీ లీవ్ కావాలని వెళితే యీ అమ్మాయిని యీ రెండు నెలలు సాయం చెయ్యమని తీసుకొచ్చాను. వాళ్ళ అక్క కూడా డాక్టరు " అని చెప్పేసి యివతలకు వచ్చారు.

మిగతా పేషెంట్సును చూడ్డం కూడా కట్ చేసి సరాసరి క్రిందికి వచ్చి, లక్ష్మీ అని ఒక్క కేక పెట్టారు

ఆ పిలుపుకు ఆయనతో బాటు వచ్చిన అచ్యుతరావు, సదాశివరావులే కాదు జ్వాలామూర్తి, విశ్వనాథం కూడా వులిక్కిపడ్డారు

లక్ష్మి అయితే బిక్కుబిక్కు లాడుతూ వచ్చి నిలబడింది

అందరికీ టెంపరేచరు చూడమని నీకెవరు చెప్పారు? అన్నారు

నిజానికి వాళ్ళు నలుగురూ థియేటర్ దగ్గర బిజీగా వున్నారని, నేను చూస్తానులే అని చెప్పి లక్ష్మే వచ్చింది

అందుకే ఏం చెప్పడానికీ తోచక బిక్క మొగంతో నిలబడింది

"రేపటి నుండి నువ్వసలు వార్డ్‌లో కెళ్ళాల్సిన పని లేదు, నేను చెబితే తప్ప లేడీ పేషెంట్సుకు అటెండ్ అవు లేదా యిక్కడ యీ రూమ్‌లో వుండి నాకు అసిస్ట్ చెయ్యి

అంతేగానీ నువ్వు అనవసరపు వాటిల్లో ఇన్‌వాల్వ్ అయితే సుధకు సమాధానం చెప్పుకోవలసిన వాడను నేను డుయూ హియర్ యిట్ అని

అచ్యుతరావు వైపు తిరిగి, గివ్ హర్ ఏజ్‌లెస్ వర్క్ ఏజ్ పాజిబుల్ మరీ తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప మేల్ పేషెంట్ల దగ్గరకు పంపకండి' అని చెప్పి వెళ్ళిపొయ్యారు

(ఇంకా ఉంది)



అప్పటికి యొ ఎదిసార్లో వరండాలోంచి వంట గదిలోకి వంటగది లోంచి వరండాలోకి కాలు కాలిన పిల్లి లా తిరిగాడు శ్రీనివాసరావు


మరి అంత తొందరైతె యెలానండి చేస్తూనే వున్నాగా ! ఎంత కొత్త ఆఫీసర్ అయితే మాత్రం అంత కంగారటండి ! అక్కడ మీ ఆఫీసర్ మారాడే గాని యింట్లో పాత స్టవ్ స్థానంలో గ్యాస్ స్టవ్ రాలేదంది త్వరగా తెమల్చడానికి కాసేపు అలా వరండాలో కూర్చుని చిన్న పిల్లలకు హోం వర్కు చేసి పెడుతూ వుండండి ఉడికిన తర్వాత పిలుస్తాను అంది అనసూయమ్మ

అది కాదే అనసూయా! యీ కొత్త ఆఫీసర్ మహామొండికుడట! క్రమశిక్షణ అంటూ ప్రక్క వూర్లోని బ్రాంచిని గడగడలాడించార్ట ! యిప్పుడు మా ప్రాణాల మీదికి వచ్చాడు

ఆయన మాత్రం మనిషి కదండి ! కొద్ది ఆలస్యానికి సర్దుకు పోలేరా మరీ విపరీతం కాకపోతే

మరో సారైతే యెలాగో సర్ది చెప్పొచ్చు మరి తొలి రోజే అతని దృష్టిలో పడటం బావుండదు అంటూ వరండాలోకి నడిచాడు

ప్రతిరోజూ సరైన వేళకే ఆఫీస్ చేరాలనుకొంటాడు శ్రీనివాసరావు. పాపం... కుదిరి చావదే ..! యెప్పటి కప్పుడు యేవో అడ్డంకులు. శ్రీమతి కోరిక మీద కూరగాయలకు వెళ్లటం వలనో, సైకిల్ తీసుకొని ట్యూషన్ కెళ్లిన పెద్దాడు ఆలస్యంగా రావటం వలనో, చిన్న పిల్లకి హోంవర్కు చేయిస్తూ వుండటం వలనో, యిదిగో యిలా శ్రీమతి వంట జ్యాపం వలనో... లేట్‌గా వెళ్లటం తప్పనిసరి అయింది. అందుకే ఆయనకు ఆఫీసులో 'లేట్



మాస్టారు' అని ముద్దు పేరు.

ఎంత తొందర చేసినా – అనుకొన్న ఆలస్యం కానే అయింది...!

ఆదరాబాదరా సైకిల్ తొక్కుకుంటూ ఆఫీస్ చేరుకొనే సరికి పావు గంట లేట్...!

బిక్కు బిక్కు మంటూ ఆఫీసు లోపల అడుగు పెట్టిన శ్రీనివాసరావు అక్కడి వాతావరణాన్ని చూసి – బిక్క చచ్చిపోయాడు. ఎవరి సీట్లో వారు కూర్చొని బుద్ధిగా పని చేస్తున్నారు. లేట్‌గా వచ్చిన తనను చూసి ముసి ముసిగా నవ్వుకొన్నారందరూ..! "లేట్ మాష్టారు యివాళైనా త్వరగా రాకూడదా..?' సన్నగా యెవరో అనటం విన్పించింది.

తొలిరోజే.. కొత్త బాస్ చేత చీవాట్లు తప్పవు. మౌనంగా తన సీటు వంక నడవబో యేంతలో –

"మిమ్మల్ని రాగానే అయ్యగారు కలవమన్నారు..." ముసి ముసి నవ్వుల మధ్య వార్త అందించాడు అటెండర్.

శ్రీనివాసరావుకి బి. పి. పెరిగింది.

దడ దడ కొట్టుకొంటున్న గుండెను అదుపులో పెట్టుకొంటూ – స్ప్రింగ్ డోర్ తెరచుకొని, లోపలకు అడుగు పెట్టి – దోషిలా తల వంచి నిల్చొన్నాడు. మెదడులో నిక్షిప్తమై వున్న అబద్ధాల దొంతర లోంచి... ఓ పుటను లాగి, "సార్...! ప్రతిరోజూ కరెక్ట్‌గానే వచ్చేవాడ్ని. యీ రోజు సైకిల్ ఎక్కబోయేంతలో... క్యారియర్ పడిపోయింది. మళ్లీ సర్దుకొని...."

'క్రమశిక్షణ'

మాస్టారూ.! మీరిక్కడ ' అంటూ లేచి తన దగ్గర కొస్తున్న ఆఫీసర్‌ను – తలవంచుకొనే క్రీగంట చూసి ఆశ్చర్యపోయాడు శ్రీనివాసరావు

ఆయన జ్ఞాపకాల పొరలలో కదలిక.

గుర్తుకు తెచ్చుకొనే ప్రయత్నంలో ఆలోచన .

"నేను మాస్టారూ! భాస్కర్‌ని మీకు జ్యోతి మిడిల్ స్కూల్‌లో స్టూడెంట్‌ని '

'ఓఁ భాస్కర్ .. గుర్తుకు వస్తూంది ." చిన్ననాటి భాస్కర్ రూపాన్ని ప్రస్తుత రూపంతో సమన్వయం చేసుకొంటూ అన్నాడు

శ్రీనివాసరావుని కుర్చీలో కూర్చోబెట్టి, తన సీట్లో కూర్చున్నాడు భాస్కర్

"అవును మాస్టారూ! భావి పౌరులను ఆదర్శవంతులుగా తీర్చిదిద్దాలనే తపన కలిగిన మీరు – ఆ వృత్తిని వదలి . యిలా యిక్కడ " అడిగాడు భాస్కర్

"అన్నీ అనుకొన్నవి అనుకొన్నట్లు జరగవు బాబూ! ఆ రోజుల్లో క్రమశిక్షణ – ఆదర్శం .' అంటూ యెంత ఆరాటపడే వాడినో మీకు గుర్తుండే వుంటుంది. .' ఆ క్రమశిక్షణే నాకీ మార్పు తెచ్చి పెట్టింది నేను పని చేస్తున్న స్కూల్ ప్రవేట్ యాజమాన్యం క్రింద పనిచేసేది కదా! అందులో ఫీజు చెల్లించి చదివే వారిలో – శ్రీమంతుల పిల్లలు యెక్కువ మంది వుండేవారు వారిలో యెక్కువ మంది సరదాకోసం చదివేవారేగాని చదువుకోసం వచ్చేవారు కాదు వారు యెలాంటి అల్లరి చేసినా భరించాలేగాని – మందలించ కూడదు ! అయినా మన సొప్పక అప్పుడప్పుడూ యెవరో ఒకరిని మందలించటం. యాజమాన్యంచేత మందలింపబడటం జరిగేది ! క్రమశిక్షణ యెవరికి కావాలి ? చివరకు వుద్వాసన తప్పలేదు..."

"పిల్లల భవిష్యత్తుకోరే మీలాంటి వారిని, ఆ పవిత్రమైన వృత్తిలోంచి తొలగించటం ఘోరం మాస్టారూ!"

"అక్కడనుండి తప్పుకొన్నాక – ఒక పుణ్యాత్ముడు నామీదగల అభిమానంతో యీ కంపెనీలో గుమాస్తా వుద్యోగానికి రెకమెండ్ చేశారు అప్పట్నించి యిలా యీ కుర్చీకి, టేబిల్‌కు, షెల్ఫ్‌కు. అలవాటుపడి రొటీన్ జీవితం గడుపుతూ వున్నాను " వేదన పొంగి, కళ్ళు చెమ్మగిల్లాయి హృదయం తేలిక పడింది.

'మీ పట్ల యెంత పొరపాటు జరిగిపోయింది మాస్టారూ! భావి తరాల భవిష్యత్తుకోసం – మీరు తీసుకొనే శ్రద్ధ, పొందే తపన నాకు బాగా గుర్తుంది ఆ రోజుల్లో – మొదట్లో మీ మాటలు విపరీతమనిపించినా, నాటి మీ మాటల ప్రేరణే నన్నో నిజాయితీ ఆఫీసర్‌ను చేయగలిగింది మీరు చెప్పిన ప్రతిమాటతోనే నేను నా జీవితపు బాటను మలచుకొన్నాను.. యిప్పుడు పావుగంట ఆలస్యమైనందుకు మీ రెంత వ్యథను చెందారో చూస్తుంటేనే తెలుస్తుంది.

"మరి నా ఆలస్యం .' ఆశగా భాస్కర్‌వంక చూశాడు

"భలేవారండి .. యివే మాటలు మరెవరో చెప్పివుంటే – కట్టుకథలను కొనేవాడ్ని – స్వయంగా మీరే చెప్పాక..! నా ఆదర్శమూర్తిని తప్పుపట్టేంత గొప్పవాడ్ని కాలేదు మాస్టారూ. "

శ్రీనివాసరావు యీసారి నిజంగా తలవంచు కొన్నాడు

తను క్రమశిక్షణ నేర్పించిన భాస్కర్ – తను దోషిలానిలబడి అతనికే కట్టు కథలు చెప్పాల్సిన దుస్థితి' కళ్ళు చెమ్మగిల్లి. చెంపల వెంబడి నీళ్ళు కారసాగాయి.

భాస్కర్ త్రుళ్ళిపడి, "అదేంటి మాస్టారూ , యిప్పుడేమైందని అన్నాడు.

'లేదు భాస్కర్. నేను మీ ముందు ఓడిపోయాను క్రమశిక్షణతో మెలగమని ఒకనాడు అరచి గీపెట్టిన నేను వాటిని పూర్తిగా మర్చిపోయాను కాలవాహినిలో తగిలిన దెబ్బలకు రాటు దేలకపోగా – నాలోని ఆశయాలు, ఆదర్శం. కరిగిపోయాయి అన్నిటినీ గాలికి వదిలేశాను పరిస్థితులు నన్నీస్థాయికి దిగజార్చాయి యింట్లోని సాధారణ యిబ్బందులు – ఆఫీసర్ల అలసత్వం . యేదో కట్టుకథలు చెప్పి ఒప్పించటమో నాలుగు అక్షింతలు వేయించుకొని సరిపెట్టుకోవటమో జరుగుతూంది నిజం భాస్కర్ యివాళ మీతో చెప్పిన సంఘటన వాస్తవంకాదు అందుకే సిగ్గు పడుతున్నాను క్షమించమని అడిగేందుకూ నోరు రావటం లేదు " తలవంచుకొన్నాడు శ్రీనివాసరావు

నో . నో అంతమాట అనకండి పరిస్థితులు మనపైచూపే ప్రభావాలకు ఒక్కోసారి తట్టుకోవటం కష్టమే! మీరు యిప్పటి విషయం మర్చిపోయి – పాత మాస్టారిలా మాకు ఆదర్శం కండి. అదే నా కోరిక " అన్నాడు భాస్కర్

చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకొని – డోర్ తెరచుకొని – తన సీట్లో కూర్చున్నాడు శ్రీనివాసరావు


తర్వాత మరెప్పుడూ ఆలస్యంగా రాలేదు.

లేట్ మాస్టారు – లేటెస్ట్ మాస్టారుగా మారిపోయాడు □

సంక్రాన్తి సంబరాలు

వావి వరుసల పరిహాస వచనములకు;
నిండు పంబరముల రమణీయతలకు;
శ్రేయమున్ గూర్చునట్టి ఆత్మీయతలకు;
సౌఖ్య లక్ష్మి స్వాగత గీతి పలుకునంట.
చురుకుగ జూచెడి కన్నుల
మరదలి సరసాల శోభ మాటు వడంగన్
మురిపెమ్ముల, మోజుల; ను
క్కిరి బిక్కిరియాయె బావ – కిమ్మనకుండన్.
తలుపు వెనుక నిలిచి – తల యోరగా బెట్టి –
మగని జూచుచున్న, మనుమరాలి
ఆత్రమరసి అవ్వ – "అసి! నీవెంత ఆ
సాధ్యురాల" వనుచు చరచె బుజము.
ముద్దు ముద్దుగ దోసెడు ముద్దబంతి
పూలు చెండుగ జుట్టి – కొప్పున నమర్చి
కనుల యెదుట మహాలక్ష్మి కదలినట్లు
తెలుగు నారి ముదమ్మున గులుకుచుండు.
మనసొక మయూరమై – నృత్య మండపమ్ము
గృహముగా – శోభ లొల్కంప– గృహిణి తగిన
రీతి కరతాళ గతుల సంప్రీతి గూర్చ
సంక్రమణ నవ్య నాట్యమ్ము సలుపు నరుదు
ముక్కు వంకరయైనను మొగము చక్క
నిది సుమా! యన "చాలులే! నీవు మాట
లాడకుము నోరు వంక మీ అన్న కనుచు"
వదినతో – అడబడుచు వివాదపడియె.
ఉప్పు పొడి గల్పి తాంబూల మొసగె నాడ
బడుచునకు ప్రేమ నొల్కించి వదినగారు–
అయ మాయకురాలేమొ! అట్టినమలి
గలగలా నవ్వె యిచ్చిన గడుసు కత్తె.

–బృందావనం రంగాచార్యులు



హైదరాబాద్ నోట్‌బుక్

శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రి గారి శత జయంతి :–

నేను శ్రీ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రి గారిని మొదట దర్శించింది 1948లో మిత్రులు శ్రీ బులుసు వేంకట రమణయ్య గారితో పాటు వెళ్లాను శరతల్ప గతుడైన భీష్ముని తలపిస్తూ, పడుకున్నారాయన ఒక సేవకుడు ఆయనను ఇటు అటు పొర్లించి ఏదో చూర్ణం ఒంటికి రాస్తున్నాడు రంగురంగుల పావురాలు గదంతా ఎగురుతూ, ఆయన మీద వాలుతూ వయ్యారాల నడకలతో, రాగరంజితమైన చూపులతో ఉల్లాసం కలిగిస్తున్నాయి శాస్త్రి గారు ఏదో చెబుతున్నారు నేను, తక్కినవారు వింటున్నాము నిజానికి న దృష్టంతా పావురాళ్ల మీదే వుంది దాదాపు ఒక గంట ఉన్నట్లు జ్ఞాపకం ఆయన ఏదో చేయమన్నారు, వ్రాయమన్నారు సరే నన్నారు తర్వాత ఒక సారి ఆయనను దర్శించాను అంతే 1956లో ఆయన కీర్తి శేషులయ్యారు శాస్త్రి గారు కొన్ని దశాబ్దాలు పక్షవాతంతో ఉన్నా వావిళ్ల సంస్థను పక్క మీది నుంచే నిర్వహించా, రంటే, అదొక సాహసం, పవాడం (అద్భుతం) తనను అటు ఇటు పొర్లించి మందులు రాయడానికి, తక్కిన ఉపచారాలకు ఆయన రెండు కుటుంబాలను తమ భవన ప్రాంగణంలోనే వసతి కల్పించి పోషించారు పావురాల గాలి మొదలయినవి పక్షవాత హరాలు కనుక వాటి పోషణకు మరొక కుటుంబం ఇలా 1956లో ఆ కొన ఊపిరి వరకు సంస్థ నిర్వహణ, సాహిత్య పోషణలతో, పండితాదరణలతో జీవితం సార్థకం చేసుకొన్న మహనీయులు ఆయన రెండవసారి కలుసుకొన్నప్పుడు ఆయన ప్రసంగ వశాత్తు అన్నారు- ఒక్క రోజులో 200 మందిని పెట్టి 500 పుటల గ్రంథాన్ని పోటాపోటీలతో ముద్రించాను – అని ఔను ఆయన అంతటి సమర్థులే అంత పెద్దది. వారి సంస్థ లేక పోతే, తెలుగు, తమిళ సంస్కృతాంధ్ర గ్రంథాలు సహస్రాధికంగా ఎలా వెలువడుతాయి? గ్రంథ ప్రకటన అస్తవ్యస్తంగా ఉన్న సమయంలో సమర్థులూ, విద్వాంసులు వ్యాపార మర్మజ్ఞులు అయిన శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రి గారు సరైన పద్ధతిలో గ్రంథ ముద్రణకు పూనుకున్నారు కొత్త టైపులను అలవాటులోకి తెచ్చారు ఇప్పుడు బహుళ వ్యాప్తిలో ఉన్న గేట్ ప్రైమర్ (జి పి) టైపును తీర్చి అక్షరాలను పోతపోయించి చేమకూర కవి చెప్పినట్లు అక్షరాలను వరవర్ణాలుగా రూపొందించారు చేతి వ్రాత పుస్తకములు చదువుకొనే దినాలలో శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రుల వారు ముద్రణాలయమును స్థాపించి చదువరుల కష్టములను నివర్తి చేసిరి, అని శ్రీ సి పి బ్రౌను ప్రశంసల నందుకొన్నారు ఆయన 50 గ్రంథాలే ప్రచురించారు తర్వాత ఆయన కుమారులు శ్రీ వేంకటేశ్వర శాస్త్రి గారు ఆ సంస్థ భారం వహించారు వేంకటేశ్వర శాస్త్రి గారు తండ్రి గారి మరణ కాలానికి ఆరేండ్ల పసిబాలుడు (1885 లో జన్మించారు) విద్యార్థి దశలోను, తర్వాతను, వ్యాపార రీత్యాను ఆయనకు దేశంలోని వివిధ రంగాల ప్రముఖులతో పరిచయం కలిగింది త్రిలింగ, ఫెడరేటెడ్ ఇండియా సంపాదకులుగా ఆయన పరిచయ పరిధి విస్తరించింది తండ్రి గారి సంస్థను సమర్థతతో నిర్వహించారు వివిధ భాషలలో సహస్రాధిక సంఖ్యలో గ్రంథాలు ప్రచురించారు తండ్రి గారు దేవనాగరిలో ప్రచురించిన భాగవతాన్ని, అసమగ్రంగా వదలిన రామాయణాన్ని ప్రచురించి, రెండింటిని ఏనుగుపై మద్రాసు పుర వీధులలో ఊరేగించారట శ్రీ నిడుదవోలు వేంకటరావుగారన్నట్లు

> ''బాలశిక్ష మొదలు భారతంబు వరకు
> గ్రంథమేది గావలసిన
> వ్రాయుడింకనేల వావిళ్లకనియెదు
> పలుకె తెలుగునాట నిలిచె నేడు''

ఆయనను ప్రజలు భాషోద్ధారక బిరుదంతోను, ఆంధ్ర విశ్వ విద్యాలయం కళా ప్రపూర్ణ బిరుదంతోను సత్కరించింది, అట్టి మహనీయుడు 1956లో కీర్తి శేషుడయ్యాడు జన్మించి 1985కు వంద సంవత్సరాలు పూర్తయాయి అప్పుడే శత జయంతి ఆంధ్రప్రదేశమంతటా జరుగవలసింది కాని, శ్రీ వేంకటేశ్వరశాస్త్రిగారు కోటి రూపాయల తమ సంస్థకు తమ అనంతరం తగిన కట్టుబాట్లు చేయకపోవడం వల్లనో, మరే కారణం వల్లనో వారసత్వపు సమస్య క్లిష్ట రూపం దాల్చి, చివరకు సంస్థ పునాదులు జీటలు వారే పరిస్థితి ఏర్పడింది ప్రస్తుతం ఆ సంస్థ నిర్వహణ తమిళనాడు ప్రభుత్వపరమయింది 120 సంవత్సరాలకు పైగా సారస్వత సేవ చేసిన ఈ సంస్థకు పూర్వ దశకు తేవాలని శ్రీ అల్లాడి స్వామినాథం, శ్రీ అల్లాడి వేంకటేశం కృషి చేస్తున్నారు ఆ కృషిలో భాగంగా శ్రీ



వేంకటేశ్వరశాస్త్రిగారి శత జయంతి మద్రాసులో గడచిన నవంబర్ నెల 8వ తేదీన మైలాపూరు ఈస్టు మాద వీధిలోని భారతీయ విద్యాభవన్ వెంకట ఆడిటోరియంలో వైభవోపేతంగా జరిగిందని శ్రీ అల్లాడి స్వామినాధన్ ఇటీవల నాతో అన్నారు ఆ సభకు డాక్టర్ బెజవాద గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు శ్రీ ఆరుద్ర వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రి గారిని గురించి ప్రధాన ప్రసంగం చేశారు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి శ్రీ జి రామానుజం ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు డాక్టర్ డి ఆంజనేయులు, శ్రీ బి ఎస్ ఆర్ కృష్ణ ప్రొఫెసర్, డాక్టర్ జి లలిత, శ్రీ ఎస్ సంపత్కుమార్ వావిళ్ల వారి సేవను గురించి ప్రసంగించారు శత జయంతి నిర్వాహక సంఘం వావిళ్ల సంస్థతో సంబంధమున్న ప్రముఖ విద్వాంసులు శ్రీ బులుసు వేంకట రమణయ్య, శ్రీ పునుగు శంకర శాస్త్రి మున్నగు వారిని సన్మానించింది ప్రారంభంలో మాజీ ఎం ఎల్ సి శ్రీ ఎస్ సి రాఘవాచారి స్వాగతం చెప్పారు తెలుగు, సంస్కృత, తమిళ భాషలలో వ్యాస రచన, వక్తృత్వపు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంచారు శ్రీ అల్లాడి వేంకటేశన్ ధన్యవాద సమర్పణతో శత జయంతి సమాప్తమైంది శత జయంతి ప్రత్యేక సంచికలో శ్రీయుతులు అవ్వారి వాసుదేవశాస్త్రి, సి వి సుబ్బన్న శతావధాని, గడియారం రామకృష్ణ శర్మ, అక్కిరాజు రమాపతి రావు, మధనాపంతుల సత్యనారాయణ శాస్త్రి, తిరుమల రామచంద్ర, చల్లా రాధాకృష్ణశర్మ, కపిలవాయి లింగమూర్తి, ఐ. వి ఎస్ శివరామ కృష్ణయ్య, శ్రీ రంగాచార్య, ఎన్ ఎస్ కృష్ణమూర్తి, బులుసు వేంకట రమణయ్య, రావూరి దొరస్వామి శర్మ, తీర్థం శ్రీధరమూర్తి, కూచిభట్ల చంద్రశేఖర శర్మ, అయల సోమయాజుల గోపాలరావు, పాతూరి నాగభూషణం, ఆచంట జానకిరామ్, ఉడాలి నరసింహశాస్త్రి, ఎం కె రామానుజాచార్యులు, భూతపురి సుబ్రహ్మణ్య శర్మ, యామిజాల పద్మనాభ స్వామి, సం రాములు, మధురాంతకం రాజారాం, డాక్టర్ శ్రీమతి నీరజా చక్రవర్తి, ఆచార్య డాక్టర్ జి. లలితగార్ల వ్యాసాలున్నాయి సంపాదక వర్గం శ్రీయుతులు బులుసు వేంకట రమణయ్య, బీదారి శ్రీనివాస శర్మ, అల్లాడి స్వామినాథంగార్లు భాషోద్ధారకులయిన శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారి శత జయంతి డాక్టర్ బెజవాద గోపాలరెడ్డిగారన్నట్లు తెలుగుదేశంలోని ప్రతి పట్టణంలోను జరగాలి

ఉపశ్రుతి :

మా అబ్బాయి వివాహం మీరు తప్పక రావాలి- అన్నాను, ప్రముఖ మహారాష్ట్ర రచయిత శ్రీ ఆనంద సాదళేగారితో, ముహూర్తం పగలా, రాత్రా?- అని ప్రశ్నించారాయన పగలే- అన్నాను మీ తెలుగు వారు సామాన్యంగా రాత్రి ముహూర్తాలు పెడుతారు పగలు ముహూర్తం జరిపి రాత్రి నవ వధూవరులకు వదలరాదూ?- అని ఛలోక్తి విసిరారు శ్రీ సాదళేగారు

-తిరుమల రామచంద్ర

Printed and Published for Nageswara Rao Estates Private Ltd by S Nageswara Rao, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada - 520 003 Acting Editor M Madhava Rao, Chief Editor S Radhakrishne.
Phones . Business 61247, 61248, 75569 Editorial 75667

పాఠకుల శీర్షిక

గర్భస్థ శిశువు చెప్పిన కథలు

అమ్మా! నన్ను చంపవద్దు

మురళి చిన్న గుమాస్తా ఉద్యోగి. అతను మొదటి భార్య చనిపోవడంతో రెండవ పెండ్లి చేసుకున్నాడు. మొదటి భార్యకు పుట్టిన ఒక కూతురున్నది మురళికి. రెండవ భార్య రాధ చదువుకున్నది. అందమయినది కావడం వలన మురళి ఆమె చేతిలో కీలుబొమ్మ అయినాడు. ఆమె చెప్పినదే వేద వాక్కు మురళికి.

కొన్ని రోజులకు రాధ గర్భవతి



అయింది. ఆ విషయమే భర్తతో చెప్పి ఇలా అన్నది. "నేను నిన్న డాక్టర్ దగ్గరకి వెళ్ళి యస్. ఎ. టి. చేయించుకున్నాను. ఆడపిల్ల అని అన్నారు. అందుకే రేపు వెళ్ళి అబార్షన్ చేయించుకోవాలి.



ఎందుకంటే ఇంతకు ముందే మనకు ఒక ఆడ పిల్ల ఉంది. ఇంక నాకు ఆడపిల్లలే వద్దు." అని ఖచ్చితంగా ఖండితంగా చెప్పింది. తాను వద్దని చెప్పినా ప్రయోజనం ఉండదని తెలిసిన మురళి నోరు విప్పలేదు.

అదే రోజు రాత్రి అందరూ పడుకున్నారు. ఎవరో "అమ్మా!" అని పిలిచిన అలికిడి అయితే రాధ లేచి చూడగా "నేనమ్మా! నీ కడుపులో పెరుగుతున్న, నీవు చంపాలని అనుకొంటున్న ఆడ పసికందుని అమ్మా! ఎందుకమ్మా! ఆడవాళ్ళంటే అంత భయం, చులకన. నీవు చీటికి మాటికి అక్కను తిట్టటం, రేపు నీవు నన్ను అబార్షన్ ద్వారా చంపాలనుకోవటం తలుచుకొంటే నాకు ఏడుపొస్తోంది. అన్ని దైవాలకన్నా మిన్న అయిన మాతృమూర్తివి నీవే అసహ్యించుకుంటున్నావా తల్లీ! ఆడవాళ్ళు మనుష్యులు కారా? భారతదేశాన్ని పాలించిన ఇందిరాగాంధీ ఆడది కాదా? నేడు భారతదేశ పరువు కాపాడిన (ఆటలలో) పి. టి. ఉష, ఇంకా సరోజినీనాయుడు, మదర్ థెరిస్సా వీళ్ళు ఆడవాళ్ళు కారా? అందరూ నీలాగ మగశిశువుల్ని కోరుకుంటే రేపు ఆ మగాళ్ళు ఆడ తోడును ఎక్కడ నుండి తెస్తారు? ఆలోచించు. అబార్షన్ వల్ల యూట్రస్‌కు ఇన్‌ఫెక్షన్ చేరి అల్సర్ వచ్చి చివరికి యూట్రస్‌నే తీసివేయవలసివస్తే తర్వాత అసలు పిల్లలు పుట్టే అవకాశమే లేకపోవచ్చు" అని అన్నది. రాధ వెక్కి వెక్కి ఏడుస్తున్నది. మురళి లేచి ఏమని అడగ్గా "ఏమండీ! నేను అబార్షన్ చేయించుకోనండి. మనకు ఈ ఇద్దరు పాపలే చాలండి." అని మొదటి పాపను దగ్గరకు చేర్చుకుని ప్రేమతో నిమిరింది. మురళి మొదట ఆశ్చర్యపోయినా తర్వాత మనస్సులోనే దేవుని నమస్కరించాడు రాధలో వచ్చిన మార్పుకు.

– ఎం. మంజుల, వెల్లూరు


★ ★ ★

అవివేకం - అమానుషం

మానవుడు వైజ్ఞానికంగా సాధిస్తున్న ప్రగతి ఒక్కోసారి అనేక వినాశకర పరిస్థితులకు దారి తీస్తోందంటే అతిశయోక్తి కాదేమో! కొన్ని మంచి ప్రయోజనాలను ఆశించి కని



పెట్టబడ్డ అనేక విషయాలు, వాటి అసలు ప్రయోజనాలకి కాకుండా, చెడ్డ ప్రయోజనాలకే ఉపయోగ పడుతున్నాయని చెప్పక తప్పదు! అటువంటి కోవకు చెందినదే "సెక్స్ డిటర్ మినేషన్ టెస్ట్." ఈ పద్ధతి ద్వారా స్త్రీ గర్భంలో వున్న "పిండం" యొక్క స్థితిగతులను తెలుసుకొని, ఒకవేళ ఏవన్నా లోపాలుంటే వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చును. ఈ "టెస్ట్" యొక్క ముఖ్య (సద్) ఉద్దేశ్యం ఇదే! కానీ దురదృష్టవశాత్తూ నేడు "ఇది" కూడా అనేక పరిశోధనలమల్లె చెడ్డ ప్రయోజనాలకే ఉపయోగపడుతోంది. కాదు! ఉపయోగించు కుంటున్నారు. ఈ "పద్ధతి" ద్వారా గర్భంలో వున్న "పిండం", మగో, ఆడో తెలుసుకుని, ఒకవేళ "ఆడ" అయితే వెంటనే "అబార్షన్" చేయించేసు కొంటున్నారు అనేక మంది




స్త్రీలు. ఇది చాలా దారుణమయిన విషయం! అయితే ఈ చర్యని సమర్థించే వాళ్ళు అనేక కారణాలు చెబుతారు. ముఖ్యంగా ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయడానికి కావలసిన "వరకట్నం" ఇచ్చుకోలేక అనేక మంది తల్లిదండ్రులు బాధపడుతున్నారన్నది అందులో మొదటిది. అలాగే నేడు "స్త్రీ" అన్ని విషయాలలోనూ పురుషుల కంటే వెనుకబడి వుందని, అనేక అత్యాచారాలకు గురవుతోందనీ, కాబట్టి గర్భంలోనే ఆమె జాతిని అంతం చేసేస్తే ఈ బాధలన్నీ ఆమె అనుభవించనక్కర్లేదు కదా! అని వారి వాదన! కానీ ఇది చాలా మూర్ఖత్వపు వాదన. ఆఫ్ కోర్స్! నేటి సమాజంలో స్త్రీకి అనేక సమస్యలుండవచ్చు! అంత మాత్రాన స్త్రీ జాతినే నిర్మూలిద్దామనుకోవటం శుద్ధ అవివేకం, అమానుషం! కాబట్టి ఈ విధమైన కిరాతకాన్ని మహిళా సంఘాలన్నీ కలిసి ప్రతిఘటించాలి! ప్రభుత్వం కూడా దీని నిషేధం కోసం తగిన చర్యలు తీసుకోవాలి!!

–మోదేకుర్తి సత్యనారాయణ, సుబ్బరాయపురం, అన్నవరం

మళ్ళీ మొదటి కొస్తుంది

ఆధునిక వైజ్ఞానిక ప్రగతి కొన్ని విషయాలలో ప్రకృతికి అవరోధం కలిగిస్తోంది. కడుపులోని బిడ్డ ఆడో, మగో లేక గర్భస్థ శిశువుకు ఏవైనా జబ్బులున్నాయో, అంగవైకల్యం కలదో అని తెలుసుకొనే విధంగా అభివృద్ధి చెందిన వైద్యశాస్త్రాన్ని, కొందరు పుట్ట



బోయే బిడ్డ ఆడపిల్లయితే, భవిష్యత్తులో రాబోయే అనేక సమస్యల దృష్ట్యా బలవంతంగా చంపివేయుటకు ఉపయోగించుచున్నారు. మానవుడు కేవలం పురుషుడూ కాదు, కేవలం స్త్రీ కాదు. ఇద్దరి ఐక్యరూపమే పరిపూర్ణ మానవుడు. ఇది సృష్టి రహస్యం. ఇందుకు విరుద్ధంగా మగపిల్లలు మాత్రమే కావాలని కోరుకోవటం మూర్ఖత్వం. అధిక జనాభావల్ల కలిగే సమస్యలను అర్థం చేసుకుని ప్రతి కుటుంబమూ ఇద్దరు, లేక ముగ్గురు పిల్లలకు పరిమితమవుతున్న ఈ తరుణంలో కేవలం మగపిల్లల్నే కంటే, ఇక భవిష్యత్తులో వీరికి స్త్రీలతో అవసరం వుండదా? స్త్రీలు లేకుండా పురుషుడు మనుగడ సాగించగలడా?

ఆడపిల్లల తల్లిదండ్రులు విముఖత చూపడానికి ప్రధాన కారణం- వరకట్న సమస్య. ఈ సమస్యకు ముఖ్యంగా బలి అయ్యేవారు, మధ్య తరగతి కుటుంబీకులు. తీవ్రంగా ఆలోచిస్తే ఈ సమస్యకు కారణం వారి ఆర్థిక పరిస్థితి అని తెలుస్తుంది. దినదినాభివృద్ధి చెందుతున్న నేటి ఆర్థిక పరిస్థితులలో రాబోయే ఇరవైయేళ్ళలో మనదేశ తలసరి ఆదాయం పెరగవచ్చు. అపుడు ఈ వరకట్న సమస్య లేకపోవచ్చు. అదీ గాక ప్రభుత్వపరంగా స్త్రీల ఆస్తి హక్కు అనీ, ఉద్యోగాలలో స్త్రీలకు ప్రత్యేకత అనీ అనేక స్త్రీ సంక్షేమ విధానాలలో మార్పులు తెస్తోంది. మార్పు అనేది ఒకగంటలోనో లేక ఒక రోజులోనో వచ్చేదికాదు. క్రమక్రమంగా రావాలి.

రెండవ కారణం- రోజు రోజుకీ స్త్రీలపై పెరుగుతున్న అత్యాచారాలు. జాగ్రత్తగా పరిశీలిస్తే అత్యాచారాలు ఎక్కువగా పల్లెలలో జరుగుతుంటాయి. అందుకు కారణం వారిలో చదువు సంస్కారాలు లేకపోవడమే. వాళ్ళు పెరిగిన పరిసరాలు మరియు తల్లిదండ్రుల బాధ్యత కూడా ఎంతయినా వుంటుంది. ఈ సమస్యకు పరిష్కారం మన చేతుల్లో వుంది. ఈనాడు ప్రతి ఆఫీసులోనూ స్త్రీలు నిర్భయంగా పనిచేయుచున్నారు. ఏ విషయంలోనైనాసరే, పురుషునితో మేమూ సమానమే అని చాటి చెబుతున్నారు.


1981వ జనాభా లెక్కల ప్రకారము ఒక్క కేరళ రాష్ట్రం మినహాయిస్తే, తక్కిన అన్ని రాష్ట్రాలలోనూ స్త్రీల సంఖ్య పురుషుల కంటే తక్కువగా వున్నది. మనదేశంలో దాదాపు ప్రతి వ్యక్తికీ పెళ్ళిచేసుకొనే సాంప్రదాయం వుంది. ఇటువంటి పరిస్థితులలో ఆడ సంతానాన్ని నిరోధిస్తే రాబోయే పాతికేళ్ళలో యవ్వనులైన యువకులకి, ఆడపిల్లల్ని ఎక్కడ నుంచి తెస్తారు? అపుడు వీరికోసం ఆడపిల్లల్ని కనడం ప్రారంభిస్తారా? అపుడేమవుతుంది? మళ్ళీ మొదలు- బాల్య వివాహాలు, బాల్య వితంతువులు. ఈ సమస్యను పరిష్కరించడానికి మరొక రాజా రామ్మోహనరాయ్ మరొక బాల గంగాధరతిలక్ వుదటారని నమ్మక మేమిటి?

– కొమ్మిరెడ్డి కుమారి,
కంచికచెర్ల, కృష్ణాజిల్లా

★ ★ ★

అర్థంలేని విషయం

సినిమాల్లో, నవలల్లో స్త్రీ పాత్రను వాస్తవ జీవితానికి విరుద్ధంగా చిత్రీకరించుటవలన ఆధునిక లోకంలో స్త్రీ ఒక గందరగోళం పరిస్థితిలో ఉంచబడుతున్నది. నిజానికి ఆడదాని పరిస్థితి



ఈనాడు యేమిటన్నది ఆలోచిస్తే కష్టాల సుడిగాలులకు ఎండుటాకులా కదిలే పరిస్థితి ఆమె కేనాడో తొలగిపోయింది, స్త్రీలలో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ఆధునిక కాలంలో (యుగంలో) స్త్రీ విద్యావతి, సంస్కారవతి. తన సమస్యలను ఓర్పుతో, నేర్పుతో పరిష్కరించుకొంటూ, తన గృహాన్ని స్వయం శక్తితో తీర్చిదిద్దుకునే వాతావరణము కల్గి వున్నది. ఆర్థికంగా పురుషునిపై ఆధారపడకుండా స్వంతంగా ఉద్యోగాలు చేస్తున్న



రోజులివి. అన్ని రంగాల్లో స్త్రీలు పురుషులతో సమానమైన స్థాయిలో వున్నారు. ఏ సమాజంలోనైనా స్త్రీకి ఇవ్వబడే స్వాతంత్ర్యాన్ని బట్టి ప్రజలందరి స్వాతంత్ర్యం ఆధారపడి వుంటుంది అనే ఉద్దేశ్యముతో స్త్రీ సంక్షేమము కోసం ప్రభుత్వం ఎన్నో చట్టాలు ప్రవేశ పెట్టింది. వీటివలన మగవాళ్ళతో సమానమైన గౌరవాన్ని ఆడవాళ్ళు కూడా పొందుతారు. ఈ చట్టాలు స్త్రీల అభ్యున్నతికి దోహదం చేస్తాయి. కావున ఆడపిల్ల పుట్టినప్పటికినీ ప్లస్సే. మైనస్ మాత్రం కాదు. అలాంటప్పుడు ఆడపిల్ల పుడుతుందని తెలియగానే అబార్షన్ చేయించుకోవడమనేది అర్థంలేని విషయం. "స్త్రీ"ని దేవతగా భావించే ఈ పవిత్ర భారత దేశంలో స్త్రీ శిశుహత్య మహాపాపమని ఎంచుకుంటోంది. పరిమిత కుటుంబం వుండాల్సిందే, తప్పులేదు. కాని ఆడపిల్లల్ని పుట్టకుండా చేయటం మాత్రం తప్పు. అందుకే దీన్ని ప్రతి ఒక్కరు, ఖండించాలి. ముఖ్యంగా డాక్టర్లు తిరస్కరించాలి. స్త్రీల మనస్తత్వంలో కూడా మార్పు రావల్సి వుంది.

– డి. శ్రీనివాస్, తెనాలి □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

గర్భస్థ శిశువు చెప్పిన కథలు

కథ వ్రాసిన వారి పేరు : ______________

____

పూర్తి చిరునామా ______________

పిన్ కోడ్ : ______________


సీక్రెట్ ఏజెంట్
విక్రమ్
మోహన్ * దిలీప్ కదమ్
20
విమానాశ్రయంలో –
నన్ను గుర్తు పట్టావా?
ఆఁ ఇప్పుడు నాకు గుర్తొచ్చావు ప్రముఖ చైనా ఏజెంట్ ఉజిన్‌వి కదూ. కాని నువ్వీ వృత్తిలో ఇప్పుడు లేవని మా ఫైళ్లలో ఉందే!
31/20
అది నిజమే కాని మా దేశం నా నా అసాధారణ ప్రజ్ఞవల్ల మళ్లీ ఈ పని నాకు అప్పగించింది
ఏదో మూడో శక్తి కూడా పని చేస్తోందని నాకిన్నాళ్ళూ అనుమానం గానే ఉంది. ఐతే నువ్వేనన్న మాట
అవును నేనూ, నా సహచరులు వాళ్ళలో ఇద్దరు చనిపోవడానికి నువ్వు కారణమయ్యావు
ఇంతకూ నీ పని ఏమిటి?
ఇంకా నీకర్థం కాలేదా? మాకు ఈ ప్రొఫెసర్ కావాలి.
ఏమిటీ?
ఔను. మొదట నేనే ఆయన్ని విడిపిద్దామనుకున్నాను. తర్వాత ఇది ఇంకా సులభమనిపించింది.
నువ్వది సాధించలేవు.
తప్పకుండా సాధిస్తాను. కాని నేను వెళ్ళిపోయే లోపల నిన్ను చంపేస్తాను. నువు చాలా ప్రమాదకరమైన శత్రువువి.
విక్రమ్ సరిగ్గా ఆ పొరపాటు కోసమే చూస్తున్నాడు. ఉజిన్ తన తుపాకిని రేణు తల మీది నుంచి తీసిన మరుక్షణం విక్రమ్ ఒక పక్కకు పిల్లి మొగ్గ వేసి
నేల మీది నుంచి సూటిగా ఉజిన్ గుండెల్లోకి కాల్చాడు.
© RANG REKHA FEATURES PVT. LTD. 1984
చిట్టచివరికి వాళ్ళు ఇంటి దారి పట్టారు
ప్రొఫెసర్ గారూ, స్వేచ్ఛగా, ఇంటికి తిరిగి వెళ్తుంటే మీ అనుభూతి ఎలా ఉంది?
అద్భుతం! మహాద్భుతం!!
(అయిపోయింది)